సత్యమేవ జయతే
సాక్షి
WWW.SAKSHI.COM
పేజీలు: 16+20 వెల: ₹ 5.00
సంపుటి: 11
సంచిక: 296
గురువారం 17-1-2019


'నిరుపేదలకు పట్టెడన్నం దొరికేటట్లు చేయడం ప్రభుత్వ ధర్మం, అందుకు ఎన్ని కోట్లు ఖర్చయినా వెనుకాడకూడదు'


చెన్నై కుర్రాడు.. చరిత్రకెక్కాడు
- 12 ఏళ్లకే గ్రాండ్ మాస్టరైన గుకేశ్

– స్పోర్ట్స్‌లో


ప్రపంచ బ్యాంకు సారథిగా ఇంద్రా నూయి?

– బిజినెస్‌లో

SIMULTANEOUSLY PRINTED AT VIJAYAWADA | HYDERABAD | BANGALORE | CHENNAI | DELHI | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAHMUNDRY | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VISAKHAPATNAM | WARANGAL

హోదానే మాకు ప్రధానం

తెలుగు రాష్ట్రాల ఎంపీలంతా ఏకతాటిపైకి వస్తే ఏపీకి మేలు: జగన్

- పార్లమెంట్‌లో ఎంపీల సంఖ్యా బలాన్ని పెంచుకుని హోదా సాధిద్దాం..
- హోదాకు తెలంగాణ సర్కారు మద్దతు ఇవ్వడాన్ని స్వాగతిస్తున్నాం..
- ఫెడరల్ ఫ్రంట్‌పై వైఎస్ జగన్, కేటీఆర్ చర్చలు
- ఏపీకి హోదా ఇవ్వాలని స్వయంగా పార్లమెంట్‌లోనే చెప్పాం: కేటీఆర్
- ఫెడరల్ ఫ్రంట్ తెలుగు వారి ప్రయోజనాలను కాపాడుతుంది
- త్వరలో ఏపీకి తెలంగాణ సీఎం కేసీఆర్ రాక.. స్వయంగా వైఎస్ జగన్‌తో సమావేశం


లోటస్ పాండ్‌లో మీడియాతో మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి. చిత్రంలో టీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, ఎంపీలు వినోద్ కుమార్, సంతోష్‌కుమార్, వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, వైఎస్సార్‌సీపీ నేత సజ్జల తదితరులు

> రాష్ట్రాలకు అన్యాయం జరిగే పరిస్థితుల నుంచి రాష్ట్రాలకు మేలు జరిగే పరిస్థితులు రావాలి. రాష్ట్రాల తరపున మాట్లాడగలిగే వారి సంఖ్యా బలం పెరగాల్సిన అవసరం ఉంది. ఇవాళ 25 మందితో అనుకున్నది సాధించలేని పరిస్థితి ఉన్నప్పుడు దాన్ని 42కు పెంచి మరింత ఎక్కువగా ఒత్తిడి చేసే పరిస్థితులు తేవాలి
>
> *- వైఎస్ జగన్*


హైదరాబాద్ నుంచి సాక్షి ప్రత్యేక ప్రతినిధి: ఆంధ్రప్రదేశ్‌కు అత్యంత ఆవశ్యకమైన ప్రత్యేక హోదా కోసం తెలుగు ఎంపీలంతా ఏకతాటిపైకి వస్తే రాష్ట్రానికి మేలు జరుగుతుందని ప్రతిపక్ష నేత, వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పేర్కొన్నారు. రాష్ట్రానికి ప్రత్యేక హోదా అత్యంత ముఖ్యమని, ఆంధ్రప్రదేశ్‌కు న్యాయం జరగాలంటే మనకు మద్దతుగా పార్లమెంట్‌లో తెలుగు రాష్ట్రాల ఎంపీల సంఖ్యా బలం పెరగడమే మార్గమని స్పష్టం చేశారు. ఏపీకి హోదా కోసం తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం మద్దతు ఇవ్వడాన్ని స్వాగతిస్తున్నట్లు ప్రకటించారు. జాతీయ స్థాయిలో ఫెడరల్ ఫ్రంట్ ఏర్పాటులో భాగంగా టీఆర్‌ఎస్ కార్యనిర్వాహక అధ్యక్షుడు, తెలంగాణ సీఎం కె.చంద్రశేఖర్‌రావు తనయుడు కె.తారక రామారావు (కేటీఆర్) బుధవారం హైదరాబాద్‌లోని లోటస్ పాండ్‌లో వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని కలసి చర్చించారు. అనంతరం వైఎస్ జగన్, కేటీఆర్ సంయుక్తంగా మీడియాతో మాట్లాడారు. ఏపీకి ప్రత్యేక హోదా ఇవ్వాలని పార్లమెంట్‌లో తమ అభిప్రాయాన్ని ఇప్పటికే స్పష్టంగా చెప్పామని, ఇందులో రెండో మాటకు తావులేదని ఈ సందర్భంగా కేటీఆర్ పేర్కొన్నారు. ఉభయ రాష్ట్రాల్లో తెలుగు వారి ప్రయోజనాలను కాపాడుకునేందుకు ఫెడరల్ ఫ్రంట్ కృషి చేస్తుందని చెప్పారు.

రాష్ట్రాల హక్కులను సాధించుకుందాం...

ఈ చర్చలకు ఒక రోజు ముందు కేసీఆర్ మంగళవారం సంక్రాంతి నాడు వైఎస్ జగన్‌కు ఫోన్ చేసి ఫెడరల్ ఫ్రంట్ ఏర్పాటుపై చర్చిద్దామని కోరారు. ఈ నేపథ్యంలో బుధవారం మధ్యాహ్నం తన ఇంటికి భోజనానికి

మిగతా 2వ పేజీలో ▶

నాటక దిగ్గజం మొదలి ఇకలేరు



- నాటకం, రచన, పరిశోధన, బోధనకు జీవితం అంకితం
- సరోజినీ నాయుడు ఇనిస్టిట్యూట్ ఆఫ్ పెర్ఫార్మింగ్ ఆర్ట్స్‌కు తొలి డీన్
- తెనాలిలో అనారోగ్యంతో మృతి

- వివరాలు 2లో

రంగస్థలానికి 'మొదలి' వీడ్కోలు

- వివరాలు 6లో

రిటర్న్‌ల ప్రాసెసింగ్ ఒక్క రోజులో..!

- ఇక రిఫండ్లు కూడా పూర్తిగా ఆటోమేటిక్
- ఐటీ శాఖ ప్రమేయం లేకుండా నేరుగా కష్టమర్ల ఖాతాల్లోకి
- అత్యాధునిక ఐటీ ఫైలింగ్ వ్యవస్థకు కేంద్ర కేబినెట్ ఓకే

– బిజినెస్‌లో

క్కొక్కొక్కో.. కోట్లు

రాష్ట్రవ్యాప్తంగా రూ.2,500 కోట్ల వరకు కోడి పందేలు

- ఉభయగోదావరి జిల్లాల్లోనే అత్యధికం
- 'తూర్పు'లో రూ.800 కోట్లు, 'పశ్చిమ'లో రూ.700 కోట్ల మేర పందేలు
- కృష్ణా, గుంటూరు జిల్లాల్లోనూ భారీగానే
- దగ్గరుండి నిర్వహించిన అధికార పార్టీ నేతలు
- కోడి పందేలతోపాటు గుండాట, పేకాట, లోన-బయట, అశ్లీల నృత్యాలు

4లో


తూ.గోదావరి జిల్లా కొమరగిరిలో పందేలు

రాష్ట్రంలో సంక్రాంతి పండుగ సందర్భంగా సంప్రదాయం పేరుతో కోడిపందేలు యథేచ్ఛగా సాగాయి. ప్రధానంగా తూర్పు గోదావరి, పశ్చిమ గోదావరి, కృష్ణా, గుంటూరు జిల్లాల్లో భారీ స్థాయిలో వందల కోట్ల రూపాయల మేర పందేలు జరిగాయి. భోగి మొదలుకుని కనుమ వరకూ మూడురోజులపాటు రాత్రింబవళ్లు ఫ్లడ్‌లైట్ల వెలుతురులో వీటిని నిర్వహించడం గమనార్హం. ఈ మూడు రోజుల్లో రాష్ట్రవ్యాప్తంగా రూ.2500 కోట్ల పందేలు జరగ్గా ఉభయగోదావరి జిల్లాల్లోనే రూ.1500 కోట్ల వరకూ పందేలు సాగాయని అంచనా. స్వయంగా టీడీపీ ఎమ్మెల్యేలు, నేతలు దగ్గరుండి మరీ పందేలు నిర్వహించడం, మరోవైపు ప్రభుత్వ పెద్దల ఆదేశాలతో పోలీసులు చేతులెత్తేశారు.

తిరుగు ప్రయాణం కొండంత భారం

- డిమాండ్‌ను క్యాష్ చేసుకునేందుకు ప్రైవేటు ట్రావెల్స్, ఆర్టీసీ పోటాపోటీ
- మూడు, నాలుగు రెట్లు అధికంగా వసూలు చేస్తున్న ప్రైవేటు ట్రావెల్స్
- ఫ్లెక్సీ ఫేర్ విధానంతో ప్రయాణికులను బాదేస్తున్న ఆర్టీసీ
- రెగ్యులర్ చార్జీల కంటే అధికంగా వసూలు చేస్తున్న వైనం
- సిటీ మెట్రో, ఆర్డినరీ కూడా ప్రత్యేక బస్సులే..
- తీవ్ర ఇబ్బందులు పడుతున్న ప్రయాణికులు

4లో



బ్రెగ్జిట్ బిల్లుకు రెడ్ సిగ్నల్

- భారీ ఆధిక్యంతో తిరస్కరించిన బ్రిటన్ పార్లమెంటు
- ప్రధాని థెరెసా మేకి ఘోర అపజయం
- థెరెసాపై పార్లమెంటులో అవిశ్వాసం పెట్టిన విపక్షం
- గెలిస్తే వచ్చే వారం మరో ఒప్పందంతో వస్తా: థెరెసా
- బిల్లును తిరస్కరించడంపై ఈయూ నేతల విస్మయం

లండన్: బ్రిటన్ పార్లమెంటులో ప్రధాని థెరెసా మేకి భారీ ఎదురుదెబ్బ తగిలింది. ఆధునిక బ్రిటన్ చరిత్రలో ఏ ప్రధానికీ ఎదురవని అపజయం ఆమెకు కలిగింది. రెండేళ్లు చర్చలు జరిపి యూరోపియన్ యూనియన్ (ఈయూ)తో ఆమె కుదుర్చుకున్న బ్రెగ్జిట్ (ఈయూ నుంచి బ్రిటన్ నిష్క్రమించడం) ఒప్పందం బిల్లును బ్రిటన్ పార్లమెంటు భారీ ఆధిక్యంతో తిరస్కరించింది. మే కుదుర్చుకొచ్చిన ఒప్పందంపై సొంతపార్టీ ఎంపీల్లో కూడా తొలి నుంచి తీవ్ర వ్యతిరేకత ఉండటం తెలిసిందే. దీని కారణంగా ఇటీవలే మే తమ పార్టీలోనే అవిశ్వాస తీర్మానాన్ని కూడా ఎదుర్కొన్నారు. తాజాగా ఒప్పందంపై మంగళవారం బ్రిటన్ పార్లమెంటులో ఓటింగ్ నిర్వహించగా 202 మంది ఈ ఒప్పందాన్ని సమర్థించగా, 432 మంది వ్యతిరేకించారు. అంటే బ్రెగ్జిట్ ఒప్పందం బిల్లు 230 ఓట్ల తేడాతో ఓడిపోయింది. వంద మందికి పైగా సొంత పార్టీ ఎంపీలే థెరెసా కుదిర్చిన ఒప్పందానికి వ్యతిరేకంగా ఓటేశారు. మరోవైపు పార్టీలోని అవిశ్వాస పరీక్షనే అతి కష్టం మీద గట్టెక్కిన థెరెసా మేకి తాజాగా పార్లమెంటులో మరో కఠిన పరీక్ష ఎదురైంది.

కొత్త

ఓటింగ్‌లో బ్రెగ్జిట్ ఒప్పందం ఓడిపోయిన వెంటనే ప్రతిపక్ష లేబర్ పార్టీ నేత జెరెమీ కార్బిన్ ఆమెపై హౌజ్ ఆఫ్ కామన్స్‌లో అవిశ్వాస తీర్మానాన్ని ప్రవేశపెట్టారు. బ్రిటన్ కాలమానం ప్రకారం బుధవారం సాయంత్రం 7 గంటలకు దీనిపై ఓటింగ్ జరగనుంది. బ్రెగ్జిట్ ఒప్పందాన్ని ఆమె సొంత పార్టీ ఎంపీలు కూడా తిరస్కరించినప్పటికీ ప్రతిపక్ష లేబర్ పార్టీ దృక్పథాన్ని కూడా వారు వ్యతిరేకిస్తున్నారు కాబట్టి అవిశ్వాసంలో మే గెలిచే అవకాశాలే ఎక్కువగా ఉన్నాయని బ్రిటన్ మీడియా అంచనా వేస్తోంది.

తర్వాత ఏం జరుగుతుంది?

బ్రిటన్ పార్లమెంటు నిబంధనల ప్రకారం ఏదైనా బిల్లు తిరస్కరణకు గురైతే మళ్లీ మూడు పార్లమెంటు పని దినాల్లోగా ప్రత్యామ్నాయ బిల్లును సభలో ప్రవేశపెట్టాల్సిన బాధ్యత ప్రధానిపై ఉంటుంది. ఆ బిల్లుకు కూడా ఆమోదం లభించని పక్షంలో మరో ప్రత్యమ్నాయాన్ని సిద్ధం చేసేందుకు ప్రధానికి మూడు వారాల సమయం లభిస్తుంది.

బ్రెగ్జిట్

మిగతా 2వ పేజీలో ▶

రసకందాయంలో కన్నడ రాజకీయం

కాంగ్రెస్, జేడీఎస్ సంకీర్ణ ప్రభుత్వాన్ని గద్దె దించేందుకు బీజేపీ 'ఆపరేషన్ కమలం'ను ప్రారంభించిందన్న వార్తల నేపథ్యంలో కర్నాటక రాజకీయాలు మరోసారి రసకందాయంలో పడ్డాయి. కాంగ్రెస్, జేడీఎస్ కూటమి ఆకర్షించేందుకు ప్రయత్నిస్తోందంటూ బీజేపీ తమ 104 మంది ఎమ్మెల్యేలను హరియాణాలోని గురుగ్రామ్‌లోని ఒక హోటల్‌లో ఉంచిన విషయం తెలిసిందే. మరోవైపు, కాంగ్రెస్‌లోని దాదాపు ఆరుగురు అసంతృప్త ఎమ్మెల్యేలు ముంబైలో మకాం వేసి బీజేపీతో సంప్రదింపులు జరుపుతున్నారంటూ కూడా వార్తలు వచ్చాయి. అయితే, తమ ఎమ్మెల్యేలెవరూ కాంగ్రెస్‌ను వీడటం లేదని, ఆ ఎమ్మెల్యేలు తమతో టచ్‌లోనే ఉన్నారని కాంగ్రెస్ స్పష్టం చేసింది. జనవరి 18న పార్టీ ఎమ్మెల్యేలందరితో సమావేశం నిర్వహించాలని నిర్ణయించింది. మరోవైపు, ఇన్నాళ్లూ కుమారస్వామి ప్రభుత్వానికి మద్దతిచ్చిన ఇద్దరు ఎమ్మెల్యేలు మంగళవారం తమ మద్దతును ఉపసంహరించుకుని బీజేపీ వైపునకు వెళ్లారు.

- వివరాలు 13లో

'జస్టిస్ ఖన్నా' నియామకంపై రగడ

సుప్రీంకోర్టు కొలీజియం తీసుకున్న నిర్ణయం వివాదాస్పదమైంది. జనవరి 12న ఢిల్లీ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ సంజీవ్ ఖన్నా పేరును సుప్రీంకోర్టు జడ్జిగా సిఫార్సు చేయడాన్ని సీనియర్ న్యాయమూర్తి జస్టిస్ ఎస్కే కౌల్ తప్పుపట్టారు. రాజస్తాన్ హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ప్రదీప్ నంద్రజాగ్ పేరును తొలగించి, ఖన్నా పేరును జాబితాలో చేర్చడాన్ని ప్రశ్నిస్తూ ఆయన సీజేఐ జస్టిస్ రంజన్ గొగోయ్‌తో పాటు కొలీజియం సభ్యులకు లేఖ రాశారు. జస్టిస్ ప్రదీప్ సమర్థుడైన న్యాయమూర్తనీ, పరిపాలకుడని జస్టిస్ కౌల్ వ్యాఖ్యానించారు. ఇలాంటి సందర్భాల్లో దుందుడుకు నిర్ణయాలు తగవని అభిప్రాయపడ్డారు. ఇలాటి నిర్ణయాల కారణంగా న్యాయవ్యవస్థతో పాటు బార్‌లోనూ సమస్యలు ఉత్పన్నమవుతాయని హెచ్చరించారు.

- వివరాలు 13లో

హోదానే మాకు ప్రధానం..

▶ మొదటి పేజీ తరువాయి

రావాల్సిందిగా జగన్ కోరారు. కేసీఆర్ సూచన మేరకు ఆయన తనయుడు కేటీఆర్, పార్టీకి చెందిన పలువురు సీనియర్ నేతలు లోటస్‌పాండ్‌కు వచ్చి గంటకు పైగా చర్చలు జరిపారు. జాతీయ స్థాయిలో సమాఖ్య స్ఫూర్తిని ప్రతిబింబిస్తూ రాష్ట్రాల హక్కులను సాధించుకోవడంపై ఇద్దరు నేతల సారథ్యంలోని ప్రతినిధుల బృందం ప్రాథమికంగా సంప్రదింపులు జరిపింది. రాష్ట్రాల ప్రయోజనాలను పరిరక్షించుకోవడం, పార్లమెంట్ సాక్షిగా ఇచ్చిన హామీల అమలు కోసం అనుసరించాల్సిన వ్యూహంపై చర్చించారు. ఈ ప్రయత్నాల కొనసాగింపులో భాగంగా తెలంగాణ సీఎం కేసీఆర్ త్వరలో ఆంధ్రప్రదేశ్‌కు వచ్చి వైఎస్ జగన్‌ను స్వయంగా కలిసి సంప్రదింపులు జరపనున్నారు.

42 మంది ఎంపీలతో కలసి ఈ అన్యాయాన్ని ఎదిరిద్దాం: వైఎస్ జగన్

'తెలంగాణ ముఖ్యమంత్రి కె.చంద్రశేఖరరావుతో ఫోన్‌లో మాట్లాడిన తరువాత కేటీఆర్ వచ్చి ఫెడరల్ ఫ్రంట్ గురించి మాతో సంప్రదింపులు జరిపారు. రాష్ట్రాలకు జరుగుతున్న అన్యాయాలు, దీనిపై గట్టిగా నిలబడాల్సిన అవసరం గురించి చర్చించారు. అన్యాయాలు జరగకూడదంటే రాష్ట్రాలన్నీ కలవాల్సిన అవసరం ఉందని అభిప్రాయాలు పంచుకున్నాం. ఉదాహరణకు మన ఆంధ్రప్రదేశ్‌కు ప్రత్యేక హోదా అంశం ఉంది. పార్లమెంట్ సాక్షిగా ఇచ్చిన హామీకే దిక్కూ దివాణం లేకుండా పోయిన పరిస్థితులు కనిపిస్తున్నాయి. ఒక్కో రాష్ట్రం పరిధిలో వారికి ఉన్న ఎంపీలను సంఖ్యాపరంగా చూస్తే దీన్ని అధిగమించే పరిస్థితులు ఉండవు. మన రాష్ట్రంలోని 25 మంది లోక్‌సభ ఎంపీలతో మనం ప్రత్యేక హోదా కోసం డిమాండ్ చేసినా పట్టించుకునే పరిస్థితి కనిపించడం లేదు. ఈ అన్యాయాన్ని ఎదిరించాలంటే ఏపీకి చెందిన ఎంపీల బలం మాత్రమే సరిపోదు. మన 25 మందికి మరో 17 మంది తెలంగాణ ఎంపీలు తోడయితే... మొత్తం 42 మంది ఒక్క తాటిపైకి వచ్చి ఆంధ్రప్రదేశ్‌కు జరుగుతున్న అన్యాయంపై




హైదరాబాద్‌లోని లోటస్‌పాండ్‌లో జరిగిన సమావేశంలో వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు వైఎస్ జగన్, టీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ తదితరులు

స్పందించగలిగితే, రాష్ట్రానికి జరుగుతున్న అన్యాయంపై ప్రశ్నిస్తే బాగుంటుంది. ఈ 42 మంది ఎంపీలు ఒకేసారి మన రాష్ట్రానికి జరుగుతున్న అన్యాయాన్ని ప్రశ్నిస్తూ... ఏపీకి ప్రత్యేక హోదా ఇవ్వాలి, పార్లమెంటు సాక్షిగా ఇచ్చిన మాటను నిలబెట్టుకోవాలి అని చెప్పగలిగితే రాష్ట్రానికి తప్పకుండా మేలు జరుగుతుంది. కాబట్టి ఇది స్వాగతించదగ్గ విషయం. రాష్ట్రాల హక్కులు నిలబడాలి, పరిరక్షించుకోవాలి అంటే సంఖ్యాపరంగా పెరగాలి. అప్పుడు కేంద్ర ప్రభుత్వం రాష్ట్రాలకు అన్యాయం చేసేందుకు జంకుతుంది. ఈ దిశగా అడుగులు వేస్తూ రాష్ట్ర ప్రభుత్వాలన్నింటితో కూడిన, కేసీఆర్ ప్రతిపాదించిన జాతీయ వేదిక పట్ల హర్షం వ్యక్తం చేస్తున్నా. రాష్ట్ర ప్రభుత్వాలన్నీ ఎంపీల పరంగా ఏకమై తమకు జరుగుతున్న అన్యాయాలపై ఎలుగెత్తి చాటే పరిస్థితి రావాలి. రాష్ట్రాలకు అన్యాయం జరగకుండా ఒక వేదికను ఏర్పాటు చేయాలని కేసీఆర్ ప్రయత్నించడం హర్షించదగ్గ విషయం. కేటీఆర్ కూడా మా వద్దకు వచ్చి ఆ విషయాలే చెప్పారు. తరువాత కేసీఆర్ నాతో ఫోన్‌లో మాట్లాడారు. తదుపరి చర్చల కోసం తానే స్వయంగా వచ్చి మాట్లాడతానని చెప్పారు. ఈ నేపథ్యంలో మా పార్టీ నేతలతో కలసి చర్చించి ఎలా ముందుకు వెళ్లాలో ఆలోచిస్తాం. ఇదే అంశంపై ఇంకా నాలుగడుగులు ముందుకు వెళ్లేందుకు కృషి చేస్తాం'

ఏపీకి హోదాపై మా వైఖరి స్పష్టం..

ఏపీకి ప్రత్యేక హోదా విషయంలో టీఆర్‌ఎస్ వైఖరిని తమ పార్టీ అధ్యక్షుడు కేసీఆర్ ఇప్పటికే స్పష్టం చేశారని కేటీఆర్ తెలిపారు. 'రాజ్యసభలో మా పార్టీ నేత కె.కేశవరావు, లోక్‌సభలో మా ఎంపీ కవిత, ఇంకా పలు వేదికల మీద మేమంతా చాలా స్పష్టంగా చెప్పాం. ఏపీ ప్రజలకు అప్పటి ప్రధాని ఇచ్చిన మాటను నిలబెట్టాలని చెప్పాం. కనుక ఆ విషయంలో రెండో అభిప్రాయంగానీ, ఆలోచనగానీ మాకు లేదు. కేసీఆర్ ఏపీకి వెళ్లి జగన్‌తో సమావేశమై మిగతా అంశాలపై మాట్లాడతారు. అన్ని విషయాలపై ఆయన స్వయంగా స్పందిస్తారు. తెలుగు రాష్ట్రాల ప్రయోజనాల కోసం ఉమ్మడిగా ఎలా పోరాడాలి అనే విషయంపై కూడా కూలంకషంగా చెబుతారు.'

ఈ సందర్భంగా విలేకరులు మరిన్ని ప్రశ్నలు అడిగేందుకు ప్రయత్నించగా.. 'ఈరోజే ఇప్పుడే అన్నీ చెప్పేస్తే ... తరువాత మీరు అడగడానికి ఏమీ ఉండదు. మాకు కూడా చెప్పడానికి ఏమీ ఉండదు' అని కేటీఆర్ నవ్వుతూ వ్యాఖ్యానించారు. ఈ రోజు ఇక ఇక్కడితో వదిలేద్దామని మీడియాను కోరారు. లోటస్‌పాండ్‌లో జరిగిన ఈ సమావేశంలో వైఎస్సార్‌సీపీ అధికార ప్రతినిధి కొలుసు పార్థసారథి, పార్టీ రాజ్యసభ సభ్యులు వి.విజయసాయిరెడ్డి, వి.ప్రభాకర్‌రెడ్డి, మాజీ ఎంపీలు వైవీ సుబ్బారెడ్డి, పి.వి.మిథున్‌రెడ్డి, పార్టీ ప్రధాన కార్యదర్శి సజ్జల రామకృష్ణారెడ్డి, టీఆర్‌ఎస్ తరపున ఆ పార్టీ ఎంపీలు వినోద్, సంతోష్, ఎమ్మెల్సీ పల్లా రాజేశ్వర్‌రెడ్డి, శ్రావణ్‌కుమార్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు. అంతకుముందు కేటీఆర్‌కు జగన్ నివాసం వద్ద విజయసాయిరెడ్డి, కె.పార్థసారథి పుష్పగుచ్ఛం ఇచ్చి స్వాగతం పలికారు.

మన ఎంపీల సంఖ్యా బలం పెరగాలి

ఈ సందర్భంగా విలేకరులు అడిగిన పలు ప్రశ్నలకు వైఎస్ జగన్ సమాధానం ఇస్తూ ప్రస్తుతం జరిగినవి ప్రాథమిక చర్చలేనని తెలిపారు. పార్లమెంట్ సాక్షిగా ప్రకటించిన ప్రత్యేక హోదాను కూడా ఇచ్చే పరిస్థితులు లేవని, అందుకే పక్క రాష్ట్రమైన తెలంగాణ మనకు మద్దతునిస్తామన్నందుకు స్వాగతిస్తున్నామని జగన్ చెప్పారు. 'క్రమంగా పరిణామాలు రూపుదిద్దుకునే కొద్దీ మేం మరిన్ని అంశాలపై చర్చిస్తాం. ఇక్కడ మీకు చెప్పాల్సింది ఒకటి ఉంది. పార్లమెంట్‌లో మన ఎంపీల సంఖ్యాబలం పెరగాలి. రాష్ట్రాలకు అన్యాయం జరిగే పరిస్థితుల నుంచి రాష్ట్రాలకు మేలు జరిగే పరిస్థితులు రావాలి. రాష్ట్రాల తరపున మాట్లాడగలిగే వారి సంఖ్యా బలం పెరగాల్సిన అవసరం ఉంది. ఇవాళ 25 మందితో అనుకున్నది సాధించలేని పరిస్థితి ఉన్నప్పుడు దాన్ని 42కు పెంచి మరింత ఎక్కువగా ఒత్తిడి చేసే పరిస్థితులు తేవాలి' అని వైఎస్ జగన్ పేర్కొన్నారు.

ఫెడరల్ ఫ్రంట్‌కు మద్దతులో భాగంగానే: కేటీఆర్

'టీఆర్‌ఎస్ అధ్యక్షుడు, తెలంగాణ ముఖ్యమంత్రి కె.చంద్రశేఖర్‌రావు ఏడాదిన్నరగా దేశ రాజకీయాల్లో గుణాత్మకమైన మార్పు రావాలని కోరుకుంటున్నారు. కేంద్రం అన్ని రకాల అధికారాలను తన వద్దే పెట్టుకుని రాష్ట్రాల పట్ల నిర్లక్ష్య వైఖరిని అనుసరిస్తోంది. ఈ విధానం మారాలనే ఆలోచనతో, సమాఖ్య స్ఫూర్తితో జాతీయ స్థాయిలో కేసీఆర్ ఈ కార్యక్రమాన్ని ప్రారంభించారు. అందులో భాగంగానే పశ్చిమ బెంగాల్ ముఖ్యమంత్రి మమతా బెనర్జీ, ఒడిశా సీఎం నవీన్ పట్నాయక్, కర్ణాటక సీఎం కుమారస్వామి, డీఎంకే అధినేత స్టాలిన్‌లను కలిశారు. అజిత్ జోగి సహా పలువురితో సంప్రదింపులు జరిపి తన ప్రయత్నానికి మద్దతునివ్వాలని కోరారు. ఆ పరంపరలో భాగంగానే మంగళవారం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి ఫోన్ చేసి కలసి మాట్లాడదామని కోరాం. మా బృందంతో ఇక్కడకు వచ్చి అన్ని విషయాలూ వారితో పంచుకున్నాం. గతంలో కేసీఆర్ ఎలా అయితే అన్ని రాష్ట్రాలకు వెళ్లి అక్కడి ప్రధాన రాజకీయ పార్టీల అధ్యక్షులు, ముఖ్యమంత్రులతో సంప్రదింపులు జరిపారో అదేవిధంగా త్వరలోనే ఏపీకి కూడా వెళతారు. కేసీఆర్ స్వయంగా వెళ్లి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డితో సమావేశమై మిగతా అన్ని విషయాలు మాట్లాడి ఈ చర్చలను మరింత ముందుకు తీసుకెళతారు.'

ప్రజాప్రయోజనాల పరిరక్షణే ప్రాతిపదిక

- వైఎస్సార్‌సీపీ–టీఆర్‌ఎస్ నేతల మధ్య పలు అంశాలపై చర్చ
- జాతీయ పార్టీలపై ఆధారపడకుండా ప్రాంతీయ పార్టీలే బలమైన శక్తిగా ఎదగాలి
- తోక పార్టీలుగా మిగలిపోకుండా శాసించే స్థాయికి చేరుకోవాలి
- తమకు ప్రత్యేక హోదా అంశమే ప్రధానమన్న వైఎస్ జగన్

సాక్షి, హైదరాబాద్: ఆయా రాష్ట్రాలు తమ ప్రజల ప్రయోజనాలను పరిరక్షించుకోవడానికి జాతీయ పార్టీలపై ఆధారపడటం కన్నా ప్రాంతీయ పార్టీలే జాతీయస్థాయిలో ఒక బలమైన శక్తిగా రూపుదిద్దుకోవాలన్న అభిప్రాయం వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ–టీఆర్‌ఎస్ నేతల మధ్య జరిగిన చర్చల్లో వెల్లడైనట్లు విశ్వసనీయంగా తెలిసింది. వచ్చే లోక్‌సభ ఎన్నికల తరువాత ఏర్పడబోయే జాతీయ రాజకీయ ముఖచిత్రం మాట ఎలా ఉన్నా ఎన్నికలకు ముందు నుంచే భావసారూప్యత గల పార్టీలతో ఒక గట్టి లాబీ ఏర్పడితే అప్పటి పరిస్థితులను ప్రభావితం చేయవచ్చనే అంశం బుధవారం నేతల మధ్య చర్చకు వచ్చింది. ప్రస్తుత పరిణామాల్లో జాతీయ పార్టీలైన బీజేపీ, కాంగ్రెస్‌లతో ఏర్పడబోయే ఫ్రంట్‌లతో ముందుగానే జత కడితే.. రేపు ప్రాధాన్యత లేని భాగస్వాములుగా ప్రాంతీయ పార్టీలు కొనసాగాల్సిందే తప్ప రాష్ట్రాల హక్కులను కాపాడుకునే పరిస్థితి ఉండదని నేతలు అభిప్రాయపడినట్లు సమాచారం. జాతీయ పార్టీల నేతృత్వంలోని ఫ్రంట్‌లలో తోక పార్టీలుగా మిగిలిపోవడం కంటే ప్రాంతీయ పార్టీలే శాసించే దశకు చేరుకుంటే ప్రజలకు మేలు జరుగుతుందనే భావన ఇరు పార్టీల్లో వ్యక్తమైంది.

కాంగ్రెస్, బీజేపీ మోసం చేశాయి

జాతీయ స్థాయిలో కాంగ్రెస్, బీజేపీల నేతృత్వంలోని ఫ్రంట్‌లు తప్ప మరో ప్రత్యమ్నాయ వేదిక లేదనే అభిప్రాయం తొలగించడానికి చేస్తున్న ఈ ప్రయత్నాన్ని తమ పార్టీ అధ్యక్షుడు కేసీఆర్ మరింత ముందుకు తీసుకువెళతారని, అందుకు సహకరించాలని టీఆర్‌ఎస్ నేతలు వైఎస్సార్‌సీపీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని కోరినట్లు సమాచారం. తమకు ప్రత్యేక హోదా అంశమే ప్రధానమైనదని వైఎస్ జగన్ తేల్చిచెప్పారు. కేంద్రం వద్దనే విస్తృతాధికారాలు ఉన్నందున ఆయా రాష్ట్రాల్లో బలమైన ప్రాంతీయ పార్టీలు ఉన్నా ఏమీ సాధించుకోలేని పరిస్థితి ఉందని, దేశ రాజకీయాల్లో గుణాత్మకమైన మార్పు రావాలని టీఆర్‌ఎస్ భావిస్తుండగా... విభజనతో దారుణంగా నష్టపోయిన ఏపీకి ప్రత్యేక హోదా సాధనే ప్రధాన లక్ష్యం అనే ప్రాతిపదికన వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నేతలు సమాలోచనలు జరిపారు. ప్రత్యేక హోదా విషయంలో కాంగ్రెస్, బీజేపీ దారుణంగా మోసగించాయని ఈ సందర్భంగా వైఎస్సార్‌సీపీ పేర్కొన్నారు.

మరిన్ని ప్రాంతీయ పార్టీలు మూడో ఫ్రంట్ వైపు ఆకర్షితులవుతాయనే అభిప్రాయం కూడా ఈ సమావేశంలో వెల్లడైనట్లు తెలిసింది. మొత్తం మీద ఇవి ప్రాథమిక చర్చలేనని, తదుపరి జరిగే చర్చల్లో మరింత స్పష్టత వస్తుందని బుధవారం చర్చల్లో పాల్గొన్న నేత ఒకరు తెలిపారు.

చంద్రబాబుకు ఉలుకెందుకు?: సజ్జల

రాష్ట్ర ప్రయోజనాల పరిరక్షణ కోసం.. టీఆర్‌ఎస్ చొరవ మేరకు తమ పార్టీ స్పందించి చర్చలు జరిపితే ముఖ్యమంత్రి చంద్రబాబు ఎందుకు ఉలికిపాటుకు గురవుతున్నారని వైఎస్సార్‌సీపీ ప్రధాన కార్యదర్శి సజ్జల రామకృష్ణారెడ్డి ప్రశ్నించారు. టీఆర్‌ఎస్ రాజకీయ పొత్తు కోసం రాలేదని, అసలు వారికి ఏపీలో ఆసక్తి కూడా లేదని అన్నారు. కేటీఆర్–జగన్ కలయికపై చంద్రబాబు ప్రేరణతో ఓ వర్గం మీడియా చేస్తున్న దుష్ప్రచారం, టీడీపీ నేతలు మాట్లాడుతున్న తీరు అభ్యంతరకరమని పేర్కొన్నారు. వైఎస్సార్‌సీపీ గట్టిగా కోరుతున్న ప్రత్యేక హోదాకు మద్దతు నిచ్చిన టీఆర్‌ఎస్‌ను స్వాగతించడంలో ఏమాత్రం తప్పు లేదని తెలిపారు. వాస్తవానికి నాలుగేళ్లపాటు బీజేపీతో కలిసి కాపురం చేసిన చంద్రబాబు ప్రత్యేక హోదా కోసం టీఆర్‌ఎస్ మద్దతు తీసుకుని ఎందుకు పోరాడలేదని నిలదీశారు. చంద్రబాబు చేయలేకపోయిన పనిని తాము చేస్తూంటే అంత అక్కసుగా ఉందా? అని సజ్జల మండిపడ్డారు.

చంద్రుడిపై మొలకలొచ్చాయ్!



మన చందమామపై విత్తనం మొలకెత్తింది. ఒకటి కాదు.. రెండు కాదు.. మూడు రకాల విత్తనాలు అంకురించాయి! అయితే ఏంటి.. అంటారా? చాలానే విషయం ఉంది. జాబిల్లికి అవతలివైపు అంటే ఎప్పుడూ చీకట్లోనే ఉండే ప్రాంతంలో విత్తనాలు మొలకెత్తడం ఒక విశేషమైతే.. భవిష్యత్తులో మనిషి చందమామపై ఇల్లు కట్టుకోవాలనుకుంటే.. తిండికేం ఢోకా లేదన్న భరోసా ఇచ్చే ప్రయోగం కూడా ఇదేనన్నది శాస్త్రవేత్తల అంచనా. సుమారు ఏడాది కింద ఛాంగే–4 పేరుతో చైనా జాబిల్లిపైకి ఓ ల్యాండర్‌ను ప్రయోగించిన విషయం తెలిసిందే. ఇది ఇప్పటివరకు ఎవరూ చూడని జాబిల్లి అవతలి ప్రాంతాన్ని చేరింది. తనతో పాటు 7 అంగుళాల పొడవైన ప్రత్యేకమైన పెట్టెను మోసుకెళ్లింది. ఇందులో పత్తి, బంగాళాదుంప, ఆవాలు, అరబిడోపోసిస్ అనే చిన్న పూల మొక్క విత్తనాలతో పాటు ఈస్ట్, ఈగ గుడ్లు, గాలి, నీళ్లు ఉన్నాయి. చందమామపై ఉండే అత్యధిక, అత్యల్ప ఉష్ణోగ్రతలను, రేడియోధార్మికతలను తట్టుకునే వస్తువులను ఎంపిక చేసి మరీ అక్కడకు పంపారన్నమాట. నియంత్రిత వాతావరణంలో విత్తనాలు మొలకెత్తుతాయా.. లేదా అనేది పరిశీలించాలన్నది ప్రయోగ లక్ష్యం. కొన్ని రోజుల కింద పత్తి విత్తనాలు చిగురించాయి. అంతర్జాతీయ అంతరిక్ష కేంద్రంలోనూ కొన్ని విత్తనాలను మొలకెత్తించి చూసినా.. అవి అత్యల్ప గురుత్వాకర్షణ శక్తి పరిస్థితుల్లో విత్తనాలు మొలకెత్తుతాయా లేదా.. అన్నది చూసేందుకే. జాబిల్లిపై అనేక దుర్భర పరిస్థితులను తట్టుకుని మరీ విత్తనాలు మొలకెత్తగలవన్న విషయం రుజువు కావడంతో భవిష్యత్తులో అక్కడ మనిషి నివాసం ఏర్పరచుకుంటే పంటలు పండించుకునే అవకాశం ఉందని ఈ ప్రయోగం ద్వారా తెలుస్తోంది. చైనా అంతరిక్ష పరిశోధన సంస్థ పత్తి విత్తనం మొలకెత్తిన ఫొటోను విడుదల చేసినా.. బంగాళా దుంప, ఆవాల విత్తనాలు కూడా మొలకెత్తాయని ఈ ప్రయోగాల్లో పాల్గొన్న ప్రొఫెసర్ లియూ హాన్‌లాంగ్ వెల్లడించారు.

బ్రెగ్జిట్ బిల్లుకు రెడ్ సిగ్నల్

▶ మొదటి పేజీ తరువాయి

బిల్లు పార్లమెంటులో తిరస్కరణకు గురవడంతో దీనిపై తదుపరి చర్చలు జరిపి తగు మార్పులు చేసేందుకు మే బుధవారం బ్రస్సెల్స్ వెళ్తారని ఇప్పటివరకు ఉన్న సమాచారం. అయితే ఒప్పందంలో మళ్లీ మార్పులు చేసేందుకు ఈయూ నేతలు పెద్దగా ఆసక్తి చూపడం లేదు. బ్రెగ్జిట్ బిల్లు తిరస్కరణకు గురవడంపై వారు విస్మయం వ్యక్తం చేశారు. ఇలా అయితే ఏ ఒప్పందమూ లేకుండానే ఈయూ నుంచి బ్రిటన్ నిష్క్రమించాల్సి ఉంటుందని హెచ్చరించారు. దీంతో వారిని ఒప్పించి, కొన్ని రాయితీలు పొంది, మళ్లీ కొత్త బ్రెగ్జిట్ ఒప్పందాన్ని కుదుర్చుకోవడం మేకి సవాలే. ఒకవేళ ఆమె గట్టిగా ప్రయత్నించి కొత్త ఒప్పందం చేసుకొచ్చినా దానిపై మళ్లీ పార్లమెంటులో ఓటింగ్ జరుగుతుంది. దీనిని కూడా పార్లమెంటు తిరస్కరిస్తే మేకి మరో మూడు వారాల సమయం లభిస్తుంది. బ్రెగ్జిట్ బిల్లును పార్లమెంటు ఎప్పటికీ ఆమోదించకపోతే ఇక ఏ ఒప్పందమూ లేకుండానే ఈయూ నుంచి బ్రిటన్ బయటకు రావాల్సి ఉంటుంది.

ఇంకో రెండు నెలలే మిగిలింది..

బ్రెగ్జిట్ ప్రక్రియ ఈ ఏడాది మార్చి 29న ప్రారంభం కానుంది. 21 నెలల పాటు ఇది సాగుతుంది. ఆ కాలంలో ఈయూ–బ్రిటన్‌ల మధ్య వాణిజ్య, పౌర సంబంధాలు ఎలా ఉండాలో తెలిపేదే ఈ బ్రెగ్జిట్ ఒప్పందం. ఈ ఒప్పందాన్ని కుదుర్చుకునేందుకు థెరెసా మే రెండేళ్లపాటు ఈయూ నేతలతో చర్చలు జరిపారు. మార్చి 29తో బ్రెగ్జిట్ ప్రారంభం కావాల్సి



బ్రిటన్ పార్లమెంట్

ఉండటంతో కొత్త ఒప్పందాన్ని కుదుర్చుకుని దాన్ని ఆమోదింపజేసుకునేందుకు బ్రిటన్‌కు దాదాపు ఇంకో రెండు నెలల సమయమే మిగిలి ఉంది. కానీ తర్వాత ఏం చేయాలో ఇప్పటికీ బ్రిటన్ నిర్ణయించుకోలేదు. తాను అవిశ్వాసంలో గెలిస్తే ప్రత్యామ్నాయ ప్రణాళికను వచ్చే వారం పార్లమెంటులో ప్రవేశపెడతానని మే వెల్లడించారు. మంగళవారం రాత్రి ఆమె మాట్లాడుతూ 'సభ మాట్లాడింది. ప్రభుత్వం ఆలకించింది. ఏం చేయాలో నిర్ణయించేందుకు అన్ని పార్టీలతోనూ చర్చలు జరుపుతాం. ఎంపీలు తమకు ఏం వద్దో చెప్పారు. కానీ వారికి ఏం కావాలో ఎవరూ చెప్పలేదు. ఈ ఓటింగ్‌తో అది మనకు తెలియదు' అని అన్నారు. 'అన్ని పార్టీల ఎంపీలను నేను కోరేది ఒక్కటే. బ్రిటిష్ ప్రజల మాట వినండి. ఈ అంశాన్ని త్వరగా పరిష్కరించాలని వారు కోరుకుంటున్నారు. అందుకోసం మా ప్రభుత్వానికి సహకరించండి' అని ఆమె అభ్యర్థించారు.

ఓటు కోసం కాన్పు వాయిదా

గర్భంతో ఉన్న ఓ మహిళా ఎంపీ బ్రెగ్జిట్ బిల్లుపై ఓటు వేసేందుకు తన కాన్పును వాయిదా వేసుకున్నారు. ఆమె బంగ్లాదేశ్ తొలి ప్రధాని షేక్ ముజీబుర్ రహ్మాన్‌కు మనవరాలు, ప్రస్తుత బంగ్లాదేశ్ అధ్యక్షురాలు షేక్ హసీనాకు దగ్గరి బంధువు కావడం మరో విశేషం. ప్రతిపక్ష లేబర్ పార్టీ నుంచి ఎన్నికైన టులిప్ సిద్దిఖీ అనే మహిళా ఎంపీ ప్రస్తుతం రెండో బిడ్డకు జన్మనివ్వాల్సి ఉంది. ఫిబ్రవరి 4న సిద్దిఖీకి సిజేరియన్ ద్వారా కాన్పు చేయాలని వైద్యులు తొలుత అనుకున్నారు. అయితే గర్భం సమయంలో మధుమేహం రావడంతో గత మంగళవారమే కాన్పు చేయాలని డాక్టర్లు నిర్ణయించారు. బ్రెగ్జిట్‌పై ఓటు వేసేందుకు వెళ్లాలని ఆమె చెప్పడంతో పరీక్షించిన వైద్యులు, అందుకు అనుమతించి, కాన్పు తేదీని గురువారానికి మార్చారు. సిద్దిఖీ మాట్లాడుతూ 'నా బిడ్డ ఒక రోజు ఆలస్యంగా ఈ ప్రపంచానికి వచ్చినా ఏం కాదు. కానీ ఇది బ్రిటన్–ఈయూల మధ్య బలమైన బంధానికి సంబంధించిన విషయం. అక్కడ ఓటు వేయడం ముఖ్యం' అని అన్నారు.

ఇంకా సమయం ఉంది: మెర్కెల్



బెర్లిన్: బ్రెగ్జిట్‌పై చర్చలు జరిపేందుకు ఇంకా సమయం ఉందని జర్మనీ చాన్స్‌లర్ ఎంజెలా మెర్కెల్ అన్నారు. 'మనకు ఇంకా సమయం ఉంది అయితే బ్రిటిష్ ప్రధాని ఏ ప్రతిపాదన తెస్తారోనని మేం ఎదురుచూస్తున్నాం. ఒప్పందాన్ని బ్రిటిష్ దిగువసభ తిరస్కరించడం పట్ల నేను మిక్కిలి చింతిస్తున్నాను. నష్టాన్ని మేం పరిమితంగా ఉంచాలనుకుంటున్నాం. అందుకే ఒక పద్ధతి ప్రకారం ముందుకెళ్లాలనుకున్నాం. కానీ పద్ధతి లేకుండా అస్తవ్యస్తంగా చేసేందుకు మేం సిద్ధమే. ఇలా అయితే బాగా ఎక్కువ నష్టం జరుగుతుంది' అని ఆమె ఓ టీవీ చానల్‌తో మాట్లాడుతూ అన్నారు.

వ్యతిరేకత ఎందుకు?

- ఒప్పందంలోని కొన్ని అంశాలు ఈయూకి అనుకూలంగాను, వివాదాస్పదంగాను ఉన్నాయని ఈ డీల్‌ను విమర్శిస్తున్నవారు చెబుతున్నారు. యురోపియన్ యూనియన్ నియమాలకు కట్టుబడేలా చేయడం ద్వారా ఈ ఒప్పందం దేశాన్ని ఈయూపై ఆధారపడే స్థితికి నెడుతుందని వారు వాదిస్తున్నారు. కాబట్టి ఒప్పందంలో మార్పులు చేయాలని డిమాండ్ చేస్తున్నారు. దీనిపై ఈయూ నుంచి కొన్ని రాయితీలు పొందేందుకు థెరిసా చేసిన ప్రయత్నాలు ఫలించలేదు. ఒప్పందంలో మార్పులు అంగీకరించబోమని ఈయూ నేతలు ప్రకటించారు.
- బ్రిటన్‌లోని ఈయూ అనుకూల రాజకీయవేత్తలు ఐరోపాతో మరింత దగ్గర ఆర్థిక సంబంధాలుండాలని కోరుతున్నారు. ఈయూలో వుండటం వల్ల సామాజిక భద్రతా హక్కులకు ముప్పు వుండబోదనే అభిప్రాయం వినవస్తోంది.
- బ్రిటన్‌లో భాగంగా వున్న ఉత్తర ఐర్లాండ్ – ఈయూలో భాగంగా వున్న ఐర్లాండ్ మధ్య ఎలాంటి సరిహద్దు ఏర్పాటు చేయరాదని ఈ ఒప్పందంలో పేర్కొనడం కూడా వివాదాస్పదమైంది.

థెరిసాపై విమర్శల వెల్లువ

ఒప్పందంపై అటు థెరిసా కేబినెట్‌లోనూ, ఇటు దేశంలోనూ తీవ్ర వ్యతిరేకత వ్యక్తమవుతోంది. అధికార కన్జర్వేటివ్ పార్టీ ఎంపీలను ఒక్క తాటిపైకి తీసుకురావడానికి బదులు వారి మధ్య చీలికల్ని ఆమె ఇంకాస్త పెద్దవి చేశారని బ్రిటన్ రాజకీయ విశ్లేషకులు వ్యాఖ్యానిస్తున్నారు. ఆమె తన పక్షంతోనే చర్చించడం, భిన్నాభిప్రాయాలు గలవారితో చర్చలు జరపకపోవడం వల్ల పరిస్థితి మరింత గడ్డుగా మారిందంటున్నారు. ఈయూకు వ్యతిరేకంగా ఆమె చేసిన వ్యాఖ్యలు ఇరు శిబిరాల మధ్య దూరాన్ని పెంచాయని, ఈయూలో ఓ ఒక్కరితోనూ ఆమె స్నేహాన్ని పెంపొందించుకోలేకపోయారని విశ్లేషిస్తున్నారు. ఒక రాజకీయవేత్తగా ఆమె ఇరుకు ఆలోచనా ధోరణి, కఠిన వైఖరి దేశానికి చెరుపు చేస్తోందంటున్నారు.



థెరిసా

ఆర్థిక మాంద్యం తప్పదు

ఒప్పందం లేకుండా ఈయూ నుంచి విడిపోయినట్టయితే బ్రిటన్ తీవ్రంగా నష్టపోతుందనే అభిప్రాయం బలంగా వినిపిస్తోంది. అదే జరిగితే బ్రిటన్ తీవ్ర ఆర్థిక మాంద్యంలో కూరుకుపోయి ఓ శతాబ్ది కాలం వెనక్కి వెళుతుందని బ్యాంక్ ఆఫ్ ఇంగ్లాండ్ ఇప్పటికే హెచ్చరించింది. బ్రిటన్ ఎలాంటి ఒప్పందం కుదుర్చుకోకుండా ఈయూ నుంచి బయటకు వస్తే – ప్రపంచ వాణిజ్య సంస్థ (డబ్లూటీవో) నియమాలకు అనుగుణంగా వాణిజ్యం చేయాల్సివుంటుంది. ఒప్పందం కుదరకపోతే బ్రిటన్‌కు మంచిదేనని, ఆ విధంగా ఈయూ నియమాల నుంచి విముక్తి లభించినట్టవుతుందని, ఇతర దేశాలతో ఒప్పందాలు కుదుర్చుకోవడానికి వీలవుతుందని మరి కొందరి వాదన.

ఒప్పందం లేకుంటే నష్టమే..

ఒప్పందం లేకుండా, ఎలాంటి పరివర్తనా వ్యవధి లేకుండా (మార్చి 29 రాత్రి 11 గంటలకు యూరోపియన్ యూనియన్ నుంచి బ్రిటన్ అధికారికంగా నిష్క్రమించాల్సివుంది. తర్వాత 21 మాసాల పరివర్తనా కాలం మొదలవుతుంది) బ్రిటన్ నిష్క్రమించడం వల్ల ఆ దేశ ఆర్థిక వ్యవస్థపై, ప్రత్యేకించి ఐర్లాండ్ (ఈయూ)లోని పలు రంగాలపై తీవ్ర ఒత్తిడి పడే ప్రమాదముంది. తమ దేశంలో ఆహారానికి, మందులకు తీవ్ర కొరత ఏర్పడుతుందని ఐర్లాండ్ ఆందోళన చెందుతోంది. ఈయూకి బ్రిటన్ చేసే ఎగమతుల్లో ఐర్లాండ్ వాటా 12.4శాతం. పెట్రోలియం, మందుల కోసం ఐర్లాండ్ భారీ ఎత్తున యూకేపై ఆధారపడుతోంది.

ఒప్పందంలోని ముఖ్యాంశాలు

- 2019 మార్చి 29 రాత్రి 11 గంటలకు యూరోపియన్ యూనియన్ నుంచి బ్రిటన్ అధికారికంగా నిష్క్రమిస్తుంది. తర్వాత మొదలయ్యే 21 మాసాల పరివర్తనా కాలంలో.. ఎటువంటి సుంకాలు లేకుండా ఈయూ – యూకే స్వేచ్ఛగా వాణిజ్యం చేసుకోవచ్చు. ఈయూ నిబంధనలను బ్రిటన్ అనుసరించాల్సివుంటుంది. ఈ కాలంలో ఈయూ వ్యవస్థలు తీసుకునే నిర్ణయాలకు యూకే కట్టుబడి వుండాలి. యూరోపియన్ కోర్టు ఆఫ్ జస్టిస్ (ఈసీజే) పరిధిలోనే కొనసాగాలి. అవసరమనుకుంటే, జాయింట్ కమిటీ 2020 జులై ఒకటి లోగా పరివర్తనా కాలాన్ని పొడిగించవచ్చు. ఎంతకాలం పొడిగిస్తారనే విషయమై స్పష్టత లేదు.
- ఆర్థిక లావాదేవీలు పరిష్కరించుకోవడంలో భాగంగా.. విడిపోయేటప్పుడు ఈయూకి బ్రిటన్ 39 బిలియన్ పౌండ్లు(5100 కోట్లు) నష్టపరిహారంగా చెల్లించాల్సి ఉంటుంది. పలువురు రాజకీయవేత్తలు దీన్ని వ్యతిరేకిస్తున్నారు.
- పౌరుల నివాస హక్కులకు ఈ ఒప్పందం గ్యారెంటీ ఇస్తుంది. ఇప్పుడు వున్న చోటే చదువుకుని, ఉద్యోగాలు చేసే వీలుంటుంది.
- బ్రిటన్‌లో భాగంగా వున్న ఉత్తర ఐర్లాండ్ – ఈయూలో బాగంగా వున్న ఐర్లాండ్ మధ్య ప్రస్తుతానికి ఎలాంటి సరిహద్దు ఏర్పాటు చేయరు. రాకపోకలకు ఎలాంటి ఆంక్షలూ ఉండవు.



నాటక దిగ్గజం ఆచార్య మొదలి ఇకలేరు

నాటక కళ, రచన, పరిశోధన, బోధనకు జీవితం అంకితం

- ప్రతిభా వైజయంతి జీవితకాల సాధన పురస్కార గ్రహీత
- తెనాలిలో అనారోగ్యంతో మృతి

తెనాలి: నటుడు, దర్శకుడు, రచయిత, నాటకరంగ పరిశోధకుడు, ఆచార్యుడు 'కళారత్న' మొదలి నాగభూషణశర్మ (84) మంగళవారం రాత్రి గుంటూరు జిల్లా తెనాలిలో కన్నుమూశారు. నాజరు పేటలోని మల్లాదివారి వీధిలో నివసిస్తున్న నాగభూషణశర్మ, కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్నారు. పరిస్థితి విషమించడంతో స్థానిక ప్రైవేట్ ఆస్పత్రికి తరలించినా ప్రయోజనం లేకుండాపోయింది. ఆయనకు ఇద్దరు కుమారులు. బుధవారం సాయంత్రం బుర్రిపాలెం రోడ్డులోని శ్మశానవాటికలో అంత్యక్రియలు నిర్వహించారు. ఆయన సతీమణి సరస్వతి 2015లో మృతిచెందారు. ఏపీ నాటక అకాడమీ అధ్యక్ష, ఉపాధ్యక్షులు, వివిధ కళాసంస్థల నిర్వాహకులు, కళాకారులు నాగభూషణశర్మ భౌతికకాయాన్ని సందర్శించి నివాళులర్పించారు. ఏడు పదుల కాలం తన జీవితాన్ని నాటకకళ, నాటక రచన, పరిశోధన, బోధనకు అంకితం చేసిన నాగభూషణశర్మ ఉస్మానియా యూనివర్సిటీలో ఇంగ్లిష్ అధ్యాపకుడిగా పనిచేస్తూనే నాటకకళపై అభిరుచితో, అమెరికా వెళ్లి మాస్టర్ ఆఫ్ ఫైన్‌ఆర్ట్స్ (థియేటర్) చేశారు. నాటకరంగ సేవలకుగానూ ఈనెల 6న తెనాలిలో అజో–విభొ–కందాళం ఫౌండేషన్ వారి ప్రతిభా వైజయంతి జీవితకాల సాధన పురస్కారం అందుకున్నారు.



ఈ నెల 6న నాగభూషణశర్మకు ప్రతిభ వైజయంతి జీవితకాల సాధన పురస్కారం ప్రదానం చేస్తున్న ప్రముఖులు

స్టోన్ క్రషింగ్ యూనిట్ల పున రుద్ధరణకు ఎన్జీటీ తిరస్కరణ

సాక్షి, న్యూఢిల్లీ: అనంతపురం జిల్లాలో నిబంధనలకు విరుద్ధంగా నడుస్తున్న స్టోన్‌క్రషింగ్ యూనిట్లను పునరుద్ధరించేందుకు జాతీయ హరిత ట్రిబ్యునల్ (ఎన్జీటీ) తిరస్కరించింది. జిల్లాలోని నేమకల్లు గ్రామంలో నిబంధనలకు విరుద్ధంగా స్టోన్ క్రషర్ యూనిట్ల నిర్వహణపై చెన్నై బెంచ్‌లో దాఖలైన కేసును జస్టిస్ ఎ.కె.గోయల్ బెంచ్ బుధవారం ఢిల్లీ నుంచి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా విచారించింది. నేమకల్లులో ఒక్క యూనిట్ కూడా నిబంధనలు పాటించడం లేదని కేంద్ర కాలుష్య నియంత్రణ మండలి నివేదిక సమర్పించింది. ఎన్జీటీ కమిటీ వేసి తనిఖీలు జరిపే వరకు రాష్ట్ర ప్రభుత్వం ఈ విషయంలో ఎందుకు చర్యలు తీసుకోలేదని ట్రిబ్యునల్ ప్రశ్నించింది. స్టోన్‌క్రషింగ్ యూనిట్ల మూసివేతకు కాలుష్య నియంత్రణ మండలి ఇచ్చిన ఆదేశాలపై స్టే ఇవ్వాలని యూనిట్ల నిర్వాహకులు కోరగా ట్రిబ్యునల్ తిరస్కరించింది. ఇక నేమకల్లు గ్రామం క్రషింగ్ యూనిట్ల నిర్వహణకు అనువైనదా? కాదా? అన్న విషయాలపై ధన్‌బాద్ మైన్స్ ఐఐటీతో అధ్యయనం జరపడానికి 3 నెలల సమయం ఇవ్వాలని రాష్ట్ర ప్రభుత్వం కోరగా.. 'ఇదేమైనా రాకెట్ సైన్సా' అని వ్యాఖ్యానించిన ట్రిబ్యునల్.. ఆరు వారాల గడువు మాత్రమే ఇచ్చింది. మరోవైపు క్రషింగ్ యూనిట్లను సవాల్ చేస్తూ పిటిషన్ దాఖలు చేసినందుకు ఆయా యూనిట్ల యజమానులు తనను బెదిరిస్తున్నారని పిటిషనర్ హిరోజీరావు ట్రిబ్యునల్ దృష్టికి తీసుకురాగా పోలీసులను ఆశ్రయించాలని సూచించింది. తదుపరి విచారణను మార్చి 6కు వాయిదా వేసింది.

టీడీపీ అనుబంధ సంఘాల అధ్యక్షుల నియామకం

సాక్షి, అమరావతి: తెలుగుదేశం పార్టీ అనుబంధ విభాగాల అధ్యక్షులను ఆ పార్టీ అధ్యక్షుడు నారా చంద్రబాబునాయుడు బుధవారం నియమించారు. తెలుగు యువత రాష్ట్ర అధ్యక్షుడిగా దేవినేని అవినాష్ (కృష్ణాజిల్లా), తెలుగు మహిళ అధ్యక్షురాలిగా పోతుల సునీత (ప్రకాశం జిల్లా), తెలుగు రైతు గా కంభం విజయరామి రెడ్డి (నెల్లూరు జిల్లా)ని నియమించారు. అలాగే బీసీసెల్‌కు బోనబోయిన శ్రీనివాసయాదవ్ (గుంటూరు), ఎస్సీ సెల్‌కు ఎంఎస్ రాజు (అనంతపురం జిల్లా), ఎస్టీ సెల్‌కు ఎంవీవీ ప్రసాద్ (విశాఖపట్నం), మైనారిటీ సెల్‌కు ఇంతియాజ్ అహ్మద్ (కర్నూలు జిల్లా)ను నియమించారు. క్రిస్టియన్ సెల్‌కు మద్దిరాల జోసెఫ్ ఇమ్మాన్యుయేల్ (గుంటూరు), టీఎన్‌టీయూసికి బి నరేష్కుమార్ రెడ్డి(చిత్తూరు), అంగన్ వాడీ యూనియన్‌కు భీమినేని వందనాదేవిని (గుంటూరు జిల్లా) ఆయా విభాగాల అధ్యక్షులను నియమించారు.

108 అంబులెన్స్‌లో ఆక్సిజన్ అందక వ్యక్తి మృతి


ఆక్సిజన్ అందక మృతి చెందిన గోరియానాయక్

గురజాల: 108 అంబులెన్సులో ఆక్సిజన్ అందక ఓ వ్యక్తి మృతిచెందిన ఘటన బుధవారం గుంటూరు జిల్లాలో జరిగింది. దాచేపల్లి మండలం ముత్యాలంపాడు గ్రామానికి చెందిన కేతావత్ గోరియానాయక్ ఆయాసంతో బాధపడుతుండడంతో కుటుంబ సభ్యులు 108కు ఫోన్‌చేశారు. ఫోన్ చేసిన కొంతసేపటికి 108 వాహనం రావడంతో వెంటనే గోరియానాయక్‌ను అంబులెన్సులోకి ఎక్కించారు. అతనికి ఆక్సిజన్ పెట్టాలని కుటుంబ సభ్యులు కోరగా 108 సిబ్బంది లేదని సమాధానం చెప్పారు. రెండు మూడు కిలోమీటర్లు దాటిన తరువాత గోరియానాయక్‌కు ఆక్సిజన్ ఇచ్చారు. గురజాల సామాజిక ఆరోగ్య కేంద్రానికి తరలించే మార్గమధ్యంలో గోరియానాయక్ మృతిచెందాడు. గోరియానాయక్ మృతిచెందాడని సిబ్బంది బంధువులకు తెలిపారు.108లో కనీస వసతులు లేకే గోరియానాయక్ మృతిచెందాడని, తాము మృతదేహాన్ని తీసుకెళ్లబోమని భీష్మించారు. ఈ విషయం తెలుసుకున్న గురజాల పట్టణ సీఐ వై రామారావు తన సిబ్బందిని వైద్యశాల వద్దకు పంపించి విషయంపై ఆరా తీశారు. వెంటనే అంబులెన్సు నుంచి మృతదేహాన్ని తీసుకెళ్లాలని, సమస్యలు ఏవైనా ఉంటే పోలీసుస్టేషనలో ఫిర్యాదు చేయాలని సూచించారు. దాచేపల్లి జడ్పీటీసీ సభ్యుడు మూలగొండ్ల ప్రకాశ్‌రెడ్డి వైద్యశాలకు వచ్చి గోరియానాయక్ మృతదేహాన్ని పరిశీలించి జరిగిన విషయాన్ని అడిగి తెలుసుకున్నారు.

వివిధ ప్రాంతాలకు ప్రత్యేక రైళ్లు

రైల్వేస్టేషన్ (విజయవాడ పశ్చిమ): ప్రయాణికుల రద్దీ దృష్ట్యా వివిధ ప్రాంతాలకు ప్రత్యేక రైళ్లు నడపనున్నట్టు రైల్వే అధికారులు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. జబల్‌పూర్–తిరునల్వేలి ప్రత్యేక రైలు (02194) ఫిబ్రవరి 7, 14, 21, 28, మార్చి 7, 14, 21, 28 తేదీల్లో ఉదయం 9.30 గంటలకు జబల్‌పూర్‌లో బయలుదేరుతుంది. తిరునల్వేలి– జబల్‌పూర్ రైలు (02193) ఫిబ్రవరి 9, 16, 23 మార్చి, 2, 9, 16, 23, 30వ తేదీల్లో సాయంత్రం 5.45 గంటలకు తిరునల్వేలిలో బయలుదేరుతుంది.

పురందేశ్వరి చైర్‌పర్సన్‌గా బీజేపీ మేనిఫెస్టో కమిటీ

కన్వీనర్‌గా ఐవైఆర్ కృష్ణారావు నియామకం

సాక్షి, అమరావతి: బీజేపీ ఏపీ శాఖ ఎన్నికల మేనిఫెస్టో రూపొందించేందుకు ప్రత్యేక కమిటీని ఏర్పాటు చేసింది. కేంద్ర మాజీ మంత్రి దగ్గుబాటి పురంధేశ్వరిని మేనిఫెస్టో చైర్‌పర్సన్‌గా, ప్రభుత్వ మాజీ ప్రధాన కార్యదర్శి ఐవైఆర్ కృష్ణారావును కన్వీనర్‌గాను నియమించినట్టు బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు కన్నా లక్ష్మీనారాయణ ప్రకటనలో పేర్కొన్నారు. కమిటీ సభ్యులుగా పి.విజయబాబు, ఎమ్మెల్సీ పీవీఎన్ మాధవ్, దాసరి శ్రీనివాసులు, షేక్ మస్తాన్, పాకా సత్యనారాయణ, కె.కపిలేశ్వరయ్య, పి.సన్యాసిరాజు మురళి, సుధీష్ రాంబోట్ల, సుబ్రమణ్యంను నియమించారు.

చంద్రబాబు పాలనంతా మోసాల పుట్ట

బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు కన్నా లక్ష్మీనారాయణ



కడప కోటిరెడ్డి సర్కిల్: అలవి కాని హామీలిచ్చి.. ఏ ఒక్కటీ అమలు చేయకుండా..నిత్యం ప్రజలను మోసం చేస్తూ పాలన సాగించడం సీఎం చంద్రబాబుకే చెల్లిందని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు కన్నా లక్ష్మీనారాయణ దుయ్యబట్టారు. బుధవారం వైఎస్సార్ జిల్లా కేంద్రం కడపలో పార్టీ జిల్లా అధ్యక్షుడు పుప్పాల శ్రీనాథరెడ్డి అధ్యక్షతన మీడియాతో మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం మినిట్స్‌లో పొందుపరచి ఉక్కు పరిశ్రమను ఏర్పాటు చేస్తామని చెప్పి.. అందుకు తగ్గ వనరులకుగానూ సమాచారం ఇవ్వమని అడిగితే ఇవ్వకుండా.. కేంద్రం మోసం చేసిందని తప్పుడు ప్రచారం చేయడం దారుణమన్నారు. తనకు అనుకూలంగా ఉన్న పత్రికలను, చానళ్లను అడ్డుపెట్టుకుని తప్పుడు ప్రచారం చేయడం దుర్మార్గం కాదా? అని ప్రశ్నించారు. కేంద్రం చొరవ తీసుకునే సమయంలో హడావిడిగా డిసెంబరు నెలలో శంకుస్థాపన చేశారు. దీనికి ఎలాంటి అనుమతులు లేవన్నారు. ఫిబ్రవరి 1 నుంచి శ్రీకాకుళంలో బస్సుయాత్ర ప్రారంభమవుతుందని అన్నారు. పార్టీ జాతీయ కార్యదర్శి వై సత్యకుమార్, జాతీయ కార్యదర్శి, రాష్ట్ర ఇన్‌చార్జ్ సునీల్ దేవకర్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సురేష్‌రెడ్డి, రాష్ట్ర ఉపాధ్యక్షుడు విష్ణువర్ధన్‌రెడ్డి, రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు శశిభూషన్‌రెడ్డి, సుంకర శ్రీనివాస్, సింగారెడ్డి రామచంద్రారెడ్డి, బీజేవైఎం రాష్ట్ర అధ్యక్షుడు నాగోతు రమేష్‌నాయుడు, రాష్ట్ర అధికారి ప్రతినిధి బండి ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.

27 నుంచి బైబిల్ మిషన్ మహోత్సవాలు



ప్రార్థనలు చేస్తున్న జె.శామ్యేల్‌కిరణ్

పెదకాకాని(పొన్నూరు): సకల జనులకు శుభవార్త అందించడమే లక్ష్యంగా 81వ బైబిల్ మిషన్ మహోత్సవాలను నిర్వహించనున్నామని మిషన్ ఉపాధ్యక్షుడు రెవరెండ్ డాక్టర్ జె.శామ్యేల్‌కిరణ్ తెలిపారు. గుంటూరు జిల్లా, పెదకాకాని మండలం, నంబూరులోని ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం ఎదుట బైబిల్ మిషన్ సభల ప్రాంగణంలో ఈ నెల 27, 28, 29 తేదీల్లో బైబిల్ మిషన్ మహోత్సవాలు జరుగుతాయని చెప్పారు. ఈ ఉత్సవాల విజయవంతం కోరుతూ పందిళ్లలో బుధవారం ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. ఫాదర్ ఎం.దేవదాసుకు దేవుడు బయలు పరచిన బైబిలు మిషన్ మహోత్సవాలను అత్యంత భక్తిశ్రద్ధలతో నిర్వహిస్తున్నట్లు కిరణ్ తెలిపారు. స్త్రీల సభల నిర్వాహకులు జె.రీనా శామ్యేల్ బృందం క్రైస్తవ భక్తి గీతాలను ఆలపించింది. పాస్టర్లు, యువకులు, మహిళలు, వలంటీర్లు పాల్గొన్నారు.

టీడీపీది ప్రచారార్భాటమే

ఎమ్మెల్యే తలసాని శ్రీనివాసయాదవ్



భీమవరం: తెలుగుదేశంపార్టీ అసత్య, ఆర్భాట ప్రచారాలతో ప్రజలను మభ్యపెట్టడం మినహా నాలుగున్నరేళ్ల పాలనలో ప్రజలకు చేసింది శూన్యమని తెలంగాణ రాష్ట్ర మాజీ మంత్రి, సనత్‌నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాసయాదవ్ తీవ్రంగా విమర్శించారు. సంక్రాంతి పండుగ సందర్భంగా మంగళవారం భీమవరం వచ్చిన సందర్భంగా ఏర్పాటు చేసిన విలేకరులతో మాట్లాడారు. ముందుగా పట్టణంలోని శ్రీమావుళ్లమ్మ అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. 400 ఏళ్ల క్రితం నిర్మించిన హైదరాబాద్‌ను తానే నిర్మించానని గొప్పలు చెబుతున్న చంద్రబాబు నాలుగున్నరేళ్ల పాలనలో అమరావతిలో రాజధానిని ఎందుకు నిర్మించలేకపోయారని ప్రశ్నించారు. ఏపీకి ఆదాయం లేదని, రాష్ట్ర విభజన తరువాత లోటుబడ్జెట్‌తో అప్పగించారని ముసలికన్నీరు కారుస్తున్న చంద్రబాబు పత్రికలు, టెలివిజన్స్‌లో ఆర్భాట ప్రచారం కోసం రూ.కోట్లు ఎలా దుబారా చేస్తోందని దుయ్యబట్టారు. పోలవరం నిర్మాణంలో ఇప్పటివరకు ఒక్క గేటు మాత్రమే ఏర్పాటుచేయగా జూలైలో నీరు విడుదలచేస్తామంటూ ప్రజలను మోసగించే ప్రయత్నం చేస్తున్నారన్నారు. ఆంధ్రకు ప్రత్యేకహోదా ఇవ్వాలంటూ పార్లమెంటులో టీఆర్‌ఎస్ ఎంపీ కవిత ఆందోళన చేసిన విషయాన్ని గుర్తుచేశారు. రాజధాని పేరుతో ప్రభుత్వం రియల్ ఎస్టేట్ వ్యాపారం చేస్తోందని ఆరోపించారు. చంద్రబాబుకు రానున్న ఎన్నికల్లో ప్రజలు తగిన బుద్ధిచెప్పడం ఖాయమన్నారు. ఏపీలో బడుగు, బలహీనవర్గాలకు సరైన నాయకత్వం లేదని, వారి అభివృద్ధికి, చైతన్యవంతం చేయడానికి అవసరమైతే తాను నాయకత్వం వహిస్తానని శ్రీనివాస్‌యాదవ్ స్పష్టం చేశారు.

చిత్తూరు జిల్లాలో జల్లికట్టు

ఏడుగురికి తీవ్ర గాయాలు • ఇద్దరి పరిస్థితి విషమం



ఎ.రంగంపేటలో ఎద్దుల పోటీని వీక్షిస్తున్న జనం

తిరుపతి రూరల్: చిత్తూరు జిల్లాలో సంక్రాంతి వేడుకల్లో భాగంగా నిర్వహించే సంప్రదాయ సాహస క్రీడ జల్లికట్టు (పశువుల పండుగ)ను బుధవారం ఘనంగా నిర్వహించారు. చంద్రగిరి మండలం ఎ.రంగంపేట, శేషాపురం, అరిగెల వారిపల్లి ప్రాంతాల్లో నిర్వహించిన జల్లికట్టులో 2,900కి పైగా దూసుకొస్తున్న ఎద్దులు, పశువులను అదుపు చేసేందుకు 5 వేల మందికి పైగా యువకులు పోటీ పడ్డారు. ఈ సాహస క్రీడను వీక్షించేందుకు జిల్లా నలుమూలల నుంచే కాకుండా తమిళనాడు రాష్ట్రం నుంచి పెద్ద సంఖ్యలో జనం తరలివచ్చారు. ఎద్దులకు కట్టిన పలకలు (బహుమతులు) కైవసం చేసుకునేందుకు ప్రాణాలకు తెగించి మరీ వాటిని పట్టుకున్నారు. పలకలను దక్కించుకున్న యువత కేరింతలు కొడుతూ సందడి చేశారు. ఈ క్రమంలో ఏడుగురికి తీవ్ర గాయాలయ్యాయి. అందులో ఇద్దరి పరిస్థితి విషమంగా ఉండటంతో తిరుపతికి తరలించారు. 23న రామిరెడ్డిపల్లిలో జరిగే జల్లికట్టులో సినీ నటులు మోహన్‌బాబు, మంచు విష్ణు, మనోజ్ పాల్గొంటారు.

ఆంక్షల నడుమ జల్లికట్టు

సాక్షి, చెన్నై: కనుమ పర్వదినం రోజున మదురై జిల్లా పాలమేడులో జరిగిన జల్లికట్టు వీరత్వాన్ని చాటింది. సుప్రీంకోర్టు సూచనల మేరకు కట్టుదిట్టమైన ఆంక్షల నడుమ ఇక్కడ జల్లికట్టు నిర్వహించారు. ఉదయం ఆరున్నర గంటలకే రాష్ట్రంలోని వివిధ జిల్లాల నుంచి కొమ్ములు తిరిగిన బసవన్నలు బుసలు కొడుతూ రంగంలోకి దిగాయి. నమోదు చేసిన పశువులను, టోకెన్లు పొందిన క్రీడాకారులను మాత్రమే క్రీడారంగంలోకి పంపించారు. ఎద్దులు జనంలోకి చొచ్చుకు వెళ్లకుండా, ఎలాంటి ప్రమాదం చోటు చేసుకోకుండా పెద్ద ఎత్తున బారికేడ్లను ఏర్పాటు చేశారు. 500 ఎద్దులు కదన రంగంలోకి రాగా, వాటిని పట్టుకునేందుకు 843 మంది క్రీడాకారులు దూసుకెళ్లారు. ఇందులో 30 మంది వరకు గాయపడ్డారు. మదురై జిల్లాలోని అలంగానల్లూరులో గురువారం జల్లికట్టు సాగనుంది. ఇందుకోసం ప్రత్యేక ఏర్పాట్లు జరిగాయి.

'వైఎస్సార్‌సీపీ, టీఆర్‌ఎస్‌లు కలిసిపోతే సరి'

పెదవాల్తేరు(విశాఖతూర్పు): వైఎస్సార్‌సీపీ, తెలంగాణ రాష్ట్ర సమితి పార్టీలు ఒకే గొడుగు కిందికి రావాలని రాష్ట్ర విద్యాశాఖ మంత్రి గంటా శ్రీనివాసరావు పేర్కొన్నారు. బీచ్‌రోడ్డులోని పార్కు హోటల్లో ఆయన బుధవారం మీడియాతో మాట్లాడారు. లోటస్‌పాండ్‌లో వైఎస్ జగన్, టీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ బృందం సభ్యులు కలుసుకోవడం హాట్‌టాపిక్‌గా మారిందన్నారు. కేసీఆర్ ఫెడరల్ ఫ్రంట్ పేరుతో దేశవ్యాప్త పర్యటనలు చేస్తున్నారని, ఇందులో భాగంగా కేటీఆర్ జగన్‌ని కలిశారని చెప్పారు. కేసీఆర్, జగన్‌లు అవిభక్త కవలలని, రెండు పార్టీల ఆలోచనలు, భావాలు ఒక్కటిగా ఉన్నప్పుడు ఒకే పార్టీగా కలిసిపోవాలని మంత్రి అన్నారు.

కొక్కొక్కో.. కోట్లు

రాష్ట్రవ్యాప్తంగా రూ.2,500 కోట్ల కోడి పందేలు



కృష్ణా జిల్లా ఈడుపుగల్లు, మద్దూరు పరిసరాల్లో ఏర్పాటు చేసిన పందెం శిబిరాలు

సాక్షి, నెట్‌వర్క్: తూర్పుగోదావరి జిల్లాలో జూదరాయుళ్లు చెలరేగిపోయారు. సుమారు 400 బరులకు పైగా ఏర్పాటు చేసి పందేలు నిర్వహించారు. శ్రీకాకుళం, విశాఖపట్నం, విజయనగరం నుంచి జూదప్రియులు పెద్ద ఎత్తున తరలివచ్చారు. పండుగ మూడు రోజులు రూ.800 కోట్లకుపైగా కోడి పందేలు జరిగాయని అంచనా. ఒకప్పుడు ఊరి పొలిమేరలకు, కొబ్బరి తోటలకు పరిమితమైన పందేలు ఇప్పుడు మెయిన్ రోడ్లకు దగ్గరగా బహిరంగంగానే సాగాయి. యు.కొత్తపల్లిలో అయితే పోలీసుస్టేషన్‌కు కూతవేటు దూరంలోనే పందేలు జరిగాయి. డిప్యూటీ సీఎం చినరాజప్ప ప్రాతినిధ్యం వహిస్తున్న పెద్దాపురం మండలం ఆర్.బి.కొత్తూరులో పండుగ మూడు రోజులు రూ.5 కోట్ల మేర, పనసపాడు–తిమ్మాపురం సరిహద్దులో రూ.10 కోట్ల మేర, తుని నియోజకవర్గం తేటగుంటలో రూ.మూడు కోట్ల మేర పందేలు నడిచాయి. జగ్గంపేట మండలం మల్లిపాకలో పందేలు చూసేందుకు వచ్చినవారి నుంచి రూ.300 చొప్పున నిర్వాహకులు వసూలు చేయడం గమనార్హం. పందేనికి కనీస ధర రూ.30 వేలుగా నిర్ణయించారు. కిర్లంపూడి, వేళంక, కాత్రేవుల పల్లెలో భారీ పందేలు జరిగాయి. పిఠాపురం టీడీపీ ఎమ్మెల్యే వర్మ సొంత గ్రామం పి.దొంతమూర్రులో రూ.మూడు కోట్లు, ఇసుకపల్లి, పిఠాపురంలలో రూ.ఆరు కోట్ల మేర పందేలు సాగాయి. కాకినాడ రూరల్ నియోజకవర్గంలో సుమారు 25 కోట్ల మేర పందేలు జరిగాయని తెలుస్తోంది. అల్లవరం మండలం గోడి, గోడిలంక, అల్లవరం, రెల్లుగడ్డ, ఉప్పలగుప్తం మండలం ఎన్.కొత్తపల్లి, చల్లపల్లి, గొల్లవిల్లి, భీమనపల్లిలో అడ్డూ అదుపులేకుండా పందేలు జరిగాయి. కోడి పందేలకు తోడు పలుచోట్ల అశ్లీల నృత్యాలను నిర్వహించారు. డిప్యూటీ సీఎం చినరాజప్ప సొంత మండలం ఉప్పలగుప్తంలో గొల్లవిల్లి, భీమనపల్లిలో అశ్లీల నృత్యాలను నిర్వహించడం గమనార్హం.

మినీ స్టేడియాలను తలపించిన బరులు

పశ్చిమ గోదావరి జిల్లాలో కోడి పందేల కోసం ఏర్పాటు చేసిన బరులతోపాటు వాటి పక్కనే పేకాట శిబిరాలు, మద్యం దుకాణాలు, బెల్టు షాపులు వెలిశాయి. ఫలితంగా బరులు జాతరలను తలపించాయి. జిల్లాలో రూ.700 కోట్ల మేర పందేలు సాగాయి. కోడిపందేలు, పేకాటల్లో రూ.కోట్లు చేతులు మారితే గుండాట, కోతాటల్లో రూ.లక్షలు, రూ.వేలు చేతులు మారాయి. ఒక్కో కోడి పందెం కనీసం రూ.25 వేల నుంచి గరిష్టంగా రూ.25 లక్షల వరకు సాగింది. పోలీసులు, రెవెన్యూ సిబ్బంది.. నిర్వాహకుల నుంచి భారీగా వసూళ్లు చేసినట్టు ఆరోపణలు వినిపిస్తున్నాయి. పోలీసులు మూడురోజులూ పందేలు జరిగే ప్రాంతాల వైపు రాకపోవడం గమనార్హం. బరుల వద్దే మద్యం అమ్మకాలు పెద్ద ఎత్తున జరిగాయి. జిల్లాలో 30 వరకూ పెద్ద బరులు ఏర్పాటు చేయగా.. మరో 200 వరకూ చిన్న బరులు సిద్ధం చేశారు. ఆయా ప్రాంతాల్లో మినీ స్టేడియాలను తలపించేలా భారీ షామియానాలు, వీఐపీ గ్యాలరీలు ఏర్పాటు చేశారు. చింతలపూడి, జంగారెడ్డిగూడెం మండలాల్లో ఏర్పాటు చేసిన పందేలకు తెలంగాణ నుంచి కూడా జూదరులు భారీగా తరలివచ్చారు. లక్షల్లో పందేలు జరిగాయి. కామవరపుకోట మండలం రావికంపాడు అడ్డరోడ్డు వద్ద మంగళవారం రాత్రి కోతాట, గుండాట ఆడుతున్న వ్యక్తుల మధ్య ఘర్షణ జరిగింది. పోలవరం నియోజకవర్గంలో 7 మండలాల్లో సుమారు 45 బరుల్లో కోడిపందేలు నిర్వహించారు. జీలుగుమిల్లి మండలం తాటియాకులగూడెంలో కోడిపందేల్లో భాగంగా జరిగిన కొట్లాటలో ఇద్దరికి గాయాలయ్యాయి. నరసాపురం నియోజకవర్గంలో విచ్చలవిడిగా కోడిపందేలు, పేకాట, గుండాట సాగాయి. నరసాపురం పట్టణంలో రోడ్డు పక్కన తోపుడుబళ్లపై పెట్టి మరీ గుండాట ఆడించారు. టీడీపీ నేతలు దగ్గరుండి నిర్వహించడంతో పోలీసులు కన్నెత్తి చూడలేదు. మార్టేరులో ఫ్లడ్‌లైట్ల వెలుగులో కోడిపందేలు నిర్వహించారు. తణుకు నియోజకవర్గంలో 16 చోట్ల బరులు ఏర్పాటు చేశారు.



తాడేపల్లిగూడెం మండలం మొదుగగుంట బరి వద్ద కోడి పందేల దృశ్యం..



కాకినాడ పరిసర ప్రాంతాల్లో మహిళల కాయ్.. రాజా కాయ్..

విజయవాడలో విచ్చలవిడిగా కోతముక్కాట

కృష్ణా జిల్లాలో రూ.500 కోట్ల మేర కోడి పందేలు సాగాయని అంచనా. జిల్లావ్యాప్తంగా బహిరంగంగానే కోడిపందేలు, గుండాట, పేకాట జరిగాయి. కంకిపాడు, మునునూరు, బాపులపాడు, మచిలీపట్నం, గుడివాడ, నందిగామ, కంచికచర్ల, చందర్లపాడు, వీరులపాడు, మైలవరం, గన్నవరం, పామర్రు మండలాల్లో భారీ స్థాయిలో కోడి పందేలు నిర్వహించారు. ఎన్నడూ లేనివిధంగా విజయవాడ నగరంలోని ప్రముఖ హోటళ్లలో టీడీపీ నేతల ఆధ్వర్యంలో కోతముక్కాట విచ్చలవిడిగా సాగింది. ఒక్కో కోసుకు రూ.లక్ష చొప్పున పందేలు జరిగాయి.

సంక్రాంతి మూడు రోజుల్లో వందల కోట్ల రూపాయలు చేతులు మారినట్లు అంచనా. గుంటూరు జిల్లాలో కూడా రూ.350 కోట్ల మేర కోడి పందేలను నిర్వహించినట్టు తెలుస్తోంది. రేపల్లె రూరల్ మండలంలోని బొబ్బర్లంక, గుడ్డికాయలలంక, నిర్మల్ నగర్, చెరుకుపల్లి మండలం తూర్పుపాలెం, బలుసులపాలెం, నిజాంపట్నం మండలం అడవులదీవి, దిండి, కొత్తపాలెం, తెనాలి నియోజకవర్గంలోని కొల్లిపర మండలం కొత్తబొమ్మువానిపాలెం పుష్కరఘాట్‌ల వద్ద అధికార పార్టీ నేతల ఆధ్వర్యంలో పందేలు సాగాయి. కోడి పందేలకు అనుబంధంగా గుండాట, కోతముక్క, చక్రం ఆటలు జరిగాయి. కొత్తబొమ్మువానిపాలెంలో తెనాలి టీడీపీ ఎమ్మెల్యే ఆలపాటి రాజేంద్రప్రసాద్ దగ్గరుండి మరీ కోడిపందేలు నిర్వహించారు. గతేడాది కోడి పందేల కేసులు కోర్టులో నడుస్తున్న నేపథ్యంలో రేపల్లె టీడీపీ ఎమ్మెల్యే అనగాని సత్యప్రసాద్ తెరవెనుకే ఉండి ఫోన్ ద్వారా అన్నీ తానై పర్యవేక్షించారు. విశాఖపట్నం జిల్లాలో ఎక్కువగా భీమిలి–విజయనగరం సరిహద్దు ప్రాంతాల్లో కోడి పందేలు సాగగా యలమంచిలి, పాయకరావుపేట, అనకాపల్లి, చోడవరం, నర్సీపట్నం నియోజకవర్గాల పరిధిలో మారుమూల ప్రాంతాల్లో పందేలు సాగాయి. జిల్లావ్యాప్తంగా రూ.80 కోట్ల మేర పందేలు కాశారు. విజయనగరం జిల్లాలో జూదంతోపాటు కోడి, పొట్టేలు పందేల కోసం రూ.70 కోట్ల వరకు ఖర్చు చేశారు.

పోలీసులపై టీడీపీ ఎమ్మెల్యే చిందులు

'ఏం తమాషాగా ఉందా? కోళ్లు ఎలా పట్టుకెళతావు? కోళ్లకు కత్తులేమైనా కట్టామా? జూదమేమైనా ఆడిస్తున్నామా? మీరు వాంటెడ్‌గా చేస్తున్నారు.. చాలా ఎగస్ట్రాలు చేస్తున్నారు. పో... వెళ్లిపో.. మీ డీఎస్పీని రమ్మను' అంటూ గుంతకల్లు టూటౌన్ ఏఎస్‌ఐ తిరుపాల్‌పై అనంతపురం జిల్లా గుంతకల్లు టీడీపీ ఎమ్మెల్యే జితేంద్రగౌడ్ చిందులు తొక్కారు. బుధవారం పాత గుంతకల్లు ఏరియా అంకాలమ్మ ఆలయ సమీపంలోని పార్కులో సంక్రాంతి సంబరాల్లో భాగంగా స్థానిక టీడీపీ నేతలు కొందరు కోడి పందేలు నిర్వహించారు. ఈ సమాచారం టూటౌన్ పోలీసులకు చేరడంతో ఏఎస్‌ఐ తిరుపాల్, కానిస్టేబుల్ శ్రీనివాసులు, ఇతర పోలీసు సిబ్బంది ఘటన స్థలానికి వెళ్లి కోళ్లను స్వాధీనం చేసుకున్నారు. పందేపు కోళ్లను స్టేషన్‌కు తరలిస్తుండగా.. ఎమ్మెల్యే జితేంద్రగౌడ్ అడ్డుకొని పోలీసు సిబ్బందిపై బూతు పురాణం అందుకున్నారు. 'ఏం తమాషాలు చేస్తున్నారా? సంప్రదాయాలను కాపాడాల్సింది పోయి అడ్డుకుంటారా?' అంటూ కోపంతో ఊగిపోయారు. పోలీసుల నుంచి బలవంతంగా కోళ్లను తీసుకుని మళ్లీ పందేలు నిర్వహించడం గమనార్హం.

కోడి పందేల బరిలో కొట్లాట

గుడివాడలో తీవ్ర ఉద్రిక్తత




గాయపడ్డ నరసింహరాజు, ప్రశాంత్‌కుమార్

గుడివాడ: అధికార తెలుగుదేశం పార్టీకి చెందిన కోడిపందేల బరి రక్తపాతంగా మారింది. కృష్ణా జిల్లా గుడివాడ పట్టణంలోని గుడ్‌మేన్‌పేటకు చెందిన ఓ వ్యక్తిని కొట్టారని తెలియడంతో.. ఆ ప్రాంత యువకులు తెలుగు యువత పట్టణ కార్యదర్శి చెక్కా నరసింహరాజు, మరో ఇద్దరిపై దాడి చేశారు. స్థానికులు అందించిన సమాచారం ప్రకారం..గుడివాడ పట్టణ శివారు రూరల్ పోలీసుస్టేషన్ పరిధిలోని బైపాస్ రోడ్డు పక్కన మున్సిపల్ చైర్మన్ యలవర్తి శ్రీనివాసరావు ఆధ్వర్యంలో కోడిపందేలు, జూదం నిర్వహిస్తున్నారు. మూడు రోజులుగా జరుగుతున్న ఈ పందేలు బుధవారం మధ్యాహ్నం కొట్లాటకు దారితీశాయి. గుడ్‌మేన్‌పేటకు చెందిన ఓ యువకుడికి, టిఫిన్ సెంటర్ వద్ద గల వంట వ్యక్తికి గొడవ జరిగింది. తెలుగు యువత పట్టణ కార్యదర్శి చెక్కా నరసింహరాజు ఆ యువకుడి ఫోన్‌ను లాక్కోవడంతో వీరిమధ్య వాగ్వాదం జరగడంతో నరసింహరాజు.. ఆ యువకుడిని కొట్టాడు. దీంతో గుడ్‌మేన్‌పేటవాసులు కోడి పందేల బరి వద్దకు చేరుకుని నరసింహరాజుపై దాడి చేశారు. పక్కనే ఉన్న ధనాల ప్రశాంత్‌కుమార్, క్యాంటీన్ నిర్వాహకుడినీ కొట్టారు. ధనాల ప్రశాంత్‌కుమార్‌ను గుడివాడ ఏరియా ఆస్పత్రికి తరలించగా..కోమాలో ఉండడంతో మెరుగైన వైద్యం నిమిత్తం విజయవాడ ఆస్పత్రికి తరలించారు. ఏసురాజు, నగేష్‌కు తీవ్ర గాయాలయ్యాయి. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

పోలీసుల ప్రేక్షకపాత్ర..

కోడి పందేల బరివద్ద రక్తపాతం జరుగుతుందని ఫోన్ చేసినా పోలీసులు స్పందించలేదని స్థానికులు పేర్కొంటున్నారు.

'ఫ్రంట్'పై చర్చలకే టీడీపీకి బెంబేలెందుకు?

- టీఆర్‌ఎస్‌తో మేము పొత్తు పెట్టుకోలేదు...
- మీరు పొత్తులకు ప్రయత్నించినప్పుడు రాష్ట్ర ప్రయోజనాలు తాకట్టు కాదా
- వైఎస్సార్‌సీపీ అధికార ప్రతినిధి అంబటి రాంబాబు



సాక్షి, అమరావతి: ఫెడరల్ ఫ్రంట్‌పై చర్చలు జరిపితే టీడీపీ నేతలు ఎందుకు బెంబేలెత్తుతున్నారో అర్థం కావడం లేదని వైఎస్సార్‌సీపీ అధికార ప్రతినిధి అంబటి రాంబాబు పేర్కొన్నారు. విజయవాడలోని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర కార్యాలయంలో బుధవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ కేటీఆర్ తదితరులు ప్రతిపక్షనేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డితో చర్చలు జరిపితే రాష్ట్ర ప్రయోజనాలు తాకట్టు పెట్టారని పేర్కొంటున్న టీడీపీ నేతలు గురివింద నీతిని మర్చినట్లున్నారన్నారు. హరికృష్ణ చనిపోయిన సమయంలో పరామర్శకు వచ్చిన కేటిఆర్‌తో చంద్రబాబు పొత్తు పెట్టుకుందామని అడిగినప్పుడు రాష్ట్ర ప్రయోజనాలు తాకట్టు పెట్టినట్లు అన్పించలేదా అని ప్రశ్నించారు. కేసీఆర్ ఛీ...పో అని చెప్పారు కాబట్టే కాంగ్రెస్ పార్టీతో పొత్తు పెట్టుకున్నాం అని చంద్రబాబు ప్రకటించిన విషయం ప్రజలందరికి తెలుసు అన్నారు. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నివాసంలో జరిగిన పరిణామాలు రాష్ట్రానికి శుభ పరిణామంగా భావిస్తున్నాం అన్నారు. జగన్ వారితో చర్చలు జరిపితే టీడీపీ నేతలు కుక్కల్లా మొరగడం మొదలు పెట్టారని ధ్వజమెత్తారు. టీఆర్‌ఎస్ పార్టీతో వైఎస్సార్‌సీపీ ఎక్కడా పొత్తు పెట్టుకోలేదన్న విషయం గుర్తించాలన్నారు. మొత్తం 42 లోక్‌సభ సీట్లు ఉన్న రెండు రాష్ట్రాలు కేంద్రంపై ఒత్తిడి తేవడం ద్వారా రాష్ట్రానికి రావాల్సిన నిధులను రాబట్టవచ్చనే ఆలోచనతోనే ఫెడరల్ ఫ్రంట్‌పై ప్రాథమిక చర్చలు జరిపినట్లు తెలిపారు. దీనికే భయపడి మంత్రి దేవినేని ఉమామహేశ్వరరావు నానా యాగి చేస్తున్నారని విమర్శించారు. ఆంధ్ర రాష్ట్రానికి ప్రత్యేక హోదా ఇవ్వడం ధర్మం అని కేసీఆర్ చెబుతున్నపుడు వారితో సంప్రదించడం తప్పా అని టీడీపీ నేతలను అంబటి రాంబాబు ప్రశ్నించారు. టీడీపీ నేతలు వక్రభాష్యాలు చెబుతూ వారికి అనుకూల ఛానళ్లలో విమర్శలు, ఆరోపణలతో సిద్ధమైపోవడం దారుణం అన్నారు. ఫెడరల్ ఫ్రంట్ ఏర్పాటు చేసే వ్యక్తులు బీజేపీ, కాంగ్రెస్‌లకు ప్రత్యామ్నాయం అని చెబుతున్నారు. జాతీయ పార్టీలు బలహీనపడి ప్రాంతీయ పార్టీలు బలపడుతున్న ఈ దశలో ప్రాంతీయ పార్టీలు ఒక తాటిపైకి రావడం శుభపరిణామం అన్నారు. ఈ అంశంలో చంద్రబాబు ప్రజలను కన్ఫ్యూజ్ చేయడానికి ప్రయత్నిస్తున్నారని, అయోమయానికి గురి కావద్దని ఆయన ప్రజలకు విజ్ఞప్తి చేశారు.

వైఎస్ షర్మిలపై దుష్ప్రచారం బాధాకరం...

వైఎస్ షర్మిలపై దుష్ప్రచారం బాధాకరం అని అంబటి రాంబాబు పేర్కొన్నారు. రాజకీయ లబ్ధి కోసం ఏదైనా మాట్లాడే చంద్రబాబు రాజకీయప్రత్యర్థుల వ్యక్తిత్వాల్ని దెబ్బతీసేందుకు నీచ సంస్కృతికి తెరతీస్తున్నారన్నారు. గతంలో కూడా షర్మిలపై సోషల్ మీడియాలో అపవాదులు వేసి ప్రచారం చేశారు. ఈ విషయాలను ప్రజలందరూ తెలుసుకోవాలని కోరారు.

ఎన్‌ఐఏ రావడానికి వీల్లేదు

- సీఎం చంద్రబాబు స్పష్టీకరణ
- రాష్ట్రం హక్కులను కేంద్రం లాక్కొంటోంది
- ఏపీలో సమస్యలన్నీ పరిష్కరించాం.. ఇక ఉన్నవన్నీ వ్యక్తిగత సమస్యలే



నారావారిపల్లెలో ఎద్దుల బండిపై సీఎం చంద్రబాబు

సాక్షి, తిరుపతి: రాష్ట్రంలోకి జాతీయ దర్యాప్తు సంస్థ(ఎన్‌ఐఏ) రావటానికి వీల్లేదని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అన్నారు. ప్రతిపక్ష నేత వైఎస్ జగన్‌పై జరిగిన హత్యాయత్నం కేసుపై దర్యాప్తును ఎన్‌ఐఏ చేపట్టడాన్ని ఆయన తప్పుబట్టారు. రాష్ట్రం హక్కులను కేంద్రం లాక్కొంటోందని ఆగ్రహం వ్యక్తం చేశారు. సంక్రాంతి పండుగ సందర్భంగా సీఎం చంద్రబాబు సోమవారం తన స్వగ్రామం చిత్తూరు జిల్లా నారావారిపల్లెకు చేరుకున్నారు. రెండు రోజులపాటు గ్రామంలోనే ఉండి కుటుంబ సభ్యులతో కలిసి సంక్రాంతి సంబరాలు జరుపుకున్నారు. అమరావతికి తిరుగు ప్రయాణం అయ్యే సమయంలో మంగళవారం సాయంత్రం విలేకరుల సమావేశంలో మాట్లాడారు. సొంత గ్రామంలో పండుగ జరుపుకునే సంప్రదాయాన్ని తన భార్య భువనేశ్వరి 20 ఏళ్ల క్రితమే ప్రారంభించిందని చెప్పుకొచ్చారు. సంక్రాంతిని అడ్డం పెట్టుకుని జూదాలు ఆడడం మంచిది కాదన్నారు. ధనిక రాష్ట్రమైన తెలంగాణలో కూడా చెయ్యని అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు ఆంధ్రప్రదేశ్‌లో చేపట్టామన్నారు. ప్రస్తుతం ఏపీలో వందశాతం అభివృద్ధి చేశామని, సమస్యలన్నీ పరిష్కరించామని తెలిపారు. ఇక ఉన్నవన్నీ వ్యక్తిగత సమస్యలేనని చెప్పారు. వైఎస్ జగన్‌పై జరిగిన హత్యాయత్నం ఘటనపై ఎన్‌ఐఏ చేపడుతున్న విచారణపై విలేకరులు అడిగిన ప్రశ్నకు చంద్రబాబు తీవ్రంగా స్పందించారు. రాష్ట్రంలోకి ఎన్‌ఐఏ రాకూడదన్నారు. రాష్ట్రానికి ఉన్న హక్కులను కేంద్రం లాక్కుంటోందని ఆరోపించారు. హక్కుల కోసం పోరాడుతామన్నారు.

షర్మిల తెలంగాణలో ఎందుకు ఫిర్యాదు చేశారో?

వైఎస్ షర్మిలకు ఏమైందని తెలంగాణలో ఫిర్యాదు చేశారని చంద్రబాబు ప్రశ్నించారు. ఏపీ పోలీసులపై నమ్మకం లేదనడం సమంజసం కాదన్నారు. షర్మిల తెలంగాణలో ఎందుకు ఫిర్యాదు చేశారో తనకు అర్థం కావడం లేదన్నారు. ఎవరూ వేలెత్తి చూపని క్యారెక్టర్ తనదని పేర్కొన్నారు. మీరు ఎప్పుడూ పొత్తులు లేకుండా ఎన్నికల్లో పోటీ చెయ్యలేదు కదా? ఈసారి ఎవరితో పొత్తుపెట్టుకోనున్నారు? అని ఓ విలేకరి ప్రశ్నించగా... టీడీపీ ఒంటరిగా కూడా పోటీచేసిందని, ఒకసారి వెనక్కి వెళ్లి చూడమన్నారు. 'రాష్ట్రాన్ని కాంగ్రెస్ విభజించిందని బీజేపీతో పొత్తు పెట్టుకున్నాం. ఇప్పుడు బీజేపీ విభజన హామీలను అమలు చేయలేదు. అందుకే కాంగ్రెస్‌తో కలిశాం' అని చంద్రబాబు స్పష్టం చేశారు. కేంద్రం రూ.75 వేల కోట్లు ఇచ్చి ఉంటే ఇప్పుడు ఇబ్బందులే ఉండేవి కావన్నారు. కేసీఆర్‌తో కలిసి ప్రత్యేకహోదా తీసుకొస్తామని వైఎస్ జగన్ చెబుతున్నారని, మరి ప్రధాని నరేంద్రమోదీని ఎందుకు అడగలేదని ప్రశ్నించారు.

తిరుగు ప్రయాణం కొండంత భారం

- నాలుగు రెట్లు అధికంగా వసూలు చేస్తున్న ప్రైవేటు ట్రావెల్స్
- ఫ్లెక్సీ ఫేర్ విధానంతో ప్రయాణికులను బాదేస్తున్న ఆర్టీసీ

సాక్షి, అమరావతి/సాక్షి, నెట్‌వర్క్: సంక్రాంతి కోసం స్వస్థలాలకు వచ్చినవారి తిరుగు ప్రయాణం కొండంత భారం కానుంది. నేటి నుంచి ఈ నెల 20 వరకు ప్రయాణికులకు కష్టాలు తప్పేలా లేవు. డిమాండ్‌ను క్యాష్ చేసుకునేందుకు ప్రైవేటు ట్రావెల్స్, ఆర్టీసీ పోటాపోటీ పడుతున్నాయి. సాధారణ రోజుల్లో టిక్కెట్ల ధరల కంటే ప్రైవేట్ ట్రావెల్స్ నిర్వాహకులు మూడు, నాలుగు రెట్లు అధికంగా వసూలు చేస్తుండగా.. ఆర్టీసీ కూడా వ్యాపార ధోరణి ప్రదర్శిస్తోంది. రెగ్యులర్ బస్సులతో పాటు మూడు వేలకు పైగా ప్రత్యేక బస్సులు నడుపుతున్నట్లు ఆర్టీసీ ప్రకటించిన విషయం తెలిసిందే. అయితే ఈ రిజర్వేషన్లకు ఫ్లెక్సీ ఫేర్ విధానం(విమాన చార్జీల్లాగా పరిస్థితిని బట్టి రేట్లు అమలు చేయడం) ప్రవేశపెట్టింది. రెగ్యులర్ చార్జీల కంటే 150 శాతం అధికంగా వసూలు చేస్తోంది.

సిటీ మెట్రో కూడా ప్రత్యేక బస్సే..!

సంక్రాంతి పండుగ జరుపుకునేందుకు హైదరాబాద్ నుంచి ఏపీలోని అన్ని జిల్లాలకు 20 లక్షల మంది వచ్చారని అంచనా. వీరి తిరుగు ప్రయాణం కోసం అన్ని జిల్లాల నుంచి 1,100 ప్రత్యేక బస్సుల్ని నడుపుతున్నట్లు ఆర్టీసీ ప్రకటించింది. ఈ బస్సుల్లో రిజర్వేషన్లు దాదాపు పూర్తయ్యాయి. ప్రతిరోజూ హైదరాబాద్‌కు అన్ని జిల్లాల నుంచి 150 వరకు సర్వీసులు నడుపుతున్నారు. వీటితో పాటు గురువారం నుంచి నాలుగు రోజుల పాటు హైదరాబాద్‌కు 1,100 బస్సులు తిప్పుతున్నట్లు ప్రకటించారు. ఫ్లెక్సీ ఫేర్ అమలు చేయడం ద్వారా ప్రయాణికులను బాదేస్తున్న ఆర్టీసీ.. ప్రత్యేక బస్సుల పేరిట సిటీల్లో తిరిగే మెట్రో, సాధారణ బస్సుల్ని అందుబాటులో ఉంచింది. దీంతో ప్రయాణికులు గంటలకొద్దీ ఆ సీట్లలో నానా ఇబ్బందులు పడుతున్నారు. రిజర్వేషన్ సమయంలో ఏ బస్సు నడుపుతున్నారో కూడా సమాచారమివ్వకుండా వ్యాపార ధోరణి అవలంబిస్తోందంటూ ప్రయాణికులు మండిపడుతున్నారు. మరోవైపు రెగ్యులర్ సర్వీసులు కూడా సరైన సమయంలో తిప్పకుండా ప్రత్యేక బస్సుల్నే ఆర్టీసీ నడపడం గమనార్హం. విజయవాడ నుంచి హైదరాబాద్ వెళ్లే బస్సు 3571 అమరావతి సర్వీస్ మధ్యాహ్నం 1.30కు బయల్దేరాల్సి ఉండగా.. ప్రత్యేక బస్సుకు ప్లాట్‌ఫాం కేటాయించి, ఈ బస్సును గంట పాటు పక్కన పెట్టారు. ఇక సంక్రాంతి హడావుడి ఎక్కువగా ఉండే పశ్చిమగోదావరి జిల్లాలోని 8 డిపోల నుంచి రోజూ 28 బస్సులు హైదరాబాద్‌కు రాకపోకలు సాగిస్తుంటాయి. పండుగ నేపథ్యంలో మరో 57 ప్రత్యేక సర్వీసుల్ని ఆర్టీసీ అధికారులు ఏర్పాటు చేశారు. అయితే బుధవారం వీటిలో చాలా వరకు సీట్లు మిగిలిపోయాయని ఆర్టీసీ రీజనల్ మేనేజర్ సుధాకర్ పేర్కొన్నారు. ఇక రాయలసీమలోని అనంతపురం జిల్లా నుంచి ప్రధాన నగరాలకు అదనంగా 50 ప్రత్యేక సర్వీసులు ఏర్పాటు చేశారు. అయితే ప్రత్యేకం పేరిట సిటీ మెట్రో బస్సులు పెట్టడంపై పలువురు ప్రయాణికులు మండిపడ్డారు. ప్రైవేటు ట్రావెల్స్ బాదుడు ఎక్కువ ఉండటంతో తప్పనిసరి పరిస్థితిలో వీటిలోనే వెళ్లాల్సి వస్తోందని వాపోయారు.

మా కష్టాలు పట్టవా?

కుటుంబసభ్యులు, బంధువులు, స్నేహితులతో సంక్రాంతి జరుపుకుందామని వస్తే.. ఇలా బాదేస్తున్నారని ఓ ప్రయాణికుడు ఆవేదన వ్యక్తం చేశాడు. ప్రభుత్వానికి మా కష్టాలు పట్టవా అని ఆగ్రహం వ్యక్తం చేశాడు. ప్రజా రవాణా వ్యవస్థ అయిన ఆర్టీసీకి ప్రభుత్వం తగిన చేయూతనిస్తే.. తమకు ఈ బాధలుండేవి కాదన్నాడు. 50 శాతం అదనంగా చార్జీలు వసూలు చేయకుండా.. అదనపు బస్సులు మరిన్ని ఏర్పాటు చేస్తే తమకు వెతలుండేవి కాదని మరో ప్రయాణికుడు వాపోయాడు. పోలవరం సందర్శన, సీఎం సభలకైతే ఇష్టారీతిన బస్సులు పెడతారని.. సామాన్యులను పట్టించుకోవట్లేదని ఆగ్రహం వ్యక్తం చేశాడు.

ప్రభుత్వం ఆదేశాలిచ్చినా టోల్ ట్యాక్స్ వసూలు..

పండుగ సందర్భంగా 3 రోజుల పాటు వాహనదారుల నుంచి టోల్ ట్యాక్స్ వసూలు చేయబోమని ప్రభుత్వమిచ్చిన ఆదేశాలు అమలు కావడం లేదు. కృష్ణా జిల్లా కీసర టోల్ ప్లాజా సిబ్బంది ఎప్పటిలానే టోల్‌ట్యాక్స్ వసూలు చేస్తున్నారు. దీనిపై వాహనదారులు మండిపడుతున్నారు. తెలంగాణలోని పంతంగి, కొర్లపహాడ్ టోల్‌ప్లాజాల వద్ద ట్యాక్స్ వసూలు చేయడం లేదని.. రాష్ట్రంలో మాత్రం ఇష్టమొచ్చినట్లు ప్రవర్తిస్తున్నారని వాహనదారులు వాపోతున్నారు. కాగా, ఈ విషయంపై ప్లాజా సీవోఎం హరిపాండు రంగస్వామిని వివరణ కోరగా.. తమకు ఎటువంటి ఆదేశాలు రాలేదని చెప్పారు. నేషనల్ హైవే అథారిటీ ఆఫ్ ఇండియా ఉత్తర్వులు పాటిస్తున్నామన్నారు.



కీసర టోల్‌ప్లాజా వద్ద బిల్లులు వసూలు చేస్తున్న సిబ్బంది



విజయవాడ-విశాఖ రహదారిలో టోల్‌గేట్ వద్ద ఇచ్చిన బిల్లు

నచ్చితే ఒక రేటు.. లేకపోతే మరో రేటు

ఇన్‌డెప్త్

- రాజధాని భూముల కేటాయింపులో సర్కార్ మాయాజాలం
- అనుకూల సంస్థలు, కంపెనీలకు కారుచౌకగా భూములు
- బసవతారకం ఆస్పత్రికి ఎకరం రూ.25 లక్షలకే కేటాయింపు
- బడా కార్పొరేట్ సంస్థలకు ఎకరం రూ.50 లక్షలకే..
- ప్రభుత్వ సంస్థలకేమో లీజు ప్రాతిపదికన భూములు
- కార్పొరేట్ సంస్థలకు మాత్రం శాశ్వత బదలాయింపు
- బ్యాంకులు, కేంద్ర ప్రభుత్వ సంస్థలకు మాత్రం ఎకరం రూ.కోటి నుంచి రూ.4 కోట్లు వసూలు

- రాజధాని భూముల కేటాయింపులో సర్కార్ మాయాజాలం - అనుకూల సంస్థలు, కంపెనీలకు కారుచౌకగా భూములు
- బసవతారకం ఆస్పత్రికి ఎకరం రూ.25 లక్షలకే కేటాయింపు - బడా కార్పొరేట్ సంస్థలకు ఎకరం రూ.50 లక్షలకే..
- బ్యాంకులు, కేంద్ర ప్రభుత్వ సంస్థలకు మాత్రం ఎకరం రూ.కోటి నుంచి రూ.4 కోట్లు వసూలు
- ప్రభుత్వ సంస్థలకేమో లీజు ప్రాతిపదికన భూములు - కార్పొరేట్ సంస్థలకు మాత్రం శాశ్వత బదలాయింపు

సాక్షి, అమరావతి: అయిన వారికి ఆకుల్లో.. కాని వారికి కంచాల్లో అనే రీతిలో ప్రభుత్వం రాజధాని అమరావతిలో భూముల కేటాయింపును ఇష్టారాజ్యంగా చేస్తోంది. తమకు కావాల్సినవారికి సేవా సంస్థల పేరుతో కారుచౌకగా భూములు కట్టబెడుతున్న రాష్ట్ర ప్రభుత్వం ప్రభుత్వ రంగ సంస్థలకు మాత్రం కోట్ల రూపాయల రేటు కడుతోంది. బడా కార్పొరేట్ సంస్థలకు సైతం వందల ఎకరాలను అతి తక్కువ ధరకే ఇస్తోంది. ఇప్పటివరకూ చేసిన భూకేటాయింపులన్నీ ఇదే తరహాలో ఉండటం గమనార్హం. సీఎం చంద్రబాబు కుటుంబానికి చెందిన బసవతారకం క్యాన్సర్ ఆస్పత్రికి ఎకరం రూ.25 లక్షలకే భూమిని ఇవ్వగా, కేంద్ర ప్రభుత్వ రంగ సంస్థ ఎల్ఐసీకి ఎకరం రూ.4 కోట్లు చొప్పున నిర్ణయించింది. కార్పొరేట్ సంస్థలకు తక్కువ రేటుకు భూములు ఇచ్చి ప్రభుత్వ రంగ సంస్థల నుంచి కోట్ల రూపాయలు వసూలు చేయడంపై తీవ్ర విమర్శలు వ్యక్తమవుతున్నాయి.



1,500 ఎకరాలు కేటాయింపు

ఇప్పటివరకూ 115కిపైగా ప్రభుత్వ, ప్రైవేటు సంస్థలకు 1,500 ఎకరాలు కేటాయించిన ప్రభుత్వం ఒక్కోదానికి ఒక్కో రేటు చొప్పున వసూలు చేసింది. 1,500 ఎకరాల్లో 600 ఎకరాలను ఎస్ఆర్ఎం, విట్, అమృత వంటి కార్పొరేట్ విద్యా సంస్థలకు ఎకరం రూ.50 లక్షల చొప్పున అతి తక్కువ ధరకే కట్టబెట్టేసింది. మరో 250 ఎకరాలను బీఆర్ఎస్ మెడ్‌సిటీ, ఇండో – యూకే హెల్త్ ఇన్‌స్టిట్యూట్‌కి ఇదే రేటుకు ఇచ్చింది. కార్పొరేట్ కంపెనీ ఎల్ అండ్ టీకి కూడా ఎకరం కేవలం రూ.1.5 లక్షల చొప్పున, ఏటా ఐదు శాతం పెంచేలా 30 ఏళ్ల లీజుకి ఆ సంస్థకు ఐదెకరాల భూమిని అప్పగించింది. తక్కువ ధరకు భూమిని ఇవ్వడమే కాకుండా ఆయా సంస్థలకు అవసరమైన రోడ్లు, నీరు వంటి సౌకర్యాలను కూడా సీఆర్‌డీఏ (క్యాపిటల్ రీజియన్ డెవలప్‌మెంట్ అథారిటీ) సొంత ఖర్చులతో సమకూర్చిపెట్టింది. రాష్ట్రంలో 38 క్రీడా సంఘాలు అమరావతిలో స్థలం కావాలని దరఖాస్తు చేసుకున్నా పట్టించుకోని ప్రభుత్వ పెద్దలు గోపీచంద్ బ్యాడ్మింటన్ అకాడమీకి మాత్రం ఎకరం రూ.10 లక్షల చొప్పున 12 ఎకరాలు కేటాయించారు. సేవా సంస్థల పేరుతో.. ఎల్వీ ప్రసాద్ ఐ ఇన్‌స్టిట్యూట్‌కి ఎకరం రూ.25 లక్షల చొప్పున, బ్రహ్మకుమారీస్, గ్జేవియర్ స్కూల్ ఆఫ్ మేనేజ్‌మెంట్‌కు ఎకరం కేవలం రూ.10 లక్షల చొప్పున భూములు ఇచ్చారు.

ప్రభుత్వ సంస్థలకు అదిరిపోయే ధర

అదే సమయంలో ఫుడ్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా (ఎఫ్‌సీఐ), ఎల్ఐసీ, ఎస్‌బీఐ, ఆంధ్రా బ్యాంక్, నాబార్డ్, న్యూ ఇండియా ఎస్యూరెన్స్ కంపెనీ, హెచ్‌పీసీఎల్, సిండికేట్ బ్యాంక్, ఐవోసీఎల్ వంటి కేంద్ర ప్రభుత్వ రంగ సంస్థలకు ఎకరం రూ.4 కోట్లు చొప్పున వసూలు చేశారు. రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్‌బీఐ), ఇండియన్ నేవీ, బీఐఎస్ (బ్యూరో ఆఫ్ ఇండియన్ స్టాండర్డ్స్), డిపార్ట్‌మెంట్స్ ఆఫ్ పోస్ట్స్, కాగ్ వంటి ప్రతిష్టాత్మక ప్రభుత్వ సంస్థలకు సైతం ఎకరం కోటి రూపాయలు వసూలు చేసి మరీ భూములు కేటాయించారు. కార్పొరేట్ సంస్థలు, తమ అనుయాయులకు ఎలాంటి ఆంక్షలు లేకుండా కారుచౌకగా వందల ఎకరాలు ఇచ్చిన ప్రభుత్వ పెద్దలు దేశ ఆర్థిక వ్యవస్థకు మూలస్తంభమైన ఆర్‌బీఐకు 11 ఎకరాలు ఇవ్వడానికి సవాలక్ష నిబంధనలు విధించారు. దీంతో కేంద్ర సంస్థలు రాజధానిలో తమ ప్రాంతీయ కార్యాలయాలు ఏర్పాటు చేసేందుకు ఆసక్తి చూపడం లేదు. భూముల కేటాయింపులో స్వప్రయోజనాలు చూసుకుని తక్కువ ధరకు వందల ఎకరాలు కేటాయించిన ప్రభుత్వం ఎస్ఆర్ఎం, విట్, బీఆర్ఎస్ మెడ్‌సిటీ వంటి సంస్థలకు శాశ్వతంగా భూములు బదలాయించగా ఆర్‌బీఐ, సీపీడబ్ల్యూడీ, ఏపీహెచ్ఆర్‌డీ వంటి ప్రభుత్వ సంస్థలకు మాత్రం లీజుకిచ్చింది. ప్రైవేటు సంస్థలకు నేరుగా ఇలా భూములివ్వకూడదని, వేలం ద్వారా కేటాయింపు జరపాలని ఆర్థిక శాఖ, సీఆర్‌డీఏ సూచించినా ప్రభుత్వ పెద్దలు ఖాతరు చేయడం లేదు. కార్పొరేట్ కంపెనీలపై అమిత ప్రేమ కనబరుస్తూ రైతుల నుంచి సేకరించిన భూములను వాటికి తక్కువ రేటుకు కట్టబెడుతుండడంపై ఆందోళన వ్యక్తమవుతోంది.

వివిధ ప్రభుత్వ, ప్రైవేటు సంస్థలకు భూకేటాయింపు వివరాలు..

సంస్థ	కేటాయించిన భూమి (ఎకరాలు)	ధర (ఎకరం)	భూమి ఇచ్చిన విధానం
నందమూరి బసవతారకం ఆస్పత్రి	15	రూ.25 లక్షలు	శాశ్వత బదలాయింపు
గ్జేవియర్ స్కూల్ ఆఫ్ మేనేజ్‌మెంట్	50	రూ.10 లక్షలు	శాశ్వత బదలాయింపు
హైదరాబాద్ ఐ ఇన్‌స్టిట్యూట్	12	రూ.25 లక్షలు	శాశ్వత బదలాయింపు
బ్రహ్మకుమారీస్ సొసైటీ	10	రూ.10 లక్షలు	శాశ్వత బదలాయింపు
గోపీచంద్ బ్యాడ్మింటన్ అకాడమీ	12	రూ.10 లక్షలు	శాశ్వత బదలాయింపు
విట్ యూనివర్సిటీ	200	రూ.50 లక్షలు	శాశ్వత బదలాయింపు
ఇండో – యూకే ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ హెల్త్	150	రూ.50 లక్షలు	శాశ్వత బదలాయింపు
ఎస్ఆర్ఎం యూనివర్సిటీ	200	రూ.50 లక్షలు	శాశ్వత బదలాయింపు
అమృతా యూనివర్సిటీ	200	రూ.50 లక్షలు	శాశ్వత బదలాయింపు
బీఆర్ఎస్ మెడ్‌సిటీ	100	రూ.50 లక్షలు	శాశ్వత బదలాయింపు
ఎల్ అండ్ టీ	5	రూ.1.5 లక్షలు	30 సంవత్సరాల లీజు
ఆర్‌బీఐ	11	రూ.1 కోటి	శాశ్వత బదలాయింపు
కాగ్	17	రూ.కోటి	60 సంవత్సరాల లీజు
ఇండియన్ నేవీ	15	రూ.కోటి	60 సంవత్సరాల లీజు
ఎఫ్‌సీఐ	1.10	రూ.4 కోట్లు	శాశ్వత బదలాయింపు
ఎల్ఐసీ	0.75	రూ.4 కోట్లు	శాశ్వత బదలాయింపు
ఎస్‌బీఐ	3.30	రూ.4 కోట్లు	శాశ్వత బదలాయింపు
ఆంధ్రా బ్యాంక్	2.65	రూ.4 కోట్లు	శాశ్వత బదలాయింపు
బ్యాంక్ ఆఫ్ ఇండియా	1.50	రూ.4 కోట్లు	శాశ్వత బదలాయింపు
ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్	0.40	రూ.4 కోట్లు	శాశ్వత బదలాయింపు
న్యూ ఇండియా అస్యూరెన్స్ కంపెనీ	1.93	రూ. 4 కోట్లు	శాశ్వత బదలాయింపు
హిందూస్తాన్ పెట్రోలియం కార్పొరేషన్	0.5	రూ.4 కోట్లు	శాశ్వత బదలాయింపు
సిండికేట్ బ్యాంక్	1.3	రూ.4 కోట్లు	శాశ్వత బదలాయింపు
ఏపీఎన్ఆర్‌టీ సొసైటీ	5	రూ.2 కోట్లు	డబ్బు కట్టకుండానే భూమి శాశ్వత బదలాయింపు తర్వాత వాయిదాల పద్ధతిలో చెల్లింపునకు అవకాశం
ఆప్కాబ్	4	రూ.2 కోట్లు	శాశ్వత బదలాయింపు


కిడారి, సోమ హత్య కేసులో ఎన్ఐఏ దర్యాప్తు వేగవంతం

- మూడురోజుల కస్టడీకి సుబ్బారావు భార్య ఈశ్వరి
- మరో ముగ్గురు అనుమానితులను విచారిస్తున్న బృందం

సాక్షి, విశాఖపట్నం: డుంబ్రిగుడ మండలం లివిటిపుట్టు వద్ద అరకు ఎమ్మెల్యే కిడారి సర్వేశ్వరరావు, మాజీ ఎమ్మెల్యే సివేరి సోమను మావోలు మట్టుబెట్టిన కేసు విచారణను నేషనల్ ఇన్వెస్టిగేషన్ ఏజెన్సీ (ఎన్ఐఏ) వేగవంతం చేసింది. రంగంలోకి దిగిన ప్రత్యేక దర్యాప్తు బృందం విశాఖలో మకాం వేసి దర్యాప్తును సాగిస్తోంది. ఇప్పటికే అరెస్టు అయిన వారిలో ఒకర్ని కస్టడీకి తీసుకుని విచారించిన ఎన్ఐఏ తాజాగా బుధవారం మరొకర్ని కస్టడీలోకి తీసుకుని విచారణ చేపట్టింది. గతేడాది సెప్టెంబర్ 23వ తేదీన కొండ్రుం పంచాయతీ సర్రాయి గ్రామంలో జరుగనున్న గ్రామదర్శినిలో పాల్గొనేందుకు బయల్దేరిన ఎమ్మెల్యే, మాజీ ఎమ్మెల్యే ప్రయాణిస్తున్న కార్లను సుమారు 60 మంది మహిళా మావోలు చుట్టుముట్టి వారిని మట్టుబెట్టిన విషయం తెలిసిందే. ఈ ఘటన జరిగిన వెంటనే కేసును అప్పటి ఏసీపీ ఫకీరప్ప నేతృత్వంలో ఏర్పాటు చేసిన ప్రత్యేక దర్యాప్తు బృందం (సిట్)కు రాష్ట్ర ప్రభుత్వం అప్పగించింది. ఘటన జరిగిన మరుసటి రోజు నుంచి 20 రోజుల పాటు సుమారు 300 మందిని సిట్ విచారించింది. కిడారి, సోమను హతమార్చడంలో మావోలకు ప్రత్యక్షంగా సహకరించిన తూటంగి మాజీ ఎంపీటీసీ సభ్యుడు, టీడీపీ మండల పార్టీ అధ్యక్షుడు యేడేల సుబ్బారావు (45), అతని భార్య యేడెల ఈశ్వరితో పాటు గెమ్మిలి శోభన్ (32), యేడేల ఈశ్వరి (34), కొర్రా కమల (35)ను అరెస్టు చేసిన సిట్.. కోర్టు ఆదేశాల మేరకు జ్యూడిషియల్ రిమాండ్‌కు తరలించింది. ఫకీరప్ప కర్నూలు ఎస్పీగా బదిలీ కావడంతో ఆ తర్వాత ఈ కేసును సీనియర్ ఐపీఎస్ ఆఫీసర్ రాహుల్ దేవ్ శర్మ పర్యవేక్షించారు. ఈ ఘటనలో పాల్గొన్న వారు ఛత్తీస్‌గఢ్ ప్రాంతీయులు కాగా.. ఎగ్జిక్యూషన్ అంతా ఏపీ సరిహద్దులో జరిగింది. ఈ కేసులో 3 రాష్ట్రాల మావోలతో లింక్ ఉండడంతో కేంద్రహోం శాఖ ఎన్ఐఏకు అప్పగించింది. గత ఏడాది డిసెంబర్ 14న ఈ కేసుకు చెందిన సీడీ ఫైల్‌ను సిట్ ప్రత్యేకాధికారి రాహుల్‌దేవ్ శర్మ ఎన్ఐఏ అధికారులకు అప్పగించారు. ఆ వెంటనే ఈ కేసును విజయవాడలోని ఫాస్ట్ ట్రాక్ కోర్టుకు బదలాయించాలన్న ఎన్ఐఏ అభ్యర్థన మేరకు ఈ కేసును జిల్లా కోర్టు బదలాయించింది. కాగా అరెస్ట్ అయిన నిందితులు మాత్రం విశాఖ సెంట్రల్ జైలులోనే ఉన్నారు. వీరిలో కొర్రా కమలను జనవరి మొదటి వారంలో 3 రోజుల కస్టడీకి తీసుకున్న ఎన్ఐఏ బృందం స్థానిక కైలాసగిరిలోని జిల్లా ఆర్మడ్ రిజర్వు కార్యాలయంలో విచారించింది. తాజాగా యేడేల సుబ్బారావు భార్య యేడేల ఈశ్వరిని కోర్టు అనుమతితో మూడు రోజుల కస్టడీకి తీసుకున్నారు. బుధవారం ఈశ్వరితో పాటు ఏజెన్సీ నుంచి మరికొంత మంది అనుమానితులను కూడా ఏఆర్ కార్యాలయానికి తీసుకొచ్చి విచారించారు.

ఏడేళ్ల చిన్నారి అగ్నికి ఆహుతి

విశాఖ జిల్లా గాజువాకలో విషాదం


మృతిచెందిన తనూశ్రీ

గాజువాక (విశాఖ): అగరబత్తిని వెలిగిస్తున్న సమయంలో ప్రమాదవశాత్తూ మంటలు వ్యాపించి ఏడేళ్ల చిన్నారి అగ్నికి ఆహుతైంది. విశాఖ జిల్లా గాజువాకలో పండగపూట ఈ విషాదం చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. గాజువాకలోని జోగవాని పాలేనికి చెందిన ఆడారి వెంకట గణేష్ కొత్తగాజువాకలో కూరగాయల వ్యాపారం చేస్తుంటాడు. అతడి ఏడేళ్ల కుమార్తె తనూశ్రీ ఉక్కునగరంలోని ఒక ప్రైవేట్ పాఠశాలలో రెండో తరగతి చదువుతోంది. భోగి రోజు మధ్యాహ్నం 12 గంటల సమయంలో తనూశ్రీ తల్లి చంద్రకళ బట్టలు ఆరబెట్టడం కోసం డాబాపైకి వెళ్లింది. ఆ సమయంలో ఇంట్లో ఉన్న చిన్నారి దేవుడి మూలన ఉన్న అగర్‌బత్తిని అక్కడే ఉన్న అగ్గిపుల్లతో వెలిగించబోయింది. ఆ మంట చిన్నారి గౌనుకు అంటుకొని క్షణాల్లో రాజుకుంది. తలుపు కూడా వేసి ఉండటంతో ఆమె అరుపులు డాబాపై ఉన్న తల్లికి వినిపించలేదు. ఇంట్లోనుంచి పొగతో కూడిన మంటలను గమనించిన పక్కింటి మహిళ గట్టిగా కేకలు వేయడంతో పాపను నగరంలోని కేజీహెచ్‌కు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మంగళవారం మృతి చెందినట్టు వైద్యులు నిర్ధారించారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

20న విజయవాడలో బీసీల ధర్మ దీక్ష: డేరంగుల

సాక్షి, హైదరాబాద్: జనాభా ప్రాతిపదికన బీసీలకు ఎమ్మెల్యే, ఎంపీ సీట్లు కేటాయించాలని జాతీయ బీసీ సంఘం అధ్యక్షుడు డేరంగుల ఉదయ్‌కిరణ్ డిమాండ్ చేశారు. బీసీలకు 50 శాతం రిజర్వేషన్లు ఇవ్వాలని డిమాండ్ చేస్తూ ఈనెల 20వ తేదీన విజయవాడ ధర్నా చౌక్ వద్ద ధర్మ దీక్ష చేపట్టనున్నట్లు తెలిపారు. బుధవారం హైదరాబాద్ నాంపల్లిలోని ఓ హోటల్‌లో బీసీల ధర్మ దీక్ష పోస్టర్‌ను ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా డేరంగుల మాట్లాడుతూ.. ఇప్పటి వరకు అసెంబ్లీ మెట్లు ఎక్కని కులాలు ఎన్నో ఉన్నాయని, వడ్డెర, రజక, విశ్వ బ్రహ్మణ, నాయీ బ్రాహ్మణ, మేదర, ఈడిగ కులాలకు చట్ట సభల్లో ప్రాతినిధ్యం కల్పించాలని కోరారు.

ఏం జరిగిందో చెప్పండి

- వైఎస్ జగన్‌పై హత్యాయత్నం కేసులో ఎన్ఐఏ విచారణ ముమ్మరం
- సాక్షులను విచారిస్తున్న అధికారులు
- విశాఖపట్నం కైలాసగిరి పోలీస్ క్వార్టర్స్ ప్రాంగణంలో మకాం
- పండుగ సెలవుల్లేకుండా నిర్విరామంగా దర్యాప్తు
- హర్షవర్దన్ చౌదరి సహా 15 మందికి నోటీసులు


విశాఖ ఎయిర్‌పోర్టులోకి శ్రీనివాసరావును తీసుకెళ్తున్న ఎన్ఐఏ అధికారులు (ఫైల్)

సాక్షి ప్రతినిధి, విశాఖపట్నం: వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు, ప్రతిపక్ష నేత వైఎస్ జగన్‌మోహన్ రెడ్డిపై హత్యాయత్నం ఘటన కేసు విచారణలో జాతీయ దర్యాప్తు సంస్థ(ఎన్ఐఏ) అధికారులు దూకుడు పెంచారు. ముందుగా నిందితుడు శ్రీనివాసరావును కోర్టు అనుమతితో అదుపులోకి తీసుకుని, విశాఖపట్నం విమానాశ్రయంలోని ఘటనా స్థలానికి తీసుకువచ్చి విచారణ చేపట్టిన అధికారులు ఇప్పుడు ఆ కేసులోని సాక్షుల విచారణను ముమ్మరం చేశారు. విశాఖ నగరం కై లాసగిరి పోలీస్ హెడ్‌క్వార్టర్స్ ప్రాంగణంలో నాలుగు రోజులుగా ఎన్ఐఏ అధికారులు మకాం వేశారు. అక్కడే తాత్కాలిక కార్యాలయం ఏర్పాటు చేసుకున్నారు. సంక్రాంతి సెలవులు కూడా లేకుండా నిర్విరామంగా దర్యాప్తు కొనసాగిస్తున్నారు.

బయటి నుంచి కాఫీ తేవొద్దన్నారు

వైఎస్ జగన్‌పై హత్యాయత్నం జరిగినప్పుడు ఘటనా స్థలంలో ఉన్న వైఎస్సార్‌సీపీ నేతలు, కార్యకర్తలను కూడా సాక్షులుగా పేర్కొంటూ విచారణ చేస్తున్నట్టు తెలుస్తోంది. ఈ మేరకు పార్టీ కార్యాలయంలో పనిచేసే కృష్ణకాంత్‌ను మంగళవారం మధ్యాహ్నం ఎన్ఐఏ అధికారులు పిలిపించి రెండుగంటలకు పైగా విచారించారు. అదేవిధంగా వైఎస్సార్‌సీపీకి చెందిన మాజీ కార్పొరేటర్ జియ్యాని శ్రీధర్‌ను మంగళవారం సాయంత్రం పిలిపించి విచారించారు. ''ఉత్తరాంధ్రలో ప్రజా సంకల్పయాత్ర నేపథ్యంలో ఎయిర్‌పోర్ట్‌కు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి విచ్చేసినప్పుడు మా ఇంటి నుంచి నేనే కాఫీ తీసుకువెళ్లేవాడిని. హత్యాయత్న ఘటనకు సరిగ్గా వారం ముందే బయటి నుంచి కాఫీ వద్దంటూ ఫ్యూజన్ ఫుడ్స్ రెస్టారెంట్ యజమాని హర్షవర్దన్ చౌదరితో చెట్టాపట్టాలు వేసుకుతిరిగే ఎయిర్‌పోర్ట్ చీఫ్ సెక్యూరిటీ ఆఫీసర్ వేణుగోపాల్ అడ్డుకున్నారు. మా ఇంటి నుంచి తెచ్చిన కాఫీని సర్వ్ చేసిన ఇద్దరు ఎయిర్ ఇండియా సిబ్బందిని వారంపాటు సస్పెండ్ చేశారు. ఫ్యూజన్ ఫుడ్స్ నుంచే తేవాలని షరతు విధించారు. సరిగ్గా ఆ వారమే ప్రతిపక్ష నేతపై శ్రీనివాసరావు కత్తితో దాడి చేశాడు'' అని శ్రీధర్ ఎన్ఐఏ అధికారులకు వివరించారు. ''కేసు దర్యాప్తు చేసిన 'సిట్' అధికారులు, విశాఖ పోలీస్ ఉన్నతాధికారులు మాకు ఏమాత్రం సహకరించలేదు. ఆ కేసు గురించి ఒక్క ముక్క కూడా చెప్పలేదు. అందుకే మీరైనా ఏం జరిగిందో చెప్పండి'' అని ఎన్ఐఏ అధికారులు విచారణకు హాజరైన సాక్షులతో అన్నట్టు సమాచారం.

ఆ లేఖపైనా విచారణ

నిందితుడు శ్రీనివాసరావు వద్ద లభ్యమైనట్టు పోలీసులు చెబుతున్న 11 పేజీల లేఖపై కూడా ఎన్ఐఏ అధికారులు విచారణ సాగిస్తున్నారు. ఈ క్రమంలోనే లేఖలో 2 పేజీలు రాసినట్టు చెబుతున్న ఫ్యూజన్‌ఫుడ్స్ రెస్టారెంట్‌లో శ్రీనివాసరావు సహోద్యోగి రేవతీ ప్రసాద్‌ను అధికారులు బుధవారం పిలిపించి సుదీర్ఘంగా విచారించారు. ఆ లేఖ ఎవరు రాశారు? నిజంగా నువ్వే రాశావా? వైఎస్ జగన్‌పై హత్యాయత్నం జరిగిన సమయంలో లేఖ శ్రీనివాసరావు వద్దనే ఉందా? లేదా? ఆ తర్వాత పుట్టించారా? ఇలా పలు కోణాల్లో రేవతీ ప్రసాద్‌ను ప్రశ్నించినట్లు సమాచారం.

హర్షవర్ధన్ చౌదరికి నోటీసులు

జగన్‌పై హత్యాయత్నం కేసులో కీలకంగా భావిస్తున్న టీడీపీ నాయకుడు. ఫ్యూజన్ ఫుడ్స్ రెస్టారెంట్ యజమాని టి.హర్షవర్దన్ చౌదరి సహా రెస్టారెంట్‌లో పనిచేస్తున్న ఉద్యోగులు, ఇతర సాక్షులు మొత్తం 15మందిని గురు, శుక్రవారాల్లో విచారణకు హాజరు కావాల్సిందిగా ఎన్ఐఏ అధికారులు నోటీసులు జారీ చేసినట్టు తెలుస్తోంది. హర్షవర్దన్ చౌదరిని ప్రశ్నిస్తే కీలక సమాచారం లభ్యమవుతుందని ఎన్ఐఏ అధికారులు భావిస్తున్నట్లు సమాచారం.

లాగిన్, ఐపీ వివరాలివ్వండి!

- 'యూట్యూబ్'కు విచారణ అధికారుల లేఖ
- షర్మిలపై అసత్య ప్రచారం కేసులో ముందడుగు
- వివరాలు అందగానే దర్యాప్తు మరింత ముమ్మరం

సాక్షి, హైదరాబాద్: వైఎస్సార్ కుమార్తె, ఆంధ్రప్రదేశ్ ప్రతిపక్షనేత వైఎస్ జగన్ సోదరి షర్మిలపై సోషల్ మీడియాలో అసత్య ప్రచారంపై నమోదైన కేసు దర్యాప్తును హైదరాబాద్ సైబర్ క్రైమ్ పోలీసులు ముమ్మరం చేశారు. అడిషనల్ డీసీపీ కేసీఎస్ రఘువీర్ నేతృత్వంలోని ప్రత్యేక బృందం.. బాధ్యుల్ని పట్టుకునేందుకు చర్యలు వేగవంతం చేసింది. ఫిర్యాదు సందర్భంగా షర్మిల కొన్ని యూట్యూబ్ లింకుల్ని సైతం పొందుపరిచారు. ఈ లింకుల ఆధారంగా లాగిన్, ఐపీ అడ్రస్ వివరాలు తెలుసుకునేందుకు సాంకేతికంగా ప్రయత్నిస్తున్న విచారణ బృందం సహకరించాలంటూ యూట్యూబ్‌కు లేఖ రాశారు. యూట్యూబ్ నుంచి లాగిన్, ఐపీ వివరాలు వచ్చిన తర్వాత ఏ సర్వీస్ ప్రొవైడర్ నుంచి ఇంటర్‌నెట్ సేవలు అందుకున్నారో తెలుసుకోవడం సులభం అవుతుంది. ఆ సర్వీస్ ప్రొవైడర్‌ను సంప్రదించడం ద్వారా నిందితులకు సంబంధించిన ఆధారాలు సేకరిస్తారు. నిందితుల్ని గుర్తించాలంటే ప్రాథమికంగా ఆయా అంశాలను యూట్యూబ్‌లోకి అప్‌లోడ్ చేసిన వారి వివరాలు తెలియాలి. సాధారణంగా ఏ సబ్‌స్క్రైబర్ అయినా వీడియో అప్‌లోడ్ చేయడానికి కచ్చితంగా లాగిన్ కావాల్సిందే. ఈ సమయంలో రిజిస్ట్రేషన్ కోసం ఫోన్ నంబరుతోపాటు పలు వ్యక్తిగత వివరాలు ఇవ్వాల్సి ఉంటుంది. దీంతో పాటు వారు యూట్యూబ్‌ను వినియోగించే సమయంలో ఏదో ఒక ఐపీ (ఇంటర్‌నెట్ ప్రొటోకాల్) అడ్రస్ ఆధారంగా ఇంటర్‌నెట్‌తో అనుసంధానమవుతారు.

ఫీల్డ్ ఆపరేషన్‌కు వేరే బృందం

సాంకేతిక దర్యాప్తు పూర్తయిన తర్వాత సైబర్ క్రైమ్ పోలీసులు నిందితుల్ని పట్టుకోవడానికి ఫీల్డ్ ఆపరేషన్ చేపట్టాలని నిర్ణయించారు. దీనికోసం మరో ప్రత్యేక బృందం సిద్ధంగా ఉంది. షర్మిలపై 2014 ఎన్నికల సందర్భంలోనూ సోషల్ మీడియా వేదికగా అసత్య ప్రచారం చేశారు. అప్పట్లో ఆమె ఫిర్యాదు మేరకు సైబర్ క్రైమ్ ఠాణాలోనే కేసు నమోదైంది. దీన్ని దర్యాప్తు చేసిన పోలీసులు ముగ్గురు నిందితుల్ని అరెస్టు చేశారు. అప్పట్లో ఆ కేసును సోషల్ మీడియా వేదికగా పరువునష్టం సంబంధిత సెక్షన్ కింద కేసు నమోదుచేశారు. కొన్నాళ్లకు ఈ సెక్షన్‌ను సుప్రీం కోర్టు తొలగించడంతో ఆ కేసు మూతపడింది. అయితే తాజా ఫిర్యాదును.. అభ్యంతరకర, అసభ్య వ్యాఖ్యలకు సంబంధించిన సెక్షన్‌ల కింద కేసు నమోదు చేశారు. దీంతో విచారణ పూర్తయ్యేంత కేసు మూసివేసే ప్రసక్తే లేదని పోలీసులు చెప్తున్నారు. అప్పట్లో అరెస్టు అయిన ముగ్గురు నిందితులను సైతం ప్రస్తుత కేసులో అనుమానిత జాబితాలో చేర్చారు. వారు ప్రస్తుతం ఎక్కడ ఉన్నారు? ఏం చేస్తున్నారు? ఈ వ్యవహారంతో సంబంధం ఉందా? అనే వివరాలను సాంకేతికంగా, క్షేత్రస్థాయిలో ఆరా తీస్తున్నారు. సైబర్ క్రైమ్ విభాగం అదనపు డీసీపీ కేసీఎస్ రఘువీర్ 'సాక్షి'తో మాట్లాడుతూ.. 'షర్మిల ఫిర్యాదు మేరకు నమోదైన కేసు దర్యాప్తునకు కీలక ప్రాధాన్యం ఇస్తూ ప్రత్యేక బృందం పనిచేస్తోంది. యూట్యూబ్‌తో పాటు ఫేస్‌బుక్‌లోనూ అభ్యంతరకర, అసభ్య సందేశాలు పోస్ట్ చేశారు. నిందితుల్ని పట్టుకున్న తర్వాత ఈ వ్యవహారం వెనుక ఉన్న వారి వివరాలు ఆరా తీస్తాం. బాధ్యులు ఎవరైనా సరే చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకుంటాం' అని అన్నారు.

షర్మిల ఫిర్యాదుపై సీఎం స్పందించే తీరు ఇదేనా?

సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ



సాక్షి, అమరావతి: దివంగత ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి కుమార్తె షర్మిల ఫిర్యాదుపై ముఖ్యమంత్రి చంద్రబాబు స్పందించిన తీరు ఆయన హోదాకు తగ్గట్లుగా లేదని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ విమర్శించారు. ఒక మహిళ తనకు అన్యాయం జరిగిందని రోడ్డెక్కితే సీఎం హోదాలో ఉన్న వ్యక్తి ఆ అన్యాయాన్ని సరిదిద్దడానికి ప్రయత్నించాల్సిందిపోయి ప్రతివిమర్శకు దిగడమేంటని ప్రశ్నించారు. పార్టీ నాయకులు జేవీ సత్యనారాయణమూర్తి, పీజే చంద్రశేఖరరావు, జల్లి విల్సన్, రావుల వెంకయ్య, జి.ఓబులేసుతో కలిసి రామకృష్ణ బుధవారం విజయవాడలో మీడియాతో మాట్లాడారు. రాష్ట్రంలో శాంతి భద్రతల పరిస్థితి సజావుగా ఉందని ముఖ్యమంత్రి తన సొంత గ్రామమైన నారావారిపల్లెలో గొప్పగా చెప్పడాన్ని ఆయన ఎద్దేవా చేశారు. ఇంతకన్నా పచ్చి అబద్ధం మరొకటి ఉంటుందా? అని విస్మయం వ్యక్తం చేశారు. షర్మిల హైదరాబాద్‌లో పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదుపై 40 ఏళ్ల అనుభవం ఉన్న వ్యక్తిగా చంద్రబాబు స్పందించలేదని, గల్లీ స్థాయి లీడర్ మాట్లాడినట్లుగా ఉందన్నారు. షర్మిలపై పలు రకాల వ్యాఖ్యానాలు చేసే బదులు ఆంధ్రప్రదేశ్ పోలీసులు న్యాయం చేస్తారో లేదో చెప్పి ఉంటే బాగుండేదని అభిప్రాయపడ్డారు. ఇప్పటికైనా ఆమెకు జరిగిన అన్యాయంపై ప్రభుత్వం స్పందించాలని డిమాండ్ చేశారు. రాష్ట్రంలో ఏనాడూ లేనంతగా కోట్లాది రూపాయల కోడిపందాలు జరుగుతుంటే సీఎం ఎక్కడున్నారు, హోం మంత్రి ఏం చేస్తున్నారని నిలదీశారు. కోర్టులు చెప్పినా ప్రభుత్వాలు భేఖతారు చేశాయన్నారు.

మహాబలిపురంలో ఉపరాష్ట్రపతి పర్యటన



టీ.నగర్ (చెన్నై): తమిళనాడు మహాబలిపురంలో బుధవారం ఉపరాష్ట్రపతి ఎం.వెంకయ్యానాయుడు తన కుటుంబంతోపాటు బీచ్ టెంపుల్‌ను సందర్శించారు. ఆయనను పర్యాటక శాఖ అధికారులు సాదరంగా ఆహ్వానించి జ్ఞాపిక అందజేశారు. భారత ఉపరాష్ట్రపతి వెంకయ్యానాయుడు ఈనెల 14వ తేదీన మూడు రోజుల పర్యటనకు మహాబలిపురానికి వచ్చారు. రెండు రోజులుగా ఆయన ఓ ప్రైవేట్ బీచ్ హోటల్‌లో కుటుంబంతోపాటు విశ్రాంతి తీసుకున్నారు. తర్వాత బుధవారం ఉదయం అక్కడున్న బీచ్ టెంపుల్, అర్జున తపస్సు, ఐదు రథాలను తిలకించారు. ముందుగా ఆయనను మహాబలిపురం పర్యాటక అధికారి శక్తివేలు, తమిళ సాంస్కృతిక పద్ధతిలో ఆహ్వానించి మహాబలిపురం విశేషాలను వెల్లడించారు. పురావస్తుశాఖ అధికారి భరణీధరన్, ఇతర అధికారులు పలువురు వెంట ఉన్నారు. ఉపరాష్ట్రపతి రాక సందర్భంగా డీఎస్పీ సుబ్బరాజు ఆధ్వర్యంలో భారీ పోలీసు భద్రత కల్పించారు.

సీఎం విధుల్లో కానిస్టేబుల్‌కు అస్వస్థత..

ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి


వెంకటరమణ (ఫైల్)

చంద్రగిరి: ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు పర్యటనలో విధులు నిర్వహించిన కానిస్టేబుల్ తీవ్ర అస్వస్థతకు గురై మృతి చెందిన ఘటన మంగళవారం చోటు చేసుకుంది. దామలచెరువుకు చెందిన వెంకటరమణ (52) చంద్రగిరి పోలీసుస్టేషన్‌లో హెడ్ కానిస్టేబుల్‌గా విధులు నిర్వహిస్తున్నారు. 15 సంవత్సరాల క్రితం వెంకటరమణకు ఆరోగ్యం సహకరించకపోతే వైద్యులు బైపాస్ సర్జరీ చేశారు. ఈ క్రమంలో సంక్రాంతి సందర్భంగా సీఎం చంద్రబాబు నారావారిపల్లికి రావడంతో వెంకటరమణను బందోబస్తు నిమిత్తం స్థానిక సీఐ రంగంపేటలో విధులకు హాజరుకావాలని ఆదేశించారు. తనకు ఆరోగ్యం సరిగాలేదని సీఐకు తెలియజేసినా ఆయన పట్టించుకోలేదు. దీంతో ఆదివారం రాత్రి ఆయన విధులకు హాజరయ్యారు. రాత్రి వేళలో అధికంగా మంచు కురవడంతో సోమవారం ఉదయం విధులు ముగించుకునే సమయంలో ఛాతిలో నొప్పిగా ఉందంటూ సహచర సిబ్బందికి తెలియజేశాడు. విధులు ముగించుకుని ఇంటికి వెళ్లిన ఆయనకు ఛాతి నొప్పి అధికం కావడంతో కుటుంబ సభ్యులు స్విమ్స్ అసుపత్రికి తీసుకెళ్లారు. అనంతరం వైద్య సేవలు పొందుతున్న సమయంలో రెండు సార్లు గుండెపోటు రావడంతో మంగళవారం ఉదయం మృతి చెందాడు. సీఎంకు బందోబస్తు నిమిత్తం వెళ్లి వెంకటరమణ గుండెపోటుతో మృతి చెందిన విషయాన్ని పోలీసు ఉన్నతాధికారులు మీడియాకు కూడా తెలియకుండా గోప్యంగా ఉంచారు

ముస్లింల సంక్షేమానికి ప్రభుత్వాలు తూట్లు

ముస్లిం పర్సనల్ లా బోర్డు రాష్ట్ర అధ్యక్షుడు అల్తాఫ్ రజా

కొండపల్లి (ఇబ్రహీంపట్నం): ముస్లింల సంక్షేమానికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు తూట్లు పొడుస్తున్నాయని ముస్లిం పర్సనల్ లా బోర్డు రాష్ట్ర అధ్యక్షుడు మహ్మద్ అల్తాఫ్ రజా ఆరోపించారు. కృష్ణా జిల్లా కొండపల్లిలోని షాబూఖారీ మసీదు ఆవరణలో బుధవారం 'అహ్లే సున్నతుల్ జమాతే' సంస్థ రాష్ట్ర స్థాయి సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న అల్తాఫ్ రజా మాట్లాడుతూ.. దేశంలో ముస్లింలు అత్యంత దయనీయ పరిస్థితుల్లో బతుకుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. దేశంలో రైల్వే ఆస్తుల తర్వాత ఎక్కువగా ఉన్న ముస్లిం ఆస్తులు, వక్ఫ్ భూములు అన్యాక్రాంతం అవుతున్నా ప్రభుత్వాలు చోద్యం చూస్తున్నాయని విమర్శించారు. 2002లో అప్పటి సీఎం చంద్రబాబు వక్ఫ్ భూముల పరిరక్షణకు కమిటీలు ఏర్పాటు చేశారని.. అయితే అవి నామమాత్రంగా మిగిలాయన్నారు. సుప్రీం కోర్టు ఆదేశాల మేరకు వక్ఫ్ ఆస్తులు కొనటం, అమ్మటం నేరమని, అయితే అభివృద్ధి పేరుతో ప్రభుత్వమే ముస్లింల భూములు సేకరించటం, మసీదులు, దర్గాలు కూల్చేయటం దారుణమన్నారు. వక్ఫ్ ఆస్తుల పరిరక్షణకు కమిటీలు ఏర్పాటు చేయాలన్నారు.

చంద్రబాబుకు కేసీఆర్ రిటర్న్ గిఫ్ట్ ఖాయం

తెలంగాణ ఎమ్మెల్యే ఆరెకపూడి గాంధీ



యడ్లపాడు (చిలకలూరిపేట): తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి కె.చంద్రశేఖర్‌రావు (కేసీఆర్) సరైన సమయంలో ఏపీ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుకు రిటర్న్ గిఫ్ట్ ఇవ్వడానికి సిద్ధంగా ఉన్నారని టీఆర్ఎస్ ఎమ్మెల్యే ఆరెకపూడి గాంధీ చెప్పారు. గుంటూరు జిల్లా యడ్లపాడులో బుధవారం జరిగిన ఓ ప్రైవేటు కార్యక్రమానికి హాజరైన గాంధీ విలేకరులతో మాట్లాడారు. టీడీపీ ఎన్ని రాజకీయ ఎత్తుగడలు వేసినా, ప్రచార ఆర్భాటాలు ఉధృతం చేసినా.. ప్రజలు అభివృద్ధికి పట్టం కడతారన్న విషయం తెలంగాణ ఎన్నికలు రుజువు చేశాయన్నారు. ఏపీ ప్రజలు నిజాయితీగా పనిచేసే నాయకుడికే పట్టం కడతారని, వంచనతో కుట్రలతో పరిపాలన కొనసాగించే వ్యక్తులను దూరం పెడతారని తెలిపారు. ఓటుకు కోట్లు కేసు వల్లే సీఎం చంద్రబాబు అర్ధంతరంగా ఏపీకి పరుగు పెట్టారని విమర్శించారు.

సాక్షి

గురువారం, జనవరి, 17

బ్రిటన్‌కు అగ్ని పరీక్ష!

యూరప్ యూనియన్(ఈయూ) నుంచి బ్రిటన్ నిష్క్రమించాల్సిన గడువు ముంచుకొస్తుండగా ఆ దేశ ప్రధాని థెరిస్సా మే ఈయూతో కుదుర్చుకొచ్చిన ముసాయిదా ఒప్పందం వీగిపోయింది. బ్రిటన్ దిగువ సభ కామన్స్‌లో మంగళవారం దానికి చుక్కెదురైంది. ఆ ప్రతిపాదనకు అనుకూలంగా కేవలం 202 ఓట్లు మాత్రమే లభించగా, 432మంది వ్యతిరేకించారు. దేశ ప్రధాని ప్రతిపాదనకు ఈ స్థాయిలో ప్రతిఘటన ఎదురుకావడం బ్రిటన్ చరిత్రలో ఇదే మొదటిసారి. దీనికి కొనసాగింపుగా ఆమె ప్రభుత్వంపై విపక్ష లేబర్ పార్టీ నాయకుడు జెరిమీ కోర్బిన్ తీసుకొచ్చిన అవిశ్వాస తీర్మానంపై చర్చ మొదలైంది. అందులో సైతం థెరిస్సా ఓడితే ఆమె ప్రభుత్వం రాజీనామా చేయాల్సి ఉంటుంది. ఈయూ నుంచి బ్రిటన్ తప్పుకొనేందుకు గడువు తేదీ మార్చి 29. అంటే... ఇక కేవలం 72 రోజులు మాత్రమే మిగిలి ఉంది. ఆలోగా ఈయూతో అది ఒప్పందానికి రాలేకపోతే బ్రిటన్ తెగదెంపులు పూర్తయినట్టే భావిస్తారు. సంస్థనుంచి బయటికొచ్చాక అనుసరించాల్సిన విధి విధానాలపై నిర్దిష్ట ప్రణాళిక లేకుండా ఈ ప్రక్రియ ముగిసిపోతే బ్రిటన్‌ను అది తీవ్ర సంక్షోభంలో పడేస్తుంది. దాని పర్యవసానంగా ఏర్పడే ఆర్థిక, రాజకీయ పరిణామాలు పెను విపత్తుకు దారి తీస్తాయి. ఆహారం, మందులు వగైరాల కొరతతో మొదలుపెట్టి విమాన రాకపోకలు స్తంభించిపోవడంతోసహా ఎన్నో సంక్లిష్ట సమస్యలు తలెత్తుతాయి. ఆ తర్వాత దేశంలో బద్దలయ్యే అశాంతిని అదుపు చేయడం ప్రభుత్వానికి తలకు మించిన భారమవుతుంది. అయితే ఇదంతా సజావుగా పూర్తవుతుందని, సమస్యలేమీ ఎదురుకావన్న భావనతోనే మార్కెట్లున్నాయి. అందుకే బ్రిటన్‌లోని తాజా పరిణామాల ప్రభావం వాటిపై పెద్దగా పడలేదు.

థెరిస్సా మే గత కొన్ని నెలలుగా ఈయూ బాధ్యులతో బ్రెగ్జిట్‌పై చర్చోపచర్చలు సాగిస్తున్నారు. వాటి పర్యవసానంగా గత నవంబర్‌లో ముసాయిదా ఒప్పందం ఖరారైంది. దీనికి కన్సర్వేటివ్ పార్టీలోనేకాక, తమకు మద్దతునిస్తున్న ఉత్తర ఐర్లాండ్ పార్టీ డీయూపీనుంచి సైతం అసమ్మతి స్వరాలు వినిపించాయి. రోజులు గడుస్తున్నకొద్దీ అవి పెరిగాయి. అటు విపక్ష లేబర్ పార్టీ, స్కాటిష్ నేషనల్ పార్టీ(ఎస్ఎన్‌పీ)లు సరేసరి. ఆ ముసాయిదా ఒప్పందం తమకు ఆమోదయోగ్యం కాదని స్పష్టం చేశాయి. ఈ స్థితిలో డిసెంబర్‌లో జరగాల్సిన ఓటింగ్‌ను ఆమె వాయిదా వేశారు. ఆ తర్వాత మరిన్ని రాయితీలివ్వాలని ఈయూను ప్రాధేయపడ్డారు. కానీ ఆ సంస్థను నడిపిస్తున్న జర్మనీ ఏంజెలా మెర్కెల్ అందుకు సిద్ధంగా లేరు. అందుకే యూరోపియన్ కమిషన్ అధ్యక్షుడు జీన్ క్లాడ్ జుంకర్, యూరోపియన్ కౌన్సిల్ అధ్యక్షుడు డోనాల్డ్ టస్క్‌లు అందుకు తిరస్కరించారు. ఇదే బ్రిటన్ పౌరులను కలవరపరిచింది. 2016 జూన్‌లో బ్రెగ్జిట్‌పై రిఫరెండం జరిగినప్పుడు అత్యధికులు స్వాగతించిన విషయాన్ని గుర్తుంచుకుంటే ప్రస్తుత వ్యతిరేకత తీవ్రతేమిటో అర్థమవుతుంది. అప్పట్లో 51.9 శాతంమంది రిఫరెండానికి అనుకూలత వ్యక్తం చేశారు. 48.1 శాతంమంది ఈయూలోనే కొనసాగాలని కోరారు. రెండున్నరేళ్లు గడిచేసరికల్లా బ్రెగ్జిట్ అనుకూలురు, దాని వ్యతిరేకులు కూడా ఒకే దోవకొచ్చారు. ఫలితంగా ముసాయిదాకు కేవలం 20 శాతంమంది మాత్రమే అనుకూలమని సర్వేలు తేల్చిచెప్పాయి. ఒప్పందం మరీ కఠినంగా ఉండరాదని అనేకులు ఆశించారు. కానీ దానికి భిన్నంగా జరగడమేకాక ముసాయిదా బ్రిటన్ ఆత్మగౌరవాన్ని దెబ్బతీస్తున్నదని దేశంలో ఆగ్రహావేశాలు వ్యక్తమవుతున్నాయి. దేశాన్ని ఇది శాశ్వతంగా అప్రజాస్వామిక ఈయూకు బానిసను చేస్తుందన్నది వారి విశ్లేషణ. ఈ ముసాయిదా ఒప్పందం ఖరారైతే ఈయూ ఆమోదం లేకుండా అమెరికాతో సహా ఏ దేశంతోనూ భవిష్యత్తులో బ్రిటన్ వాణిజ్య ఒప్పందాలకు రావడం సాధ్యపడదని వారంటున్నారు. తమనుంచి దూరమైతే ఎలాంటి దుర్గతి పడుతుందో సంస్థలోని ఇతర సభ్య దేశాలకు చూపడమే ఈయూ అధినేతల ఆంతర్యంగా కనబడుతున్నదన్న విమర్శలున్నాయి. అందుకే థెరిస్సా మే తీరును నిరసిస్తూ ఈమధ్యకాలంలో పలువురు మంత్రులు, డిప్యూటీలు ఆమె ప్రభుత్వానికి గుడ్‌బై చెప్పారు. బ్రెగ్జిట్ చర్చల్లో మొదటినుంచీ కీలకపాత్ర పోషిస్తున్న డొమినిక్ రాబ్ కూడా వారిలో ఉన్నారు.

ఒక దేశం సంస్థలో సభ్యత్వం తీసుకున్ననాటికి ఎలా ఉందో, విడిపోయాక కూడా అలా కొనసాగుతామంటే ఈయూ పెద్దలకు అభ్యంతరం ఎందుకుండాలి? సంస్థ ఆలంబనతో అన్నివిధాలా ఎదిగాక మధ్యలో విడిచిపోతానంటే ఈయూ సంకటస్థితిలో పడుతుందన్నది జర్మన్ కార్పొరేట్ల వాదన. అయితే యూరప్‌పై తమ ఆర్థిక పెత్తనాన్ని కొనసాగించడానికే జర్మన్లు ఇలాంటి అర్థరహిత వాదనలు చేస్తున్నారని బ్రిటన్ నిపుణులు ఆరోపిస్తున్నారు. ఒప్పందం ఖరారు కాకపోతే అటు బ్రిటన్‌కు మాత్రమే కాదు...ఇటు ఈయూ దేశాలకూ బోలెడు సమస్యలు ఎదురవుతాయి. ఈయూ సభ్యదేశాల పౌరులు ఇన్నాళ్లూ యూరప్‌లోఎక్కడైనా స్వేచ్ఛగా వెళ్లొచ్చు. ఉపాధి వెదుక్కోవచ్చు. కానీ ఏ ఒప్పందమూ లేకుండా బ్రిటన్ విడిపోయే పరిస్థితి ఏర్పడితే వేరే దేశాల్లో ఉండే బ్రిటన్ పౌరులు అక్కడ నివసించేందుకు పర్మిట్లకు దరఖాస్తు చేయాలి. ఫిన్‌లాండ్‌లో ఉన్న 5,000మంది బ్రిటన్ పౌరులకు ఇప్పటికే అక్కడి ప్రభుత్వం హెచ్చరిక జారీ చేసింది. అలాగే బ్రిటన్‌లో ఉండే వేరే దేశాల పౌరులు సైతం ఆ పనే చేయాల్సి ఉంటుంది. ఫ్రాన్స్ నుంచి బ్రిటన్‌కు వైన్ ఎగుమతులు... బ్రిటన్‌నుంచి ఫ్రాన్స్‌కు మద్యం ఎగుమతులు నిలిచిపోతాయి. ఆ రెండు దేశాలూ ఆర్థిక సంక్షోభంలో పడతాయి. ఏదేమైనా బ్రిటన్ పరిస్థితి 'ముందు నుయ్యి–వెనక గొయ్యి' అన్నట్టుంది. పాత ముసాయిదాలో మార్పులు కావాలని బ్రిటన్ సంప్రదిస్తే కొత్త ఒప్పందానికి ఆమోదం పొందుతామన్న ముందస్తు హామీ ఇచ్చే షరతు విధిస్తామని ఈయూ బాధ్యులు అంటున్నారు. ఒకప్పుడు 'రవి అస్తమించని సామ్రాజ్యానికి' అధిపతిగా ఉన్న బ్రిటన్‌కు ఈ బ్రెగ్జిట్ వ్యవహారం అగ్నిపరీక్షగా మారింది. దీన్నుంచి అది గౌరవంగా ఎలా బయటపడగలదో ముమ్ముందు చూడాలి.

గ్రహం అనుగ్రహం

శ్రీ విళంబి నామ సంవత్సరం, ఉత్తరాయణం, హేమంత ఋతువు
పుష్యమాసం, తిథి శు.ఏకాదశి సా.6.34 వరకు, తదుపరి ద్వాదశి
నక్షత్రం కృత్తిక ఉ.10.10 వరకు, తదుపరి రోహిణి, వర్జ్యం రా.1.49
నుంచి 3.24 వరకు, దుర్ముహూర్తం ఉ.10.19 నుంచి 11.04 వరకు
తదుపరి ప.2.44 నుంచి 3.28 వరకు
అమృతఘడియలు... ఉ.7.44 నుంచి 9.20 వరకు.

సూర్యోదయం : 6.38
సూర్యాస్తమయం: 5.42
రాహుకాలం : ప. 1.30 నుంచి 3.00 వరకు
యమగండం : ఉ.6.00 నుంచి 7.30 వరకు

రిజర్వేషన్ల స్ఫూర్తికి ఆటంకం



మల్లెపల్లి లక్ష్మయ్య

రిజర్వేషన్లను చాలామంది దానధర్మంగానూ, భిక్షగానూ భావిస్తున్నారు. కానీ భారత ప్రజాస్వామిక సూత్రంలో ప్రాతినిధ్యం కీలకమైనది. ఏ కులాలకైతే ప్రాతినిధ్యం లేదో, ఆయా కులాలకు ప్రత్యేక సౌకర్యాలు కల్పిస్తూ, విధానాలను రూపొందించాలి. మూడువేల ఏళ్ళుగా వివక్షకు, అణచివేతకు కారణమైన అగ్రకులాల ఆధిపత్యాన్ని కొత్తగా తెచ్చిన కోటా మరింత పటిష్ట పరుస్తుందన్నది నగ్న సత్యం. అగ్రకులాల పేదలకు ఎటువంటి సంక్షేమ కార్యక్రమాలు చేపట్టకూడదని ఎవ్వరూ అనడం లేదు. చదువుల విషయంలో ఇప్పటికే వారికి స్కాలర్‌షిప్స్ ఉన్నాయి. ఇంకా వాటిని అందరికీ అందేవిధంగా చర్యలు తీసుకోవచ్చు. కానీ రిజర్వేషన్ల స్ఫూర్తిని దెబ్బతీయకూడదు.

''అధికారానికీ, అవకాశాలకూ అవతల ఉన్న సమూహాలకూ, కులాలకూ ప్రత్యేకమైన అవకాశాలూ, హక్కులూ కల్పించాలి. వారి కోసం ప్రత్యేక చట్టాలు చేయాలి. అందుకు గాను ప్రాథమిక హక్కులలో దానికి చోటు కల్పిస్తున్నాము'' ప్రాథమిక హక్కులలో భాగమైన ఆర్టికల్ 16పైన జరిగిన చర్చలో పాల్గొంటూ బాబాసాహెబ్ అంబేడ్కర్ చేసిన వ్యాఖ్యలివి. రాజ్యాంగ పీఠికలో పేర్కొన్న అంశాలు కూడా దీనిని ధ్రువపరుస్తున్నాయి. మన దేశంలో స్వేచ్ఛ, సమానత్వం, సోదరత్వం సాధించడానికి ఒక ప్రణాళిక అవసరం. అందులో భాగంగానే అన్యాయానికీ, అసమానతలకూ, అణచివేతకూ, వివక్షకూ గురైన వర్గాల కోసం కొన్ని ప్రత్యేక అవకాశాలూ, చట్టాలూ చేశాం. చేస్తున్నాం. కానీ, ఆర్థికంగా వెనుకబడిన వర్గాల కోసం పార్లమెంటులో ఆమోదించిన చట్టం రాజ్యాంగ విలువలనూ, ప్రాథమిక లక్ష్యాలనూ విస్మరించింది. భారతదేశ కుల వ్యవస్థలో ఆధిపత్య స్థానంలో ఉన్న వర్గాలకు విద్య, ఉపాధి రంగాల్లో 10 శాతం రిజర్వేషన్లను ఖరారు చేస్తూ ఈ చట్టం చేశారు. సమాజంలో ఉన్న ఏ అంతరాలైతే పోవాలని మనం కోరుకుంటున్నామో అవే అంతరాలను అంతకంతకూ అధికం చేసేదే ఈ చట్టం అని నా అభిప్రాయం. అసలు రిజర్వేషన్లు ఎవరికివ్వాలి? ఎందుకివ్వాలి? అర్థం చేసుకోవాలంటే చరిత్ర అడుగడుగునా చెరగని దళితుల నెత్తుటి జాడలను తడిమి చూడాలి.

తరతరాల అవమాన భారాన్ని పెంటతట్టలా నెత్తిన మోసిన వేన వేల దళితులకు పరిహారంగా వచ్చిందే రిజర్వేషన్ల ప్రక్రియ. చరిత్ర పరిణామ క్రమంలో జరిగిన మానవ భావజాల తప్పిదాలను సరిదిద్దుకునే అవకాశాన్ని అంబేడ్కర్ రిజర్వేషన్ల పేరుతో కల్పించారు. కానీ ఈరోజు చేసిన చట్టం ద్వారా కల్పిస్తున్న ఈబీసీలకు పదిశాతం రిజర్వేషన్లు మాత్రం ఆధిపత్య చరితను పునఃప్రతిష్ఠించడానికే. నిజానికి గత రెండు వేల సంవత్సరాలకు పైగా జ్ఞానం, చదువు, సంపద మీద కొంత మంది తరతరాల గుత్తాధిపత్యం కొనసాగుతోంది. ఈ ఆధిపత్య భావజాలమే సమాజాన్ని పిడికిట బిగించి అణగారిన వర్గాలను అందులో బంధించింది. దీన్ని జయించడానికి రిజర్వేషన్లు ఓ చిన్న ప్రయత్నం మాత్రమే. భారత సమాజంలో వర్ణవ్యవస్థను నిర్మించి, కొన్ని వర్గాలకు, కొన్ని ప్రత్యేకమైన అవకాశాలను కల్పించారు. చదువు జ్ఞానం, సంపద మీద అధికారాన్నీ, ఆధిపత్యాన్నీ బ్రాహ్మణులు సంపాదించడం అందులో భాగమే. ఆ తరువాత క్షత్రియులు అధికారాన్ని సాగించారు. వైశ్యులు వ్యవసాయం, వ్యాపారం మీద అజమాయిషీ పొందారు. శూద్రులు వృత్తుల ద్వారా, ఇతర పరిచర్యల ద్వారా సేవకులుగా ఉన్నారు. ఇప్పుడు మనం ఎస్సీ, ఎస్టీలుగా పిలుస్తున్న నూటికి 25 శాతం మంది ఈ ఆధిపత్య సమాజం అంచులను కూడా తాకలేకపోయారు.

ఈ ఆధిపత్య వ్యవస్థపై పడిన మొదటి సమ్మెట దెబ్బ 1902లో బ్రాహ్మణులతోపాటు బ్రాహ్మణేతర కులాలకు విద్య, ఉద్యోగాల్లో అవకాశాలు కల్పించడానికి కొల్హాపూర్ సంస్థానాధీశుడు సాహుమహారాజ్ రిజర్వేషన్లు కల్పించడంతో పడింది. దీనితో ఆ ప్రాంతంలో ఉన్న బ్రాహ్మణేతరులైన మరాఠాలతోపాటు, అనేకమందికి ప్రభుత్వంలో భాగస్వామ్యం లభించింది. అటువంటి నిర్మాణాత్మక చర్యలలో భాగంగానే అంబేడ్కర్‌లాంటి వారికి సాహుమహారాజ్ సహాయ, సహకారాలు లభించాయి. కొల్హాపూర్ సంస్థానం మరాఠాల అధికారంలో ఉన్నప్పటికీ, మెజారిటీ ఉద్యోగాలు బ్రాహ్మణుల చేతుల్లోనే ఉండేవి. అప్పటికే మహారాష్ట్రలో పుణె పట్టణం కేంద్రంగా జ్యోతిబాపూలే నాయకత్వంలో సాగిన

కొత్త కోణం



సత్యశోధక సమాజ్ ఉద్యమం ఆనాటి సమాజం మీద తీవ్రమైన ప్రభావాన్ని కలుగజేసింది. అక్కడ మొదలైన సామాజిక పరివర్తన మైసూర్ సంస్థానంలో, మద్రాసు రెసిడెన్సీలో కూడా ప్రతిధ్వనించింది.

1919 నుంచి బాబాసాహెబ్ అంబేడ్కర్ సాగించిన పోరాటాన్ని దీని కొనసాగింపుగానే చూడాలి. రాజకీయ హక్కుల కోసం సౌత్‌బరో కమిటీ ముందు నినదిస్తే, భారతదేశంలో అమలు చేయాల్సిన సంస్కరణల గురించి సైమన్ కమిషన్‌కు వినిపించారు. భారతదేశానికి అవసరమైన ప్రభుత్వ విధానాలేవి అనే అంశాలపై 1930, 1931 సంవత్సరాల్లో జరిగిన రౌండ్ టేబుల్ కాన్ఫరెన్స్‌లలో అంటరాని కులాల హక్కుల కోసం అంబేడ్కర్ ఒంటరిపోరాటం చేశారు. అప్పటికే తిరుగులేని నాయకుడుగా ఉన్న మహాత్మాగాంధీని కూడా ఎదిరించి, అంటరాని కులాల హక్కుల కోసం పోరాడి విజయం సాధించారు. అయితే గాంధీ అంటరాని కులాలను ప్రత్యేక వర్గంగా చూడడానికి నిరాకరించారు. ప్రత్యేక ఓటింగ్ విధానం ద్వారా తమ అభ్యర్థులను తామే ఎన్నుకునే ఒక అవకాశాన్ని గాంధీ దెబ్బకొట్టారు. దానిపేరే పుణె ఒడంబడిక. దాని ద్వారా అంటరాని కులాలకు అంటరాని కులాల ప్రజలు మాత్రమే ఓటువేసే అవకాశం కోల్పోయి, అంటరాని కులాలకు అందరం ఓటు వేసే రిజర్వుడు నియోజకవర్గాల పద్ధతి అమలులోకి వచ్చింది.

ఆ తర్వాత 1946 నుంచి 1950 వరకు సాగిన రాజ్యాంగ సభలో అనేక పరిణామాలు జరిగాయి. ప్రాథమిక హక్కుల్లో పొందుపరిచిన అనేక అవకాశాలకు గాంధీకి అత్యంత సన్నిహితుడైన సర్దార్ పటేల్ మోకాలడ్డారు. 1950 వరకు ముస్లింలకు, క్రిస్టియన్లకు, ఎస్సీ, ఎస్టీ లకు రిజర్వేషన్లు ఉండేవి. పరిమిత ప్రయోజనంలోనైనా అవి కొనసాగాయి. అయితే భారత రాజ్యాంగంలో వాటిని కొనసాగించడానికి సర్దార్ పటేల్ ఒప్పుకోలేదు. అసలు రిజర్వేషన్ల విధానమే అవసరం లేదని మొండికేశారు. అంబేడ్కర్ దానిని ఒప్పుకోలేదు. తరతరాలుగా వివక్షకూ, అవమానాలకూ గురౌతోన్న ఎస్సీ, ఎస్టీలకు మాత్రం రిజర్వేషన్లు కల్పించారు. అంబేడ్కర్ దూరదృష్టితో తీసుకొచ్చిన ఆర్టికల్ 46 వల్ల స్వాతంత్ర్యానంతరం వెనుకబడిన కులాలకు రిజర్వేషన్లు కల్పించే అవకాశం వచ్చింది. ''సమాజంలోని బలహీన వర్గాలకు విద్య, ఆర్థికపరమైన అవకాశాలను మెరుగుపరచడానికి కృతనిశ్చయంతో ఉంటుంది. ప్రత్యేకించి ఎస్సీ, ఎస్టీల అభివృద్ధికి కృషి చేస్తుంది'' అనేది ఆర్టికల్ 46 ఉద్దేశ్యం. ఆ తర్వాతనే అనేక కమిటీలు, కమిషన్లను ఏర్పాటు చేశారు. చివరకు మండల్ కమిషన్ సిఫారసుల అమలు ద్వారా దేశంలోని వెనుకబడిన కులాలు విద్య, ఉద్యోగావకాశాలను పొందుతున్నారు. ఇప్పటికే భారత సుప్రీంకోర్టు ఆర్థిక ప్రాతిపదికన తీసుకొచ్చే రిజర్వేషన్ల విషయంలో తన వ్యతిరేకతను ప్రకటించింది. చరిత్రలో తరతరాలుగా అణచివేతకు, వివక్షకూ గురైన కులాలకు విద్య, ఉద్యోగ రంగాల్లో సమానావకాశాలు అందించేందుకే రిజర్వేషన్లు కల్పించారని తేల్చి చెప్పింది.

రిజర్వేషన్లను చాలామంది దానధర్మంగానూ, భిక్షగానూ భావిస్తున్నారు. కానీ భారత ప్రజాస్వామిక సూత్రంలో ప్రాతినిధ్యం కీలకమైనది. ఏ కులాలకైతే ప్రాతినిధ్యం లేదో, ఆయా కులాలకు ప్రత్యేక సౌకర్యాలు కల్పిస్తూ, విధానాలను రూపొందించాలి. కానీ నేడు దేశంలో అగ్రకులాల ప్రాతినిధ్యం అన్ని రంగాల్లో వారి జనాభాకు మించి ఉన్నది. భారత ప్రభుత్వ అధికార యంత్రాంగంలో కేడర్–1, కేడర్–2లలో అగ్రకులాల ఆధిపత్యం కొనసాగుతున్నది. కేవలం కేడర్–4లో మాత్రం ఇతర కులాలు, ముఖ్యంగా ఎస్సీ, ఎస్టీలు ఉన్నారు. కేడర్–4 పోస్టులు కేవలం అటెండర్లు, డ్రైవర్లు, స్వీపర్లు, స్కావెంజర్లు ఉంటారు. ఐఏఎస్, ఐపీఎస్‌లతో పాటు ఇతర ఉన్నతోద్యోగులలో అగ్రవర్ణాలు దాదాపు 50 నుంచి 60 శాతం ఉన్నారు. దేశంలో వారి జనాభా కేవలం 15 నుంచి 20 శాతానికి మించదు. కొన్ని రాష్ట్రాల్లో కేవలం పది శాతంగా కూడా వారు లేరు.

రిజర్వేషన్లకు ప్రాతిపదికగా ఉండే వివక్ష, అణచివేత, దోపిడీ అగ్రకులాలు ఎదుర్కోవడం లేదు. వారి పేదరికానికి వేరే ఎవ్వరూ కారణం కాదు. కానీ ఎస్సీ, ఎస్టీ, బీసీ, ఇతర మైనారిటీ వర్గాల పేదరికానికి, వెనుకబాటుతనానికీ కుల వివక్ష, అణచివేత ప్రధాన కారణాలు. నిజానికి ప్రభుత్వాలు ఎస్సీ, ఎస్టీ, ఓబీసీ వర్గాల అభ్యున్నతికి మరిన్ని చర్యలు తీసుకోవాల్సి ఉంది. ఇప్పటికే ఎస్సీ, ఎస్టీల రక్షణ కోసం ఉన్న చట్టాలు ఏవీ కూడా ఆశించిన స్థాయిలో అమలు జరగడం లేదు. మూడువేల ఏళ్ళుగా వివక్షకు, అణచివేతకు కారణమైన అగ్రకులాల ఆధిపత్యాన్ని కొత్తగా తెచ్చిన కోటా మరింత పటిష్ట పరుస్తుందన్నది నగ్న సత్యం. బీజేపీ ఈ దేశంలో అగ్రకులాల ఆధిపత్యం కొనసాగించాలనుకుంటోంది. తమ రాజకీయ అధికారాన్ని నిలబెట్టుకోవడానికే ఈ ప్రయత్నం చేస్తున్నట్టు కనిపిస్తున్నది. మిగతా పార్టీల నాయకత్వాలు కూడా అగ్రకులాల చేతుల్లో ఉన్నాయి. దానివల్ల ఏ పార్టీ కూడా ఈబీసీ రిజర్వేషన్లను వ్యతిరేకించలేదు.

అయితే అగ్రకులాల పేదలకు ఎటువంటి సంక్షేమ కార్యక్రమాలు చేపట్టకూడదని ఎవ్వరూ అనడం లేదు. చదువుల విషయంలో ఇప్పటికే వారికి స్కాలర్ షిప్స్ ఉన్నాయి. ఇంకా వాటిని అందరికీ అందేవిధంగా చర్యలు తీసుకోవచ్చు. ఒకవేళ ప్రభుత్వాలకు చిత్తశుద్ధి ఉంటే అన్ని స్థాయిల్లో అందరికీ ఉచిత విద్య కల్పించవచ్చు. అంతేకానీ చారిత్రక అవసరంగా వచ్చిన రిజర్వేషన్ల స్ఫూర్తిని దెబ్బతీసే కుట్రకు ఈచట్టం సాధనం కాకూడదు. ఎస్సీ, ఎస్టీ, బీసీలకు రిజర్వేషన్లు కల్పించడానికి రాజ్యాంగ ప్రాతిపదిక ఉంది. అదే సామాజిక అంతరాలూ, వివక్ష. అంతరాలను అధిగమించడం కేవలం కొన్ని వర్గాల అభివృద్ధికే కాదు, అది సామాజిక అభ్యున్నతికి అవసరం కూడా. అదే న్యాయం కూడా. కానీ ఈ రోజు బీజేపీ నాయకత్వంలోని ప్రభుత్వం ప్రతిపాదించిన అగ్రకులాల పేదలకు రిజర్వేషన్లు అనే అంశం రాజ్యాంగ స్ఫూర్తికీ, సామాజిక న్యాయానికీ, సామాజిక విలువలకూ విరుద్ధమైనది. వివక్షాపూరిత విష చరితకు ఇది నాంది కాబోతోంది.

వ్యాసకర్త సామాజిక విశ్లేషకులు । మొబైల్ : 81063 22077

సోషల్ నెట్ వర్కింగ్ వెబ్‌సైట్లు ఫేస్‌బుక్, ట్విట్టర్‌లలో సెలబ్రిటీల 'మనసులోని మాట'లు తాజాగా ఇలా...!



సోషల్ మీడియా

కత్తి



"మనం ఏ పరిస్థితుల్లో ఉన్నా, మన మెడపై సెక్షన్ 124 ఏ కత్తి వేళ్లాడుతూనే ఉందని 1929లో మహాత్మాగాంధీ పేర్కొన్నారు. సెక్షన్ 124ఏ ను తొలగించడానికి పెద్ద ఎత్తున ఆందోళన చేపట్టాలని కూడా ఆయన పిలుపునిచ్చారు. ఇప్పటికీ ఆ చట్టం కొనసాగడం అవమానకరం. వలసవాద కాలం నాటి ఆ చట్టాన్ని విద్యార్థి నాయకులపై ప్రయోగించడం బీజేపీ మూర్ఖత్వానికి నిదర్శనం"

– రామచంద్ర గుహ, చరిత్రకారుడు

ఫ్లాప్



"కొంతమందికి ఫ్లాప్ ఐడియాలు, ఫ్లాప్ స్క్రిప్టులు, ఫ్లాప్ పుస్తకాలు, సూపర్ ఫ్లాప్ ట్వీట్స్ చేయగలిగే అద్భుతమైన సామర్థ్యం ఉంటుంది. వాళ్లు చేసే విన్యాసాలు చూస్తుంటే వినుగొస్తోంది. ఇలాంటి వారంతా భక్తులే అని గుర్తించడానికి మనం ఆశ్చర్యపోనక్కర్లేదు"

– ప్రియాంక చతుర్వేది, కాంగ్రెస్ ప్రతినిధి


అవార్డు



"ఫిలిప్ కొట్లర్ ప్రెసిడెన్షియల్ అవార్డు ఏమిటి? అది ప్రధాన మంత్రికి ఎందుకు ఇచ్చారు? జ్యూరీ సభ్యులెవరు? అలాంటి బూటకమైన, గొప్పగా అనిపించే ఏదైనా గ్లోబల్ లీడర్‌షిప్ అంతర్జాతీయ అవార్డు ఒకటి నాకు కూడా కావాలి. వాటితో సమానమైన ఘనకార్యాలు సాధించినట్టు కూడా పేరు కావాలి"

– శోభా డే, రచయిత్రి

మార్పు



"ఏ కారణం లేకుండా మన జీవితాల్లోకి కష్టాలు రావు. కష్టాలు వచ్చాయి అంటే, మన జీవితంలో ఏదో మార్పు రావాల్సిన అవసరం ఉందని చెప్పడమే"

– అమితాబ్ బచ్చన్, బాలీవుడ్ హీరో


దాడి



"శబరిమల విషయంలో కేరళలోని ఎల్‌డీఎఫ్ ప్రభుత్వం వ్యవహరిస్తున్న తీరు సిగ్గుపడే విధంగా ఉందని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ వ్యాఖ్యానించటం తప్పుడు సంకేతాలను ఇస్తోంది. భారతీయ జనతా పార్టీ, రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్ అభిప్రాయాలకు విభిన్నమైన సుప్రీంకోర్టు ఇచ్చిన ఏ తీర్పునూ లెక్కచేయమనడం సబబు కాదు. ఆ తీర్పును అమలు చేయాలని కోరితే తమపై దాడి చేయడంగా భావించడం సరికాదు. రాజ్యాంగంపై ప్రమాణం చేసిన ప్రధాని ఆరెస్సెస్ ప్రచారకుడిలా మాట్లాడటం దారుణం"


– సీతారాం ఏచూరి, సీపీఎం నేత

ఓ సినీమాలాంటి కథ



గొల్లపూడి మారుతీరావు

జీవన కాలమ్



ఇలాంటి కథని రాస్తే చాలామంది నవ్వుతారు. అలాంటి కథలు రాసి ఒప్పించిన ఇద్దరు మహానుభావులు నాకు గుర్తొస్తారు –థామస్ హార్డీ (ది మేయర్ ఆఫ్ కాస్టర్ బ్రిడ్జ్), ఆంటన్ చెఖోవ్. అయినా ఇది విచిత్రమైన, అనూహ్యమైన కథ. నిజానికి కన్నూరు ప్రాంతంలో జరిగిన ఈ కథని వాళ్ల మేనకోడలు శాంతా కావుంబాయి నవలని రాసింది. అది 1946 ప్రాంతం. బ్రిటిష్ పాలనలో కేరళలో కన్నూరు ప్రాంతంలో భూస్వాముల ఆగడాలను వ్యతిరేకిస్తూ ముమ్మరంగా తిరుగుబాటు జరుగుతున్న సామాజిక–రాజకీయ నేపథ్య విప్లవాన్ని ప్రాతిపదికగా తీసుకుని ఈ కథని అతని మేనకోడలు శ్రీమతి శాంత నవలని రాసింది. ఆ తిరుగుబాటు నేపథ్యంలో జరిగిన ఓ ఉపకథ ఇది.

నారాయణన్ పెద్ద విప్లకారుడేం కాదు. కనీసం తన తండ్రిలాగా శాశ్వతమైన కీర్తిని ఆర్జించిన అమరవీరుడూ కాదు. ఇ.కె. నారాయణన్ నంబియార్ 30 ఏళ్ల వాడు. తండ్రితో పాటు ఈ తిరుగుబాటు ఉద్యమంలోకి దూకాడు ఆవేశంగా. అప్పుడే అతనికి పెళ్లయింది. భార్య శారద దూరపుబంధువుల అమ్మాయి. అప్పటికి భార్య శారద 13 ఏళ్ల పిల్ల. నిజానికి వాళ్లిద్దరూ ఆనాటికి నోరిప్పి కబుర్లు చెప్పుకోలేదు– చెప్పుకోవడం తెలీదు కనుక. పెళ్లయిన కొన్ని నెలలకే ఇద్దరూ విడిపోయారు. అక్కడి రైతులు బ్రిటిష్ యాజమాన్యం, భూకామందులను ఎదిరిస్తూ జరిగే ఈ తిరుగుబాటులో చేతులు కలిపారు. డిసెంబర్ 29న నంబియార్ తన తండ్రి రామన్ నంబియార్‌తో కలిసి తాలియన్‌కి వెళ్లాడు. దూరపు కొండల సమీపంలో ఉన్న కారాకట్టిడం నాయనార్ అనే భూస్వామి మీద తిరుగుబాటుకి బయలుదేరిన వందలాది మందితో వీరూ ఉన్నారు. భూస్వామి ఆగడాలను తుదముట్టించి, అతని ఆట కట్టించాలని వారి ప్లాను. కానీ వీళ్ల ప్రయత్నం కార్యరూపం దాల్చే లోగా బ్రిటిష్‌వారి మలబార్ స్పెషల్ పోలీసు బలగం వీరిని చుట్టుముట్టింది. ఆ తిరుగుబాటుదారుల గుంపుమీద బుల్లెట్ల వర్షం కురిపించింది. అయిదుగురు అక్కడికక్కడే చనిపోయారు. ఎందరో గాయపడ్డారు. నంబియార్ తండ్రితో తప్పించుకుని అజ్ఞాతంలోకి మాయమయ్యాడు.

కానీ, పోలీసులు అతని ఇంటిమీద దాడిచేసి, స్త్రీలను హింసించి వారి ఉనికి కూపీ లాగారు. శారద అభం శుభం తెలియని పిల్ల కనుక ఆమెని వదిలిపెట్టారు. ఈ సంఘటన తర్వాత కుటుంబం ఆమెని పుట్టింటికి పంపించేసింది. రెండు నెలలు పోలీసు ఆ కుటుంబాన్ని రాసి రంపానబెట్టి, ఈ యజమానుల ఆచూకీ పట్టుకుని ఇద్దరినీ అరెస్టు చేసి జైల్లో పెట్టారు. సంవత్సరాలు గడిచాక ఈ ఖైదీలను అధికారులు కన్నూరు సెంట్రల్ జైలు నుంచి వియ్యూరు అటు తర్వాత సేలం జైళ్లకు బదిలీ చేశారు.

1950 ఫిబ్రవరి 11న రామా నంబియార్ జైల్లోనే జరిగిన కాల్పుల్లో తుపాకీ గుండుకి మరణించాడు. కొడుకు 16 సార్లు ఈ కాల్పులకు గురి అయ్యాడు. అయినా బతికాడు. చచ్చిపోయాడని అంతా నిర్ధారించుకున్నారు. కానీ శారదకేమో అతను బతికే ఉంటాడని ఓ నమ్మకం. సంవత్సరాలు తిరిగిపోతున్నాయి. బంధువులు ఆమెకి బలవంతంగా మరో పెళ్లి చేశారు. మరో ఎనిమిదేళ్లకు నారాయణన్‌ని విడుదల చేశారు. ఎక్కడా పెళ్లాం ఆచూకీ లేదు. అతనూ మరో పెళ్లి చేసుకున్నాడు.

అయితే శారద ఎక్కడో ఒకచోట బతికే ఉన్నదని అతని ఊహ. సంవత్సరాల తర్వాత శారదకు కొడుకు పుట్టాడు. పేరు భగవాన్ పరాస్సినిక్కడవు. ఈ కుర్రాడు తన తల్లి ఎప్పుడో తన చిన్నతనంలో జరిగిన సంఘటనల గురించి తల్చుకోవడం విన్నాడు. ఈ మేనకోడలు– అంటే నవలా రచయిత్రి శాంత ఈ కుర్రాడిని కలిసింది. నారాయణన్ గురించి చెప్పింది. వాళ్లిద్దరినీ ఒకసారి కలపాలని భగవాన్ అనుకున్నాడు. ('లవకుశ'లాగ ఉన్నదా) ఎన్నాళ్ల తర్వాత? 72 సంవత్సరాల తర్వాత. ఇప్పుడు నారాయణన్ తొంభయ్యో పడిలో ఉన్నాడు. శారద దాదాపు డెబ్బయ్యోపడి. భగవాన్ ఇంట్లో వారిద్దరూ కలిశారు. తమ స్వాధీనంలో లేని కారణాలకి వారిద్దరూ జీవితాల్లో దూరమయ్యారు. వైవాహిక జీవితాలూ అలాగే సాగాయి. అతని నిస్సహాయత ఆమెకి తెలుసు. ఆమె గురించి అతను జైల్లో అప్పుడప్పుడూ తలచుకుని ఆమెకి జరిగిన అన్యాయానికి బాధపడ్డాడేమో తెలీదు. అయితే ఒకరిమీద ఒకరికి దురభిప్రాయాలు లేవు. ఇద్దరూ జీవితం చేతుల్లో పావులు. వారి సమాగమం మొన్న డిసెంబర్ 26న.


72 సంవత్సరాల తర్వాత దూరమైన ఇద్దరు– ఆనాటి భార్యాభర్తలు ఏం మాట్లాడుకుంటారు? ఇప్పటి ఆమె కొడుకుకి నారాయణన్ ఏ విధంగా కృతజ్ఞత చెప్పుకుంటాడు? మేనకోడలు శాంత ఇప్పుడు మరో కొత్త నవలని రాయాలేమో?!

రంగస్థలానికి 'మొదలి' వీడ్కోలు

నాటకాన్ని శ్వాసిస్తూ, నాటకం ఔన్నత్యాన్ని స్వప్నిస్తూ ఆ రంగానికి ఏడుపదుల కాలాన్ని అంకితం చేసిన మహనీయుడు ఆచార్య మొదలి నాగభూషణశర్మ. కాలేజి రోజుల్లో కన్యాశుల్కంలో మధురవాణి వేషంతో నటుడిగా నాటక కళాసేవ ఆరంభించి, నాటక దర్శకుడిగా, రచయితగా, అధ్యాపకుడిగా, పరిశోధకుడిగా నాటకానికి బహుముఖీన సేవలందించారు. తెలుగు నాటకాలే కాదు, విదేశాల్లోని ఉత్తమ నాటకాలను అద్భుత ప్రయోగాలతో ప్రదర్శించి, తెలుగు ప్రజలకు నాటకవిందు చేశారు. నాటక, గాయక ప్రముఖులపై పుస్తకాలను తీసుకొచ్చారు. తోలుబొమ్మలాటను జపనీయుల కళ్లకు కట్టారు. తెలుగు డ్రామా అండ్ థియేటర్ చరిత్రను ఇంగ్లిష్, తెలుగులో రాయాలనే తపనతో కృషిచేస్తున్న తరుణంలో ఆయన కన్నుమూయటం తెలుగు నాటకానికి తీరనిలోటు.

ఆచార్య మొదలి నాగభూషణశర్మ (84) పూర్వీకులది గుంటూరు జిల్లాలోని బ్రాహ్మణకోడూరు. తండ్రి సుబ్రహ్మణ్యశర్మ ఉద్యోగరీత్యా ఇదే జిల్లాలోని రేపల్లె దగ్గరగల ధూళిపూడిలో స్థిరపడ్డారు. అక్కడే 1935 జూలై 24న నాగభూషణశర్మ జన్మించారు. పాఠశాల దశనుంచే ఆయనకు రంగస్థలంపై అనుబంధం ఏర్పడింది. విజయవాడ, బందరులో కాలేజి చదివే రోజుల్లో ఆ బంధం మరింత పెరిగింది. 'మధుర వాణి'గా 50 ప్రదర్శనల్లో నటించారు. 'భారతి'లో ప్రచురితమైన తొలి నాటకం 'అన్వేషణ' రాసిందీ ఆ రోజుల్లోనే. హైదరాబాద్‌లో ఎంఏ, పీహెచ్‌డీ తర్వాత ఉస్మానియా విశ్వవిద్యాలయంలో ఇంగ్లిష్ అధ్యాపకుడిగా చేరారు. కొంతకాలం తర్వాత అమెరికాలోని ఇల్లినాయ్ యూనివర్సిటీలో ఎంఎఫ్ఏ (థియేటర్) చేశారు. తిరిగి రాగానే ఉస్మానియా యూనివర్సిటీలో ప్రారంభించిన థియేటర్ ఆఫ్ ఆర్ట్స్ శాఖకు తొలి అధిపతిగా మొదలిని నియమించారు.

చాట్ల శ్రీరాములు, రాజా రామదాస్ వంటి నిష్ణాతులను అధ్యాపకులుగా చేర్చుకుని, నాటకకళ వికాసానికి నాగభూషణ శర్మ శ్రద్ధపెట్టారు. పలు నాటకాలనే కాదు, ఆచార్య ఆత్రేయ నాటకోత్సవాన్ని విజయవంతంగా ప్రదర్శించారు. నాటకరంగ ప్రముఖులు డీఎస్ఎన్ మూర్తి, తనికెళ్ల భరణి, తల్లావఝుల సుందరం, భిక్షు, భాస్కర్, హావల్కర్, విద్యాసాగర్, జీఎస్ ప్రసాద్‌రెడ్డి వంటి ప్రముఖులు ఉస్మానియా థియేటర్ ఆర్ట్స్ శాఖ నుంచి పట్టాలు తీసుకున్నవారే. 1988లో సెంట్రల్ యూనివర్సిటీలో సరోజినీనాయుడు ఇనిస్టిట్యూట్ ఆఫ్ పెర్ఫార్మింగ్ ఆర్ట్స్ ప్రారంభమైనపుడు శర్మ తొలి డీన్‌గా నియమితులయ్యారు. ఆ స్కూలును కళల వికాసానికి అనువైనదిగా రూపుదిద్దారు శర్మ.



నివాళి

మరోవైపు నాటకరచన, దర్శకత్వం బాధ్యతలను అపూర్వంగా నిర్వహించారు. తెలుగులో 60, 28 ఇంగ్లిష్ నాటకాలకు దర్శకత్వం వహించారు. విదేశీ భాషలకు చెందిన అనేక కళాఖండాలను తెలుగులోకి అనువదించి, ప్రదర్శింపజేశారు. వీటిలో 'రాజా ఈడిపస్', 'ది విజిట్', 'మ్యాడ్ విమెన్ ఆఫ్ చల్లియట్', 'హయవదన', 'మృచ్ఛకటిక' వంటి నాటకాలు ప్రముఖమైనవి. వీటిలోని ప్రయోగాలు అనితరసాధ్యం. హైదరాబాద్‌లోని రసరంజని సంస్థకు అనేక నాటకాలను ప్రదర్శించారు. వీటిలో టంగుటూరి ప్రకాశం పంతులు ఆత్మకథను 'ప్రజా నాయకుడు ప్రకాశం' నాటకంగా, తన దర్శకత్వంలో రాష్ట్రమంతా ప్రదర్శించారు. హెన్రిక్ ఇబ్సెన్ నాటకం 'డాల్స్ హౌస్' తెలుగులో 'బొమ్మరిల్లు'గా, బెర్టొల్ట్ బ్రెచెట్ ఇంగ్లిష్ నాటకం 'తెల్లసున్నా'గా శామ్యూల్ బకెట్ రచన 'దేవుడయ్యి వస్తాడట' పేరుతోనూ తన దర్శకత్వంలోనే ప్రదర్శనలకు సిద్ధంగా ఉంచారు.

సాహిత్యం, కళలు, జానపదం, నాటకం, అనువాదాలు, విమర్శలు... ఇలా అన్ని ప్రక్రియల్లోనూ 14 పుస్తకాలు రాశారు. 1975లో రాష్ట్ర సంగీత నాటక అకాడమీ జానపద కళోత్సవాల కోసమని నటరాజ రామకృష్ణతో కలిసి 300 గ్రామాలు తిరిగి 750 మంది కళాకారులను ఆ ఉత్సవంలో పాల్గొనేలా చేశారు. 64 కళారూపాలను 'ఫోక్ పెర్ఫార్మింగ్ ఆర్ట్స్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్' పుస్తకంగా తీసుకొచ్చారు. తోలుబొమ్మలాట బృందాన్ని జపాన్ తీసుకెళ్లి 15 పట్టణాల్లో ప్రదర్శింపజేశారు. నాటకరంగ సేవలకుగాను నాగభూషణ శర్మ కేంద్ర సంగీత నాటక అకాడమీ పురస్కారాన్ని, రాష్ట్ర ప్రభుత్వ ఎన్టీఆర్ రంగస్థల పురస్కారాన్ని, గతేడాది 'కళారత్న' గౌరవాన్ని స్వీకరించారు. ఈనెల 6న తెనాలిలో అజో–విభొ– కందాళం ఫౌండేషన్ వారి ప్రతిభా వైజయంతి జీవితకాల సాధన పురస్కారాన్ని అందుకున్నారు.

(తెనాలిలో మంగళవారం రాత్రి కన్నుమూసిన 'మొదలి'కి నివాళి)

బి.ఎల్.నారాయణ, సాక్షి, తెనాలి
మొబైల్ : 95509 30789



ఇక్కడే చదువు, ఇక్కడే నిద్ర : నేపాల్‌లోని 'నెలసరి పాక'లో ఓ బాలిక

చంపావత్

ప్రశ్నల భవంతి

ఫైనాన్స్ కమిషన్ కేటాయింపులతో కట్టిన భవనాన్ని బహిష్టు కేంద్రంగా మార్చారంటే.. ప్రభుత్వం ఏమైనా అంటుందేమోనన్న భయం కన్నా, నెలసరి వచ్చిన మహిళలు ఎవర్నైనా అంటుకుంటారేమోనన్న భయమే చంపావత్ జిల్లా గ్రామస్తులలో, గ్రామ పంచాయతీల్లో వ్యాపించి ఉందని అనుకోవలసి వస్తోంది!

● మాధవ్ శింగరాజు

'ఫైనాన్స్ కమిషన్' అనే మాట ఎంచేతో భయం గొల్పేలా ఉంటుంది. ఇంతకన్నా పోలీస్ కమిషన్ కొంచెం స్నేహపూర్వకంగా ఉంటుందేమో. ఉంటుందేమో కానీ, భారత రాజ్యాంగంలో పోలీస్ కమిషన్ అనేది లేదు. ఉంటే అది కూడా భయమో, అభయమో గొల్పుతూ ఉండేది ఇప్పటికి.

ప్రస్తుతం దేశాన్ని నడిపిస్తున్నది పద్నాల్గవ ఫైనాన్స్ కమిషన్. కమిషన్ ఐదేళ్ల కాలపరిమితిలో ఇంకా రెండేళ్లు మిగిలే ఉన్నాయి. 2020 వరకు. అయినప్పటికీ రెండేళ్ల క్రితమే 2017లో పదిహేనవ ఫైనాన్స్ కమిషన్ కూడా రెడీ అయిపోయింది. 2020 నుంచి 25 వరకు. ఆ కమిషన్‌కు ఛైర్మన్ ఎన్.కె.సింగ్.

పద్నాల్గవ ఫైనాన్స్ కమిషన్ తరఫున వచ్చిన కొంతమంది అధికారులు ఇప్పుడు ఉత్తరాఖండ్ లోని చంపావత్ జిల్లాలో ఫైళ్లు పట్టుకుని తిరుగుతున్నారు! మొదట వాళ్లు ఆ జిల్లాలోని ఘర్‌చమ్ గ్రామానికి వెళ్లారు. వాళ్లకేదో ఇన్ఫర్మేషన్



ఇండియా-నేపాల్ సరిహద్దు గ్రామంలో..!

అందింది.. పంచాయతీ నిధులతో అక్కడ కొత్తగా కట్టిన ఒక భవంతి లెక్కల్లో అవకతవకలు జరిగాయని. ఆ నిధులు ఫైనాన్స్ కమిషన్ కేటాయించిన నిధులే. పని సక్రమంగానే జరిగింది. అయితే ఆ భవంతిని వినియోగిస్తున్న తీరే సక్రమంగా లేదు! లేకపోవడమే కాదు, పౌరులకు రాజ్యాంగం కల్పించిన ప్రాథమిక హక్కులకు భంగం కలిగించేదిగా కూడా ఉంది. భవంతి లోపలంతా మహిళలు ఉన్నారు! వాళ్లేమీ డ్వాక్రా మహిళలు, స్వయం సహాయ బృందాల మహిళలు కాదు. రుతుక్రమంలో ఉన్న మహిళలు! కేంద్ర నిధులతో పంచాయతీ కట్టించిన భవనంలో వీళ్లు ఉండడం ఏంటి? ఇది రెండో ప్రశ్న. ఊళ్లో రుతుక్రమంలో ఉన్న మహిళలందర్నీ ఇలా ఊరికి దూరంగా ఉంచడం ఏమిటి? ఇది మూడో ప్రశ్న. మరి మొదటి ప్రశ్న ఏమిటి? రుతుక్రమంలో ఉన్న మహిళను అసలు ఇంటి బయట ఉంచడం ఏమిటి? ప్రశ్నల క్రమం ఎలా ఉన్నా మహిళల్ని ఇలా ఇంటికి దూరంగా, ఊరికి దూరంగా, రాజ్యాంగ హక్కుకు దూరంగా ఉంచడం సక్రమం కాదు.

భవన నిర్మాణంలో నిధుల దుర్వినియోగం జరిగిందని గ్రామస్తులు కొందరు జిల్లా మేజిస్ట్రేట్ రణ్‌బీర్ చౌహాన్ దృష్టికి తెచ్చినప్పుడు, ఆ భవనాన్ని 'బహిష్టు కేంద్రం'లా వినియోగిస్తున్నట్లు బయటపడింది. చౌహాన్ నివ్వెరపోయారు. జిల్లాలో ఇంకా ఎక్కడైనా ఇలాంటి 'పంచాయతీ నిధుల బహిష్టు కేంద్రాలు' ఉన్నాయేమో చూడాలని అధికారులను ఆదేశించారు. ఉన్నదీ లేనిదీ ఒకటీ రెండు రోజుల్లో తెలుస్తుంది. అయితే ఉండేందుకే అవకాశం ఉందనిపిస్తోంది.

చంపావత్ జిల్లా.. భారత్-నేపాల్ సరిహద్దుల్లో ఉంది. నేపాల్ గ్రామాల్లో 'నెలసరి పాక'ల (పీరియడ్ హట్స్) ఆచారం ఉంది. రుతుక్రమం వచ్చిన మహిళల్ని ఆ ఐదు రోజులూ వాటిలో ఉంచుతారు. ఆ అనాగరిక ఆచారానికి సరిహద్దుకు ఇవతల ఉన్న మన గ్రామాలు కూడా ప్రభావితం అవుతున్నాయనేందుకు నిదర్శనమే ఇప్పుడు బయట పడిన ఘర్‌చమ్ గ్రామంలోని బహిష్టు కేంద్రం. ఇటీవలే నేపాల్‌లోని బజురా జిల్లాలోని ఒక గ్రామంలో అంబా బొహారా (35), పన్నెండు, తొమ్మిదేళ్ల వయసు గల ఆమె కొడుకులిద్దరు నిద్రిస్తున్నప్పుడు నెలసరి పాకకు నిప్పంటుకుని ఊపిరి ఆడక ఆ ముగ్గురూ చనిపోయినట్లు వార్తలు వచ్చాయి. గత నవంబర్‌లో వచ్చిన గజ తుఫాన్‌లో తమిళనాడులో విజయలక్ష్మి అనే పన్నెండేళ్ల బాలిక నెలసరి పాకలో ఉన్నప్పుడు ఈదురుగాలులకు కొబ్బరి చెట్టు కూలిపడి చనిపోయింది. ఆమె తల్లి గాయపడింది. ఇంకా ఇలాంటి వార్తలు మిగతా రాష్ట్రాల నుంచీ తరచూ వినిపిస్తూనే ఉన్నాయి కనుక ఆడపిల్లల విషయంలో నేపాలైనా, భారత్ అయినా, ఇంకో దేశమైనా ఒకటే అనుకోవాలి.

ఇంకొకటి కూడా అనుకోవాలి. ఫైనాన్స్ కమిషన్ కేటాయింపులతో కట్టిన భవనాన్ని బహిష్టు కేంద్రంగా మార్చారంటే.. ప్రభుత్వం ఏమైనా అంటుందేమోనన్న భయం కన్నా, నెలసరి వచ్చిన మహిళలు ఎవర్నైనా అంటుకుంటారేమోనన్న భయమే గ్రామస్తులలో, గ్రామ పంచాయతీల్లో వ్యాపించి ఉందని అనుకోవాలి. చంపావత్ జిల్లా మేజిస్ట్రేట్‌కు ఈ సంగతి తెలిసినప్పుడు మొదట ఆయన అన్నమాట.. 'ఇదేంటీ!' అని. రెండో మాట.. 'అలా ఉంచేశారా, ప్యాడ్స్ ఏమైనా ఇచ్చారా?' అని. మంచి మాట. అరవై ఏడేళ్లుగా ఫైనాన్స్ కమిషన్ దేశాభివృద్ధి కోసం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల మధ్య డబ్బు లెక్కలు చూస్తోంది. మహిళా సంక్షేమం అన్నది కమిషన్ పరిధిలోకి రాని విషయమే అయినా, అభివృద్ధిలో భాగంగా మరుగుదొడ్ల నిర్మాణానికి నిధులు కేటాయించిన విధంగానే, స్త్రీల జీవితాలను దుర్భరం చేసే దురాచారాలను పాటిస్తున్న గ్రామాలకు నిధులను తగ్గిస్తాం అన్న భయం పెట్టొచ్చు. డబ్బు ఇచ్చే కాదు, డబ్బును ఇవ్వకుండా కూడా అభివృద్ధిని సాధించవచ్చు.. స్త్రీ సంక్షేమం కూడా దేశాభివృద్ధిలో ఒక భాగం అనుకుంటే.



ప్రతీకాత్మక చిత్రం

కొండ ఎక్కాలంటే ఏం చెయ్యాలి?
దేవుణ్ని మనసులో పెట్టుకోవాలి.
అప్పుడు మెట్లు కనిపించవు.
దీవెనలే కనిపిస్తాయి.
జీవితంలో పిల్లలకు కష్టాలు..
కష్టమైన మెట్లు.
ప్రతిసారీ తోడుగా మనం ఉండలేం.
కానీ..
లక్ష్యసాధనలో ఆనందాన్ని
వాళ్లకు చూపగలిగితే
పరీక్షలు కనబడవు.
మంచి మార్కులే కనిపిస్తాయి.

మీ అమ్మాయికి మంచిమార్కులు వస్తాయి!

సైకియాట్రిస్ట్ దగ్గర ఆ అమ్మాయి కూచుని ఉంది. పదహారేళ్లు ఉంటాయి. తోడుగా అమ్మా నాన్నా ఉన్నారు.

'ఏంటి ప్రాబ్లమ్?' అడిగాడు సైకియాట్రిస్ట్.

'బాగా చదువుతుంది డాక్టర్. ఎమ్‌సెట్‌లో మెడిసిన్ ర్యాంక్ కొట్టాలని లక్ష్యం. కాలేజీలో స్లిప్ టెస్ట్‌లు, వీక్లీ టెస్టుల్లో తనే ఫస్ట్ ఉంటుంది. తనకో మంచి ఫ్రెండ్ కూడా ఉంది. ఆ అమ్మాయి కూడా బ్రైట్ స్టూడెంటే. కాని ఈ మధ్య ఒకటి రెండు టెస్టుల్లో ర్యాంకులు రాలేదు. దాంతో విపరీతంగా ఏడ్వడం మొదలెట్టింది. కాన్ఫిడెన్స్ పోయింది. అది పక్కన పెట్టండి. ర్యాంకులు తనఫ్రెండ్‌కు వచ్చాయట. పాపం ఆ అమ్మాయిని శత్రువుగా చూస్తోంది. దూరం పెడుతోంది. అంతా గందరగోళంగా తయారైంది బిహేవియర్. మీరే హెల్ప్ చేయాలి'

సైకియాట్రిస్ట్ ఆ అమ్మాయివైపు చూశాడు.

'ఏమ్మా... ఏంటి నీ సమస్య'

ఆ అమ్మాయి వెక్కివెక్కి ఏడ్వడం మొదలెట్టింది.

'నా పని అయిపోయింది డాక్టర్. ఇక నాకు ర్యాంకులు రావు. నేను మెడిసిన్ చేయనట్టే. రెండు మూడు టెస్టుల్లో నాకు మంచి మార్కులు రాలేదంటే ఇక ఎప్పటికీ రావనేగా అర్థం'...

సైకియాట్రిస్ట్ 'ఏం పిల్లలో' అన్నట్టుగా నిశ్వాస విడిచాడు.

'సరే అయితే నీకు ఇంకో అమ్మాయి కథ చెబుతా. నా పేషెంటే. అది విని నీకేం అనిపించిందో చెప్పు' అన్నాడు.

సైకియాట్రిస్ట్ చెప్పడం మొదలుపెట్టాడు.

● ● ●

ఇది నీలవేణి కథ.

నీలవేణిది విజయవాడ దగ్గర చిన్న పల్లెటూరు. చిన్నప్పుడు అందరిలాగే ఆడుతూ పాడుతూ ఉండేది. అమ్మా నాన్నలతో హాయిగా ఉండేది. కాని ఆ అమ్మాయికి ఎనిమిదేళ్ల వయసు వచ్చినప్పుడు సడన్‌గా ఒక ప్రమాదంలో అమ్మా నాన్నా చనిపోయారు. చిన్న పిల్ల. ఏమీ తెలియని వయసు. లాలించే అమ్మ ఆడించే నాన్న ఇక కనపడరు అనంటే ఆ వయసులో ఎంత భయంగా ఉంటుంది. ఎంత భీతిల్లేలా ఉంటుంది. కాని నీలవేణి అంత దుఃఖాన్ని తట్టుకొని నిలబడింది. అమ్మా నాన్నలు లేకపోయినా అమ్మమ్మ, తాతయ్య ఉన్నారనుకుంది. అమ్మమ్మ, తాతయ్యలు కూడా ఆ పాపను అంతే ప్రేమగా చూసుకున్నారు. నీలవేణికి చదువు పెద్దగా రాలేదు. కాని నీలవేణికి జీవితంలో ఏదైనా సాధించాలని పట్టుదల. చదువు రాలేదని ఆ అమ్మాయి కుంగిపోలేదు. నిరాశ పడలేదు. ఆ అమ్మాయిది గట్టి వొళ్లు. చరుగ్గా ఉంటుంది. అందుకని ఆటల్లోకి వెళ్లింది. లాంగ్‌జంప్ తన ఫేవరెట్ గేమ్. పల్లెటూరి స్కూల్లో లాంగ్‌జంప్‌లో రాణిస్తున్న నీలవేణిని హైస్కూల్లో ఒకరిద్దరు టీచర్లు ఎంకరేజ్ చేశారు. జిల్లాస్థాయి ప్లేయర్ అయ్యింది. ఊళ్లో గుర్తింపు పొందింది. అందరూ మెచ్చుకునేవారు.

● ● ●

'చూశావా? నీలవేణి ఎక్కడా కుంగిపోకుండా ఎలా సెకండ్ చాన్స్ తీసుకొని పైకి వచ్చిందో' అన్నాడు సైకియాట్రిస్ట్.

ర్యాంకు రాని అమ్మాయి తల ఊపింది.

> **ఇప్పుడు చెప్పు. నీ సమస్య ఒక సమస్యా. నీ పని అయిపోయినట్టేనా? నీలవేణి లాంటి వాళ్లను చూసి మనం ఎప్పుడూ పోరాడుతూ ఉండాలని సాటి స్నేహితులను వదిలిపెట్టకుండా ముందుకు వెళ్లాలని అనిపించడం లేదా' అన్నాడు సైకియాట్రిస్ట్.**

'కథ ఇంకా అయిపోలేదు' అన్నాడు సైకియాట్రిస్ట్.

● ● ●

నీలవేణి కథ కొనసాగింపు.

నీలవేణి ఆ ఊళ్లోనే ఉన్న జూనియర్‌కాలేజీలో చేరింది. అలాంటి కాలేజీల్లో చదువు సరిగ్గా రాకపోయినా ఆటల్లో రాణించే మగపిల్లలు ఉంటారు. అలాంటి అబ్బాయే రాజు. అతడు లాంగ్‌జంప్ కోసం వచ్చే నీలవేణిలోని టాలెంట్‌ను గమనించాడు. అదే కాలేజ్‌లో ఉన్న ఫిజికల్ డైరెక్టర్‌తో కలిసి నీలవేణిని ఎంకరేజ్ చేయడం మొదలెట్టాడు. లాంగ్‌జంప్‌తో పాటు హైజంప్, పోల్‌జంప్, రన్నింగ్... అన్నింటిలోనూ నీలవేణి పార్టిసిపేట్ చేసేలా చేశాడు. నీలవేణి ఇప్పుడు స్టేట్‌లెవల్ అడపాదడపా నేషనల్ లెవల్ మెడల్స్ సాధించడం మొదలెట్టింది. ఇక భవిష్యత్తంతా నీలవేణిదే అనిపించే సమయం. సరిగ్గా ఆ సమయంలో ఊహించని సంఘటన. విజయవాడలో ఒక స్పోర్ట్స్ మీట్‌కు హాజరయ్యి తిరిగి ఊరికి వస్తుండగా రాజు, నీలవేణి ప్రయాణిస్తున్న షేర్ ఆటోను వెనుక నుంచి లారీ గుద్దింది. రాజు ఎడమ వైపున పొదల్లో పడగా నీలవేణి కుడివైపు రోడ్డు మధ్యలో పడింది. అప్పుడే వేగంగా వస్తున్న కారు ఆ అమ్మాయి కాళ్లను తొక్కేసింది.

● ● ●

వింటున్న అమ్మాయి ఉలిక్కి పడి చూసింది.

సైకియాట్రిస్ట్ ఆ అమ్మాయి వైపు చూస్తూ నీలవేణి కథ కొనసాగించాడు.

● ● ●

ఏ కాళ్లతోనైతే నీలవేణి ఇంత గుర్తింపు తెచ్చుకుందో ఏ కాళ్లతోనైతే తన భవిష్యత్తును నిర్మించుకుందో ఆ కాళ్లు తీసేయక తప్పదు అని డాక్టర్లు నిర్ణయించి నీలవేణి స్పృహలో లేని సమయంలో కాళ్లు తీసేశారు. స్పృహలోకి వచ్చాక పేషెంట్ షాక్‌లోకి వెళ్లకుండా బ్యాండేజీలతోనే కృత్రిమ రూపాన్ని చుట్టి కాళ్లు ఉన్నాయన్న భ్రాంతి సృష్టించారు. ఆరువారాల వరకు నీలవేణికి తనకు కాళ్లు లేవన్న సంగతే తెలియదు. ఒకరోజు తెలిసింది. భూమి ఆకాశాలు చీకటితో నిండిపోయాయన్న భావన వచ్చింది. అలాంటి స్థితి వస్తే ఎవరైనా కుంగిపోతారు. నీలవేణి కూడా కుంగిపోయింది. కాని ఆ ప్రమాదం కంటే పెద్ద దెబ్బ రాజు తీశాడు. అంతవరకూ పలకరించే కుర్రాడు, అంతవరకూ తోడు నిలుస్తాడనుకున్న స్నేహితుడు తప్పించుకు తిరగడం ప్రారంభించాడు. ఇటు ఆ దెబ్బ అటు ఈ దెబ్బ... నీలవేణి తట్టుకొని నిలబడగలదా?

కాని నిలబడింది. జీవితం అంటే అనూహ్యంగా ఉంటుందని, కాని మనం జీవితానికి లొంగ కుండా ప్రయత్నాన్ని కొనసాగిస్తూ ఉండాలని నమ్మింది. అందుకోసం ఆత్మస్థయిర్యం కోసం సైకియాట్రిస్ట్ దగ్గర కౌన్సిలింగ్ తీసుకుంది.

నూరేళ్ల జీవితంలో ఇవాళ్టి ఘటనలు, రేపటి ఘటనలే మొత్తం జీవితం కాబోవని ఎన్నో అవకాశాలు ఊహించని మలుపులు మున్ముందు ప్రతి ఒక్కరికీ ఎప్పుడూ ఉంటాయని సైకియాట్రిస్ట్ చెప్పిన మాటలను మనసులోకి తీసుకుంది.

ఆమె గురించి తెలిసిన వాళ్లందరూ ఆమెకు సాయం చేశారు. విదేశాల నుంచి కృత్రిమ కాళ్లు తెప్పించారు. ఆటల్లో పాల్గొనే వీలున్న ఆ కృత్రిమకాళ్లతో నీలవేణి మళ్లీ ప్రాక్టీసు మొదలెట్టింది. మొదట్లో కొంచెం కష్టమైంది. ఆ తర్వాత వీలైంది. నీలవేణి క్షణం కూడా ఆలస్యం చేయకుండా నిపుణుల పర్యవేక్షణలో తిరిగి ప్రాక్టీసు మొదలెట్టింది.

కాళ్లు బాగుంటే ఆమెకు ఒలింపిక్స్‌లో పాల్గొనాలనే కోరిక ఉండేది.

కాళ్లు పోయాక కూడా ఒలింపిక్స్‌లో పాల్గొనగలిగింది. కాకపోతే పారా ఒలింపిక్స్‌లో. ఆరు మెడల్స్ వచ్చాయి కూడా.

● ● ●

సైకియాట్రిస్ట్ చెప్పడం ఆపి తన సెల్‌ఫోన్‌లో నుంచి నీలవేణి ఫొటో చూపించాడు. మెడలో మెడల్స్‌తో నవ్వుతూ ఉన్న నీలవేణి.

'కథ ఇంకా అయిపోలేదు. నీలవేణిని విడిచిపెట్టి వెళ్లిన రాజు తిరిగి వచ్చాడు. క్షమించమని కోరుకున్నాడు. ఇక ఎప్పటికీ నీలవేణి తోడు విడువనని చెప్పాడు. సాధారణంగా ఇంకో అమ్మాయి అయితే అతణ్ణి అసహ్యించుకునేది. కాని నీలవేణి మాత్రం– దివ్యాంగులను ఎలాగైతే ఎక్కువ ప్రేమతో చూడాలో తప్పు చేసినవారిని కూడా ఎక్కువ ప్రేమతో చూసి వారిని మంచి మార్గంలో పెట్టాలి అని అతణ్ణి యాక్సెప్ట్ చేసింది. ఇప్పుడు చెప్పు. నీ సమస్య ఒక సమస్యా. నీ పని అయిపోయినట్టేనా? నీలవేణి లాంటి వాళ్లను చూసి మనం ఎప్పుడూ పోరాడుతూ ఉండాలని సాటి స్నేహితులను వదిలిపెట్టకుండా ముందుకు వెళ్లాలని అనిపించడం లేదా' అన్నాడు సైకియాట్రిస్ట్.

మార్కులు రాని అమ్మాయి సిగ్గుపడుతూ తల ఆడించింది.

నిటారుగా కూర్చుంది.

'ఇంకో సిట్టింగ్'... అని తల్లి అంటూ ఉంటే 'అక్కర్లేదు' అని ఆ అమ్మాయే చెప్పింది.

లేచి నిలబడుతూ 'థ్యాంక్స్ అంకుల్. నీలవేణికి కూడా నా థ్యాంక్స్ చెప్పండి' అంది కొంచెం నవ్వుతూ.

సైకియాట్రిస్ట్ కూడా నవ్వుతూ తర్వాతి పేషెంట్ కోసం బెల్ నొక్కాడు.

కథనం: సాక్షి ఫ్యామిలీ
ఇన్‌పుట్స్: డాక్టర్ కల్యాణ చక్రవర్తి, సైకియాట్రిస్ట్

మరో శబరి

నొప్పించక తానొవ్వక

నిన్న శబరిమల, నేడు అగస్త్యర్‌కూడమ్! మహిళ తన అభీష్టాన్ని నెరవేర్చుకుంది. కోర్టు తీర్పులు తొలగించిన నిషేధంతో తన ఆకాంక్షను శిఖరానికి చేర్చుకుంది. రెండు వారాల క్రితం కనకదుర్గ, బిందు.. అయ్యప్పను దర్శించు కుంటే.. రెండు రోజుల క్రితం ధన్య అనే ఐఎఎస్ ఆఫీసర్ అగస్త్యకూడమ్‌ను అధిరోహించారు! ఎవర్నీ నొప్పించకుండా తాను అనుకున్నది సాధించారు.





ధన్య శిఖరాన్ని అధిరోహిస్తున్న దృశ్యాలు



ధన్య

మహిళలు– మగవాళ్ల మధ్య ప్రకృతి పెద్ద తేడానే సృష్టించింది. మహిళలను మానసికంగా శక్తిమంతులను చేసింది, మగవారిని శారీరకంగా శక్తిమంతుల్ని చేసింది. శారీరకంగా మగవారికున్నంత దేహదారుఢ్యం లేదనే కారణంగా మహిళలకు కొన్ని జాగ్రత్తలు చెప్పడం మొదలవుతుంటుంది సమాజంలో. 'అక్కడికి వెళ్లద్దు, ఇక్కడికి వెళ్లడం కష్టం. ఆ కొండ ఎక్కడం ఎంత కష్టం అంటే ఆడవాళ్లు ఎక్కగలిగిన కొండ కాదది' వంటి అభిప్రాయాలతో మొదలై, అది కాస్తా క్రమంగా జాగ్రత్త స్థాయి నుంచి నిషిద్ధం స్థాయిని చేరుతూ ఉంటుంది.

కేరళలోని 1868 మీటర్ల ఎత్తయిన అగస్త్యర్ కూడమ్ కొండ కూడా మహిళలకు అలాంటి నిషిద్ధ ప్రదేశమే. కేరళలో ఎత్తైన పర్వతాల్లో రెండవది అగస్త్యర్‌కూడమ్. పర్వత శిఖరాన్ని అధిరోహించడం సాధ్యమయ్యే పని కాదు. ప్రమాదకరమైన భూభాగం అని ఫారెస్ట్ డిపార్ట్‌మెంట్ గుర్తించిన ప్రదేశం. ఆ కొండ మీదకు ఆడవాళ్లు వెళ్లకూడదనే నిబంధన ఉండేది. ఇటీవలి సుప్రీంకోర్టు తీర్పుల్లో శబరిమలకు అన్ని వయసుల మహిళలూ వెళ్లవచ్చనే తీర్పుతోపాటు అగస్త్యర్‌కూడమ్ శిఖరానికి మహిళలు కూడా వెళ్లవచ్చని తీర్పు చెప్పింది. ఆ తీర్పు వెలువడగానే ఆ శిఖరం మీదకు ట్రెకింగ్‌కు వెళ్లడానికి వందమంది మహిళలు తమ పేర్లను నమోదు చేసుకున్నారు. వారిలో ఇండియన్ ఇన్ఫర్మేషన్ సర్వీస్ ఆఫీసర్, డిఫెన్స్ అధికార ప్రతినిధి ధన్య సనాల్ కూడా ఉన్నారు. అయితే వాళ్లందరి కంటే మొదట అగస్త్యర్‌కూడమ్‌ను అధిరోహించారామె. ఆ పర్వతాన్ని అధిరోహించిన తొలి మహిళగా ఈ జనవరి 14న రికార్డు సాధించారు.

ఆందోళనలను అధిగమించింది

పర్వత శిఖరాన్ని అధిరోహించడానికి ధన్య సనాల్‌కి ప్రకృతి పెట్టే పరీక్షలు, వాతావరణ ప్రతికూలతలు ఎదురు కాలేదు కానీ స్థానిక 'కణి' గిరిజనుల నుంచి ప్రతికూలత ఎదురైంది. పర్వత శిఖరం మీదున్న అగస్త్య ముని ఆలయాన్ని ఆడవాళ్లు దర్శించుకోవడానికి వీల్లేదని పట్టుపట్టారు ఆ గిరిజనులు. అందుకు ధన్య సనాల్ ''నేను ట్రెకింగ్‌ను ఇష్టపడి ఈ పర్వతాన్ని అధిరోహించాను, అంతే తప్ప ఆలయాన్ని దర్శించుకోలేదు. ఒకరి మనోభావాలన ఇబ్బంది కలిగించడం నా ఉద్దేశం కాదు. ఈ పర్వతం మీదకు ట్రెకింగ్‌కు వెళ్లడానికి తమ పేర్లను నమోదు చేసుకున్న నాలుగు వేల మందిలో వందమంది మహిళలున్నారు. వారిలో నేనూ ఉన్నానంతే'' అని సున్నితంగా బదులిచ్చారు.

ధన్య సనాల్ వయసు 38, ఆమె 2012 బ్యాచ్‌కు చెందిన ఐఏఎస్ ఆఫీసర్. ''అగస్త్యర్‌కూడమ్ పర్వతం నిటారుగా ఉంటుంది. ఎక్కేటప్పుడు ఏ మాత్రం పట్టు తప్పినా ఊహించలేని ప్రమాదం సంభవిస్తుంది. మహిళలకు కష్టమనే ఉద్దేశంతో ఆ నిబంధన పెట్టి ఉండవచ్చు. నేను శారీరక దారుఢ్యం కోసం రోజూ గంట సేపు వ్యాయామం చేస్తాను. పర్వతాన్ని అధిరోహించడానికి అవసరమైన మానసిక, శారీరకమైన దారుఢ్యం నాకుంది. అందుకే ఈ పర్వతారోహణ చేశాను. ఇక్కడ ఫిట్‌నెస్ ఒక్కటే ప్రధానం '' అని కూడా అన్నారామె. ధన్య సనాల్ ఆగస్త్య ఆలయానికి వెళ్లకపోవడంతో కణి గిరిజనులు కూడా ఆందోళనను తీవ్రతరం చేయలేదు. సంప్రదాయవాదులు కూడా నిషేధం ఉన్నది పర్వతాన్ని అధిరోహించడానికా, ఆలయాన్ని సందర్శించడానికా అనే ధర్మ మీమాంసలో పడిపోయి ఉండవచ్చు. ఏది ఏమైనా ధన్య సనాల్ ఎవరినీ నొప్పించకుండా తాను అనుకున్నది సాధించారు.

– మంజీర

సినిమా

వివాదంలో శ్రీదేవి బంగ్లా!



ప్రశాంత్

కన్ను కొట్టి దేశవ్యాప్తంగా ఫేమస్ అయిపోయారు మలయాళ బ్యూటీ ప్రియా ప్రకాశ్ వారియర్. ఇప్పుడు ఆమె 'శ్రీదేవి బంగ్లా' అనే సినిమాతో బాలీవుడ్ ఎంట్రీ ఇవ్వబోతున్నారు. ప్రశాంత్ మమ్‌బ్లీ దర్శకత్వం వహిస్తున్నారు. చంద్రశేఖర్ ఎస్.కె, ఎమ్. ఎన్. పింప్లీ నిర్మాతలు. ఈ సినిమా ట్రైలర్‌ను విడుదల చేసింది చిత్రబృందం. ఈ ట్రైలర్‌లోని విజువల్స్ తన భార్య శ్రీదేవి జీవితానికి దగ్గరగా ఉన్నాయని బోనీకపూర్ 'శ్రీదేవి బంగ్లా' సినిమా నిర్మాతలకు నోటీసులు పంపారు. గతేడాది ఫిబ్రవరిలో శ్రీదేవి మృతి చెందిన విషయం తెలిసిందే. ఇక.. 'శ్రీదేవి బంగ్లా' వివాదం విషయానికొస్తే.. ''ఈ సినిమా టైటిల్‌లో శ్రీదేవి పేరును వెంటనే మార్చడంతో పాటు వేరే మార్పులు చేయాల్సి ఉంటుందన్న విధంగా బోనీకపూర్ మాకు నోటీసులు పంపారు. బయోపిక్‌కు అనుమతులు తీసుకోవాలన్న విషయం తెలుసు. శ్రీదేవి అనే పేరు గల నటి లండన్ వెళ్లినప్పుడు ఎలాంటి పరిస్థితులను ఎదుర్కొవలసి వచ్చిందనే అంశాల ఆధారంగా మా సినిమా ఉంటుంది. ఇది ఒక క్రైమ్ అండ్ సస్పెన్స్ థ్రిల్లర్. ఇప్పుడు స్టోరీ లైన్ గురించి ఇంతకన్నా చెప్పలేం. శ్రీదేవి అనేది కామన్ నేమ్. రిలీజ్ కాకుండానే శ్రీదేవి జీవితం ఆధారంగా తెరకెక్కుతోందనడం సరికాదు. విడుదలయ్యాక ఇది శ్రీదేవి బయోపిక్ అవునా? కాదా? అనేది ప్రేక్షకులు నిర్ణయిస్తారు. ఈ సినిమాకి ముందుగా కంగనా రనౌత్‌ని అనుకున్నాం. కానీ సౌత్‌లో మరింత రీచ్ ఉండాలని ప్రియా ప్రకాశ్ వారియర్‌ను తీసుకున్నాం'' అని పేర్కొన్నారు ప్రశాంత్.

''సినిమాలో శ్రీదేవి అనేది నా పాత్ర పేరు. ఆమె పేరుతో ఎవరూ వివాదాలు సృష్టించాలనుకోరు'' అని ప్రియా ప్రకాశ్ పేర్కొన్నారు. ఈ చిత్రం ఏప్రిల్‌లో రిలీజ్ కానుంది.



ప్రియా ప్రకాశ్ వారియర్

సాక్షి ఫ్యామిలీ సినిమా

విజయవాడ ॥ గురువారం 17-1-2019

లవ్ డాక్టర్ — నన్నడగొద్దు ప్లీజ్


ప్రియదర్శిని రామ్
లవ్ డాక్టర్

హాయ్ అన్నయ్యా! నేనొక అబ్బాయిని టూ ఇయర్స్‌గా లవ్ చేస్తున్నాను. తనకి కూడా నేనంటే చాలా ఇష్టం. ఇంట్లో ఒప్పించాం. చుట్టాలకి లవ్ మ్యారేజ్‌లా కాకుండా అరేంజ్డ్ మ్యారేజ్‌లా చెప్పుకోవాలని మా పేరెంట్స్ ముందే అనుకున్నారు. అదే విధంగా అందరికీ వాళ్లు కుదిర్చిన పెళ్లిలానే చెప్పారు. తనకి డ్రింకింగ్ అలవాటు ఉందని నాకు తెలుసు. కానీ మా మామయ్య మా డాడీకి తన గురించి బ్యాడ్‌గా చెప్పారట. దాంతో సడన్‌గా పెళ్లి క్యాన్సిల్ అయ్యింది. నేను ఏం చెప్పినా వినట్లేదు. తనేమో 'వెళ్లిపోయి పెళ్లి చేసుకుందాం!' అంటున్నాడు. ఏం చెయ్యాలో అర్థం కావట్లేదు. దయచేసి సలహా ఇవ్వండి.

– పావని

అమ్మ నాన్న నీ మంచి కోరే వాళ్లే కదా!!

'ఏంటి సార్? ఈ రోజుల్లో మందు కొట్టని వాళ్లెవరూ..? మరీ మందు కొడితే తాళి కట్టనివ్వరా సార్.. దుర్మార్గం కాకపోతే...?? అసలు డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులు చూడటం లేదా సార్? అమ్మాయిలు కూడా ఫుల్‌గా లాగించి రోడ్ల మీద పోలీసులను కూడా కొట్టేస్తున్నారు. సిల్లీ ఎక్స్‌క్యూజ్ కదా సార్, స్పిరిట్ ముట్టుకుంటాడని పెళ్లి స్పిరిట్‌ని మరచిపోవడం!!'

నీలూ! లక్ష అమ్మాయిలలో ఒక అమ్మాయి.. మేబీ.. ఒక అమ్మాయి మందు సేవిస్తుందేమో.. కానీ విషయం అదికాదు. అబ్బాయిని ఇంట్రడ్యూస్ చేసినప్పుడు... మంచి బాలుడు.. మచ్చలేని చంద్రుడు.. చాలా గుడ్డు... గుడ్డు... వెరీ గుడ్డు అని మన అమ్మాయే పేరెంట్స్‌కి చెప్పి ఉంటుంది. వాళ్లకు అసలు లవ్ మ్యారేజ్ అంటేనే పడదు. అయినా అమ్మాయి కోసం దాన్ని అరేంజ్ మ్యారేజ్‌లా కన్వర్ట్ చేసి పెళ్లికి ఒప్పుకున్నారు. అప్పుడు తెలిసింది. సారూ దేవదాసని. వాళ్లు ఆ సినిమా చూశారు. మందు కొట్టి చంద్రముఖిని లైన్లో పెట్టాడుగా..! అని పేరెంట్స్ చాలా ఊహించుకున్నార్లావుంది. మందు ఎంత కీడైనా తెస్తుంది. ఇంకా ఏమేం అలవాట్లున్నాయో అని సందేహించారు. దాంతో కనెక్షన్ తెగింది. మళ్లీ కనెక్షన్ సెట్ అవ్వాలంటే అబ్బాయి ప్రూవ్ చేసుకోవాలి.

లైఫ్ లాంగ్ మాలవేసుకుని.. బుద్ధిగా ఉంటానని ప్రామిస్ చెయ్యాలి! అమ్మాయిని స్పిరిట్ ఆఫ్ మ్యారేజ్‌తో రెస్పెక్ట్ చేస్తానని, మళ్లీ కంత్రి స్పిరిట్ ముట్టనని వాగ్దానం చెయ్యాలి. అది వాడి రెస్పాన్స్‌బులిటీ. ప్రేమిస్తే సరిపోదు. జయించడం కూడా రావాలి!!

లవ్ డాక్టర్, సాక్షి ఫ్యామిలీ, సాక్షి టవర్స్, రోడ్ నంబరు 1, బంజారాహిల్స్, హైదరాబాద్-34.
lovedoctorram@sakshi.com

కాసుకో సుడోకు

8							7	5
5			7	2		9	1	
	9	7	5			4		8
2				8			9	
	8	3				5	4	
	1			5				3
		1			4	8	6	
	2	8		9	3			4
4	7							2

నిబంధనలు: ప్రతి వరుసలో 1 నుంచి 9 అంకెలు నింపండి (అడ్డంగా,నిలువుగా). ఒక వరుసలో ఒక అంకెను ఒకసారి మాత్రమే వాడాలి. ప్రతి 3x3 చదరం లోనూ 1 నుంచి 9 అంకెలు రావాలి.

నిన్నటి జవాబు

3	1	8	7	9	5	4	6	2
9	6	7	2	4	3	5	1	8
5	4	2	8	6	1	9	7	3
6	7	5	1	3	8	2	4	9
1	8	9	5	2	4	6	3	7
2	3	4	9	7	6	8	5	1
7	5	1	4	8	2	3	9	6
4	2	6	3	1	9	7	8	5
8	9	3	6	5	7	1	2	4

నాన్న జర్నీ నుంచి ఆ నాలుగు విషయాలు నేర్చుకోవాలి


రమేశ్ ప్రసాద్

తెలుగు సినిమా బుడి బుడి అడుగులు వేస్తున్న సమయంలో తెలుగు సినిమా స్థాయి పెరగడానికి కృషి చేసిన దర్శక–నిర్మాతల్లో ఎల్వీప్రసాద్ ప్రముఖులు. తెలుగు, హిందీ, తమిళ తొలి టాకీ సినిమాల్లో నటించిన అరుదైన రికార్డ్ ఆయనదే. దర్శకుడిగా 'మన దేశం, సంసారం మిస్సమ్మ' వంటి విజయవంతమైన చిత్రాలతో పాటు హిందీలో పలు చిత్రాలకు దర్శకత్వం వహించారు. నిర్మాతగా 'ఇలవేలుపు, ఇల్లాలు' వంటి చిత్రాలు నిర్మించారు. నేడు ఎల్వీ ప్రసాద్ 111వ జయంతి. ఈ సందర్భంగా తండ్రికి ఎల్వీ ప్రసాద్ ప్రయాణాన్ని పంచుకున్నారు ఆయన తనయుడు, ప్రసాద్ ల్యాబ్స్ అధినేత, నిర్మాత రమేశ్ ప్రసాద్.

''మా నాన్నగారి ప్రయాణాన్ని తలచుకున్నప్పుడల్లా నాకు గుర్తొచ్చేది నాలుగు విషయాలు. ప్రిసర్వెన్స్(పట్టుదల), ప్యూరిటీ ఆఫ్ థాట్స్ (కల్మషం లేని ఆలోచనలు), ప్యాషన్ (తపన), పేషన్స్ (ఓపిక). చదువు లేకపోయినా ఆయన అనుకున్నది సాధించారు. చిన్నప్పటి నుంచి నాన్నగారికి నాటకాల పట్ల ఆసక్తి ఉండేది. వ్యవసాయంలో మా తాతగారికి ఊహించలేనంత నష్టం వాటిల్లింది. దాంతో మా నాన్నగారు ఎవరికీ చెప్పకుండా కేవలం 100 రూపాయిలతో ముంబై వెళ్లిపోయారు. అప్పు తీర్చలేక పారిపోయారని అందరూ అనుకున్నారట. కానీ సినిమాల మీద ఆసక్తితో ముంబై చేరుకొని అక్కడ వాచ్‌మెన్‌గా ఉద్యోగం సంపాదించారు. హిందీ రాకపోయినా కేవలం సైగలతో సంభాషించేవారని తర్వాతి రోజుల్లో నాన్నగారు చెబితే మాకు తెలిసింది. ఓ టైలర్ షాప్‌ను శుభ్రం చేసే పని కూడా చేశారాయన. డిగ్నిటీ ఆఫ్ లేబర్ అనే విషయానికి మా నాన్నగారు ఓ చక్కని ఉదాహరణ. నాన్నగారి తపనను గమనించిన టైలర్ ఆయన సినిమాల్లోకి వెళ్లడానికి తన వంతు సహాయం చేశారు. ఇంటి నుంచి వెళ్లిపోయాక 16 నెలలకు 'నేను బావున్నాను. సినిమాల్లో పని చేస్తున్నాను' అంటూ ఇంటికి ఉత్తరం రాశారు. వాచ్‌మేన్‌గా పనిచేసిన థియేటర్ మరమత్తులు జరిగి, మళ్లీ నాన్నగారి సినిమాతోనే ప్రారంభం అయింది. ఆ వేడుకకు ముఖ్య అతిథిగా వచ్చిన కమల్ హాసన్‌తో ఈ విషయాన్ని పంచుకున్నారు నాన్నగారు. మా నాన్నగారు తీసిన సినిమాల్లో 'బిదాయి' అనే సినిమా అంటే నాకు ఇష్టం. వాస్తవానికి నాన్నగారి గురించి వినడం తప్పితే ఎక్కువగా ఆయనతో గడిపింది లేదు. ఆయన షూటింగ్స్‌తో అంత బిజీగా ఉండేవారు. తనను ఇంతవాణ్ని చేసిన ప్రేక్షకులకు ఏదైనా చేయాలనే ఉద్దేశంతో ఎల్వీ ప్రసాద్ ఐ ఇన్‌స్టిట్యూట్ స్థాపించారు. సినిమాకు తిరిగివ్వాలని ప్రసాద్ ల్యాబ్స్ స్థాపించారు. కెమెరా అంటే నాకు కొంచెం ఇబ్బంది. అందుకే సినిమాల్లోకి రావాలని అనుకోలేదు. 'సంసారం'లో చిన్న పాత్రను పోషించాను. 'మీ నాన్నగారి బయోపిక్ తీస్తారా?' అని చాలామంది అడుగుతున్నారు. ఇంకా ఏమీ అనుకోలేదు. మా ప్రొడక్షన్‌లో రెండు సినిమాలు తీశాం. అవి అనుకున్న స్థాయిలో ఆడలేదు. ప్రేక్షకుల అభిరుచి మారుతోంది. మరో సినిమా తీయడానికి చర్చలు నడుస్తున్నాయి'' అన్నారు.

కుర్చీ ఎక్కడం లేదు


రజనీకాంత్

'త్వరలోనే రజనీకాంత్ 'కుర్చీ' ఎక్కబోతున్నారట' అనే వార్త చెన్నైలో హల్‌చల్ చేస్తోంది. ఇది రాజకీయపరమైన చర్చ? నెక్ట్స్ సీయం రజనీ అని ఊహించేసుకుంటే పొరబాటే. ఈ చర్చ సినిమాకు సంబంధించినది. మురుగదాస్‌తో రజనీకాంత్ చేయబోయే సినిమాకు 'నార్కాలి'(కుర్చీ) అనే టైటిల్ ఫిక్స్ చేశారని టాక్. రాజకీయపరంగా మాత్రం మంచి బరువైన టైటిల్ ఇది. ఊహించుకున్న వాళ్లకు ఊహించుకున్నంత అర్థమున్న టైటిల్. అందుకే హీటైన డిస్కషన్స్‌కు దారి తీశాయి. ఈ వాడివేడి చర్చల మీద మురుగదాస్ నీళ్లు చల్లారు. ''మా సినిమాకు 'నార్కాలి' అనే టైటిల్ ఫిక్స్ చేయలేదు. అనవసరంగా పుకార్లు పుట్టించకండి'' అని క్లారిఫై చేశారు. రజనీను ఫ్యాన్స్ ఎలా చూడాలనుకుంటున్నారో మా సినిమా అలా ఉంటుంది. పొలిటికల్ థ్రిల్లర్ కాదు అని ఓ సందర్భంలో చెప్పారాయన. సన్ నెట్‌వర్క్ ఈ సినిమాను నిర్మించనుందట. ఇందులో హీరోయిన్‌గా కీర్తీ సురేశ్ నటిస్తారనే ప్రచారం జరుగుతోంది. ఆల్రెడీ మురుగదాస్ 'సర్కార్'లో కీర్తీ సురేశ్ నటించారు.

నవీన్‌లో మంచి ఈజ్ ఉంది

– కృష్ణ


నవీన్, కృష్ణ, విజయనిర్మల, నరేశ్

''టైటిల్ బావుంటే సినిమా సగం సక్సెస్ అయినట్టే. 'ఊరంతా అనుకుంటున్నారు' అనే టైటిల్‌లో నేటివిటీ ఉంది. ఇంగ్లీష్ టైటిల్స్ ఎక్కువ వస్తున్న టైమ్‌లో ఇలాంటి టైటిల్‌తో రావడం బాగుంది'' అని సూపర్‌స్టార్ కృష్ణ అన్నారు. నవీన్ విజయ్ కృష్ణ, అవసరాల శ్రీనివాస్ హీరోలుగా బాలాజి సానల తెరకెక్కించిన చిత్రం 'ఊరంతా అనుకుంటున్నారు'. మేఘా చౌదరి, సోఫియా సింగ్ కథానాయికలు. శ్రీహరి మంగళంపల్లి, రమ్య గోగుల, పి.యల్.యన్. రెడ్డి, ఎ. పద్మనాభరెడ్డి నిర్మాతలు. నవీన్ విజయ్‌కృష్ణ పుట్టినరోజు సందర్భంగా ఈ చిత్రం టైటిల్ లోగోను కృష్ణ, ఫస్ట్ లుక్‌ను విజయనిర్మల రిలీజ్ చేశారు. నవీన్ లుక్ టీజర్‌ను నరేశ్ విడుదల చేశారు. ఈ సందర్భంగా కృష్ణ మాట్లాడుతూ – ''నవీన్ చిన్నప్పటి నుంచి సినిమా వాతావరణంలో పెరిగాడు. తనలో మంచి ఈజ్ ఉంది. పాటలు, ఫైట్లు బాగా చేస్తున్నాడు. ఆర్టిస్ట్‌గా మంచి భవిష్యత్తు ఉంది. కథ బావుందని నరేశ్ అన్నాడంటే సినిమాలో విషయం ఉన్నట్టే. ఈ చిత్రం విజయం సాధించాలి'' అన్నారు. ''నందిని నర్సింగ్ హోమ్' నవీన్‌కు హీరోగా మంచి పేరు తెచ్చింది. ఆర్టిస్ట్‌గా నిలదొక్కుకోవాలన్నది అతని తాపత్రయం. నేను బాగున్నాయి అన్న సినిమాలు 99 శాతం ఫెయిల్ అవ్వలేదు'' అన్నారు నరేశ్. ''ఈ సినిమా అంతా పాలకొల్లులో షూట్ చేశాం. అక్కడే సెటిల్ కావాలనిపించేంతగా నచ్చింది'' అన్నారు నవీన్. ''గ్రామీణ నేపథ్యంలో అందంగా సాగే సినిమా ఇది. విలేజ్ బాయ్‌గా నవీన్ మెప్పిస్తాడు. నవీన్‌లోని పలు షేడ్స్ ఇందులో కనిపిస్తాయి'' అన్నారు నిర్మాతలు.

నిలకడగా బ్రహ్మానందం ఆరోగ్యం


బ్రహ్మానందం

'అహ నా పెళ్ళంట!' (1985) సినిమాతో వస్తూనే తెలుగు తెరపై నవ్వులు పూయించారు హాస్యనటులు బ్రహ్మానందం. అప్పటినుంచి ఇప్పటివరకూ ప్రేక్షకులను నవ్విస్తూనే ఉన్నారు. దాదాపు వెయ్యిచిత్రాలు చేసిన బ్రహ్మానందం ఏమాత్రం క్రేజ్ తగ్గకుండా నటుడిగా ఫామ్‌లో ఉన్నారు. ఇటీవలే 'గ్రేట్ తెలుగు లాఫ్టర్ చాలెంజ్' షోతో బుల్లితెర ప్రేక్షకులను కూడా పలకరించారు. ప్రస్తుతం బ్రహ్మానందం ఆస్పత్రిలో ఉన్నారనే విషయం తెలిసి ఆయన అభిమానులు, సన్నిహితులు కలవరపడ్డారు. అయితే ఆయన ఆరోగ్యం నిలకడగానే ఉంది. గుండెలో నొప్పి అనిపించడంతో హైదరాబాద్‌లోని ప్రముఖ డాక్టర్‌ని సంప్రదించారట బ్రహ్మానందం. శస్త్రచికిత్స ఇక్కడ చేయించుకుంటే అభిమానుల రాకపోకలు, వారి ఆందోళనతో ఇబ్బందిగా ఉంటుందని భావించిన ఆయన ముంబైలోని ప్రముఖ ఆస్పత్రిలో చేరారు. గుండె ఆపరేషన్ విజయవంతంగా పూర్తయింది. నేడు ఐసీయు నుంచి సాధారణ గదికి మారనున్నారు. ''ఆదివారం ఆరోగ్య పరిస్థితి సరిగా లేకపోవడంతో బ్రహ్మానందంగారిని ఆస్పత్రిలో జాయిన్ చేశాం. ఆయనకు గుండెకు సంబంధించిన శస్త్రచికిత్స జరిగింది'' అని బ్రహ్మానందం కుటుంబ సన్నిహిత వర్గాలు పేర్కొన్నాయి. ప్రస్తుతం బ్రహ్మానందం ఆరోగ్యం నిలకడగా ఉన్నట్లు వైద్యులు తెలిపారు. బ్రహ్మానందం కుమారులు రాజా గౌతమ్, సిద్దార్థ్‌లు తండ్రితో పాటు ముంబైలో ఉన్నారు.

ప్రభాస్‌లా ఉన్నావన్నారు


హీరోయిన్స్‌తో జాన్

హారర్, కామెడీ, థ్రిల్లర్ ప్రధానాంశాలుగా రూపొందిన చిత్రం 'అదృశ్యం'. జాన్ హీరోగా, ప్రియాంక, హర్షద, తేజారెడ్డి, జయవాణి హీరోయిన్లుగా నటించారు. రవిప్రకాష్ స్వీయ దర్శకత్వంలో రూపొందించారు. సెన్సార్ పూర్తి చేసుకున్న ఈ చిత్రం ఫిబ్రవరిలో రిలీజ్‌కు రెడీ అయింది. ఈ సందర్భంగా దర్శక–నిర్మాత రవిప్రకాష్ మాట్లాడుతూ – ''నా కెరీర్ కె.విశ్వనాథ్‌గారి దగ్గర మొదలైంది. తర్వాత సింగీతం శ్రీనివాస్‌గారి దగ్గర 14 సినిమాలు పని చేశా. వాళ్ల దగ్గర పని చేయడం నా అదృష్టం. నేను రూపొందించిన 'బంటీ ది బ్యాడ్‌బాయ్'కు ఎన్నో అవార్డులు వచ్చాయి. 'అదృశ్యం' ఒక థ్రిల్లర్. టీమ్ అందరి కృషి వల్లే సినిమా బాగా వచ్చింది'' అన్నారు. ''ఇది నా 3వ సినిమా. విశ్వనాథ్‌గారు నన్ను ప్రభాస్‌లా ఉన్నావు అన్నారు. మా సినిమాను అందరూ ఆదరిస్తారని అనుకుంటున్నాను'' అన్నారు జాన్. ఈ చిత్రానికి సంగీతం : ఆల్‌డ్రిన్, కెమెరా: రామ్ పినిశెట్టి.

తోడు దొరికింది


విశాల్, అనీషా

హీరో విశాల్ పెళ్లికొడుకు కాబోయే తరుణం ఆసన్నమైంది. త్వరలో ఆయన వివాహం హైదరాబాద్‌కు చెందిన అమ్మాయి అనీషా అల్లాతో జరగనుంది. 'అర్జున్ రెడ్డి, పెళ్ళిచూపులు' చిత్రాల్లో నటించారు అనీషా. ''నా జీవిత ప్రయాణంలో నాకు తోడుగా ఉండే వ్యక్తి నాకు దొరికాడు. ఈ రోజు నేను ఇలా ఉండటానికి భాగమైన వ్యక్తికి చాలా థ్యాంక్స్. త్వరలో మరో కొత్త ప్రయాణాన్ని మొదలుపెట్టబోతున్నాం'' అని విశాల్‌ను ఉద్దేశిస్తూ అనీషా చెప్పుకొచ్చారు. ''ఇట్స్ కన్ఫార్మ్డ్. ఆమె అంగీకరించింది. నేను పెళ్లి చేసుకోబోయే అమ్మాయి పేరు అనీషా అల్లా అని చెప్పడానికి సంతోషంగా ఉంది. నా జీవితంలో తర్వాతి పెద్ద మార్పుకు రెడీ అవుతున్నాను. త్వరలో పెళ్లి తేదీని ప్రకటిస్తాం'' అని విశాల్ పేర్కొన్నారు.

ఏడడుగులకు రెడీ


జో, రిచా

సగం పెళ్లి చేసుకున్నారు కథానాయిక రిచా గంగోపాధ్యాయ్. అదేనండీ ఆమె నిశ్చితార్థం జరిగిందని సరదాగా అలా చెబుతున్నాం. ఈ విషయాన్ని రిచా అధికారికంగా వెల్లడించారు. ''నా నిశ్చితార్థం పూర్తయిందని చెప్పడానికి సంతోషిస్తున్నాను. నా కాబోయే భర్త జోను నేను ఓ బిజినెస్ స్కూల్‌లో కలుసుకున్నాను. రెండేళ్లు అద్భుతంగా గడిచాయి. నా జీవితంలో నెక్ట్స్ ఫేజ్(పెళ్లి తర్వాతి జీవితం) గురించి ఆసక్తిగా ఎదురు చూస్తున్నాను. పెళ్లి తేదీ నిర్ణయించలేదు'' అని పేర్కొన్నారు రిచా. 'లీడర్' సినిమాతో తెలుగు తెరకు పరిచయం అయిన రిచా ఆ తర్వాత 'నాగవల్లి, మిరపకాయ్, సారొచ్చారు, మిర్చి' వంటి సినిమాల్లో నటించారు. 2013లో 'భాయ్' సినిమా తర్వాత ఆమె మళ్లీ వెండితెరపై కనిపించలేదు. 'ఇక సినిమాలకు ఫుల్‌స్టాప్ పెడుతున్నా' అని ప్రకటించి ఆమె అమెరికా వెళ్లిపోయారు.


కమల్‌హాసన్

నేటి భారతీయుడు

ఆయుధాలు లేకుండా కేవలం రెండు వేళ్లతో ప్రత్యర్థులను ఎదుర్కోగలడు సేనాపతి. అవినీతిని ఆశ్రయించినవాళ్లకు సమాధానం చెబుతూ 1995లో శంకర్ సృష్టించిన పాత్ర ఇది. సేనాపతి పాత్రలో కమల్‌హాసన్ అద్భుతమైన నటనను కనబరిచారు. ఇప్పుడు ఈ సినిమాకు సీక్వెల్ రూపొందిస్తున్నారు శంకర్. మొదటి భాగంలో కమల్ వృద్ధ గెటప్‌లో ఎలా కనిపించారో గుర్తు చేసుకోండి. ఇప్పుడు నేటి భారతీయుడిని చూడండి. ఈ సినిమా షూటింగ్ రేపటి నుంచి స్టార్ట్ కానుంది. సంక్రాంతి స్పెషల్‌గా ఈ సినిమాలో కమల్ లుక్‌ను కొద్దిగా శాంపిల్ చూపించారు. లైకా ప్రొడక్షన్స్ నిర్మించనున్న ఈ చిత్రంలో కాజల్ అగర్వాల్ హీరోయిన్. కమల్ హాసన్ మనవడిగా సిద్దార్థ్ నటించనున్నారని టాక్. అనిరుధ్ స్వరాలు అందిస్తున్న ఈ చిత్రం వచ్చే ఏడాదిలో రిలీజ్ కానుంది.


విజయ్ సేతుపతి

సేనాధిపతి రాజాపాండీ

ప్రస్తుతం తమిళంలో మంచి ఫామ్‌లో ఉన్న హీరో విజయ్ సేతుపతి. రీసెంట్‌గా రజనీకాంత్ 'పేట్టా'లో కూడా కనిపించారు. ఇప్పుడీ హీరో చిరంజీవి నటిస్తున్న 'సైరా: నరసింహారెడ్డి' చిత్రం ద్వారా తెలుగు పరిశ్రమకు పరిచయం అవుతున్నారు. ఉయ్యాలవాడ నరసింహారెడ్డి జీవితం ఆధారంగా తెరకెక్కుతున్న చిత్రం 'సైరా'. సురేందర్‌రెడ్డి దర్శకుడు. రామ్‌చరణ్ నిర్మిస్తున్నారు. నయనతార, తమన్నా కథానాయికలు. అమితాబ్ బచ్చన్, జగపతిబాబు, కిచ్చా సుదీప్, విజయ్ సేతుపతి ముఖ్య పాత్రల్లో కనిపించనున్నారు. నిన్న విజయ్ సేతుపతి పుట్టిన రోజు. ఈ సందర్భంగా 'సైరా' సినిమాలో ఆయన పోషిస్తున్న 'రాజా పాండీ' లుక్‌ని రిలీజ్ చేసింది చిత్రబృందం. ఈ చిత్రంలో తమిళ సైన్యానికి సేనాధిపతిగా ఆయన పాత్ర ఉంటుందని సమాచారం.


శ్రియ, యశ్

యశ్ మహాచంద్ర

'కేజీయఫ్'తో తెలుగు రాష్ట్రాల్లో మంచి ఫాలోయింగ్ సంపాదించిన నటుడు యశ్. ఆయన కీలక పాత్ర చేసిన 'చంద్ర' చిత్రాన్ని 'మహాచంద్ర' పేరుతో అనువదిస్తున్నారు. యశ్, ప్రేమ్ కుమార్, శ్రియ ముఖ్య పాత్రలు పోషించారు. రూపా అయ్యర్ దర్శకత్వంలో షాన్వాజ్ నిర్మించారు. డబ్బింగ్ కార్యక్రమాలు పూర్తి చేసుకున్న సందర్భంగా నిర్మాత షాన్వాజ్ మాట్లాడుతూ – ''కన్నడంలో సూపర్ హిట్ అయిన ఈ చిత్రాన్ని తెలుగు ప్రేక్షకుల ముందుకు తీసుకురావడం ఆనందంగా ఉంది. యశ్ కీలక పాత్రలో కనిపిస్తారు. శ్రియ అద్భుతమైన నటన కనబరిచారు. ఫిబ్రవరి రెండో వారంలో రిలీజ్ ప్లాన్ చేస్తున్నాం'' అన్నారు. ఈ చిత్రానికి సమర్పణ: దామోదర వనాచార్య, సంగీతం: గౌతమ్ శ్రీవాస్తవ్, కెమెరా: దాస్.

సాక్షి ఫ్యామిలీ
విజయవాడ
గురువారం ॥ 17-1-2019

అమ్మ కావాలని ఉందా?



అమ్మ కావడం చాలామందికి సులువు. కొందరిలో సమస్య ఉంటుంది. ఎదురుచూపు ఉంటుంది. అడ్డంకులు ఏమిటో బోధ పడవు. వైద్య సహాయానికి వెళితే సమస్య ఏమిటో తెలుస్తుంది. అది గర్భాశయంలో లోపం కావచ్చు, ట్యూబుల్లో అడ్డంకి కావచ్చు, ఫలదీకరణ సమస్య కావచ్చు, మానసిక ఒత్తిడీ కావచ్చు. డాక్టర్‌ని కలవండి. అవగాహన పెంచుకోండి. ఆనందంగా మాతృత్వపు మాధుర్యం అనుభవించండి.


గత వారం సంతానలేమి తాలూకు కొన్ని అంశాల గురించి చర్చించాం. 'అండాల విడుదలలో ఎదురయ్యే సమస్య' గురించి, వాటికి పరిష్కారాల గురించి తెలుసుకున్నాం. ఈ వారం మహిళల్లో సంతానలేమికి కారణమయ్యే మరికొన్ని అంశాల గురించి విపులంగా తెలుసుకుందాం.

గర్భాశయంలో లోపాలు

సాధారణంగా గర్భాశయంలో లోపాల వల్ల గర్భం దాల్చలేని వారు దాదాపు 10% నుంచి 15% వరకు ఉంటారు. గర్భాశయంలో లోపాలు కూడా అనేక కారణాల వల్ల కలుగుతుంటాయి. ఉదాహరణకు... గర్భాశయ ముఖద్వారం (సర్విక్స్) వల్ల ఏదైనా ఇన్ఫెక్షన్ ఉన్నా, పూత ఉన్నా, అక్కడ స్రవించే మ్యూకస్ స్రావాలు మరీ చిక్కగా ఉన్నా, గర్భాశయ ముఖద్వారం మరీ సన్నగా ఉన్నప్పుడు వీర్యకణాలు గర్భసంచి లోపలికి ప్రవేశించలేకపోవచ్చు. కొంత మందిలో యోనిలోని ద్రవాల్లో ఆమ్లగుణం మరీ ఎక్కువగా ఉండటం వల్ల అవి వీర్యకణాలను చైతన్య రహితం చేస్తాయి. కొంతమందిలో సర్విక్స్ దగ్గర వీర్యకణాలకు వ్యతిరేకంగా పనిచేసే యాంటీ-స్పెర్మ్ యాంటీబాడీస్ ఉంటాయి. అవి వీర్యకణాలను నిర్వీర్యం చేసి, గర్భాశయంలోకి వెళ్లనివ్వవు.

మరికొందరిలో గర్భాశయంలో ఫైబ్రాయిడ్స్, పాలిప్స్, అడ్డుపొరలు (యుటెరైన్ సెప్టమ్) వంటి సమస్యలు ఉండటం వల్ల... అవి ఉన్న స్థితి (పొజిషన్), పరిమాణం (సైజు) వంటి అంశాలు గర్భధారణకు అడ్డుగా నిలవవచ్చు. ఇలాంటి సందర్భాల్లో సమస్య తీవ్రతను బట్టి గర్భం దాల్చడం కష్టం కావచ్చు.

పరీక్షలు/చికిత్స: స్పెక్యులమ్, వెజైనల్ ఎగ్జామినేషన్ ద్వారా యోని, సర్విక్స్ భాగంలో ఉండే ఇన్ఫెక్షన్, పూత, గీరుకుపోయినట్లుగా అయ్యే పుండు (ఎరోజన్), సర్వైకల్ పాలిప్ వంటి సమస్యలను తెలుసుకోవచ్చు. అలాగే పాప్‌స్మియర్ పరీక్ష కూడా చేయించుకోవడం మంచిది. కేవలం ఇన్ఫెక్షన్ ఉన్నప్పుడు యాంటీబయాటిక్ పూర్తి కోర్సు వాడటం వల్ల సమస్య సమసిపోతుంది. దీంతో పుండు తగ్గకపోతే అప్పుడు క్రయోకాటరీ (ఐస్ ట్రీట్‌మెంట్) చికిత్స అవసరమవుతుంది. పాలిప్ (కండపెరగడం) వంటి సమస్యలు ఉంటే, వాటిని శస్త్రచికిత్సతో తొలగించాలి. గర్భాశయ ముఖద్వారం కొందరిలో మరీ సన్నగా (సర్వైకల్ స్టెనోసిస్) ఉన్నప్పుడు దానిని డీ అండ్ సీ అనే చిన్న ప్రక్రియ ద్వారా వెడల్పుచేయడం వల్ల ఉపయోగం ఉండవచ్చు. ఇన్ఫెక్షన్, పూత, పుండు ఉన్నప్పుడు సర్విక్స్‌లో స్రవించే ద్రవాలు సరిగా లేకపోవడం వల్ల చికిత్స తీసుకున్నా గర్భం రాకపోతే ఐయూఐ (ఇంట్రా యుటెరైన్ ఇన్‌సెమినేషన్) అనే పద్ధతి ద్వారా వీర్యకణాలను నేరుగా యోని నుంచి సర్విక్స్ ద్వారా గర్భాశయంలోకి పంపడం జరుగుతుంది. పెల్విక్ స్కానింగ్ చేయడం వల్ల గర్భాశయంలో ఫైబ్రాయిడ్స్, అడినోమయోసిస్, ఎండోమెట్రియోసిస్ వంటి అనేక సమస్యలు తెలుస్తాయి. అవసరమైతే 3డీ స్కానింగ్, ఎమ్మారై వంటి పరీక్షలు చేసి, సమస్య తీవ్రతను నిర్ధారణ చేసి, దానికి అనుగుణంగా చికిత్స అందించాల్సి ఉంటుంది.



లాపరోస్కోపీ ద్వారా ఫైబ్రాయిడ్స్, ఎండోమెట్రియాసిస్ వంటి సమస్యలను నిర్ధారణ చేసి, అదే ప్రక్రియ ద్వారా వాటిని తొలగించే ప్రయత్నం చేయవచ్చు. లేదా పాత పద్ధతుల్లోనే పొట్టను కట్ చేయడం ద్వారా సర్జికల్ పద్ధతిలో వాటిని తొలగించవచ్చు. ఇక హిస్టరోస్కోప్ ద్వారా గర్భాశయం లోపలి పొరలో ఉండే పాలిప్స్, సెప్టమ్ (అడ్డుపొర), అడ్‌హెషన్స్ (అతుకులు), సబ్‌మ్యూకస్ ఫైబ్రాయిడ్స్ వంటి సమస్యలను నిర్ధారణ చేసుకొని, వాటిని తొలగించవచ్చు. ఇలా గర్భధారణకు అడ్డుపడే అంశాలను కనుగొని, వాటిని తొలగిస్తే గర్భం దాల్చడానికి అవకాశాలు పెరుగుతాయి.

గుర్తుంచుకోవాల్సింది ఏమిటంటే...: అన్ని రకాల ఫైబ్రాయిడ్స్‌ను తొలగించాల్సిన అవసరం ఉండదు. ఫైబ్రాయిడ్స్ గర్భాశయ పొరలో ఉన్నప్పుడు (సబ్‌మ్యూకస్ ఫైబ్రాయిడ్స్) వాటిని తొలగించాల్సి వస్తుంది. గర్భాశయ కండరాల్లో ఉన్నవి (ఇంట్రామ్యూరల్ ఫైబ్రాయిడ్స్) 5 సెం.మీ. కంటే ఎక్కువగా ఉండి, సర్విక్స్ భాగంలో ఉండి, వీర్యకణాలను లోపలికి వెళ్లనివ్వకుండా అడ్డుపడటం, పిండం పెరగకుండా చేయడం వంటి సమస్య ఏర్పడుతున్నప్పుడు మాత్రమే వాటిని తొలగించడం వల్ల ఉపయోగం ఉంటుంది.

చిన్న ఫైబ్రాయిడ్‌లు, గర్భాశయం బయటకు ఉన్నవీ (సబ్‌సీరోజల్ ఫైబ్రాయిడ్స్) గర్భం రావడానికి పెద్దగా అడ్డుపడకపోవచ్చు. కాబట్టి అలాంటి వాటికి ఆపరేషన్ కచ్చితంగా చేయాలని ఏమీలేదు. ఎండోమెట్రియాసిస్ సమస్య ఉన్నప్పుడు, కొందరిలో గర్భాశయం లోపలిపొర (ఎండోమెట్రియమ్) కడుపులోకి వెళ్లడం, మరికొందరిలో గర్భాశయం బయటా, అండాశయం పైనా, ఇలా పలుచోట్ల అతుక్కొని నెలనెలా రుతుస్రావం సమయంలో లోపలివైపున రక్తస్రావం అయి, అక్కడ అండాశయంలో చాక్‌లెట్ సిస్ట్‌లూ, ట్యూబ్స్, గర్భసంచి, పేగులు... ఇలా అన్నీ అంటుకుపోయి అండం నాణ్యత, విడుదలలో, ఫలదీకరణలో ఇబ్బందులు ఏర్పడి, గర్భం రాకపోవచ్చు.

ఫెలోపియన్ ట్యూబ్‌లలో లోపాలు

అండాశయం నుంచి గర్భాశయానికి ఇరువైపులా ఉండే ట్యూబ్‌లను ఫెలోపియన్ ట్యూబ్‌లు అంటారు. అండం అండాశయం నుంచి ఈ ట్యూబ్‌లలోకి చేరుతుంది. యోని నుంచి శుక్రకణాలు, గర్భాశయంలోనుంచి ట్యూబ్‌లలోకి చేరుతాయి. అండం, శుక్రకణంతో కలిసి, ట్యూబ్‌లో పిండంగా మారాక అది గర్భాశయంలోని ఎండోమెట్రియమ్ పొరలోకి చేరిపోయి, శిశువుగా పెరుగుతుంది. గర్భం దాల్చడంలో ఫెలోపియన్ ట్యూబ్‌లు కూడా కీలకమైన భూమిక పోషిస్తాయి. అందుకే ఫెలోపియన్ ట్యూబ్‌లలో లోపాలు కూడా గర్భం రావడంలో అవరోధాలు కలిగిస్తాయి.

గర్భాశయం నుంచి లేదా పొట్టలోని పేగుల నుంచి కొన్ని రకాల ఇన్ఫెక్షన్లు ఫెలోపియన్ ట్యూబ్స్‌కి చేరి వాటిని కూడా ఇన్ఫెక్ట్ చేయడం వల్ల వాటి పని తీరు తగ్గుతుంది. అప్పుడు ట్యూబ్స్ వాయడం, తర్వాత అవి మూసుకుపోవడం జరుగుతుంది. ఇన్ఫెక్షన్స్ రావడంతో పాటు కడుపులో ఏదైనా అపరేషన్ జరిగి ఉంటే ఆ కారణంగా, లేక ఎండోమెట్రియోసిస్‌తో కొందరిలో అతుకులు (అడ్‌హెషన్స్) ఏర్పడటం వల్ల ట్యూబ్స్ అండాశయాలకు దూరంగా జరుగుతాయి. దాంతో అండం ట్యూబ్‌లోపలికి ప్రవేశించదు.

నిర్ధారణ ఇలా: ఫెలోపియన్ ట్యూబ్స్ మూసుకుపోయి ఉన్నాయా లేదా తెరచుకుని ఉన్నాయా తెలుసుకోడానికి హిస్టరోసాల్పింగోగ్రామ్ (హెచ్ఎస్‌జీ) అనే ఎక్స్‌రే లేదా సోనోసాల్పింగోగ్రామ్ (ఎస్ఎస్‌జీ) అనే పరీక్షలు చేయాల్సి ఉంటుంది. కొందరిలో పరీక్ష చేసినప్పుడు పొట్టకండరం బిగుసుకుపోవడం వల్ల ట్యూబ్స్ బిగుసుకుపోయినట్లయ్యి ట్యూబ్స్ బ్లాక్ అయిపోయాయని (అడ్డంకులు ఏర్పడ్డాయని) తప్పుడు రిపోర్ట్ రావచ్చు.



చికిత్స: ట్యూబ్స్ మూసుకుపోయి ఉంటే, దాన్ని నిర్ధారణ చేసుకోడానికి లాపరోస్కోపీ ప్రక్రియలో డై-టెస్ట్ చేస్తారు. ఇందులో అడ్డంకి (బ్లాక్) ఎక్కడుందో చూసి, హిస్టరోస్కోపీ ద్వారా ఫెలోపియన్ ట్యూబ్ కాన్యులేషన్ అనే ప్రక్రియతో దాన్ని తెరవడానికి ప్రయత్నించవచ్చు. ఇది కొందరికి ఉపయోగపడుతుంది. కొందరిలో సత్ఫలితం ఇవ్వకపోవచ్చు. కొందరిలో ట్యూబ్స్‌లో ఇన్ఫెక్షన్ వల్ల నీరు చేరి (హైడ్రో సాల్పింగ్), అవి వాచి, మూసుకుపోవచ్చు. అలాంటి సందర్భాల్లో చికిత్స చేసినా పెద్ద ఉపయోగం ఉండదు. కారణం... ట్యూబ్స్ పాడైపోయి, వాటి పనితీరు సరిగా ఉండదు. ఇలాంటి సందర్భాల్లో గర్భం వచ్చినా అది ట్యూబ్స్‌లో ఇరుక్కుపోయి, ఎక్టోపిక్ ప్రెగ్నెన్సీ వచ్చే అవకాశాలు ఎక్కువగా ఉంటాయి. రెండు ట్యూబ్స్‌లో కనీసం ఒక్కటైనా తెరచుకొని ఉంటే గర్భం వచ్చే అవకాశాలు ఉంటాయి.

ట్యూబ్స్ రెండూ మూసుకుపోయినప్పుడు, అలాంటివారిలో గర్భం కోసం ఐవీఎఫ్ (టెస్ట్‌ట్యూబ్) పద్ధతిని అనుసరించాల్సి ఉంటుంది. కొందరిలో ఐవీఎఫ్‌కు వెళ్లే ముందు ట్యూబ్స్‌లో హైడ్రోసాల్పింగ్స్ తీవ్రత ఎక్కువగా ఉంటే, ట్యూబ్స్‌ను తొలగించాల్సి ఉంటుంది. లేకపోతే దానిలోనుంచి వచ్చే ద్రవం పిండం గర్భాశయంలో అతుక్కోకుండా చేస్తుంది.

ఫలదీకరణ (ఫర్టిలైజేషన్) సమస్యలు

ప్రతినెలా అండాశయం నుంచి విడుదలైన అండం ట్యూబ్‌లలోకి ప్రవేశిస్తుంది. ఒకసారి విడుదలైన తర్వాత అండం 24 గంటలు మాత్రమే జీవిస్తుంది. (అంటే యాక్టివ్‌గా ఉంటుంది. ఆ తర్వాత నిర్వీర్యమవుతుంది). ఆ సమయంలో కలయిక ద్వారా విడుదలైన వీర్యకణాలు ట్యూబ్‌లలోకి చేరి అండాన్ని చుట్టుముడతాయి. అనేక వీర్యకణాల నుంచి విడుదలయ్యే హైలురానిక్ యాసిడ్ వంటి అనేక ఎంజైములు... అండం మీద చిల్లుపడేలా చేస్తాయి. అందులోనుంచి ఒక్క వీర్యకణం మాత్రమే అండంలోకి ప్రవేశిస్తుంది. వెంటనే చిల్లు మూసుకుపోతుంది. అలా ఒక వీర్యకణం, అండం కలిసి ఫలదీకరణ జరిగి పిండం ఏర్పడుతుంది. ఈ ప్రక్రియలో ఎక్కడ లోపాలు ఉన్నాగానీ గర్భం రాకపోవచ్చు. ఈ ప్రక్రియలో శుక్రకణాలు గర్భాశయంలో వెళ్లిన తర్వాత అక్కడ వాటి సంఖ్య తక్కువగా ఉన్నా, వాటి నాణ్యత (క్వాలిటీ), కదలిక (మొటిలిటీ) సరిగా లేనప్పుడు, వాటి నుంచి విడుదలయ్యే ఎంజైములు సరిగా ఉండనప్పుడు గర్భం రాదు. అలాగే అండం నాణ్యత సరిగా లేకపోయినా, అండంపైన పొర బాగా మందంగా ఉన్నా ఫలదీకరణ జరగకపోవచ్చు. వీర్యకణాలు 48 గంటల నుంచి 72 గంటల వరకు జీవించి ఉంటాయి. ఫలదీకరణ లోపాలను తెలుసుకోవడం మామూలుగా కష్టం. పరీక్షలలో వేరే సమస్యలు ఏవీ కనిపించనప్పుడు దంపతులకు ఒక కోర్స్ యాంటీబయాటిక్, మల్టీ విటమిన్, యాంటీఆక్సిడెంట్స్ మాత్రల వంటి రకరకాల మందులు ఇచ్చి చూడటం జరుగుతుంది. అన్ని రకాలుగా ప్రయత్నించినా ఐయూఐ చికిత్స చేసినా గర్భం రానప్పుడు ఫలదీకరణలో సమస్యలు ఉన్నట్లుగా భావించి, ఆ దంపతులకు ఐవీఎఫ్, ఇక్సీ (ఐసీఎస్ఐ / టెస్ట్ ట్యూబ్ బేబీ) పద్ధతులను సూచించడం జరుగుతుంది. ఈ ప్రక్రియలో అండాలను శుక్రకణాలను మైక్రోస్కోప్ కింద విశ్లేషించడం జరుగుతుంది. అలాంటప్పుడు ఒక్కోసారి కొన్ని లోపాలను సైతం గుర్తించే అవకాశం ఉంది. అందులో అనేక అండాలను, శుక్రకణాలను నేరుగా ల్యాబ్‌లో అనేక న్యూట్రిషన్ మీడియాలో కలిపి చూస్తారు. కాబట్టి ఈ ప్రక్రియల ద్వారా ఫలదీకరణ సమస్యలను అధిగమించవచ్చు. అయినా ఫలదీకరణ కాకపోవడం జరగడం, వాటి నాణ్యత బాగా లేకపోయినా, అవసరమైతే దాతల నుంచి స్వీకరించిన అండాలను లేదా శుక్రకణాలను కూడా దంపతులు ఆమోదిస్తే వాడి చూడవచ్చు.

ఇంప్లాంటేషన్ సమస్యలు

ఫెలోపియన్ ట్యూబ్‌ల ద్వారా వచ్చే అండం అక్కడ శుక్రకణాలతో కలిశాక పిండంగా మారి, గర్భసంచిలోకి వచ్చి అక్కడ కాస్తంత పరుపులాగా తయారుగా ఉన్న ఎండోమెట్రియమ్ పొరలోకి అంటుకుపోయి శిశువుగా పెరుగుతుందన్న విషయం తెలిసిందే. ఇలా అండంగా మారిన పిండం, ఎండోమెట్రియమ్‌లోకి అంటుకుపోవడాన్ని 'ఇంప్లాంటేషన్' అంటారు. కొందరిలో ఈ ఇంప్లాంటేషన్ సమస్య వల్ల కూడా పిండం పెరగక సంతానలేమి సమస్య రావచ్చు.

కారణమేమిటి: కొందరిలో ఎలాంటి సమస్యలూ కనిపించకపోయినా, అన్ని పరీక్షలూ మామూలుగా (నార్మల్‌గా)నే ఉన్నా, ప్రాథమికంగా వాడే మందులు వాడినా, నేరుగా వీర్యకణాలను లోపలికి తీసుకెళ్లి వదిలే ప్రక్రియ అయిన ఐయూఐ (ఇంట్రా యుటెరైన్ ఇన్‌సెమినేషన్) చేసినా, పిండాన్ని నేరుగా యుటెరస్ వరకు తీసుకెళ్లే ఐవీఎఫ్ (ఇన్‌విట్రో ఫెర్టిలైజేషన్) జరిపినా, లేదా వీర్యకణాలను నేరుగా అండంలోకే ఇంజెక్షన్ ద్వారా ప్రవేశపెట్టే ఇక్సీ (ఐసీఎస్ఐ – ఇంట్రా సైటోప్లాసమిక్ స్పెర్మ్ ఇంజెక్షన్) పద్ధతి ద్వారా పిండాన్ని నేరుగా యుటెరస్ వరకు పంపినా గర్భం రాకపోవచ్చు. కొందరిలో గర్భాశయం పిండాన్ని స్వీకరించదు. ఇలా ఎందుకు జరుగుతోందనేందుకు కారణాలు ఇంకా తెలియరావడం లేదు. ఇందు కోసం అనేక రకాల పరిశోధనలు, ప్రయోగాలు జరుగుతూనే ఉన్నాయి. పిండం ట్యూబుల్లోకి వచ్చి, గర్భాశయంలో అంటుకుంటేనే అది శిశువుగా రూపొందడం మొదలువుతుంది. ఇంప్లాంటేషన్‌గా చెప్పే ఈ సమయంలో అనేక రకాల హార్మోన్లు, రసాయనాలు, కెమికల్ మీడియేటర్లు, గర్భాశయ పొరలో రక్తప్రసరణ, ఇంకా బయటకు తెలియని చాలా ప్రక్రియలు అన్నీ సరిగా ఉన్నప్పుడే గర్భధారణ జరుగుతుంది. వాటిలో ఏదైనా సమస్య ఉంటే ఎన్ని చికిత్సలు చేసినా ఉపయోగం ఉండదు. అందుకే టెస్ట్‌ట్యూబ్ బేబీ ప్రక్రియ ద్వారా ప్రయత్నించినా, అందులోనూ 40% నుంచి 50% మేరకు మాత్రమే గర్భధారణ కలిగే అవకాశం ఉంటాయి.

ఇంప్లాంటేషన్ సమస్యలకు చికిత్సలో భాగంగా ఐవీఎఫ్‌లో గర్భసంచిలోకి ఎండోమెట్రియమ్ పొరను ప్రేరేపించడం, పిండం పైనా, పొరకీ చిన్నగా చిల్లు పెట్టడం (అసిస్టెడ్ హ్యాచింగ్) వంటి ప్రక్రియలతో పాటు గర్భాశయం పిండాలన్ని తిరస్కరించకుండా ఉండటం కోసం, స్వీకరించేలా చేయడం కోసం యాంటీ ఇమ్యూన్ ఇంజెక్షన్స్ ఇవ్వడం, స్టెరాయిడ్స్ వంటి అనేక రకాల మందులతో చికిత్సలు ఇవ్వడం జరుగుతుంది. కొందరిలో ఎన్ని చేసినా ఇంప్లాంటేషన్ నూటికి నూరు పాళ్లు విజయవంతం కాకపోవచ్చు.



తెలియని కారణాలు:
(అన్ ఎక్స్‌ప్లెయిన్‌డ్ ఇన్‌ఫెర్టిలిటీ): కొందరిలో ఎన్ని పరీక్షలు చేసినా, ఎలాంటి సమస్యా లేదని నిర్ధారణ అయినా ఎంతకూ గర్భం రాదు. ఇందుకు కారణాలు తెలియదు.

మానసిక కారణాలు

మహిళల్లో కనిపించే మానసిక ఒత్తిడి అంశం కూడా గర్భధారణపై చాలావరకు ప్రభావం చూపే అవకాశం ఉంది. కుటుంబంలో కలహాలు, గర్భం రాలేదని బంధువుల, ఇరుగు పొరుగు వారి సూటిపోటి మాటలు, మానసిక వ్యథ వంటి కారణాల వల్ల గర్భధారణకు మొదటి నుంచీ అవసరమైన హార్మోన్ల విడుదలలో అసమతౌల్యత ఏర్పడి అండం విడుదల కాదు. అలాగే ఫలదీకరణ, ఇంప్లాంటేషన్‌లో ఇబ్బందులు ఏర్పడవచ్చు. ఇలాంటి వారికి బయట నుంచి ఎన్ని మందులు ఇచ్చినా, లోపల విడుదల కావాల్సిన హార్మోన్లు సక్రమంగా లేకపోవడం వల్ల గర్భం రావడంలో ఆలస్యమవుతుంది.

అందుకే మానసికంగా కుంగుబాటు వంటి సమస్యలను దరిచేరనివ్వకూడదు. మానసికంగా తీవ్రమైన ఒత్తిడికి గురయ్యేవారు (వారితో పాటు ఇలాంటి సమస్యను దరిచేరనివ్వకూడదని భావించే సాధారణ ఆరోగ్యవంతులు కూడా) యోగా, ధ్యానం, వాకింగ్ వంటి రిలాక్సేషన్ టెక్నిక్స్ అవలంబించాలి. తేలికపాటి వ్యాయామాలు చేయాలి. అవసరమైతే కౌన్సెలింగ్ వంటివి ప్రయత్నించవచ్చు. దాంతో మనకు తెలియకుండానే అసమతౌల్యత తొలగిపోయి, హార్మోన్లు సరిగా పనిచేసి, గర్భం వచ్చే అవకాశాలు పెరుగుతాయి.

(మరికొన్ని వివరాలు తదుపరి వారం)...



డా॥ వేనాటి శోభ, బర్త్‌రైట్ బై రెయిన్‌బో, హైదర్‌నగర్

రుమటాలజీ కౌన్సెలింగ్

ఫ్యామిలీ డాక్టర్

కీళ్లవాతానికి మంచి చికిత్స ఉందా?

నా వయసు 38 ఏళ్లు. గత పదేళ్లుగా కీళ్లవాతంతో బాధపడుతున్నాను. ఎన్నో రకాల మందులు వేసుకున్నా ఫలితం కనిపించలేదు. ఈ వ్యాధి కారణంగా ఉండే బాధను భరించడం కంటే చనిపోవడం మేలన్నంత తీవ్రంగా నొప్పులు ఉంటున్నాయి. ఈ సమస్యకు ఏవైనా పరిష్కారాలు ఉంటే వివరంగా చెప్పండి.

– కల్యాణి, నిజామాబాద్

కీళ్లవాతం సమస్య చాలా తీవ్రమైనది. దీని కారణంగా అనేకమంది కాళ్లు, చేతులు వంకర్లుపోయి, ఇంకొకరి సహాయం లేకుండా కదలలేని పరిస్థితుల్లో ఉండటం చాలా సాధారణంగా కనిపించే అంశం. కీళ్లవాతపు జబ్బులపై సరైన అవగాహన లేకపోవడంతో దీన్ని కొందరు నిర్లక్ష్యం చేసి, వ్యాధిని బాగా ముదరబెట్టుకొని, చివరకు మృత్యువు బారిన పడుతుంటారు. ఆధునిక వైద్యం అందుబాటులోకి రాక ముందు మూలికలు, కొన్ని నాటు పూతమందులు వంటి చాలా పరిమితమైన చికిత్స మాత్రమే ఉండేది.

గతంలో తీవ్రమైన ఆటోఇమ్యూన్ వ్యాధులతో బాధపడేవారిలో జబ్బులు తగ్గడం ఒకింత తక్కువ. అలాగే మరణాలు ఎక్కువగా ఉండేవి. కానీ ఇటీవల ఈ వ్యాధులకు సైతం సరికొత్త చికిత్స విధానాలు అందుబాటులోకి రావడం వల్ల పరిస్థితిలో గణనీయమైన మార్పువచ్చింది. ఈ మందుల కారణంగా రోగుల్లోనూ విశేషమైన మెరుగుదలకు అవకాశం చిక్కింది.

ఇరవయ్యో శతాబ్దం మొదటిభాగంలో మెథోట్రెగ్జేట్, సైక్లోఫాస్ఫమైడ్ అనే మందులు అందుబాటులోకి రావడంతో ఈ వ్యాధులతో బాధపడేవారి సంఖ్య తగ్గింది. ఈ సమస్యతో బాధపడేవారికి ఈ మందులు ప్రాథమిక చికిత్సగా మారాయి. కానీ గత దశాబ్దంలో ఈ సమస్యకు అనేక కొత్త మందులు అందుబాటులోకి వచ్చాయి. వీటిని 'బయోలజిక్స్' అంటారు. కీళ్లవాతం వంటి సమస్యలకు ప్రాథమిక స్థాయిలో నొప్పినివారణ మందులు (పెయిన్‌కిల్లర్స్), చిన్న చిన్న మోతాదుల్లో స్టెరాయిడ్స్ వాడటం తప్పనిసరి. వీటితో పాటు వ్యాధి తీవ్రతను బట్టి 'డీఎమ్ఆర్‌డీఎస్' (డిసీజ్ మాడిఫైయింగ్ యాంటీ రుమాటిక్ (డ్రగ్స్) మందులను రుమటాలజిస్టులు సూచిస్తారు. ఇవి లోపలి నుంచి పనిచేస్తాయి. అయితే చికిత్స మొదలుపెట్టిన వెంటనే పెద్దగా మార్పు కనిపించదు. అలాగే ఈ మందులు క్యాన్సర్‌కి వాడేలాంటివనే అపోహ మరికొందరిలో ఉంది. దాంతో బాధల తీవ్రత చాలా ఎక్కువగానే ఉన్నప్పటికీ కొంత మంది చికిత్సను మధ్యలోనే వదిలేస్తారు. అయితే రోగులు గుర్తుంచుకోవాల్సిందేమిటంటే... నెమ్మదిగా పనిచేసినప్పటికీ వీటి వల్ల మంచి మెరుగదలే ఉంటుంది. అయితే 20% నుంచి 30% మందిలో ఎన్ని మందులు వేసుకున్నా ప్రయోజనం ఉండదు.

బయోలజిక్స్ గురించి: పైన పేర్కొన్నట్లుగా సాధారణ మందులతో పెద్దగా ప్రయోజనం లేని సందర్భాల్లో బయోలజిక్స్ మందులు సమర్థంగా పనిచేసే అవకాశాలున్నాయి.



రుమటాయిడ్ ఆర్థరైటిస్, లూపస్, స్క్లీరోడెర్మా, యాంకైలోజింగ్ స్పాండలైటిస్ వంటి అనేక రకాల ఆటోఇమ్యూన్ వ్యాధులలో ఈ బయోలజిక్స్ మందుల వల్ల వ్యాధి తీవ్రత తగ్గడమే కాకుండా ఈ కారణంగా సంభవించే మరణాలూ బాగా తగ్గుతాయి. ఇక మధ్యలోనే చికిత్స మానేసిన చాలా మంది రోగులు... ఆ తర్వాత తమ వ్యాధులు బాగా ముదరడం వల్ల వ్యాధితీవ్రత బాగా పెరుగుతుంది. ఇలాంటి రోగులకు స్మాల్ మాలెక్యూల్స్, స్టెమ్‌సెల్ థెరపీ వంటి మరింత ఆధునిక చికిత్సలు అందుబాటులో ఉన్నాయి. ఇవి మరింత సమర్థమైన ప్రత్యామ్నాయ చికిత్సలు.


అయితే ఈ ఆధునిక చికిత్సా విధానాలను విచ్చలవిడిగా వాడటం సరికాదు. రోగి పరిస్థితిని బట్టి, వారిలోని వ్యాధి తీవ్రతను బట్టి, ఈ చికిత్సావిధానాల వల్ల కలిగే ప్రయోజనాలూ, నష్టాలను దృష్టిలో పెట్టుకొని చాలా విచక్షణతో వీటిని వాడాల్సి ఉంటుంది. అందుకే రుమటాజిస్టులు ఈ మందుల వల్ల కలిగే లాభనష్టాల నిష్పత్తిని బేరిజు వేసుకొని, ఒక సరైన అంచనాకు వచ్చి ఈ మందులను సూచిస్తారు. కాబట్టి మీరు పై అంశాలన్నింటినీ దృష్టిలో పెట్టుకొని నిపుణులైన రుమటాలజిస్టును సంప్రదించండి. దాంతో మీ ఇబ్బందులు తొలగి, మీ జీవనశైలి మరింత మెరుగవుతుంది.



డాక్టర్ విజయ ప్రసన్న పరిమి
సీనియర్ కన్సల్టెంట్ రుమటాలజిస్ట్, సిటీ న్యూరో సెంటర్, రోడ్ నెం. 12, బంజారాహిల్స్, హైదరాబాద్.

పరి పరిశోధన


కేన్సర్ కణాలను కొవ్వుగా మార్చేస్తారు



కేన్సర్ మహమ్మారిపై పోరులో స్విట్జర్లాండ్ యూనివర్సిటీ శాస్త్రవేత్తలు కీలక ముందడుగు వేశారు. కేన్సర్ కణాలను నిరపాయకరమైన కొవ్వు కణాలుగా మార్చేందుకు వీరు ఒక వినూత్నమైన పద్ధతిని కనుక్కున్నారు. కేన్సర్ కణాలు శరీరంలోని ఇతర ప్రాంతాలకు విస్తరించే విధానాన్నే ఆసరాగా చేసుకుని తాము ఈ కొత్త పద్ధతిని ఆవిష్కరించామని గెర్హార్డ్ క్రిస్టోఫోరీ అంటున్నారు. ఈ కణాలు కొన్నిసార్లు ఎపిథీలియల్ మెసన్‌కైమల్ ట్రాన్సిషన్ అనే ప్రక్రియకు గురవుతూంటాయని ఈ దశలో అవి మూలకణాల మాదిరిగా ఉంటాయని ఆయన వివరించారు. శరీరంలోని ఏ రకమైన కణంగానైనా మారగలిగే సత్తా మూలకణాలదన్నది తెలిసిందే. ఎలుకల్లోకి రొమ్ము కేన్సర్ కణాలను జొప్పించి తాము ప్రయోగాలు చేశామని.. మధుమేహానికి వాడే రోసిగ్లిటాజోన్, కేన్సర్ చికిత్సకు ఉపయోగించే ట్రామిటినిబ్‌లను ఆ ఎలుకలపై వాడినప్పుడు కేన్సర్ కణాలు కొన్ని కొవ్వు కణాలుగా మారుతున్నట్లు తాము గుర్తించామని... అంతేకాకుండా ఈ మందుల ప్రయోగం తరువాత కేన్సర్ కణాల విస్తరణ కూడా లేకుండా పోయిందని క్రిస్టోఫోరీ తెలిపారు. ఈ పద్ధతిలో వాడిన మందులు రెండింటికీ ఇప్పటికే అనుమతులు ఉండటం వల్ల మానవ ప్రయోగాలు త్వరలో మొదలవుతాయని... కీమోథెరపీతోపాటు ఈ కొత్త పద్ధతిని వాడటం ద్వారా కేన్సర్‌కు మెరుగైన చికిత్స కల్పించవచ్చునని వివరించారు.

* * *

గాలినే శక్తిగా మార్చేసుకుంటుంది




ఈ రోజుల్లో అన్నీ స్మార్ట్ అయిపోతున్నాయి. టీవీ, ఫ్రిజ్, వాచీలన్నీ నెట్‌కు అనుసంధానమైపోతున్నాయి. మరి ప్రతిదాంట్లోనూ ఓ బ్యాటరీ ఉంటే.. వాటిని చార్జ్ చేసుకోవడం ఎంత ఇబ్బందో ఒక్కసారి ఆలోచించండి. ఈ సమస్యను అధిగమించేందుకు ఇజ్రాయెల్ కంపెనీ విలియట్ ఓ వినూత్నమైన టెక్నాలజీని ఆవిష్కరించింది. బ్యాటరీ అన్నది అవసరం లేకుండా బ్లూటూత్ టెక్నాలజీతో పనిచేసే మైక్రోచిప్‌ను తయారు చేశారు. కాగితం మందం, పోస్టల్ స్టాంప్ సైజులో ఉండే ఈ మైక్రోచిప్ బరువుతో పాటు ఉష్ణోగ్రతలను గుర్తించగలదు. ఆ సమాచారాన్ని బ్లూటూత్ టెక్నాలజీ ద్వారా మూడు మీటర్ల దూరం వరకూ పంపగలదు. ఇందుకు కావాల్సిన శక్తిని మొత్తం వైఫై, బ్లూటూత్, సెల్ సిగ్నల్స్ నుంచి సేకరిస్తుంది. ఈ రకమైన మైక్రో చిప్‌ల కారణంగా సెల్‌ఫోన్ సంకేతాల ద్వారా వెలువడే రేడియోధార్మికత కొంత మళ్లీ వినియోగంలోకి వస్తుందని అంచనా. ఇటీవల జరిగిన ఒక ప్రదర్శనలో తాము ఈ మైక్రోచిప్‌ను ప్రదర్శించామని శాంసంగ్, అమెజాన్ వంటి ప్రముఖ సంస్థలు విలియట్‌లో పెట్టుబడులు పెడుతున్నట్లు సమాచారం. ఇప్పటివరకూ నెట్‌కు అనుసంధానం కాని గాడ్జెట్‌లను కూడా ఈ కొత్త మైక్రోచిప్ ద్వారా కనెక్ట్ చేయవచ్చునని విలియట్ సీఈవో తల్ తామీర్ తెలిపారు.

* * *

కేన్సర్‌పై పోరాటానికి ప్రొటీన్ సిద్ధమైంది



దుష్ప్రభావాలు ఏమీ లేకుండానే కేన్సర్‌కు చికిత్స కల్పించాలన్న శాస్త్రవేత్తల ప్రయత్నాలు ఒక కొలిక్కి వస్తున్నాయి. వాషింగ్టన్ యూనివర్సిటీ శాస్త్రవేత్తలు ఇందుకోసం ఒక ప్రొటీన్‌ను కృత్రిమంగా సిద్ధం చేశారు. రోగ నియంత్రణ వ్యవస్థలో కీలకమైన ఇంటర్‌ల్యూకిన్ -2 (ఐఎల్ -2) కేన్సర్‌తోపాటు మధుమేహం, ఆర్థరైటిస్ వంటి అనేక ఆటోఇమ్యూన్ వ్యాధులకు చికిత్స కల్పించగలదు. అయితే దుష్ప్రభావాలు చాలా ఎక్కువ. ఈ నేపథ్యంలో వాషింగ్టన్ యూనివర్సిటీకి చెందిన ప్రొటీన్ డిజైన్ విభాగం కంప్యూటర్ ప్రోగ్రామ్ ద్వారా ఐఎల్-2 ను పోలిన కృత్రిమ ప్రొటీన్‌ను డిజైన్ చేశారు. జంతువుల్లో జరిగిన ప్రయోగాల్లో ఈ కృత్రిమ ప్రొటీన్ కేన్సర్ కణాలపై దాడి చేయగల టీ- కణాలను చైతన్యవంతం చేసినట్లు స్పష్టమైంది. అంతేకాదు.. నియో -2/15 అని పిలిచే ఈ కృత్రిమ ప్రొటీన్ ఇంటర్‌ల్యూకిన్ -15 ప్రొటీన్‌లా కూడా పనిచేస్తుంది. శాస్త్రవేత్తలు దాదాపు 30 ఏళ్లుగా ఐఎల్-2ను సురక్షితంగా చేసేందుకు ప్రయత్నిస్తున్నారని.. నియో -2/15 ద్వారా ఇది సాధ్యమవుతోందని ఈ పరిశోధనలకు నేతృత్వం వహించిన శాస్త్రవేత్త డేయిన్ అడ్రియానో సిల్వా తెలిపారు. అన్నీ సవ్యంగా సాగితే నియో -2/15 ద్వారా కేన్సర్‌కు మరింత మెరుగైన, దుష్ప్రభావాలు ఏవీ లేని చికిత్స అందుతుందని అంచనా.



- క్లాట్ పరీక్ష షెడ్యూల్ విడుదల
- ఈ ఏడాది నుంచి మళ్లీ ఆఫ్‌లైన్ విధానంలోనే పరీక్ష
- 21 నేషనల్ లా యూనివర్సిటీల్లో 2500 సీట్లు
- లా కోర్సులకు పెరుగుతున్న డిమాండ్
- కార్పొరేట్ రంగంలోనూ కొలువులు

నాణ్యమైన న్యాయ విద్యకు క్లాట్-2019

లా.. కార్పొరేట్ రూపు సంతరించుకుంటోంది! న్యాయశాస్త్ర విద్యార్థులకు డిమాండ్ పెరుగుతోంది! అంతేకాదు ప్రముఖ 'లా' యూనివర్సిటీల నుంచి న్యాయవాద కోర్సు పూర్తిచేసిన అభ్యర్థులకు కార్పొరేట్ కంపెనీలు రెడ్‌కార్పెట్ స్వాగతం పలుకుతున్నాయి. ప్రముఖ లా ఇన్‌స్టిట్యూట్స్‌లో ఇంటర్మీడియెట్ అర్హత తోనే లా కోర్సుల్లో చేరడానికి మార్గం.. క్లాట్ (కామన్ లా అడ్మిషన్ టెస్ట్)! ఇంజనీరింగ్‌కు ఐఐటీలు, మేనేజ్‌మెంట్‌కు ఐఐఎంల మాదిరిగానే.. న్యాయవిద్యలో నాణ్యమైన విద్యను అందుబాటులో తెచ్చేందుకు జాతీయ స్థాయిలో నెలకొల్పిన ఇన్‌స్టిట్యూట్‌లే.. నేషనల్ లా యూనివర్సిటీలు/ ఇన్‌స్టిట్యూట్‌లు. వీటిలో అడుగుపెట్టేందుకు వీలు కల్పించే క్లాట్-2019కు నోటిఫికేషన్ విడుదలైంది. ఈ నేపథ్యంలో క్లాట్ పరీక్ష తీరుతెన్నులు, ప్రవేశం కల్పించే యూనివర్సిటీలు, కెరీర్ అవకాశాల గురించి తెలుసుకుందాం..

న్యాయ విద్య(లా).. మనం సంప్రదాయ న్యాయవాద వృత్తికి కేరాఫ్‌గా భావించే కోర్సు. లా ఇప్పుడు ఆధునిక రూపు సంతరించుకుంటోంది. న్యాయవాద కోర్సుతో ప్రస్తుతం సంప్రదాయ అడ్వొకేట్ వృత్తితోపాటు బహుళ జాతి సంస్థల్లోనూ కొలువులు సొంతం చేసుకోవచ్చు. న్యాయ విద్యకు, లా గ్రాడ్యుయేట్లకు పెరుగుతున్న ప్రాధాన్యం దృష్ట్యా దేశవ్యాప్తంగా పభుత్వం నేషనల్ లా యూనివర్సిటీలు ఏర్పాటుచేసింది. వీటిలో ఇంటర్మీడియెట్ అర్హతగా ప్రవేశం కల్పించే అయిదేళ్ల ఇంటిగ్రేటెడ్ బీఏ ఎల్‌ఎల్‌బీ కోర్సుకు పోటీ ఎక్కువగా ఉంది. నేషనల్ లా యూనివర్సిటీలు.. కామన్ లా అడ్మిషన్ టెస్ట్ (క్లాట్)-యూజీ పేరుతో జాతీయస్థాయిలో నిర్వహించే పరీక్షలో మెరిట్ జాబితాలో నిలిస్తేనే ప్రవేశం లభిస్తుంది.



క్లాట్-యూజీ: 2019

క్లాట్-యూజీ-2019 షెడ్యూల్‌ను పరిశీలిస్తే రెండు ప్రధాన మార్పులు గమనించొచ్చు. అవి.. ఈ ఏడాది నుంచి పరీక్షను మళ్లీ ఆఫ్‌లైన్(పెన్-పేపర్) విధానంలో నిర్వహించాలని నిర్ణయించారు. మరోవైపు గతేడాదితో పోల్చితే ఈ సంవత్సరం క్లాట్‌తో ప్రవేశం కల్పించే నేషనల్ లా యూనివర్సిటీల సంఖ్య పెరిగింది. ఈ ఏడాది మొత్తం 21 నేషనల్ లా యూనివర్సిటీల్లో క్లాట్-యూజీ మెరిట్ ఆధారంగా ప్రవేశం పొందొచ్చు.

- క్లాట్-యూజీ పరీక్ష మొత్తం అయిదు విభాగాల్లో ఆబ్జెక్టివ్ ప్రశ్నల విధానంలో జరుగుతుంది.

విభాగం	ప్రశ్నలు	మార్కులు
ఇంగ్లిష్ కాంప్రెహెన్షన్	40	40
జీకే అండ్ కరెంట్ అఫైర్స్	50	50
ఎలిమెంటరీ మ్యాథమెటిక్స్ (న్యూమరికల్ ఎబిలిటీ)	20	20
లీగల్ ఆప్టిట్యూడ్	50	50
లాజికల్ రీజనింగ్	40	40
మొత్తం	200	200

- **పరీక్ష వ్యవధి:** రెండు గంటలు

విజయానికి మార్గాలు

- క్లాట్-యూజీ పరీక్ష ఔత్సాహికులు సంబంధిత విభాగాల్లో, మొత్తంగా టాప్ స్కోర్ సొంతం చేసుకోవాలంటే.. ఆయా విభాగాలకు సంబంధించి పదోతరగతి, ఇంటర్మీడియెట్ స్థాయిలోని అంశాలపై దృష్టిసారించాలి.
- బేసిక్ గ్రామర్, ఇంగ్లిష్ లాంగ్వేజ్‌లో ప్రాథమిక పరిజ్ఞానం సొంతం చేసుకుంటే ఇంగ్లిష్ కాంప్రెహెన్షన్ విభాగంలో మంచి మార్కులు సొంతం చేసుకోవచ్చు. వొకాబ్యులరీపై పట్టు సాధించడం ద్వారా కాంప్రెహెన్షన్ నైపుణ్యాలు మెరుగవుతాయి. ప్రశ్నలను సులువుగా సాధించగలిగే సామర్థ్యం లభిస్తుంది. టెన్సెస్, సెంటెన్స్ ఫార్మేషన్, సెంటెన్స్ కరెక్షన్, యాక్టివ్ అండ్ ప్యాసివ్ వాయిస్, డైరెక్ట్-ఇన్‌డైరెక్ట్ స్పీచ్ వంటి బేసిక్ గ్రామర్ అంశాలపై పట్టు సాధించాలి.
- జీకే అండ్ కరెంట్ అఫైర్స్ విభాగంలో చరిత్ర, భారత రాజ్యాంగం నుంచి ప్రశ్నలు అడుగుతారు. కాబట్టి జాతీయోద్యమంలో కీలక ఘట్టాలపై దృష్టిపెట్టాలి. భారత రాజ్యాంగానికి సంబంధించి రాజ్యాంగ రూపకల్పన నుంచి తాజా సవరణల వరకు అన్నీ తెలుసుకోవాలి. కరెంట్ అఫైర్స్‌కు సంబంధించి అంతర్జాతీయ స్థాయిలో ద్వైపాక్షిక ఒప్పందాలు, ముఖ్యమైన సంఘటనలు, సదస్సులపై అవగాహన పెంచుకోవాలి. ప్రామాణిక జనరల్ నాలెడ్జ్ పుస్తకాలతోపాటు, రోజూ ప్రామాణిక ఇంగ్లిష్/తెలుగు దినపత్రికలు చదవడం అలవాటు చేసుకోవాలి.
- మ్యాథమెటిక్స్ (న్యూమరికల్ ఆప్టిట్యూడ్)కు సంబంధించి పదోతరగతి స్థాయిలోని గణిత సబ్జెక్ట్ అంశాలపై పట్టు సాధించాలి. గత ప్రశ్నపత్రాలను పరిశీలిస్తే అర్థమెటిక్‌కు ఎక్కువ వెయిటేజీ కనిపిస్తోంది. దీన్ని పరిగణనలోకి తీసుకొని పర్సంటేజెస్, టైమ్ అండ్ డిస్టెన్స్, టైమ్ అండ్ స్పీడ్, యావరేజ్, రేషియో తదితర అంశాలను ప్రాక్టీస్ చేయాలి.
- క్లాట్-యూజీలో.. అభ్యర్థులు కొత్తగా భావించే విభాగం లీగల్ ఆప్టిట్యూడ్. విద్యార్థుల్లోని న్యాయపరమైన దృక్పథం, సహేతుక ఆలోచన ధోరణి, నిర్ణయ సామర్థ్యాలను పరిశీలించే విధంగా ప్రశ్నలు ఉంటాయి. నిర్దిష్టంగా ఒక సంఘటన, వివాదాన్ని పరిష్కరించేందుకు అందరికీ ఆమోదయోగ్యమైన పరిష్కారం కనుగొనే నైపుణ్యం పొందాలి. ముఖ్యమైన చట్టాలు, న్యాయ శాఖకు సంబంధించి ఇటీవల కాలంలో చోటుచేసుకున్న తాజా పరిణామాలు, లీగల్ టెర్మినాలజీపై అవగాహన పెంచుకోవడం ద్వారా మంచి మార్కులు సాధించొచ్చు.
- అభ్యర్థుల్లోని తార్కిక విశ్లేషణ సామర్థ్యాన్ని పరీక్షించే విభాగం.. లాజికల్ రీజనింగ్. ఇందులో ప్యాసేజ్ ఆధారిత ప్రశ్నలు; అసెర్షన్ అండ్ రీజనింగ్ ప్రశ్నలు అడుగుతారు. ఇందుకోసం సిలాజిజమ్, కోడింగ్-డీకోడింగ్, డైరెక్షన్, అనాలజీ, సిరీస్, సీటింగ్ అరేంజ్‌మెంట్ వంటి అంశాలపై అవగాహన పొందాలి. స్టేట్‌మెంట్ ఆధారిత ప్రశ్నల కోసం కంపేరిటివ్ అప్రోచ్‌ను అలవర్చుకోవాలి.

క్లాట్‌తో ప్రవేశాలు కల్పించే నేషనల్ లా యూనివర్సిటీలు

- నేషనల్ లా స్కూల్ ఆఫ్ ఇండియా యూనివర్సిటీ- బెంగళూరు.
- నల్సార్ - హైదరాబాద్.
- నేషనల్ లా యూనివర్సిటీ - భోపాల్.
- వెస్ట్ బెంగాల్ నేషనల్ యూనివర్సిటీ ఆఫ్ జ్యురిడికల్ సైన్సెస్-కోల్‌కతా.
- నేషనల్ లా యూనివర్సిటీ- జోధ్‌పూర్.
- హిదయతుల్లా నేషనల్ లా యూనివర్సిటీ- రాయ్‌పూర్.
- గుజరాత్ నేషనల్ లా యూనివర్సిటీ- గాంధీనగర్.
- డా. రామ్‌మనోహర్ లోహియా నేషనల్ లా యూనివర్సిటీ- లక్నో.
- రాజీవ్‌గాంధీ నేషనల్ యూనివర్సిటీ ఆఫ్ లా - పంజాబ్.
- చాణక్య నేషనల్ లా యూనివర్సిటీ - పాట్నా.
- ద నేషనల్ యూనివర్సిటీ ఆఫ్ అడ్వాన్స్‌డ్ లీగల్ స్టడీస్ -కోచి.
- నేషనల్ లా యూనివర్సిటీ - కటక్ (ఒడిశా).
- నేషనల్ యూనివర్సిటీ ఆఫ్ స్టడీ అండ్ రీసెర్చ్ ఇన్ లా - రాంచి.
- నేషనల్ లా యూనివర్సిటీ అండ్ జ్యుడీషియల్ అకాడమీ - అసోం.
- దామోదరం సంజీవయ్య నేషనల్ లా యూనివర్సిటీ - విశాఖపట్నం.
- తమిళనాడు నేషనల్ లా స్కూల్-తిరుచిరాపల్లి.
- మహారాష్ట్ర నేషనల్ లా యూనివర్సిటీ-ముంబై.
- మహారాష్ట్ర నేషనల్ లా యూనివర్సిటీ -నాగ్‌పూర్.
- మహారాష్ట్ర నేషనల్ లా యూనివర్సిటీ - ఔరంగాబాద్.
- హిమాచల్‌ప్రదేశ్ నేషనల్ లా యూనివర్సిటీ - సిమ్లా.
- ధర్మశాస్త్ర నేషనల్ లా యూనివర్సిటీ (ఎంపీడీఎన్‌ఎల్‌యూ) - జబల్‌పూర్.

గమనిక: ఈ ఏడాది నుంచి కొత్తగా సిమ్లా, జబల్‌పూర్ క్యాంపస్‌లు అందుబాటులోకి వచ్చాయి.



చదవాల్సిన పుస్తకాలు

- క్లాట్ ఎసెన్షియల్స్-అభినవ్ శ్రీవాత్సవ్.
- ఆబ్జెక్టివ్ జనరల్ ఇంగ్లిష్-ఆర్.ఎస్.అగర్వాల్.
- వర్డ్ పవర్ మేడ్ ఈజీ-నార్మన్ లూయిస్.
- క్వాంటిటేటివ్ ఆప్టిట్యూడ్-ఆర్.ఎస్.అగర్వాల్.
- లూసెంట్స్ జనరల్ నాలెడ్జ్.
- లీగల్ ఆప్టిట్యూడ్ -ఎ.పి.భరద్వాజ్.
- అనలిటికల్ రీజనింగ్ -ఎం.కె.పాండే.

మూడు వేల ర్యాంకులోపే

కొత్తగా అందుబాటులోకి వచ్చిన రెండు నేషనల్ లా యూనివర్సిటీలను కలిపి మొత్తం 21 నేషనల్ లా యూనివర్సిటీల్లో 2500 వరకు సీట్లు అందుబాటులో ఉన్నాయి. వీటిలో ప్రవేశం ఖరారు చేసుకోవాలంటే.. మూడు వేల లోపు ర్యాంకుతోనే సాధ్యం. జనరల్ కేటగిరీలో 1700లోపు ర్యాంకుతోనే సీట్లు భర్తీ అయిపోతున్నాయి.

కార్పొరేట్ కొలువులు

ప్రతిష్టాత్మక నేషనల్ లా యూనివర్సిటీల్లో న్యాయవాద కోర్సు పూర్తి చేసుకునే విద్యార్థులకు కార్పొరేట్ కొలువులు ఆహ్వానం పలుకుతున్నాయి. ముఖ్యంగా అంతర్జాతీయ స్థాయిలో కార్యకలాపాలు నిర్వహిస్తున్న కంపెనీలు, ఆర్ అండ్ డీ సంస్థలు, బ్యాంకులు వీరికి ప్రాధాన్యం ఇస్తున్నాయి. ఏటా ఆయా ఇన్‌స్టిట్యూట్‌లలో క్యాంపస్ నియామకాలు చేపడుతున్నాయి. సగటున రూ.8 లక్షల నుంచి రూ. 15 లక్షల వార్షిక వేతనం అందుతోంది.

క్లాట్-2019 అర్హత, దరఖాస్తు సమాచారం

- **అర్హత:** 45 శాతం మార్కులతో ఇంటర్మీడియెట్ ఉత్తీర్ణత (రిజర్వ్‌డ్ కేటగిరీ అభ్యర్థులకు అయిదు శాతం సడలింపు). చివరి సంవత్సరం చదువుతున్న అభ్యర్థులు కూడా అర్హులే.
- **వయో పరిమితి:** ఈ ఏడాది ఎలాంటి గరిష్ట వయో పరిమితి నిబంధన లేదు.

ముఖ్య తేదీలు

- **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్లో.
- **దరఖాస్తు తేదీలు:** జనవరి 13 నుంచి మార్చి 31 వరకు.
- **క్లాట్ పరీక్ష తేదీ:** మే 12, 2019.
- **ఫలితాల వెల్లడి:** మే చివరి వారం లేదా జూన్ మొదటి వారం.
- **పూర్తి వివరాలకు వెబ్‌సైట్:** https://clatconsortiumofnlu.ac.in

క్లాట్-పీజీ

ప్రతిష్టాత్మక నేషనల్ లా యూనివర్సిటీల్లో ఇంటిగ్రేటెడ్ బీఏ ఎల్‌ఎల్‌బీ కోర్సులే కాకుండా.. పీజీ కోర్సులు కూడా అందుబాటులో ఉన్నాయి. వీటిలో ప్రవేశానికి కూడా జాతీయస్థాయిలో క్లాట్-పీజీ పేరుతో ఎంట్రన్స్ నిర్వహించి అందులో మెరిట్ ఆధారంగా సీట్లు భర్తీ చేస్తారు. ఎల్‌ఎల్‌బీ పూర్తిచేసిన అభ్యర్థులు క్లాట్ పీజీకి దరఖాస్తు చేసుకోవచ్చు.

ఆఫ్‌లైన్‌కు కారణమదే..

క్లాట్-యూజీ 2019ను తిరిగి గతంలో మాదిరిగా ఆఫ్‌లైన్‌లో నిర్వహించాలని నిర్ణయించడానికి ముఖ్య కారణం.. ఆన్‌లైన్ విధానంలో సాంకేతిక సమస్యలు ఎదురవుతున్నాయని విద్యార్థుల నుంచి వినతులు రావడమే. దీంతో లా యూనివర్సిటీల కన్సార్షియం 2019 నుంచి క్లాట్‌ను ఆఫ్‌లైన్ విధానంలో నిర్వహించాలనే అభిప్రాయాన్ని ఆమోదించారు.

– ప్రొఫెసర్ శ్రీకృష్ణ దేవరావు,
క్లాట్-2019 కన్వీనర్, వీసీ,
నేషనల్ లా యూనివర్సిటీ-కటక్.

ఉద్యోగ సమాచారం

28 నుంచి ఆర్మీ రిక్రూట్‌మెంట్ ర్యాలీ

టెరిటోరియల్ ఆర్మీలో.. సోల్జర్(జనరల్ డ్యూటీ), సోల్జర్(క్లర్క్), సోల్జర్ (ట్రేడ్స్‌మెన్) వంటి వివిధ ఉద్యోగాల భర్తీకి రిక్రూట్‌మెంట్ ర్యాలీ జరగనుంది. జనవరి 28 నుంచి ఫిబ్రవరి 3వ తేదీ వరకూ.. హైదరాబాద్‌లోని మౌలాలీలో ఈ రిక్రూట్‌మెంట్ ర్యాలీ నిర్వహించనున్నట్లు సంబంధిత అధికారులు ప్రకటన విడుదల చేశారు. తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, మహారాష్ట్ర, కేరళ, రాజస్థాన్, తమిళనాడు, గుజరాత్, గోవా, పాండిచ్చేరి, దాదర్ నగర్ హవేలీ, డామన్, డయ్యూ, లక్షదీవుల అభ్యర్థులు ఈ ర్యాలీలో పాల్గొనేందుకు అర్హులు. 18-42 ఏళ్ల మధ్య వయసు గల అభ్యర్థులు అర్హులు. సోల్జర్(జనరల్ డ్యూటీ), సోల్జర్ ట్రేడ్స్‌మెన్(మెస్ కీపర్ పోస్టులకు 8వ తరగతి) పోస్టులకు పదోతరగతి పాసై ఉండాలి. సోల్జర్(క్లర్క్)కు 10+2 ఉత్తీర్ణత తప్పనిసరి. తెలంగాణ, ఆంధ్రప్రదేశ్‌లకు చెందిన అభ్యర్థులకు జనవరి 28న ఉదయం 5గంటల నుంచే ఎంపిక ప్రక్రియ జరుగుతుంది. రిపోర్ట్ చేయాల్సిన చిరునామా 1105, రైల్వే ఇంజనీర్ (టెరిటోరియల్ ఆర్మీ), మౌలాలీ, హైదరాబాద్.

ఆర్మీ-ఎన్‌సీసీ స్పెషల్ ఎంట్రీ స్కీమ్

ఇండియన్ ఆర్మీ ఎన్‌సీసీ స్పెషల్ ఎంట్రీ స్కీమ్ 46వ కోర్సు ద్వారా షార్ట్ సర్వీస్ కమిషన్ ఆఫీసర్ పోస్టుల భర్తీకి అవివాహిత పురుష, మహిళా అభ్యర్థుల నుంచి దరఖాస్తులు కోరుతోంది.

- **మొత్తం ఖాళీలు:** 55 (ఎన్‌సీసీ పురుషులు-50, మహిళలు-5).
- **అర్హత:** కనీసం 50% మార్కులతో గ్రాడ్యుయేషన్ ఉత్తీర్ణత. చివరి ఏడాది చదువుతున్న వారు కూడా దరఖాస్తు చేసుకోవచ్చు. ఎన్‌సీసీ -సీ సర్టిఫికెట్‌తో పాటు నిర్దిష్ట శారీరక ప్రమాణాలుండాలి.
- **వయసు:** 2019, జూలై 1 నాటికి 19-25 ఏళ్ల మధ్య ఉండాలి.
- **ఎంపిక:** స్టేజ్ 1, 2 పరీక్షలు, ఎస్‌ఎస్‌బీ ఇంటర్వ్యూ, మెడికల్ ఎగ్జామ్ ఆధారంగా.
- **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్‌లో.
- **దరఖాస్తుకు చివరితేదీ:** ఫిబ్రవరి 7, 2019.
- **పూర్తి వివరాలకు వెబ్‌సైట్:** www.joinindianarmy.nic.in

ఇండియన్ కోస్ట్ గార్డ్‌లో నావిక్ పోస్టులు

భారత ప్రభుత్వ రక్షణ మంత్రిత్వ శాఖకు చెందిన ఇండియన్ కోస్ట్‌గార్డు 10+2 ఎంట్రీ-02 /2019 బ్యాచ్ ద్వారా నావిక్ (జనరల్ డ్యూటీ) పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

- **అర్హత:** కనీసం 50% మార్కులతో మ్యాథ్స్, ఫిజిక్స్ సబ్జెక్టులతో 10+2 ఉత్తీర్ణత. నిర్దేశిత శారీరక, వైద్య ప్రమాణాలుండాలి.
- **వయసు:** 18-22 ఏళ్ల మధ్య ఉండాలి.
- **ఎంపిక:** రాత పరీక్ష, ఫిజికల్ ఫిట్‌నెస్ టెస్ట్ ఆధారంగా ఎంపిక ఉంటుంది.
- **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్‌లో.
- **దరఖాస్తు ప్రారంభతేదీ:** జనవరి 21, 2019.
- **దరఖాస్తుకు చివరితేదీ:** జనవరి 31, 2019.
- **పూర్తి వివరాలకు వెబ్‌సైట్:** www.joinindiancoastguard.gov.in

బ్యాంక్స్ క్లర్క్స్ మెయిన్ గ్రాండ్ టెస్ట్

ఐబీపీఎస్ క్లర్క్స్ మెయిన్ అభ్యర్థుల కోసం సాక్షి.. ఆన్‌లైన్‌లో విద్య వీక్లీ టెస్ట్- 3ను నిర్వహిస్తోంది. సాక్షి విద్య నిపుణులు రూపొందించిన ఈ పరీక్షను ఈ వారం ఆన్‌లైన్‌లో ఎక్కడి నుంచైనా, ఎప్పుడైనా రాయొచ్చు. కీ, సొల్యూషన్స్‌తోపాటు ఫలితాలు, రాష్ట్ర స్థాయి ర్యాంకులను తెలుసుకోవచ్చు. ఒకసారి రిజిస్టర్ చేసుకుని ఎన్నిసార్లు అయినా గ్రాండ్ టెస్ట్ ప్రాక్టీస్ చేసుకోవచ్చు. అభ్యర్థులు www.sakshieducation.com ద్వారా రిజిస్టర్ చేసుకోవాలి. ఉత్తమ ప్రతిభ కనబర్చిన వారికి హైదరాబాద్‌లోని IACE ఇన్‌స్టిట్యూట్ బహుమతులను అందజేస్తుంది.

Vidya Weekly Test- 3
IBPS Clerks Main Grand Test
190 Qns | 200 Marks | 160 Min
Gifts Sponsored By IACE

- ఇంజనీరింగ్, టెక్నాలజీ రంగాల్లో పరిశోధనలకు ప్రోత్సాహం
- ఎంహెచ్‌ఆర్‌డీ, ఐఐటీలు, ఐఐఎస్సీల సంయుక్త నిర్వహణ
- కీలకమైన పది విభాగాల్లో పరిశోధన ప్రతిపాదనలకు ఆహ్వానం
- ఇంప్రింట్-2కు కొత్త ప్రతిపాదనలు స్వీకరణ

స్వదేశీ సాంకేతిక ముద్ర.. ఇంప్రింట్

ఇంజనీరింగ్, సాంకేతిక రంగాల్లో ఎదురవుతున్న సవాళ్లను అధిగమించేందుకు.. గుర్తించిన కీలకమైన పది విభాగాల్లో స్వదేశీ టెక్నాలజీ అభివృద్ధి దిశగా పరిశోధనలు సాగించడం లక్ష్యంగా ప్రారంభించిన ప్రాజెక్టు... ఇంప్రింట్ (ఇంపాక్టింగ్ రీసెర్చ్ ఇన్నోవేషన్ అండ్ టెక్నాలజీ) ఇండియా. ఇందులో భాగంగా దేశంలోని రీసెర్చ్, టెక్నాలజీ ఇన్‌స్టిట్యూట్‌ల నుంచి వచ్చే పరిశోధన ప్రతిపాదనలను వేగంగా పరిశీలించి త్వరితగతిన అనుమతులిచ్చేందుకు సింగిల్ విండో విధానం అమలవుతోంది. కేంద్ర మానవ వనరుల అభివృద్ధి మంత్రిత్వ శాఖ (ఎంహెచ్‌ఆర్‌డీ).. ఐఐటీలు, ఐఐఎస్సీలతో సంయుక్తంగా అమలు చేస్తున్న ప్రాజెక్ట్.. ఇంప్రింట్ ఇండియా. ప్రస్తుతం ఇంప్రింట్-2 స్కీమ్‌కు దరఖాస్తు ప్రక్రియ కొనసాగుతున్న నేపథ్యంలో... ఇంప్రింట్ లక్ష్యం, అర్హతలు, దరఖాస్తు విధివిధానాలు తెలుసుకుందాం...





ఇంజనీరింగ్, టెక్నాలజీ రంగాల్లో పరిశోధనల ద్వారా నూతన ఆవిష్కరణలు చేసేందుకు కేంద్ర ప్రభుత్వం ఇంప్రింట్ ఇండియా పథకానికి శ్రీకారం చుట్టింది. ఇది దేశంలోని అత్యున్నత విద్యాసంస్థల సంయుక్త పరిశోధన ప్రోత్సాహక పాజెక్టుగా చెప్పవచ్చు. 2015లో ప్రారంభమై విజయవంతంగా అమలవుతున్న ఇంప్రింట్ ఇండియా స్కీమ్.. నూతన ఆవిష్కరణలను ప్రోత్సహించే క్రమంలో తాజాగా ఔత్సాహికుల నుంచి దరఖాస్తులు స్వీకరిస్తోంది. ఈ ఏడాది ఇంప్రింట్ 2 పేరుతో ముఖ్యమైన 20 ప్రత్యేక టెక్నాలజీ థీమ్స్‌లకు సంబంధించి ప్రాజెక్టు ప్రతిపాదనలను ఆన్‌లైన్లో స్వీకరిస్తోంది. ఈ ఇంప్రింట్-2ను ఇంప్రింట్-2 సి (సొసైటల్ మిషన్ ప్రాజెక్టు)గా పిలుస్తున్నారు.

ఇంప్రింట్ లక్ష్యం

- దేశంలో సామాజికంగా సవాలుగా మారిన, తక్షణ పరిష్కారం అవసరమైన సమస్యలను గుర్తించడం, ఇన్‌స్టిట్యూట్‌ల స్థాయిలోనే పరిశోధనలు నిర్వహించి పరిష్కార మార్గాలను ఆవిష్కరించడం ఇంప్రింట్- ఇండియా ప్రధాన ఉద్దేశం. ఇందుకోసం పరిశోధనల పరంగా పేరు గడించిన ఐఐటీలు, ఐఐఎస్సీ ద్వారా ఇంప్రింట్ లక్ష్యాలను అందుకోవాలని కేంద్ర ప్రభుత్వం నిర్ణయించింది.
- అడ్వాన్స్‌డ్ మెటీరియల్స్, ఎనర్జీ, ఎన్విరాన్‌మెంటల్ సైన్స్ అండ్ క్లైమేట్ చేంజ్, హెల్త్‌కేర్, ఐసీటీ (ఇన్ఫర్మేషన్ అండ్ కమ్యూనికేషన్ టెక్నాలజీ), మాన్యుఫ్యాక్చరింగ్, నానో టెక్నాలజీ, హార్డ్‌వేర్, సెక్యూరిటీ అండ్ డిఫెన్స్, సస్టెయినబుల్ హాబిటెట్స్, వాటర్ రిసోర్సెస్ అండ్ రివర్ సిస్టమ్స్.. అనే పది డొమైన్లల్లో అత్యున్నత పరిశోధనలు చేయడమే లక్ష్యంగా ఇంప్రింట్ పనిచేస్తుంది.
- ప్రస్తుతం ఇంప్రింట్-2లో భాగంగా కొత్త పరిశోధన ప్రతిపాదనలు స్వీకరిస్తున్నారు. ఈ పథకం ప్రారంభం అయినప్పటి నుంచి 2612 ప్రతిపాదనలు రాగా... 259 ప్రతిపాదనలకు అత్యున్నత స్థాయి కమిటీ ఆమోదం లభించింది. వీటిలో 142 ప్రాజెక్టులకు ఇప్పటికే నిధులు సైతం విడుదల చేయడం జరిగింది.
- ఎంపికైన ప్రాజెక్టులకు ఆర్థిక వనరులను ప్రభుత్వమే అందజేస్తుంది. ప్రాజెక్టు నిర్వహణకు అవసరమైన అత్యున్నత మౌలిక వసతులు కల్పిస్తుంది. ప్రస్తుతం ఈ ప్రాజెక్టుకు ఐఐటీలు, ఐఐఎస్సీలు కోఆర్డినేటింగ్ ఇన్‌స్టిట్యూట్‌లుగా వ్యవహరిస్తున్నాయి. మున్ముందు అన్ని యూనివర్సిటీలకు ఈ పథకాన్ని వర్తింపజేసే యోచనలో ప్రభుత్వం ఉంది. ప్రాజెక్టుకు అవసరం అయిన మొత్తాన్ని కేంద్ర మానవ వనరుల మంత్రిత్వ శాఖ సంబంధిత డొమైన్ మంత్రిత్వ శాఖ/డిపార్ట్‌మెంట్/కౌన్సిల్ సహాయంతో సమకూరుస్తుంది. ఇప్పటివరకు వివిధ ప్రాజెక్టులకు సంబంధించి సుమారు రూ.313 కోట్ల వరకు ప్రభుత్వం వెచ్చించింది.

అర్హత

- రీసెర్చ్ ప్రతిపాదనలను ప్రిన్సిపల్ ఇన్వెస్టిగేటర్ ద్వారా అందజేయాలి. ఆయన కేంద్ర ప్రభుత్వ నిధులతో నడిచే టెక్నలాజికల్ ఇన్‌స్టిట్యూట్‌లకు చెందిన నిపుణుడై ఉండాలి. కేంద్ర ప్రభుత్వ నిధులతో నడిచే విద్యాసంస్థల్లో, ఎంహెచ్‌ఆర్‌డీ నిధులిస్తున్న కేంద్రీయ యూనివర్సిటీలు, ఎంహెచ్‌ఆర్‌డీ ఫండ్ చేస్తున్న ఉన్నత విద్యాసంస్థలు, ఇంజనీరింగ్, టెక్నాలజీలో ఆర్ అండ్ డీ కోర్సులు చేస్తున్న రెగ్యులర్ అకడమిక్స్/రీసెర్చ్ బాధ్యతలు నిర్వహిస్తున్న ఫ్యాకల్టీ మెంబర్, సైంటిస్టులు, సైంటిఫిక్ ఆఫీసర్లు www.serbonline.in వెబ్‌సైట్ ద్వారా ప్రతిపాదనలు పంపించవచ్చు. పదవీ విరమణకు కనీసం నాలుగేళ్ల సమయం ఉండటం తప్పనిసరి.
- అభ్యర్థులు పంపిన ప్రతిపాదనలను వివిధ దశల్లో పరిశీలిస్తారు. అకడమిక్, ఇండస్ట్రీ, పరిశోధన, డెవలప్‌మెంట్ సంస్థలకు చెందిన నిపుణుల బృందంతో నేషనల్ పీర్స్ కమిటీ ఉంటుంది. ఈ కమిటీ స్క్రీనింగ్, రివ్యూయింగ్, మానిటరింగ్ చేస్తుంది. ఎంపికైన ప్రాజెక్టుకు రూ.3 నుంచి రూ.4 కోట్లు ఇస్తారు. ప్రాజెక్ట్ ప్రారంభం అయిన తర్వాత ప్రోగ్రామ్ అడ్వైజరీ కమిటీ, స్టీరింగ్ కమిటీ, అపెక్స్ కమిటీల పర్యవేక్షణ ఉంటుంది. ప్రాజెక్టులను ఎప్పటికప్పుడు జాతీయ స్థాయి సబ్జెక్టు నిపుణులు సమీక్షిస్తారు. వీరు ప్రాజెక్టు ఏజెన్సీలు, మంత్రిత్వశాఖలకు చెందిన సీనియర్ ప్రతినిధులు, సాంకేతిక నిపుణులు, డొమైన్ ఎక్స్‌పర్ట్స్ కమిటీ (డీఈసీ)లతో సంప్రదిస్తారు.
- **వెబ్‌సైట్లు:** www.imprint2.in
http://serbonline.in
https://imprintindia.org

విజయ సమ్రక్రాంతి

భారత్ లక్ష్యాన్ని ఛేదిస్తున్నప్పుడు కోహ్లి తొందరగా ఔటైతే ఒక లెక్క... అతను క్రీజ్‌లో ఉంటే మరో లెక్క...విరాట్ దీనిని మరోసారి చేసి చూపించాడు. తొలి మ్యాచ్ వైఫల్యం తర్వాత ఇప్పుడు మరో అద్భుత సెంచరీతో భారత కెప్టెన్ జట్టును విజయం దిశగా నడిపించాడు. శుభారంభాన్ని కొనసాగించడంతో పాటు చేయాల్సిన రన్‌రేట్ పెరిగిపోతున్నా ఎక్కడా ఒత్తిడికి లోను కాకుండా సాధికారికంగా ఆడిన కోహ్లి సిరీస్‌లో జట్టును సమంగా నిలిపాడు. అంతకు ముందు చక్కటి బౌలింగ్‌తో భువనేశ్వర్ ఆసీస్‌ను దెబ్బ తీసి భారత్‌కు భారీ లక్ష్యం నిర్దేశించకుండా అడ్డుకున్నాడు.

కెప్టెన్ మాటల్లో చెప్పాలంటే అది 'ఎమ్మెస్ క్లాసిక్'... మరికొంత కాలం వరకు విమర్శకులకు ఎలాంటి అవకాశం ఇవ్వని ఇన్నింగ్స్‌తో ధోని తన విలువేంటో చూపించాడు. 42 డిగ్రీల తీవ్ర ఉష్ణోగ్రతలో 50 ఓవర్ల కీపింగ్ తర్వాత బ్యాటింగ్‌లో దాదాపు 20 ఓవర్లు నిలబడి టీమ్‌ను విజయతీరం చేర్చడంలో పాత ధోనిని గుర్తుకు తెచ్చాడు. వేడితో కుప్పకూలే స్థితిలోనూ సింగిల్స్ కోసం తగ్గని శైలితో పాటు సిక్సర్‌తో స్కోరును సమం చేయడం వరకు మాజీ కెప్టెన్ తన మహిమను చూపిస్తే... మరో ఎండ్‌లో కార్తీక్ 'ఫినిషర్' పాత్రను సమర్థంగా పోషించాడు.

- రెండో వన్డేలో 6 వికెట్లతో భారత్ గెలుపు
- కోహ్లి సెంచరీ, ధోని కీలక ఇన్నింగ్స్
- షాన్ మార్ష్ శతకం వృథా
- రేపు చివరి వన్డే


ధోని

మార్ష్

అడిలైడ్: సంక్రాంతి పండగ రోజున భారత క్రికెట్ జట్టు అభిమానులకు ఆనందాన్ని పంచింది. ఆసక్తికరంగా సాగిన పోరులో విజేతగా నిలిచి సిరీస్ ఫలితాన్ని ఆఖరి పోరు వరకు తీసుకెళ్లింది. మంగళవారం ఇక్కడ జరిగిన రెండో వన్డేలో భారత్ 6 వికెట్ల తేడాతో ఆస్ట్రేలియాపై ఘన విజయం సాధించింది. టాస్ గెలిచి ముందుగా బ్యాటింగ్‌కు దిగిన ఆస్ట్రేలియా 50 ఓవర్లలో 9 వికెట్ల నష్టానికి 298 పరుగులు చేసింది. షాన్ మార్ష్ (123 బంతుల్లో 131; 11 ఫోర్లు, 3 సిక్సర్లు) సెంచరీ సాధించగా, గ్లెన్ మ్యాక్స్‌వెల్ (37 బంతుల్లో 48; 5 ఫోర్లు, 1 సిక్స్) రాణించాడు. భారత బౌలర్లలో భువనేశ్వర్ (4/45) మెరుగైన ప్రదర్శన నమోదు చేయగా, షమీకి 3 వికెట్లు దక్కాయి. మరింత భారీ స్కోరు దిశగా దూసుకెళుతున్న దశలో భారత బౌలర్లు చెలరేగడంతో ఆసీస్ 3 పరుగులకే చివరి 4 వికెట్లు కోల్పోయింది. అనంతరం భారత్ 49.2 ఓవర్లలో 4 వికెట్లకు 299 పరుగులు సాధించింది. 'మ్యాన్ ఆఫ్ ద మ్యాచ్' విరాట్ కోహ్లి (112 బంతుల్లో 104; 5 ఫోర్లు, 2 సిక్సర్లు) శతకంతో చెలరేగాడు. మహేంద్ర సింగ్ ధోని (54 బంతుల్లో 55 నాటౌట్; 2 సిక్సర్లు), రోహిత్ శర్మ (52 బంతుల్లో 43; 2 ఫోర్లు, 2 సిక్సర్లు) కీలక ఇన్నింగ్స్‌లు ఆడారు. మూడు వన్డేల సిరీస్‌లో ప్రస్తుతం ఇరు జట్లు 1–1తో సమంగా నిలవగా... సిరీస్‌లో చివరి మ్యాచ్ శుక్రవారం జరుగుతుంది.

మార్ష్ దూకుడు...

ఆస్ట్రేలియా ఇన్నింగ్స్ మరోసారి పేలవంగా ప్రారంభమైంది. భువీ చక్కటి బంతికి కెప్టెన్ ఫించ్ (6) బౌల్డ్ కావడంతో జట్టు తొలి వికెట్ కోల్పోయింది. తర్వాతి ఓవర్లోనే బౌన్సర్‌తో కారీ (18)ని షమీ ఔట్ చేశాడు. అయితే ఆ తర్వాత వరుసగా నాలుగు అర్ధ సెంచరీ భాగస్వామ్యాలు ఆసీస్ ఇన్నింగ్స్‌ను నిలబెట్టాయి. మార్ష్, ఉస్మాన్ ఖాజా (21) కలిసి చక్కటి సమన్వయంతో బ్యాటింగ్ చేశారు. వీరిద్దరు నిలదొక్కుకుంటున్న దశలో జడేజా అద్భుతమైన డైరెక్ట్ త్రోకు ఖాజా రనౌట్‌గా వెనుదిరిగాడు. ఆ తర్వాత కొద్ది సేపు మార్ష్‌కు అండగా నిలిచిన హ్యాండ్స్‌కోంబ్ (20)...జడేజా బౌలింగ్‌లో స్వీప్‌కు ప్రయత్నించి స్టంపౌటయ్యాడు. ఆ తర్వాత మార్ష్‌తో మరో కీలక భాగస్వామ్యం నెలకొల్పిన అనంతరం స్టొయినిస్ (29) కూడా వెనుదిరిగాడు. ఈ స్థితిలో ఆరో వికెట్‌కు మార్ష్, మ్యాక్స్‌వెల్ కలిసి జోడించిన 94 పరుగులు ఆసీస్‌కు మెరుగైన స్కోరును అందించాయి. కుల్దీప్ ఓవర్లో వీరిద్దరు భారీ సిక్సర్లు బాదడంతో 16 పరుగులు రాగా, సిరాజ్ వేసిన తర్వాతి ఓవర్లో ఆసీస్ బ్యాట్స్‌మెన్ మూడు ఫోర్లు కొట్టారు. ఈ క్రమంలో 108 బంతుల్లో మార్ష్ శతకం పూర్తయింది. వీరిద్దరి జోరుతో 47 ఓవర్లు ముగిసే సరికి ఆసీస్ స్కోరు 281/5. అయితే ఇక్కడ ఆట మలుపు తిరిగింది. 48వ ఓవర్లో మ్యాక్స్‌వెల్, మార్ష్‌లను ఔట్ చేసిన భువీ...చివరి ఓవర్లో సిడిల్ (0) వికెట్ కూడా తీశాడు. అంతకు ముందు ఓవర్లో రిచర్డ్సన్ (2)ను షమీ పెవిలియన్ పంపించాడు. ఫలితంగా 50వ ఓవర్లో వచ్చిన సిక్స్, ఫోర్ సహా చివరి 3 ఓవర్లలో ఆసీస్ 16 పరుగులు మాత్రమే చేయగలిగింది.

సమష్టి భాగస్వామ్యాలు...

ఆస్ట్రేలియా ఇన్నింగ్స్ తరహాలోనే భారత్ బ్యాటింగ్‌లో కూడా నాలుగు అర్ధ సెంచరీ భాగస్వామ్యాలు ఉండటం విశేషం. ఐదో వికెట్ వరకు బ్యాట్స్‌మెన్ వరుసగా 47, 54, 59, 82, 57 పరుగులు జత చేయడం విశేషం. ఓపెనర్లు రోహిత్, ధావన్ (28 బంతుల్లో 32; 5 ఫోర్లు) దూకుడుగా ఆడి శుభారంభం అందించారు. స్వేచ్ఛగా ఆడిన ధావన్‌ను బెహ్రన్‌డార్ఫ్ ఔట్ చేయడంతో ఎనిమిదో ఓవర్లో భారత్ తొలి వికెట్ కోల్పోయింది. కెప్టెన్‌తో కీలక భాగస్వామ్యం తర్వాత భారీ షాట్‌కు ప్రయత్నించి కొద్ది సేపటికే రోహిత్ కూడా వెనుదిరిగాడు. ఆ తర్వాత తడబడుతూనే ఇన్నింగ్స్ కొనసాగించిన రాయుడు (36 బంతుల్లో 24; 2 ఫోర్లు)ను మ్యాక్స్‌వెల్ వెనక్కి పంపించాడు. ఈ దశలో కెప్టెన్, మాజీ కెప్టెన్ పార్ట్‌నర్‌షిప్ జట్టును ముందుకు నడిపించింది. భారీ షాట్లు ఆడకపోయినా సింగిల్స్‌పైనే వీరిద్దరు దృష్టి పెట్టి చకచకా పరుగులు సాధించారు. సిడిల్ బౌలింగ్‌లో డీప్‌స్క్వేర్ లెగ్ దిశగా ఆడటంతో 108 బంతుల్లో కోహ్లి శతకం పూర్తయింది. ఆ వెంటనే అతని వికెట్ తీసిన ఆసీస్ గెలుపుపై ఆశలు పెంచుకుంది. అయితే ధోని, కార్తీక్ (14 బంతుల్లో 25 నాటౌట్; 2 ఫోర్లు) వారికి ఆ అవకాశం ఇవ్వలేదు. విరాట్ వెనుదిరిగాక విజయానికి 38 బంతుల్లో 57 పరుగులు చేయాల్సి ఉండగా మరో నాలుగు బంతులు మిగిలి ఉండగానే భారత్ లక్ష్యం చేరింది.


కోహ్లి

స్కోరు వివరాలు

ఆస్ట్రేలియా ఇన్నింగ్స్: కారీ (సి) ధావన్ (బి) షమీ 18; ఫించ్ (బి) భువనేశ్వర్ 6; ఖాజా (రనౌట్) 21; షాన్ మార్ష్ (సి) జడేజా (బి) భువనేశ్వర్ 131; హ్యాండ్స్‌కోంబ్ (స్టంప్డ్) ధోని (బి) జడేజా 20; స్టొయినిస్ (సి) ధోని (బి) షమీ 29; మ్యాక్స్‌వెల్ (సి) కార్తీక్ (బి) భువనేశ్వర్ 48; రిచర్డ్సన్ (సి) ధావన్ (బి) షమీ 2; లయన్ (నాటౌట్) 12; సిడిల్ (సి) కోహ్లి (బి) భువనేశ్వర్ 0; బెహ్రన్‌డార్ఫ్ (నాటౌట్) 1; ఎక్స్‌ట్రాలు 10; **మొత్తం (50 ఓవర్లలో 9 వికెట్లకు) 298.**
వికెట్ల పతనం: 1–20; 2–26; 3–82; 4–134; 5–189; 6–283; 7–283; 8–286; 9–286.
బౌలింగ్: భువనేశ్వర్ 10–0–45–4; షమీ 10–0–58–3; సిరాజ్ 10–0–76–0; కుల్దీప్ 10–0–66–0; జడేజా 10–1–49–1.

భారత్ ఇన్నింగ్స్: రోహిత్ (సి) హ్యాండ్స్‌కోంబ్ (బి) స్టొయినిస్ 43; ధావన్ (సి) ఖాజా (బి) బెహ్రన్‌డార్ఫ్ 32; కోహ్లి (సి) మ్యాక్స్‌వెల్ (బి) రిచర్డ్సన్ 104; రాయుడు (సి) స్టొయినిస్ (బి) మ్యాక్స్‌వెల్ 24; ధోని (నాటౌట్) 55; కార్తీక్ (నాటౌట్) 25; ఎక్స్‌ట్రాలు 16; **మొత్తం(49.2 ఓవర్లలో 4 వికెట్లకు) 299.** **వికెట్ల పతనం:** 1–47; 2–101; 3–160; 4–242. **బౌలింగ్:** బెహ్రన్‌డార్ఫ్ 8.2–1–52–1; రిచర్డ్సన్ 10–0–59–1; సిడిల్ 8–0–58–0; లయన్ 10–0–59–0; స్టొయినిస్ 9–0–46–1; మ్యాక్స్‌వెల్ 4–0–16–1.

సిరాజ్‌కు కలిసిరాని అరంగేట్రం



హైదరాబాద్ పేస్ బౌలర్ మొహమ్మద్ సిరాజ్ భారత్ తరఫున వన్డేలు ఆడిన 225వ ఆటగాడిగా గుర్తింపు పొందాడు. 2 అంతర్జాతీయ టి20లు ఆడిన అనంతరం అతనికి వన్డే అవకాశం దక్కింది. అయితే తొలి టి20లాగే తొలి వన్డే కూడా అతనికి చేదు అనుభవాన్నే మిగిల్చింది. అడిలైడ్ వన్డేలో 10 ఓవర్లలో 76 పరుగులిచ్చిన అతను ఒక్క వికెట్ కూడా తీయలేదు. భారత్ తరఫున కర్సన్ ఘావ్రీ (0/83) తర్వాత అరంగేట్రంలో అతి చెత్త ప్రదర్శన సిరాజ్‌దే. ఏడాది క్రితం తన తొలి టి20లో 4 ఓవర్లలో 53 పరుగులిచ్చి 1 వికెట్ తీసిన సిరాజ్... జోగిందర్ శర్మ (0/57) తర్వాత అరంగేట్రంలో రెండో చెత్త గణాంకాలు నమోదు చేసిన భారత బౌలర్‌గా నిలిచాడు.

64

వన్డేల్లో కోహ్లికిది 39వ సెంచరీ. ఓవరాల్‌గా అంతర్జాతీయ క్రికెట్‌లో కోహ్లి శతకాల సంఖ్య 64కు చేరింది. సంగక్కర (63)ను కోహ్లి అధిగమించగా... సచిన్ (100), పాంటింగ్ (71) మాత్రమే అతనికంటే ముందున్నారు.

భారత్ సూపర్ పవర్ కావాలి

విరాట్ కోహ్లి ఆకాంక్ష

అడిలైడ్: ప్రపంచ క్రికెట్‌లో భారత్ ఆధిపత్యం కొనసాగాలని, సూపర్ పవర్‌గా ఎదగాలన్నదే తన ఆకాంక్ష అని టీమిండియా సారథి కోహ్లి చెప్పాడు. విశ్వవ్యాప్తంగా భారతీయులు ఉన్న నేపథ్యంలో మనం టెస్టులకు ప్రాధాన్యమిస్తే ప్రపంచ వ్యాప్తంగా ఆదరణ వస్తుందని చెప్పుకొచ్చాడు. కుర్రాళ్లు కేవలం పరిమిత ఓవర్ల క్రికెట్‌పైనే ఆసక్తి పెంచుకోవడం ఎంతమాత్రం తగదని... అసలైన ఆట అయిన 'టెస్టు'లపై కూడా దృష్టి పెట్టాలని కోహ్లి సూచించాడు. ఓ స్పోర్ట్స్ చానెల్‌కు ఇచ్చిన ఇంటర్వ్యూలో అతను మాట్లాడుతూ 'వన్డేలు, టి20లు కూడా క్రికెటే! అందులో రాణించాలనుకోవడంలో తప్పులేదు. అయితే వాటికే పరిమితమవడం... టెస్టులను చిన్న చూపు చూడటం తప్పు. కుర్రాళ్లు చాలామంది సంప్రదాయ టెస్టులకు విలువ ఇవ్వడం లేదు. ఇది వారి కెరీర్‌కు ఎంతమాత్రం మంచిది కాదు. ఇలా చేస్తే ఒత్తిడి ఎదుర్కోలేక మానసిక సమస్యలు తప్పవు. తద్వారా కెరీర్‌ను కొనసాగించలేకపోవచ్చు' అని కుర్రాళ్లను హెచ్చరించాడు. ఐదు రోజుల ఆట ఆడేందుకు కుర్రాళ్లు పూర్తిస్థాయిలో సన్నద్ధమవ్వాలన్నాడు. 'ఏదో రెండు గంటలు ఆడటం, కొన్ని ఓవర్లు వేయటం ఆటను ముగించడం సరైన పద్ధతి కానేకాదు. కుర్రాళ్లు అసలైన టెస్టు మజాకు అలవాటు పడాలి. మన విజన్‌ను బట్టి అభిమానులుంటారు. టెస్టుల్ని ఆసక్తికరంగా ఆడితే తప్పకుండా ప్రేక్షకులు పెరుగుతారు. భారతీయులు విశ్వవ్యాప్తంగా ఉన్నారు. ఇదే మన బలం. ఐదు రోజుల ఆటను గౌరవిస్తే, మనం టెస్టుల్ని శాసిస్తే, సంప్రదాయ క్రికెట్ అగ్రస్థానంలో ఉంటుంది' అని అన్నాడు. రాబోయే రోజుల్లో టెస్టు క్రికెట్లో భారత్ దుర్భేద్యమైన జట్టుగా ఎదగాలని తాను ఆశిస్తున్నట్లు కోహ్లి చెప్పాడు.

● పంత్ 'బేబీ' సిట్టర్!



భారత క్రికెటర్ రిషభ్ పంత్ ప్రేమలో పడ్డాడు. బుధవారం 'ఇన్‌స్టాగ్రామ్'లో ఆమెతో కలిసి దిగిన ఫొటోను పోస్ట్ చేశాడు. దీనిపై 'నేను సంతోషంగా ఉన్నానంటే కారణం నువ్వు...నిన్ను కూడా సంతోషంగా ఉంచడమే నేను చేయాల్సింది' అని వ్యాఖ్యను కూడా జోడించాడు. ఆ అమ్మాయి పేరు ఇషా నేగి అని అతని సన్నిహితులు వెల్లడించారు. 21 ఏళ్ల పంత్ ఇలాంటి ఫొటోతో గర్ల్‌ఫ్రెండ్‌ను పరిచయం చేయడం ఆసక్తికర చర్చగా మారింది.



ఇక ఆనంద్ సర్‌తో ఆడతా

'చాలా సంతోషంగా ఉంది. గ్రాండ్‌మాస్టర్‌నైనందుకు ఎంతో ఉద్విగ్నంగా ఉంది. మూడో జీఎం నార్మ్‌తో పాటు గ్రాండ్‌మాస్టర్ టైటిల్ దక్కింది. ఇక విశ్వనాథన్ ఆనంద్ సర్‌తో తలపడాలనుకుంటున్నా. ఈ గేమ్ (9వరౌండ్)కు ముందు నేనేమీ ఒత్తిడిని ఎదుర్కోలేదు. అయితే ఆటమధ్యలో కాస్త ఎదురైనప్పటికీ ఆటపైనే దృష్టిపెట్టి ముందడుగు వేశాను. స్పెయిన్ (బార్సిలోనా)లోనే కర్యాకిన్ రికార్డును చెరిపేసే అవకాశం చేజార్చినందుకు నిరాశగా ఉంది. ఆ తర్వాత ముంబై టోర్నీలోను సాంకేతిక కారణాల వల్ల ప్రపంచ రికార్డును కోల్పోయాను'

– గుకేశ్

చెన్నై కుర్రాడు... చరిత్రకెక్కాడు

12 ఏళ్లకే గ్రాండ్‌మాస్టర్‌నైన గుకేశ్

- అతిపిన్న భారతీయ జీఎంగా రికార్డు
- ప్రపంచంలోనే రెండో పిన్నవయస్కుడిగా ఘనత

చెన్నై: తమిళనాడు కుర్రాడు డి.గుకేశ్ పన్నెండేళ్ల వయసులోనే గ్రాండ్‌మాస్టర్ హోదాతో రికార్డులకెక్కాడు. 12 ఏళ్ల 7 నెలల 17 రోజుల వయసులో ఈ ఘనత సాధించిన అతిపిన్న భారతీయ గ్రాండ్‌మాస్టర్‌గా కొత్త చరిత్ర సృష్టించాడు. తన రాష్ట్ర సహచరుడు ఆర్.ప్రజ్ఞానంద జూన్‌లో సాధించిన రికార్డు (12 ఏళ్ల 10 నెలల వయసులో)ను ఏడాది తిరగకుండానే చెరిపేశాడు. ఢిల్లీ ఇంటర్నేషనల్ ఓపెన్ చెస్ టోర్నమెంట్‌లో మంగళవారం తొమ్మిదో రౌండ్లో డి.కె.శర్మను ఓడించడం ద్వారా గుకేశ్ గ్రాండ్‌మాస్టర్ (జీఎం) హోదా పొందాడు. మొత్తం మీద భారత చదరంగ క్రీడాకారుల్లో అతను 59వ జీఎం. 2002లో ఉక్రెయిన్‌కు చెందిన సెర్గీ కర్యాకిన్ 12 ఏళ్ల ఏడు నెలల వయసులో సాధించిన జీఎం ఘనత ప్రపంచ అతిపిన్న రికార్డు కాగా, గుకేశ్ కేవలం 17 రోజుల తేడాతో ఆ రికార్డుకు దూరమయ్యాడు. నిజానికి గత నెలలోనే గుకేశ్‌కు 'ప్రపంచ రికార్డు' అవకాశం వచ్చినా... తృటిలో చేజార్చుకున్నాడు. డిసెంబర్‌లో జరిగిన బార్సిలోనా టోర్నీలో అతను మూడో రౌండ్లో ఇటలీ గ్రాండ్‌మాస్టర్ డానియెల వొకటురో (ఇటలీ) చేతిలో ఓడిపోవడంతో మూడో జీఎం నార్మ్‌తో పాటు 'ప్రపంచ అతిపిన్న' ఘనత చేజారింది. తిరిగి నెల వ్యవధిలోనే తమిళ తంబి తన ఎత్తులకు పదును పెట్టాడు.

తల్లిదండ్రులతో ఆడుతూనే...

ఎత్తులు–పైఎత్తులతో ప్రత్యర్థుల్ని చిత్తు చేస్తున్న ఈ చిచ్చర పిడుగు 'చెస్' నేపథ్యం కేవలం ఓ 'ఆటవిడుపు'గా మొదలైంది. గుకేశ్ తల్లి పద్మ, తండ్రి రజినీకాంత్ ఇద్దరూ వైద్యులే. వాళ్లిద్దరు ఇంట్లో ఆడుతుంటే చూసిన చిన్నారి గుకేశ్ సరదాగా ఎత్తులు వేశాడు. ఆ తర్వాత తల్లిదండ్రులతో దీటుగా పోటీపడ్డాడు. అతని ఎత్తులకు, ఓర్పుగా దెబ్బతీసే పైఎత్తులకు వాళ్లిద్దరూ అబ్బురపడేవారు. అతని ఆసక్తిని ఆటవిడుపుకే పరిమితం కాకుడదని భావించిన తల్లిదండ్రులు తమ చిన్నారిని చెస్ అకాడమీలో చేర్పించారు. ఇక అక్కడ్నుంచి ఆట కాస్త చెస్ బాట అయ్యింది.

జాఫర్, సంజయ్ సెంచరీలు

నాగపూర్: డిఫెండింగ్ చాంపియన్ విదర్భ...ఉత్తరాఖండ్‌తో జరుగుతున్న రంజీ ట్రోఫీ క్వార్టర్ ఫైనల్ మ్యాచ్‌లో దీటుగా బదులిస్తోంది. సంజయ్ రామస్వామి (112 బ్యాటింగ్), వసీం జాఫర్ (111 బ్యాటింగ్) అజేయ సెంచరీలతో రెండో రోజు బుధవారం ఆట ముగిసే సరికి విదర్భ వికెట్ నష్టానికి 260 పరుగులు చేసింది. అంతకు ముందు ఉత్తరాఖండ్ 355 పరుగులకు ఆలౌటైంది. సౌరభ్ రావత్ (108) శతకం పూర్తి చేసుకోగా, ఉమేశ్ యాదవ్ 4 వికెట్లు పడగొట్టాడు.

ఇతర క్వార్టర్ ఫైనల్ మ్యాచ్‌ల స్కోర్లు:
బెంగళూరు: రాజస్తాన్ తొలి ఇన్నింగ్స్ 224; కర్ణాటక తొలి ఇన్నింగ్స్ 263 (వినయ్ కుమార్ 83 నాటౌట్, సిద్ధార్థ్ 52, రాహుల్ చహర్ 5/93); రాజస్తాన్ రెండో ఇన్నింగ్స్ 11/0.
వాయనాడ్: కేరళ తొలి ఇన్నింగ్స్ 185; గుజరాత్ తొలి ఇన్నింగ్స్ 162 (పార్థివ్ పటేల్ 43, సందీప్ వారియర్ 4/42); కేరళ రెండో ఇన్నింగ్స్ 171 (జోసెఫ్ 56, జలజ్ సక్సేనా 44 నాటౌట్).
లక్నో: ఉత్తరప్రదేశ్ తొలి ఇన్నింగ్స్ 385; సౌరాష్ట్ర తొలి ఇన్నింగ్స్ 170/7(దేశాయ్ 84, పుజారా 11).

విచారణ మొదలు

పాండ్యా, రాహుల్‌లతో మాట్లాడిన సీఈఓ



ముంబై: టీవీ షోలో అభ్యంతరకర వ్యాఖ్యలు చేసి నిషేధం ఎదుర్కొంటున్న భారత క్రికెటర్లు పాండ్యా, రాహుల్‌ల విచారణ మొదలైంది. బీసీసీఐ సీఈఓ రాహుల్ జోహ్రి మంగళవారం వారితో ఫోన్‌లో మాట్లాడారు. అయితే కేవలం క్రికెటర్లు చెప్పింది మాత్రమే ఆయన విన్నారని... టీవీ కార్యక్రమంలో పాల్గొన్న నేపథ్యం, ఆ వ్యాఖ్యల గురించి ఎలాంటి ప్రశ్నలు అడగలేదని సమాచారం. 'ఇది విచారణ ఆరంభం మాత్రమే కాబట్టి సంక్షిప్తంగానే వారి మాటలు విన్నారు. ఇంకా షోకాజ్ నోటీసుకు సమాధానం ఇస్తూ రాతపూర్వకంగా ఏం రాశారో కూడా చూడాల్సి ఉంది. బుధవారం ఆయన తన నివేదిక సమర్పించే అవకాశం ఉంది. అంబుడ్స్‌మన్ నియామకం జరిగితేనే పూర్తి స్థాయి విచారణ ఇక ముందు కొనసాగుతుంది' అని బోర్డు అధికారి ఒకరు వెల్లడించారు.

రెండో రౌండ్‌లో సైనా, శ్రీకాంత్

మలేసియా మాస్టర్స్ బ్యాడ్మింటన్ టోర్నీ

కౌలాలంపూర్ (మలేసియా): కొత్త ఏడాదిలో తొలి టైటిల్ సాధించడమే లక్ష్యంగా... మలేసియా మాస్టర్స్ బ్యాడ్మింటన్ టోర్నీ బరిలోకి దిగిన భారత స్టార్ ప్లేయర్లు కిడాంబి శ్రీకాంత్, సైనా నెహ్వాల్ శుభారంభం చేశారు. బుధవారం జరిగిన పురుషుల సింగిల్స్ తొలి రౌండ్‌లో ఏడో సీడ్ కిడాంబి శ్రీకాంత్ 21–17, 21–11తో లాంగ్ ఆంగస్ (హాంకాంగ్)పై 30 నిమిషాల్లోనే విజయం సాధించాడు. మరో మ్యాచ్‌లో క్వాలిఫయర్ పారుపల్లి కశ్యప్ (భారత్) 19–21, 21–19, 21–10తో రస్మస్ జెమ్‌కీ (డెన్మార్క్)పై నెగ్గి ముందంజ వేశాడు. మహిళల సింగిల్స్ తొలి రౌండ్‌లో ఏడో సీడ్ సైనా నెహ్వాల్ 14–21, 21–18, 21–18తో డెంగ్ జాయ్ యువాన్ (హాంకాంగ్)పై కష్టపడి గెలిచింది. మరోవైపు మహిళల డబుల్స్ తొలి రౌండ్‌లో అశ్విని పొన్నప్ప– సిక్కి రెడ్డి (భారత్) ద్వయం 21–16, 22–20తో ఎన్ సు యు– యెన్ సిన్ యింగ్ (హాంకాంగ్) జోడీపై నెగ్గి రెండోరౌండ్‌కు చేరుకుంది. మిక్స్‌డ్ డబుల్స్ విభాగంలోనే భారత్‌కు వ్యతిరేక ఫలితం ఎదురైంది. తొలి రౌండ్‌లో ప్రణవ్ చోప్రా– సిక్కిరెడ్డి (భారత్) జంట 19–21, 17–21తో రాబిన్ తాబులింగ్– సెలీనా పియెక్ (నెదర్లాండ్స్) జోడీ చేతిలో ఓటమి పాలై టోర్నీ నుంచి నిష్క్రమించింది. నేటి రెండో రౌండ్ మ్యాచ్‌ల్లో వాంగ్ వింగ్ కి విన్సెంట్ (హాంకాంగ్)తో శ్రీకాంత్, ఆరోసీడ్ ఆంథోని సినిసుకా జింటింగ్ (ఇండోనేసియా)తో కశ్యప్, యిప్ పుయ్ యిన్ (హాంకాంగ్)తో సైనా ఆడతారు. మహిళల డబుల్స్ రెండో రౌండ్‌లో కెటుట్ మహాదేవి ఇస్తారాణి– రిజ్కీ అమేలియా ప్రదీప్త (ఇండోనేసియా) జోడీతో అశ్విని– సిక్కి జంట ఆడుతుంది.



నాదల్, ఫెడరర్ ముందంజ

మూడో రౌండ్‌కు వోజ్నియాకి ▪ ఆస్ట్రేలియన్ ఓపెన్

మెల్‌బోర్న్: టెన్నిస్ దిగ్గజాలు రాఫెల్ నాదల్ (స్పెయిన్), రోజర్ ఫెడరర్ (స్విట్జర్లాండ్)ఆస్ట్రేలియా ఓపెన్‌లో ముందంజ వేశారు. పురుషుల సింగిల్స్‌లో రెండో సీడ్ నాదల్, మూడో సీడ్ ఫెడరర్ మూడో రౌండ్లోకి ప్రవేశించారు. అయితే వింబుల్డన్ రన్నరప్, ఐదో సీడ్ కెవిన్ అండర్సన్ (దక్షిణాఫ్రికా)కు రెండో రౌండ్లోనే చుక్కెదురైంది. ప్రపంచ 39వ ర్యాంకర్ ఫ్రాన్సిస్ టియాఫో (అమెరికా)... ఆరో ర్యాంకర్ కెవిన్‌కు షాకిచ్చాడు. మహిళల సింగిల్స్‌లో రెండో సీడ్ కెర్బర్ (జర్మనీ), మూడో సీడ్ వోజ్నియాకి (డెన్మార్క్), ఐదో సీడ్ స్లోన్ స్టీఫెన్స్ (అమెరికా) మూడో రౌండ్లోకి అడుగుపెట్టారు.

అలవోకగా నెగ్గిన నాదల్...

పురుషుల సింగిల్స్‌లో బుధవారం జరిగిన రెండో రౌండ్లో నాదల్ 6–3, 6–2, 6–2తో మాథ్యూ ఎబ్డెన్ (ఆస్ట్రేలియా)పై అలవోక విజయం సాధించగా, ఫెడరర్ 7–6 (7/5), 7–6 (7/3), 6–3 క్వాలిఫయర్ డానియెల్ ఎవాన్స్ (ఇంగ్లండ్)పై చెమటోడ్చి నెగ్గాడు. వింబుల్డన్ ఫైనలిస్ట్ అండర్సన్ 6–4, 4–6, 4–6, 5–7తో అన్‌సీడెడ్ టియాఫో చేతిలో కంగుతిన్నాడు. ఆరో సీడ్ సిలిచ్ (క్రొయేషియా) 7–5, 6–7 (9/11), 6–4, 6–4తో మెక్‌డోనాల్డ్ (అమెరికా)పై గెలుపొందగా, ఫెబియానోతో పోరాడి ఓడిన


వోజ్నియాకి

మ్యాచ్‌లో ఒపెల్కా (అమెరికా) అదరగొట్టాడు. అతను 67 ఏస్‌లు సంధించడం విశేషం. హోరాహోరీగా జరిగిన ఈ పోరులో చివరకు థామస్ ఫెబియానో (ఇటలీ) 6–7 (15/17), 6–2, 6–4, 3–6, 7–6, (10/5)తో ఒపెల్కాపై నెగ్గాడు.

బెర్టెన్స్ ఔట్

మహిళల సింగిల్స్ రెండో రౌండ్లో తొమ్మిదో సీడ్ కికి బెర్టెన్స్ (నెదర్లాండ్స్)కు 6–3, 3–6, 3–6తో రష్యా క్రీడాకారిణి పల్యుచెంకోవా చేతిలో చుక్కెదురైంది. మిగతా మ్యాచ్‌ల్లో రెండో సీడ్ కెర్బర్ 6–2, 6–3తో బియట్రిజ్ మైయా (బ్రెజిల్)పై, ఐదో సీడ్ స్టీఫెన్స్ 6–3, 6–1తో టిమియా బబోస్ (హంగేరి)పై, మూడో సీడ్ వోజ్నియాకి 6–1, 6–3తో లార్సన్ (స్వీడెన్)పై 8వ సీడ్ క్విటోవా (చెక్ రిపబ్లిక్) 6–1, 6–3తో కెమెలియా బెగు (రుమేనియా)పై, షరపోవా (రష్యా) 6–2, 6–1తో రెబెక్కా పీటర్సన్ (స్వీడెన్)పై గెలుపొందారు.

భారత పోరాటం తొలిరౌండ్లోనే...

ఆరంభ గ్రాండ్‌స్లామ్‌లో భారత పోరాటం తొలిరౌండ్లోనే ముగిసింది. డబుల్స్‌లో భారత జోడీలన్నీ నిరాశపరిచాయి. 15వ సీడ్ రోహన్ బోపన్న–దివిజ్ శరణ్ జంట 1–6, 6–4, 5–7తో కెరెనొ బుస్టా–గార్సియా లోపెజ్ (స్పెయిన్) జోడీ చేతిలో కంగుతినగా, లియాండర్ పేస్– రెయిస్ వరేలా (మెక్సికో) ద్వయం 5–7, 6–7 (4/7)తో క్రాజిసెక్ (అమెరికా)– సిటాక్ (ఆస్ట్రేలియా) జంట చేతిలో ఓడింది. జీవన్ నెడున్‌జెళియాన్–మోన్రో (అమెరికా) జోడీ 6–4, 6–7 (8/10), 5–7తో కెవిన్ క్రావిట్జ్ (జర్మనీ)–నికొలా మెక్టిక్ (క్రొయేషియా) జంట చేతిలో పరాజయం చవిచూసింది.




తిరుమలలో ఘనంగా పార్వేట ఉత్సవం

తిరుమల: తిరుమల కలియుగ ప్రత్యక్షదైవం వేంకటేశ్వరస్వామి పార్వేట ఉత్సవం మకర సంక్రమణకు మరుసటి రోజున కనుమ పండుగనాడైన బుధవారం తిరుమలలో అత్యంత ఘనంగా జరిగింది. అదే రోజున గోదా పరిణయోత్సవం కన్నుల పండువగా టీటీడీ నిర్వహించింది. తిరుపతిలోని గోవింద రాజస్వామి ఆలయంలోని ఆండాళ్ గోదాదేవి చెంత నుంచి శ్రీవారికి ప్రత్యేక మాలలు కానుకగా అందాయి. స్వామికి ప్రాత:కాలారాధన పూర్తయిన తరువాత మలయప్పస్వామి తిరుచ్చిలో వేంచేశారు. వారి వెంట మరో తిరుచ్చిపై కృష్ణస్వామి వేంచేశారు. అనంతరం పార్వేట మండపానికి వెళ్లి, ఆ మండపం నందు పుణ్యాహం జరిగిన పిమ్మట మంచెలో వేంచేశారు. స్వామికి ఆరాధన, నివేదన జరిగి హారతులు అందాయి. అనంతరం ఉభయదారులు తాళ్ళపాక, మఠంవారికి మర్యాదలు అందగా.. స్వామి మండపాన్ని వదలి ప్రాంగణానికి వచ్చారు. కృష్ణస్వామి సన్నిధి గొల్లపూజ చేసిన చోటుకు వేంచేసి.. పాలు, వెన్న ఆరగింపు హారతి జరిగిన మలయప్పస్వామి సన్నిధికి వెళ్లారు. తరువాత గొల్లకు బహుమానం జరిగింది. తరువాత మలయప్ప స్వామి ముందునకు కొంత దూరం పరుగెత్తి వారి తరపున అర్చకులు బాణం వేసిన పిమ్మట వెనుకకు వచ్చారు. మలయప్ప స్వామి ఉత్సవం పూర్తయి మహాద్వారానికి వచ్చి హత్తీరాంజీ బెత్తం తీసుకుని సన్నిధిలోకి వేంచేశారు. దీంతో పార్వేట ఉత్సవం ఘనంగా ముగిసింది.

కులమీడియా గగ్గోలు ఎందుకు?

వైఎస్సార్‌సీపీ ఎంపీ విజయసాయిరెడ్డి ఆగ్రహం



సాక్షి, హైదరాబాద్: ఫెడరల్ ఫ్రంట్‌పై చర్చించేందుకు టీఆర్‌ఎస్, వైఎస్సార్‌సీపీ నాయకులు కలిస్తేనే ఆంధ్రులకు ద్రోహం జరిగిపోయినట్లు ఎల్లో కుల మీడియా, టీడీపీ, సీపీఐ నేతలు గగ్గోలు పెట్టడం తీవ్ర అభ్యంతరకరమని రాజ్యసభ సభ్యుడు వి.విజయసాయిరెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ మేరకు ఆయన బుధవారం ట్వీట్ చేశారు. 'టీఆర్‌ఎస్, వైఎస్సార్‌సీపీ నాయకులు కలిస్తేనే ఆంధ్రులకు ద్రోహం జరిగిపోయినట్టు గోల పెడుతున్న ఎల్లో కుల మీడియా, టీడీపీ, సీపీఐ నాయకులు.. తెలంగాణ ఎన్నికల్లో కలిసి పోటీ చేద్దామని కేసీఆర్‌ను చంద్రబాబు ప్రాధేయపడినప్పుడు మీ నోళ్లకు తాళాలు పడ్డాయా?' అని ప్రశ్నించారు. 'కేసీఆర్ ఆంధ్రా ప్రజల గురించి అంత అవమానకరంగా మాట్లాడితే కలిసి పోటీ చేద్దామని చంద్రబాబు ఎందుకు ప్రతిపాదించారు? హరికృష్ణ పార్థివ దేహం సాక్షిగా తెలంగాణ ఎన్నికల్లో పొత్తుపెట్టుకుందామని కేటీఆర్‌ను అడిగిందెవరు? ఇవన్నీ మర్చిపోతే ఎలా ఉమామహేశ్వరరావు?' అని ప్రశ్నించారు. తెలుగు రాష్ట్రాల ప్రయోజనాల కోసం... ఏపీకి ప్రత్యేక హోదా కోసం... చేయి చేయి కలవాలి. తెలుగు ప్రజలు గెలవాలి.' అని ఆయన మరో ట్వీట్ చేశారు.

జగన్‌ను సీఎం చేయడమే నా ధ్యేయం

వైఎస్సార్‌సీపీ సేవకుడిగా పనిచేస్తా ● పోసాని కృష్ణమురళి



కడప అగ్రికల్చర్: వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీకి సేవకుడిగా పనిచేస్తూ వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని అధికార పీఠం ఎక్కించడమే తన ధ్యేయమని ప్రముఖ సినీ నటుడు, దర్శకుడు పోసాని కృష్ణమురళి చెప్పారు. ఆయన మంగళవారం వైఎస్సార్ జిల్లాకు ఓ సినిమా షూటింగ్ నిమిత్తం వచ్చారు. ఇర్కాన్ సర్కిల్లోని వైఎస్సార్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ వైఎస్సార్ విగ్రహం సాక్షిగా.. వైఎస్సార్‌సీపీ అధికారంలోకి రావాలని తను కోరుకుంటున్నట్లు తెలిపారు. తాను పార్టీలో పదవి, ఇతరత్రా ఏదీ ఆశించి పార్టీలోకి రాలేదన్నారు. ఎమ్మెల్యే, ఎంపీగా పోటీచేసే ఆలోచనే లేదన్నారు. షర్మిలపై సోషల్ మీడియాలో పెడుతున్న అసభ్య పోస్టులపై స్పందిస్తూ.. అప్పటి సీఎం ఎన్టీఆర్ భార్య లక్ష్మీపార్వతిని గౌరవించాల్సింది పోయి ఇష్టానుసారంగా మాట్లాడి, బజారుకీడ్చి నానా విధాలుగా అవమానించారని, చిరంజీవి పార్టీ పెట్టి ప్రజల్లోకి వస్తే ఆయన కుటుంబంలోని మహిళల గురించి నీచంగా మాట్లాడారని చెప్పారు. అధికారం కోసం టీడీపీ నాయకులు ఎంతటి నీచానికైనా దిగజారతారన్నారు. కార్యక్రమంలో పార్టీ నేతలు చల్లా మధుసూధనరెడ్డి, వీరభద్ర తదితరులున్నారు.

రాజశేఖరుడికి పట్టువస్త్రాలు

- పెద్దపండగ సందర్భంగా సమర్పించిన గిరిజనులు
- ఆ తర్వాతే వారి పూర్వీకులకు పూజలు



తెల్లంవారిగూడెంలో వైఎస్సార్‌కు పట్టు వస్త్రాలు సమర్పించి పూల దండలు వేసి నివాళులు అర్పిస్తున్న గ్రామస్తులు

బుట్టాయగూడెం: దివంగత మహానేత డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డికి సంక్రాంతి పండగ సందర్భంగా పశ్చిమగోదావరి జిల్లా బుట్టాయగూడెం మండలంలోని తెల్లంవారిగూడెంకు చెందిన గిరిజన మహిళ తెల్లం భీమమ్మ ఆధ్వర్యంలో నూతన పట్టు వస్త్రాలను సమర్పించారు. వైఎస్సార్ మరణించిన నాటి నుంచి ఏటా సంక్రాంతి పండగ రోజున ఆయనకు కొత్త దుస్తులు పెట్టిన తర్వాతే ఆమె తన పూర్వీకులకు నైవేద్యాలు సమర్పిస్తూ వస్తున్నారు. తొమ్మిదేళ్లుగా ఆనవాయితీగా చేస్తున్నారు. ఆమె అల్లుడు మాజీ ఎమ్మెల్యే తెల్లం బాలరాజు, కుటుంబసభ్యులు రాజశేఖరరెడ్డి విగ్రహానికి దుస్తులు వేయడంతో పాటు పూల దండలు వేసి హారతులు ఇస్తారు. అనంతరం పేదలకు దుస్తులు పంపిణీ చేస్తారు. కాగా ఈ కార్యక్రమంలో పాల్గొనే గ్రామస్తులు కూడా ఇదే సంప్రదాయానికి అలవాటు పడ్డారు. రాజన్నకు నూతన వస్త్రాలు పెట్టిన తర్వాతే మిగిలిన కార్యక్రమాల్లో పాల్గొంటున్నారు. ఆయనే మా దేవుడని పండుగ పూట రాజశేఖరరెడ్డి ఆశీస్సులు ఉంటే సుఖ సంతోషాలతో వర్ధిల్లుతామని చెబుతున్నారు. ఎంపీటీసీ సభ్యులు కూరం ముత్యాలమ్మ, గ్రామస్తులు తెల్లం దుర్గారావు, వెంకటరమణ పాల్గొన్నారు.

● తెలంగాణ

ప్రొటెం స్పీకర్‌గా ముంతాజ్ ప్రమాణం

రాజ్‌భవన్‌లో నిరాడంబరంగా కార్యక్రమం



సాక్షి, హైదరాబాద్: తెలంగాణ శాసనసభ ప్రొటెం (తాత్కాలిక) స్పీకర్‌గా ముంతాజ్ అహ్మద్‌ఖాన్ బుధవారం సాయంత్రం ప్రమాణస్వీకారం చేశారు. రాజ్‌భవన్‌లోని దర్బార్‌హాల్‌లో నిరాడంబరంగా జరిగిన ఈ కార్యక్రమంలో ఆయనతో గవర్నర్ ఇ.ఎస్.ఎల్ నరసింహన్ ప్రమాణం చేయించారు. అసెంబ్లీ కార్యదర్శి వి. నర్సింహాచార్యులు తాత్కాలిక స్పీకర్ స్పీకర్ నియామకానికి సంబంధించిన నోటిఫికేషన్‌ను చదివి వినిపించారు. ప్రమాణ స్వీకారం అనంతరం తాత్కాలిక స్పీకర్ ముంతాజ్ అహ్మద్‌ఖాన్ 'ప్రమాణపత్రం'పై గవర్నర్ సమక్షంలో సంతకం చేశారు. గవర్నర్ నరసింహన్, ముఖ్యమంత్రి కె. చంద్రశేఖర్‌రావు, మాజీ స్పీకర్ ఎస్. మధుసూదనాచారి తాత్కాలిక స్పీకర్ ముంతాజ్ అహ్మద్‌ఖాన్‌కు అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో శాసనమండలి చైర్మన్ వి.స్వామిగౌడ్, హోంమంత్రి మహమూద్ అలీ, ఎంపీలు అసదుద్దీన్ ఒవైసీ, బి. వినోద్ కుమార్, జి. సంతోష్ కుమార్, ఎమ్మెల్సీలు పల్లా రాజేశ్వర్‌రెడ్డి, బి. వెంకటేశ్వర్లు, అమీన్ జాఫ్రీ, ఎమ్మెల్యేలు కొప్పుల ఈశ్వర్, సయ్యద్ అహ్మద్ పాషాఖాద్రీ తదితరులు పాల్గొన్నారు.

అడ్వాన్స్‌లు ఇచ్చేద్దాం.. కమీషన్లు కొట్టేద్దాం

వంశధార-బాహుదా 'అనుసంధానం' అంచనాల్లో వంచన



1,765.75 క్యూసెక్కుల సామర్థ్యంతో 17 మీటర్ల వెడల్పు, 3.30 మీటర్ల లోతుతో ఒక కిలోమీటర్ పొడవున కాలువ తవ్వడానికి రూ.57.65 కోట్లు ఖర్చు అవుతుందట! శ్రీకాకుళం జిల్లా హీరమండలం రిజర్వాయర్ నుంచి వంశధార నదీ జలాలను ఇచ్ఛాపురం సమీపంలోని బాహుదా నదికి తరలించి, రెండు నదులను అనుసంధానం చేయడానికి 110 కి.మీ. పొడవున కాలువ తవ్వాలని ప్రతిపాదించారు. ఈ హైలెవల్ కెనాల్‌కు రూ.6,342.56 కోట్లతో సమగ్ర ప్రాజెక్టు నివేదిక(డీపీఆర్)ను రూపొందించారు.

పోలవరం కుడి కాలువ సామర్థ్యం 17,633 క్యూసెక్కులు.. 85.5 మీటర్ల వెడల్పు, 5 మీటర్ల లోతుతో 174 కి.మీ.ల పొడవున తవ్వి.. లైనింగ్ వేసేందుకు రూ.4375.77 కోట్ల వ్యయం అవుతుందని ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది.. వంశధార-బాహుదా నదులను అనుసంధానం చేసే హైలెవల్ కెనాల్‌కు పది రెట్ల అధిక సామర్థ్యంతో, లైనింగ్‌తో తవ్వే పోలవరం కుడి కాలువకు కి.మీ.కు రూ.25.14 కోట్లను ఖర్చు చేస్తున్నట్లు వెల్లడవుతోంది.

- 110 కి.మీ.ల కాలువ తవ్వడానికి రూ.6,342.56 కోట్లతో ప్రతిపాదన
- డీపీఆర్ తప్పులతడక అని తేల్చిన జలవనరుల శాఖ
- ముఖ్యనేత ఒత్తిడితో డీపీఆర్‌పై ఆమోదముద్ర
- అంచనాల్లో అక్రమాలు జరిగాయని తేల్చిన అధికారులపై సీఎం ఆగ్రహం
- యథాతథంగా ఆమోదించాలని ఆర్థిక శాఖపై ఒత్తిడి
- నెలాఖరులోగా తొలి దశ పనులకు టెండర్లు పిలవాలని ఆదేశం
- భారీగా ముడుపులు దండుకోవడానికి పథక రచన

సాక్షి, అమరావతి: వీటిని పరిశీలిస్తే ఏమనిపిస్తుంది? వంశధార-బాహుదా నదుల అనుసంధానం అంచనాల్లోనే భారీగా అక్రమాలు చోటుచేసుకున్నట్లు స్పష్టమవుతోంది కదా.. ఆర్థిక శాఖ అధికారులు కూడా ఇదే అంశాన్ని ఎత్తిచూపి, ప్రతిపాదనలను తోసిపుచ్చారు. కానీ.. సీఎం చంద్రబాబు వాటిని యథాతథంగా ఆమోదించాలని ఆర్థిక శాఖ అధికారులపై ఒత్తిడి తెస్తున్నారు.

వంశధార-బాహుదా నదుల అనుసంధానం పనుల్లో భారీ కుంభకోణానికి ప్రభుత్వ పెద్దలు తెర తీశారు. కేవలం 1,765.75 క్యూసెక్కుల సామర్థ్యంతో కనీసం లైనింగ్ కూడా లేకుండా తవ్వే కాలువకు కిలోమీటర్‌కు ఏకంగా రూ.57.65 కోట్లు ఖర్చవుతుందంటూ అంచనాలు రూపొందించేలా జలవనరుల శాఖ అధికారులపై ఒత్తిడి తెచ్చారు. ఈ అంచనాల్లో లోపాలను ఎత్తిచూపిన ఆర్థిక శాఖ అధికారులపై సాక్షాత్తూ ముఖ్యమంత్రి చంద్రబాబే మండిపడ్డారు. వాటిని తక్షణమే ఆమోదించాలని ఆర్థిక శాఖపై ఒత్తిడి తెస్తున్నారు. వంశధార-బాహుదా నదులను అనుసంధానించే హైలెవల్ కెనాల్ నిర్మాణానికి రూ.6,342.56 కోట్లతో రూపొందించిన ప్రతిపాదనలను ఆమోదిస్తే, ప్రజాధనం పక్కదారి పట్టడం ఖాయమని అధికారవర్గాలు బాహాటంగా వ్యాఖ్యానిస్తున్నాయి.

గోదావరి-కృష్ణా నదులను అనుసంధానించి చరిత్ర సృష్టించామని.. గోదావరి-పెన్నా, వంశధార-నాగావళి, వంశధార-బాహుదా, వంశధార-చంపావతి అనుసంధానం చేసి రాష్ట్రాన్ని సస్యశ్యామలం చేస్తామని ముఖ్యమంత్రి చంద్రబాబు పదేపదే ప్రకటిస్తున్నారు. కానీ, రాష్ట్రంలో గోదావరి-కృష్ణా నదుల అనుసంధానం జరగలేదని కేంద్ర జలసంఘం(సీడబ్ల్యూసీ) పలు సందర్భాల్లో కుండబద్దలు కొట్టింది. అయినా చంద్రబాబు అవాస్తవాలను వల్లె వేస్తూనే ఉన్నారు. ఈ క్రమంలోనే వంశధార-బాహుదా నదుల అనుసంధానానికి తెరతీశారు.

డీపీఆర్ పూర్తిగా తప్పులతడక

వంశధార-బాహుదా నదుల అనుసంధానం సాధ్యాసాధ్యాలపై అధ్యయనం చేసి.. సమగ్ర ప్రాజెక్టు నివేదిక(డీపీఆర్) తయారు చేసే బాధ్యతను కోటరీ సంస్థకే కట్టబెట్టేలా ప్రభుత్వ పెద్దలు చక్రం తిప్పారు. రెండు నదీ పరివాహక ప్రాంతాల్లో అధ్యయనం చేసిన ఆ సంస్థ వంశధార ప్రాజెక్టు రెండో దశలో హీరమండలం రిజర్వాయర్ నుంచి హైలెవల్ కెనాల్ తవ్వి ఇచ్ఛాపురం సమీపంలోని బాహుదా నదిలోకి వంశధార జలాలను తరలించాలని ప్రతిపాదించింది. రోజుకు 1,765.75 క్యూసెక్కుల చొప్పున వంద రోజుల్లో 16 టీఎంసీలను తరలించడం ద్వారా శ్రీకాకుళం జిల్లా ఇచ్ఛాపురం, టెక్కలి, పలాస నియోజకవర్గాల్లోని 14 మండలాల్లో కొత్తగా 1.06 లక్షల ఎకరాల ఆయకట్టుకు నీళ్లందించడంతోపాటు 54 వేల ఎకరాల ఆయకట్టును స్థిరీకరించవచ్చునని సూచించింది.

ఇందుకు హైలెవల్ కెనాల్‌ను 110 కిలోమీటర్ల పొడవున తవ్వాల్సి ఉంటుందని.. ఈ కాలువ తవ్వడానికి రూ.6,342.56 కోట్ల వ్యయం అవుతుందని అంచనా వేసింది. ఈ కెనాల్‌కు అనుబంధంగా 6.10 టీఎంసీల సామర్థ్యంతో పెద్దలోగిడి, రంగసాగరం, రేగులపాడు, హంసరలి జలాశయాలు నిర్మించాలని ప్రతిపాదించింది. ఈ జలాశయాల నిర్మాణానికి అయ్యే వ్యయం కాలువ తవ్వడానికి అయ్యే ఖర్చుకు అదనం అని డీపీఆర్‌లో పేర్కొంది. దీన్ని పరిశీలించిన జలవనరుల శాఖ అధికారులు డీపీఆర్‌ను తప్పులతడకగా తేల్చి.. తోసిపుచ్చారు. కానీ, సీఎం చంద్రబాబు తీవ్ర స్థాయిలో ఒత్తిడి చేయడంతో ఆ డీపీఆర్ ఆధారంగా హైలెవల్ కెనాల్ తవ్వడానికి రూ.6,342.56 కోట్ల వ్యయంతో సర్కార్‌కు ప్రతిపాదనలు పంపారు.

ఆశ్చర్యపోయిన ఆర్థిక శాఖ

వంశధార-బాహుదా నదులను అనుసంధానం చేసే హైలెవల్ కెనాల్ అంచనాలను పరిశీలించిన ఆర్థిక శాఖ నివ్వెరపోయింది. కేవలం 17 మీటర్ల వెడల్పు, 3.30 మీటర్ల లోతుతో కాంక్రీట్ లైనింగ్ లేకుండా కేవలం తవ్వకం పనులకే కిలోమీటర్‌కు రూ.57.65 కోట్లు ఎందుకని ఆశ్చర్యం వ్యక్తం చేసింది. అంచనాల్లో లోపాలు ఉన్నాయంటూ పేర్కొంటూ వాటిని జలవనరుల శాఖకు వెనక్కి పంపింది. ఇటీవల జలవనరుల శాఖపై సీఎం చంద్రబాబు నిర్వహించిన సమీక్షలో వంశధార-బాహుదా నదుల అనుసంధానం ప్రతిపాదనలపై ఆరాతీశారు. ఆర్థిక శాఖ తోసిపుచ్చిందంటూ జలవనరుల శాఖ అధికారులు చెప్పడంతో ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రతిపాదనలను యథాతథంగా ఆమోదించాలని ఆర్థిక శాఖ అధికారులను ఆదేశించారు. తొలి దశ పనులకు పరిపాలన అనుమతి ఇచ్చి.. తక్షణమే టెండర్లు పిలవాలని తేల్చిచెప్పారు.

భారీ స్కామ్‌కు పథకరచన

అంచనాల్లోనే వంచనకు పాల్పడిన ప్రభుత్వ పెద్దలు.. హైలెవల్ కెనాల్ తొలి దశ అంటే 55 కిలోమీటర్ల వరకూ కాలువ తవ్వకం పనులను ఐదు ప్యాకేజీలుగా విభజించి టెండర్లు పిలవాలంటూ జలవనరుల శాఖ అధికారులపై ఒత్తిడి తెస్తున్నారు. ఈ ఐదు ప్యాకేజీలను కోటరీ కాంట్రాక్టర్లకే కట్టబెట్టేలా చక్రం తిప్పుతున్నారు. నెలాఖరులోగా టెండర్ల ప్రక్రియను ప్రారంభించి.. ఫిబ్రవరి రెండో వారంలోగా ముగించి.. కోటరీ కాంట్రాక్టర్లకే పనులు అప్పగించేలా పథకం వేశారు. ఆ తర్వాత కాంట్రాక్టర్లకు మొబిలైజేషన్ అడ్వాన్సులు అప్పగించి.. వాటినే కమీషన్లుగా పొందడానికి ప్లాన్ వేశారు. తొలి దశ పనుల అంచనా వ్యయం రూ.2,709.56 కోట్లు. ఇందులో 10 శాతం అంటే రూ.270 కోట్ల మేర మొబిలైజేషన్ అడ్వాన్సులుగా కాంట్రాక్టర్లకు ఇచ్చి.. వాటినే కమీషన్లుగా వసూలు చేసుకోనున్నారు.

వైఎస్సార్‌సీపీలో 610 మంది చేరిక

గుంటూరు జిల్లాలో టీడీపీకి షాక్

గురజాల రూరల్(గురజాల): ఎన్నికలు సమీపిస్తున్న కొద్దీ తెలుగుదేశం పార్టీకి కార్యకర్తలు షాక్ ఇస్తున్నారు. సీఎం చంద్రబాబు అధికారంలోకి వచ్చిన నాటి నుంచి చేస్తున్న అరాచకాలు, అవినీతికి విసుగుచెందిన ప్రజలు వైఎస్సార్ సీపీ వైపు మొగ్గు చూపుతున్నారు. కొంత కాలంగా వైఎస్సార్ సీపీలోకి భారీగా చేరికలు జరుగుతున్నాయి. గుంటూరు జిల్లా గురజాల మండలంలోని జంగమహేశ్వరపురం గ్రామంలో బుధవారం రాత్రి 'రావాలి జగన్.. కావాలి జగన్' కార్యక్రమం నిర్వహించారు. గ్రామానికి చెందిన వివిధ సామాజిక వర్గాలకు చెందిన 265 కుటుంబాల నుంచి 610 మందికిపైగా వైఎస్సార్ సీపీలో చేరారు. వైఎస్సార్ సీపీ గురజాల నియోజకవర్గ సమన్వయ కర్త కాసు మహేష్‌రెడ్డి, నరసరావుపేట పార్లమెంటరీ నియోజకవర్గ సమన్వయకర్త శ్రీ లావు శ్రీకృష్ణదేవరాయలు, మాచర్ల ఎమ్మెల్యే పిన్నెల్లి రామకృష్ణారెడ్డి, గుంటూరు తూర్పు నియోజకవర్గ ఎమ్మెల్యే ముస్తఫా, పశ్చిమ నియోజకవర్గ సమన్వయకర్త చంద్రగిరి ఏసురత్నం, మాజీ ఎమ్మెల్సీ టి.జి.వి. కృష్ణారెడ్డి పార్టీ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. రాష్ట్ర సంయుక్త ప్రధాన కార్యదర్శి ఎనుముల మురళీధర్‌రెడ్డి, పోలు వీరారెడ్డి పాల్గొన్నారు. ఎంపీటీసీ సభ్యురాలు చలంచర్ల రోశమ్మ, ఎనుముల రామకృష్ణారెడ్డి, సంకటి నరసింహారెడ్డి, ముసుగు శ్రీను, పాశం యర్రయ్య, షేక్ ఫక్రూబీ, సిలార్, కె నారాయణ, కానాల లక్ష్మయ్య, రాచకొండ వీరనారాయణ, గుంటూరు జానకయ్య, బి సత్యనారాయణ, శేషగిరి, పెద వెంకట్రామయ్య, ఆర్ బ్రహ్మం, గురువులు, అంజి, నీలకంఠం,శ్రీను, బి ఏసోబు, పుల్లయ్య, శివయ్య పార్టీలోకి చేరారు.



వైఎస్సార్‌సీపీలో చేరిన మహిళలతో పార్టీ నాయకులు కాసు మహేష్‌రెడ్డి, లావు శ్రీకృష్ణదేవరాయలు, ఏసురత్నం తదితరులు



పుష్పపల్లకీలో మల్లన్న విహారం

శ్రీశైలం: శ్రీశైల మహాక్షేత్రంలో సంక్రాంతి మహోత్సవాల్లో భాగంగా బుధవారం మల్లికార్జునుడు పార్వతీ సమేతంగా పుష్పపల్లకీలో విహరిస్తూ భక్తులకు దర్శనమిచ్చారు. కనుమ సందర్భంగా రాత్రి 8.00 గంటలకు ఆలయ ప్రాంగణంలోని అక్కమహాదేవి అలంకార మండపంలో స్వామి, అమ్మవార్ల ఉత్సవమూర్తులకు అర్చకులు, వేదపండితులు శాస్త్రోక్తంగా పూజలు నిర్వహించారు. ఆలయ ప్రదక్షిణ అనంతరం ఉత్సవమూర్తులను రథశాల వద్దకు చేర్చి.. అక్కడ వివిధ రకాల పుష్పాలతో ఏర్పాటు చేసిన పల్లకీలో అధిష్టింపజేశారు. నారికేళ నైవేద్యాలను సమర్పించిన తర్వాత గంగాధర మండపం నుంచి ప్రారంభమైన ఉత్సవం అంకాలమ్మగుడి, నందిమండపం, ప్రధాన మాడ వీధుల్లో అత్యంత వైభవంగా సాగింది. కాగా, మంగళవారం దేవేరితో కలసి ఆలయ పుష్కరిణిలో తెప్పపై విహరించారు. అదేరోజు నందివాహన గ్రామోత్సవం ముగిశాక రాత్రి 9.00 నుంచి శ్రీ గంగా పార్వతి సమేత మల్లికార్జునస్వామివార్ల బ్రహ్మోత్సవ కల్యాణం వైభవంగా జరిగింది.



తూర్పుగోదావరి జిల్లా అంబాజీపేట మండలం మొసలపల్లి శివారు జగ్గన్నతోటలో ప్రభల సందడి

'ప్రభ'వించిన కోనసీమ

అమలాపురం: సంక్రాంతి ప్రభల తీర్థాలు తూర్పు గోదావరి జిల్లాలో అట్టహాసంగా జరుగుతున్నాయి. ఇటు ఆధ్యాత్మికం.. అటు సంప్రదాయం మేళవించిన ప్రభల తీర్థాలకు భక్తులు పోటెత్తుతున్నారు. రాష్ట్రంలోనే అతిపెద్ద ప్రభల తీర్థంగా గుర్తింపు పొందిన జగ్గన్నతోట ప్రభల తీర్థం బుధవారం కనులవిందుగా సాగింది. అంబాజీపేట మండలం మొసలపల్లి శివారు జగ్గన్నతోటలో జరిగిన ఈ తీర్థానికి మూడు మండలాల నుంచి ఏకాదశ రుద్రులు (11 ప్రభలు) తరలివచ్చారు. పంట కాలువలు, కొబ్బరితోటలు, వరిచేలు దాటుకుని సుమారు టన్ను బరువు ఉన్న ప్రభలను 50 నుంచి 60 మంది వరకు మోసుకువచ్చిన తీరు భక్తులను సంభ్రమాశ్చర్యాలకు గురి చేసింది. 11 ప్రభలు ఒకేచోట కొలువుదీరి భక్తులను పరవశింపచేశాయి. ఎన్‌ఆర్‌ఐలు, వివిధ ప్రాంతాల్లో నివాసముంటున్న స్థానికులు, ఇతర ప్రాంతాలకు చెందిన వారి మిత్రులు పెద్ద ఎత్తున తరలివచ్చారు. ఈ ఒక్క తీర్థానికే సుమారు 40 వేల మంది భక్తులు వచ్చినట్టు అంచనా. జగ్గన్నతోటతోపాటు ఇదే మండలంలో వాకలగరువు సరిహద్దులో జరిగిన ప్రభల తీర్థంలో వాకలగరువు ప్రభ 50 అడుగులు, తొండవరం ప్రభ 46 అడుగుల ఎత్తుతో భక్తులను విశేషంగా ఆకట్టుకున్నాయి. వీటితోపాటు మామిడికుదురు మండలం కొర్లగుంటలో 12 ప్రభలు తరలివచ్చాయి. పి.గన్నవరం, ఆత్రేయపురం, అమలాపురం, ముమ్మిడివరం, మలికిపురం మండలాలతోపాటు జిల్లా వ్యాప్తంగా 60 గ్రామాల్లో ప్రభల తీర్థాలు జరిగాయి. సోమవారం రాత్రి సంక్రాంతి రోజున కొత్తపేటలో జరిగిన ప్రభల తీర్థంలో గ్రామస్తులు పోటీపడుతూ బాణాసంచాలతో హోరెత్తించారు.



బోడిగాడితోటలో సమాధుల వద్ద పెద్దలను స్మరిస్తూ పూజలు చేస్తున్న వారసులు

పినాకినీ తీరాన పెద్దల పండగ

నెల్లూరు (బృందావనం): తెలుగువారి పెద్ద పండగ.. సంక్రాంతి నేపథ్యంలో మంగళవారం శ్రీపొట్టిశ్రీరాములు నెల్లూరు జిల్లా కేంద్రంలోని పవిత్ర పినాకినీ తీరాన ఉన్న బోడిగాడితోటలోని పెద్దల సమాధుల తోట వద్దకు ప్రజలు తరలివచ్చి సంప్రదాయబద్ధంగా పెద్దల పండగ నిర్వహించారు. తమకు జన్మనిచ్చిన తల్లిదండ్రులను, తమ వారసులను, వారికి జీవితాన్నిచ్చిన పూర్వీకులను స్మరిస్తూ నూతన వస్త్రాలను, వారికి ఇష్టమైన పిండి వంటలను సమర్పించి, నూతన వస్త్రాలతో ధూపదీప నైవేద్యాలతో వారికి పూజలు చేశారు. సమాధులకు విశేషంగా అలంకరణ చేశారు.

కోదాడ వద్ద ఘోర రోడ్డు ప్రమాదం

ఒకే కుటుంబానికి చెందిన ముగ్గురు మృతి

కోదాడ రూరల్: సూర్యాపేట జిల్లా కోదాడ మండలం కొమరబండ సమీపంలోని జాతీయ రహదారిపై బుధవారం ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది. ఈ ఘటనలో ఒకే కుటుంబానికి చెందిన ముగ్గురు దుర్మరణం చెందగా ఒకరు గాయపడ్డారు. వివరాలు.. హైదరాబాద్‌లోని చర్లపల్లి ఈసీనగర్‌కు చెందిన రావి నాగమురళీకృష్ణ (48) ఓ ప్రైవేట్ సంస్థలో ఉద్యోగం చేస్తున్నాడు. సంక్రాంతి పండుగ సందర్భంగా ఆంధ్రప్రదేశ్‌లోని కృష్ణాజిల్లా నూజివీడు మండలం పోతిరెడ్డిపాలెంలో ఉన్న అత్తగారి ఇంటికి భార్య కవిత (42), కూతురు ధనుష (17), కుమారుడు యునిత్‌తో కలిసి వెళ్లారు. పండుగ ముగించుకుని తిరిగి హైదరాబాద్ వస్తుండగా కొమరబండ శివారులో కారు అదుపు తప్పి అటుగా హైదరాబాద్ నుంచి విజయవాడ వెళ్తున్న రెండు కార్లను ఢీకొట్టి పక్కనే ఉన్న కల్వర్టుకు బలంగా తగిలింది. దీంతో కారులోనే నాగమురళీకృష్ణ మృతిచెందగా, కవిత, ధనుషలు కల్వర్టుకు దూరంగా ఎగిరిపడి మృతిచెందారు. యునిత్ గాయాలతో బయటపడ్డాడు. అటువైపు కారులో వెళ్తున్న మెదక్ జిల్లా రామాయంపేటకు చెందిన కంభం పాటి ఈశ్వర్, అనిరుధ్‌రావు, సోమనగాని స్వామిలకు గాయాలయ్యాయి.

ఇక దుబాయ్ ఫ్లైట్స్‌పై దృష్టి

- అమరావతి నుంచి నేరుగా నడిపేందుకు ప్రయత్నాలు
- ఓటింగ్ ద్వారా ప్రజాభిప్రాయాన్ని సేకరిస్తున్న ఏపీఏడీసీఎల్

సాక్షి, అమరావతి: పండగల వేళ ఆర్టీసీ ప్రయాణికుల జేబులు గుల్ల చేస్తున్న ప్రభుత్వం.. సంపన్నులు ప్రయాణించే విమాన సర్వీసులను మాత్రం ఎదురు డబ్బులిచ్చి మరీ నడుపుతోంది. ఇప్పటికే అమరావతి నుంచి నేరుగా సింగపూర్‌కు ఇలా ఎదురుడబ్బులిచ్చి సర్వీసులు నడుపుతుండగా.. తాజాగా దుబాయ్‌కు సర్వీసులు ప్రారంభించేందుకు ప్రయత్నాలు మొదలెట్టింది. గతంలో సింగపూర్‌కు విమాన సర్వీసులు ప్రారంభించే ముందు ఏపీ ఎయిర్‌పోర్టు డెవలప్‌మెంట్ కార్పొరేషన్ లిమిటెడ్ (ఏపీఏడీసీఎల్) ప్రజాభి ప్రాయ సేకరణ తరహాలోనే.. దుబాయ్ సర్వీసులకూ మొదలెట్టింది. అమరావతి నుంచి నేరుగా దుబాయ్‌కు విమాన సర్వీసులు ప్రారంభించడంపై లాభదాయకత, భాగస్వాముల అభిప్రాయాలను తెలుసుకోవడానికి ఈ అభిప్రాయ సేకరణ చేస్తున్నట్లు పేర్కొంది.

ఓటింగ్ విధానంపై అనుమానాలు

ఏపీఏడీసీఎల్ నిర్వహిస్తున్న ఈ ఓటింగ్ విధానంపై పలు విమర్శలొస్తున్నాయి. జనవరి 11న ఓటింగ్ ప్రారంభం కాగా.. జనవరి 16 సాయంత్రం 6.30 గంటలకు 1,34,582 మంది దుబాయ్‌కు విమాన సర్వీసులు ప్రారంభించడానికి మద్దతు తెలిపినట్లుగా ఏపీఏడీసీఎల్ వెబ్‌సైట్ గణాంకాలు పేర్కొంటున్నాయి. కానీ ఏపీఏడీసీఎల్ వైబ్‌సైట్ ప్రారంభమైనప్పటి నుంచి ఇప్పటి వరకు సందర్శించిన వారి సంఖ్య అదే సమయానికి 1,14,827గా ఉంది. పోనీ గతంలో వెబ్‌సైట్‌ను సందర్శించిన వారందరూ ఈ పోలింగ్‌లో పాల్గొన్నారనుకున్నా.. 19,755 మంది అదనంగా ఓటింగ్‌లో ఎలా పాల్గొన్నారన్న ప్రశ్నలొస్తున్నాయి. అంతేకాదు ఈ వెబ్‌సైట్‌ను నెలకు 5,000 మంది లోపే సందర్శిస్తున్నారని వెబ్ గణాంకాలు స్పష్టం చేస్తుంటే.. ఈ ఒక్క వారంలోనే ఏకంగా 1.14 లక్షల మంది పాల్గొన్నారన్న దానిపై కూడా పలు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఓటింగ్‌లో కేవలం మద్దతు ఆప్షన్ ఒక్కటే ఉండటంతో ఓటింగ్ వివరాలు తెలుసుకోవడానికి క్లిక్ చేసినా సరే అనుకూలంగా ఓటింగ్ చేసినట్లు వచ్చేస్తోంది. దీన్నిబట్టి కేవలం కొంతమందే ఓటింగ్‌లో పాల్గొంటే.. లక్షలాది మంది అడుగుతున్నట్లుగా చూపించే ప్రయత్నం ప్రభుత్వం చేస్తోందంటున్నారు. జనవరి 11న ప్రారంభమైన ఈ అభిప్రాయ సేకరణ జనవరి 17తో ముగియనుంది. గతంలో సింగపూర్‌కు నేరుగా విమాన సర్వీసులు నడపడానికి ఇదే విధంగా ఓటింగ్ పెట్టి ప్రభుత్వం భారీ ప్రచారం చేసిన సంగతి తెలిసిందే. అప్పటి ఓటింగ్‌లోనూ చాలా మంది మద్దతు లభించినా ఏ ఒక్క విమానయాన సంస్థ కూడా ముందుకు రాలేదు.

మహిళా కానిస్టేబుల్ ఆత్మహత్య

- 4 నెలల క్రితమే ప్రేమ వివాహం
- 2 నెలలుగా భర్తతో మనస్పర్థలు



భర్తతో కుమారి (ఫైల్)

ఆనందపురం (భీమిలి): జీవితాంతం తోడుగా ఉంటానని చెప్పి ప్రేమించి పెళ్లి చేసుకున్న భర్త వేధింపులకు తాళలేక మహిళా కానిస్టేబుల్ ఆత్మహత్య చేసుకుంది. విశాఖ జిల్లా ఆనందపురంలో బుధవారం జరిగిన ఈ విషాద సంఘటనకు సంబంధించి సీఐ సూర్యనారాయణ, స్థానికులు అందించిన వివరాలిలా ఉన్నాయి. తెలంగాణ రాష్ట్రం రంగారెడ్డి జిల్లా, పూడూరు మండలం, వెంకాపల్లి గ్రామానికి చెందిన మాల రాజేంద్ర (27)కు రెండేళ్ల కిందట ఇండో టిబెటిన్ బోర్డర్ బెటాలియన్ (ఐటీబీపీ)లో కానిస్టేబుల్ ఉద్యోగం వచ్చింది. ఈ మేరకు విశాఖ జిల్లా ఆనందపురం మండలం పందలపాకలో ఉన్న బెటాలియన్‌లో చేరాడు. తర్వాత అక్కడే కానిస్టేబుల్‌గా చేరిన విశాఖ జిల్లా మునగపాక మండలం, నాగవరం గ్రామానికి చెందిన కరణం కళావతి, రమణ దంపతుల చిన్న కుమార్తె కరణం కుమారి (22)ను ప్రేమించాడు. పెద్దలను ఎదిరించి నాలుగు నెలల కిందట సింహాచలంలో వివాహం చేసుకున్నారు. వారిరువురి మధ్య మనస్పర్థలు తలెత్తడంతో రెండు నెలల కిందట కుమారి పురుగు మందు తాగి ఆత్మహత్యకు యత్నించింది. అప్పట్లో బెటాలియన్ అధికారులు వారిద్దరికీ కౌన్సెలింగ్ నిర్వహించారు. అయినా ఎడముఖం పెడముఖంగానే ఉంటున్నారు. ఈ నేపథ్యంలో రాజేంద్ర శిక్షణ నిమిత్తం ఈ నెల 7న చండీగఢ్ వెళ్లాడు. ఏమైందో తెలియదు కానీ కుమారి మంగళవారం ముందుగా రాజేంద్రకు ఫోన్ చేసి తాను ఆత్మహత్య చేసుకున్నట్లు చెప్పింది. అయితే అటు నుంచి ఓదార్పు రాలేదు సరికదా నువ్వు చనిపోతే నేను కూడా చనిపోతానని చెప్పి రాజేంద్ర ఫోన్ పెట్టేసినట్టు పోలీస్ విచారణలో బయటపడింది. ఐటీబీపీ కమాండెంట్ చంద్రమోహన్ మిశ్రా, పోలీస్ అధికారులు సంఘటన ప్రాంతాన్ని పరిశీలించారు.

రసకందాయంలో కన్నడ రాజకీయం

కుమారస్వామి ప్రభుత్వాన్ని కూల్చేందుకు 'ఆపరేషన్ కమలం'!

- కాంగ్రెస్ అసంతృప్త ఎమ్మెల్యేలతో బీజేపీ మంతనాలు!
- గురుగ్రామ్‌లోని ఓ హోటల్లో బీజేపీ ఎమ్మెల్యేలు
- సంఖ్యాబలం చాటేందుకు 18న కాంగ్రెస్ శాసనసభా పక్ష సమావేశం

సాక్షి, బెంగళూరు: కాంగ్రెస్, జేడీఎస్ సంకీర్ణ ప్రభుత్వాన్ని గద్దె దించేందుకు బీజేపీ 'ఆపరేషన్ కమలం'ను ప్రారంభించిందన్న వార్తల నేపథ్యంలో కర్ణాటక రాజకీయాలు మరోసారి రసకందాయంలో పడ్డాయి. కాంగ్రెస్, జేడీఎస్ కూటమి ఆకర్షించేందుకు ప్రయత్నిస్తోందంటూ బీజేపీ తమ 104 మంది ఎమ్మెల్యేలను హరియాణాలోని గురుగ్రామ్‌లోని ఒక హోటల్‌లో ఉంచిన విషయం తెలిసిందే. మరోవైపు, కాంగ్రెస్‌లోని దాదాపు ఆరుగురు అసంతృప్త ఎమ్మెల్యేలు ముంబైలో మకాం వేసి బీజేపీతో సంప్రదింపులు జరుపుతున్నారంటూ కూడా వార్తలు వచ్చాయి. అయితే, తమ ఎమ్మెల్యేలెవరూ కాంగ్రెస్‌ను వీడటం లేదని, ఆ ఎమ్మెల్యేలు తమతో టచ్‌లోనే ఉన్నారని కాంగ్రెస్ స్పష్టం చేసింది. రేపు(జనవరి 18న) పార్టీ ఎమ్మెల్యేలందరితో సమావేశం నిర్వహించాలని నిర్ణయించింది. మరోవైపు, ఇన్నాళ్లూ కుమారస్వామి ప్రభుత్వానికి మద్దతిచ్చిన ఇద్దరు ఎమ్మెల్యేలు మంగళవారం తమ మద్దతును ఉపసంహరించుకుని బీజేపీ వైపునకు వెళ్లారు. వారిలో ఒకరు స్వతంత్ర ఎమ్మెల్యే కాగా, మరొకరు కర్ణాటక ప్రజ్ఞావంత జనతా పార్టీ(కేపీజేపీ)కి చెందిన సభ్యుడు. దాంతో బీజేపీ బలం 106కి చేరింది. బీజేపీ కుయుక్తులు ఫలించవని, తన ప్రభుత్వానికి ఢోకా లేదని ముఖ్యమంత్రి కుమార స్వామి చెప్పారు. ప్రభుత్వాన్ని కూల్చేందుకు తామేమీ ప్రయత్నించడం లేదని, తమ ప్రమేయం లేకుండానే, అంతర్గత విభేదాలతోనే కుమారస్వామి సర్కారు కూలుతుందని బీజేపీ పేర్కొంది.

వీరిపైనే దృష్టి

ఇటీవల మంత్రి పదవిని కోల్పోయిన రమేశ్ జార్కిహోళి, ఎమ్మెల్యేలు డాక్టర్ ఉమేశ్ జాదవ్, బి.నాగేంద్ర, ప్రతాప్‌గౌడపాటిల్, మహేశ్ కుమటళ్లి, బీసీ పాటిల్, కంప్లి గణేశ్, భీమానాయక్, డాక్టర్ సుధాకర్, శ్రీనివాసగౌడ సొంత పార్టీ కాంగ్రెస్‌పై తీవ్ర అసంతృప్తితో ఉన్నారని సమాచారం. వీరు పార్టీ నేతలకు అందుబాటులో లేరని తెలుస్తోంది.

రేపు సీఎల్పీ భేటీ

ప్రాంతీయ కర్ణాటక ప్రజ్ఞావంత జనతా(కేపీజేపీ) పార్టీకి చెందిన ఆర్. శంకర్, స్వతంత్ర ఎమ్మెల్యే హెచ్. నగేశ్‌లు ప్రభుత్వానికి మద్దతు ఉపసంహరించుకోవడంతో కాంగ్రెస్–జేడీఎస్ బలం 117కి తగ్గిపోయింది. వారిద్దరు బీజేపీకి మద్దతు ప్రకటించడంతో ఆ పార్టీ బలం 106కు పెరిగింది. అధికార కూటమిలో అంతర్గత విభేదాల్ని ఆసరాగా చేసుకుని అటు వైపు నుంచి ఎమ్మెల్యేల్ని ఆకర్షించేందుకు బీజేపీ 'ఆపరేషన్ లోటస్'ను ప్రారంభించినట్లు వార్తలు వచ్చాయి. అదే సమయంలో తమ సభ్యులు జారిపోకుండా బీజేపీ వారందరిని గురుగ్రామ్‌లోని ఓ విలాసవంత హోటల్‌కు తరలించింది. మరోవైపు, రేపు బెంగళూరులో మాజీ ముఖ్యమంత్రి సిద్ధరామయ్య నేతృత్వంలో జరిగే శాసనసభా పక్ష సమావేశం ద్వారా అంతా సవ్యంగానే ఉందనే సంకేతాలు పంపాలని కాంగ్రెస్ ప్రయత్నిస్తోంది. బడ్జెట్ గురించి చర్చించడమే అజెండాగా ఈ సమావేశం జరగాల్సి ఉండగా, తాజా రాజకీయ పరిస్థితులే ప్రముఖంగా చర్చకు వచ్చే అవకాశాలున్నాయి.


బెంగళూరులో ఆందోళనకు దిగిన జేడీఎస్ ఎమ్మెల్యేలు

పార్టీల వ్యూహ ప్రతివ్యూహాలు..

కాంగ్రెస్ ఇన్‌చార్జి కేసీ వేణుగోపాల్, డిప్యూటీ సీఎం పరమేశ్వర, మాజీ సీఎం సిద్ధరామయ్య, ఇతర కేపీసీసీ నేతలు అసంతృప్త ఎమ్మెల్యేలను బుజ్జగించే విషయంపై చర్చించారు. అవసరమైతే ఎమ్మెల్యేలను రిసార్ట్‌కు తరలించాలని యోచిస్తున్నారు. గురుగ్రామ్ హోటల్‌లో ఉన్న బీజేపీ ఎమ్మెల్యేలతో ఆ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు బీఎస్ యడ్యూరప్ప సమావేశమై సమాలోచనలు జరిపారు.

మా సంకీర్ణం భద్రం: కాంగ్రెస్

కాంగ్రెస్ సభ్యులంతా తమను సంప్రదిస్తూనే ఉన్నారని, పార్టీలో అంతా సవ్యంగానే ఉందని ఉపముఖ్యమంత్రి జి.పరమేశ్వర చెప్పారు. కర్ణాటకలో సంకీర్ణ ప్రభుత్వాన్ని కూల్చడం ద్వారా, జాతీయ స్థాయిలో ఏర్పడబోయే విపక్ష మహా కూటమి విఫలమవుతుందనే సంకేతాన్ని బీజేపీ ఇవ్వాలనుకుంటోందన్నారు. బీజేపీ ప్రయత్నాలు ఫలించవని నొక్కిచెప్పారు. తాజా పరిణామాలపై ముఖ్యమంత్రి కుమారస్వామి స్పందిస్తూ..తమ సంకీర్ణ ప్రభుత్వంలో ఇబ్బందులు లేవని, కాంగ్రెస్, జేడీఎస్ సభ్యులందరి మద్దతు ప్రభుత్వానికే ఉందన్నారు. కర్ణాటకలో సంకీర్ణ ప్రభుత్వాన్ని కూల్చేందుకు చేసిన ప్రయత్నాలు విఫలం కావడం వల్లే కూటమిలో విభేదాలున్నాయంటూ బీజేపీ ప్రచారం చేస్తోందని కాంగ్రెస్ నేత మల్లికార్జున్ ఖర్గే ఆరోపించారు.

మొత్తం స్థానాలు - 224 (ఒక నామినేటెడ్ సీటు మినహాయించి)	
మెజారిటీకి అవసరమైన సీట్లు:	113
కాంగ్రెస్– జేడీఎస్ కూటమి	
కాంగ్రెస్:	80
జేడీఎస్:	37
మొత్తం:	117
(ఈ కూటమికి మద్దతిచ్చిన బీఎస్పీ ఎమ్మెల్యే మహేశ్ ఇటీవలే మంత్రిపదవికి రాజీనామా చేసి, కూటమికి దూరమయ్యారు)	
బీజేపీ:	104
స్వతంత్రులు:	02
మొత్తం:	106
(కాంగ్రెస్ నుంచి గెలిచిన ఐదారుగురు ఎమ్మెల్యేలతో బీజేపీ సంప్రదింపులు జరుపుతున్నట్లు సమాచారం)	


బీజేపీ వ్యూహం

కర్ణాటకలో కాంగ్రెస్–జేడీ(ఎస్) సంకీర్ణ ప్రభుత్వానికి 117మంది ఎమ్మెల్యేల బలం ఉంది. బీజేపీకి 104 సభ్యుల బలం ఉంది. తాజాగా ఇద్దరు స్వతంత్రులు బీజేపీ వైపు వచ్చారు. బీజేపీ ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయాలంటే కాంగ్రెస్, జేడీ(ఎస్)ల నుంచి 13 మంది ఎమ్మెల్యేల చేత రాజీనామా చేయించాల్సి ఉంటుంది. అప్పుడు మొత్తం సభ్యుల సంఖ్య 211కి తగ్గుతుంది. మెజారిటీకి అవసరమైన సభ్యుల సంఖ్య 106 అవుతుంది. ప్రస్తుతం సొంత సభ్యులు 104, స్వతంత్రులు ఇద్దరు కలిస్తే బీజేపీ బలం 106కి చేరుతుంది. కాంగ్రెస్– జేడీఎస్ సభ్యులు నేరుగా బీజేపీకి మద్దతిస్తే ఫిరాయింపు నిరోధక చట్టం ప్రకారం వారిపై అనర్హత వేటు పడుతుంది. అందుకే 'ఆపరేషన్ కమలం' ద్వారా రాజీనామా చేసిన వారిని ఉప ఎన్నికల్లో గెలిపించుకోవడమే బీజేపీ వ్యూహంగా తెలుస్తోంది. లోక్‌సభ ఎన్నికల్లో మళ్లీ బీజేపీ అధికారం చేపట్టడం ఖాయమని సర్వేలు అంచనా వేస్తుండటంతో.. కర్ణాటక అసెంబ్లీ ఉప ఎన్నికలు కూడా వస్తే లాభమని బీజేపీ అంచనా.

ఆపరేషన్ కమలం అంటే..: దక్షిణాదిన తొలిసారిగా ఇక్కడ పాగావేసిన కమలనాథులు తమ ప్రభుత్వాన్ని సుస్థిరం చేసుకోవడానికి ఆపరేషన్ కమలం అస్త్రాన్ని బయటకు తీశారు. ప్రతిపక్ష ఎమ్మెల్యేలకు డబ్బుని, అధికారాన్ని ఎరగా వేసి చీలిక తెచ్చి తమ వైపు లాక్కోవడమే ఆపరేషన్ కమలం లక్ష్యం.


మైసూర్ సమీపంలోని ఓ గ్రామంలో జరిగిన సంక్రాంతి వేడుకల్లో మంగళవారం ఎద్దులను మంటలు దాటిస్తున్న యువత. దుష్టశక్తుల్ని పారదోలేందుకు ఇలా ఎద్దులతో విన్యాసాలు చేయించడం అక్కడి సంప్రదాయం.

అమిత్ షాకు స్వైన్ ఫ్లూ



న్యూఢిల్లీ: స్వైన్ ఫ్లూ చికిత్స కోసం బీజేపీ అధ్యక్షుడు అమిత్ షా బుధవారం రాత్రి ఢిల్లీలోని ఎయిమ్స్‌లో చేరారు. 'నాకు స్వైన్ ఫ్లూ వచ్చింది. చికిత్స జరుగుతోంది. భగవంతుడి దయ, మీ అందరి ఆశీర్వాదంతో త్వరలోనే కోలుకుంటా' అని అమిత్ షా హిందీ భాషలో ట్వీట్ చేశారు. ఛాతీ పట్టేయడం, ఊపిరి తీసుకోవడంలో ఇబ్బందులు తదితర కారణాలతో అమిత్ షాను ఆసుపత్రిలో చేర్చినట్లు విశ్వసనీయవర్గాలు తెలిపాయి. కేంద్ర రైల్వే శాఖ మంత్రి పియూష్ గోయల్ అమిత్ షాను ఆసుపత్రిలో పరామర్శించారు.

మెడికల్ చెకప్ కోసం అమెరికాకు జైట్లీ



న్యూఢిల్లీ: కేంద్ర ఆర్థికమంత్రి అరుణ్ జైట్లీ అకస్మాత్తుగా అమెరికా వెళ్లారు. గత సంవత్సరం ఢిల్లీలోని ఎయిమ్స్‌లో జైట్లీకి మూత్రపిండ మార్పిడి శస్త్రచికిత్స జరిగిన విషయం తెలిసిందే. అమెరికాలో జైట్లీ పలు వైద్య పరీక్షలు, చికిత్స చేసుకోనున్నారని సమాచారం. కిడ్నీ మార్పిడి ఆపరేషన్ అనంతరం విదేశాల్లో ఆయన చికిత్స పొందడం ఇదే ప్రథమం. ఈ వారాంతంలోగా జైట్లీ తిరిగి భారత్ వస్తారని ఆయన కార్యాలయ వర్గాలు తెలిపాయి. ఫిబ్రవరి 1వ తేదీన జైట్లీ కేంద్ర బడ్జెట్‌ను పార్లమెంటులో ప్రవేశపెట్టాల్సి ఉంది. తాత్కాలిక బడ్జెటే అయినా, సాధారణ ఎన్నికలు ముందు ప్రవేశపెడ్తున్న బడ్జెట్ కావడంతో.. పూర్తి స్థాయి ప్రిపరేషన్‌తో బడ్జెట్‌ను రూపొందిస్తున్నట్లు సమాచారం.

సీబీఐ చీఫ్ ఎంపిక కోసం 24న భేటీ

న్యూఢిల్లీ: సీబీఐ కొత్త అధిపతిని ఎంపిక చేసేందుకు ప్రధాని నరేంద్రమోదీ నేతృత్వంలోని అత్యున్నత స్థాయి కమిటీ ఈ నెల 24వ తేదీన భేటీ కానుందని అధికార వర్గాలు వెల్లడించాయి. ఈ కమిటీలో ప్రధాని, సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి, లోక్‌సభలో విపక్ష నేత సభ్యులుగా ఉంటారు. అంతర్గత పోరు కారణంగా ఆలోక్‌వర్మను సీబీఐ చీఫ్ విధుల నుంచి తప్పించి సెలవుపై పంపడం, దీన్ని ఆలోక్‌వర్మ సుప్రీంకోర్టులో సవాలు చేయగా, మళ్లీ ఆయనను కోర్టు సీబీఐ డైరెక్టర్‌గా నియమించడం తెలిసిందే. అనంతరం ప్రధాని మోదీ, సీజేఐ ప్రతినిధిగా హాజరైన న్యాయమూర్తి జస్టిస్ సిక్రీ, కాంగ్రెస్ నేత ఖర్గేల కమిటీ అలోక్‌వర్మను పదవి నుంచి తొలగించడం కూడా విదితమే.

ఒడిశాలో 'కంటివెలుగు'!



భువనేశ్వర్: తెలంగాణ ప్రభుత్వం చేపట్టిన 'కంటివెలుగు' తరహాలో ఒడిశా ప్రభుత్వం 'సునేత్ర' పథకాన్ని ప్రారంభించింది. ఈ పథకం కింద రాష్ట్ర ప్రజలందరికీ ఉచితంగా కంటి పరీక్షలు, చికిత్సలు జరుపుతారు. అవసరమైన వారికి ఉచితంగా కళ్లద్దాలు అందజేస్తారు. అన్ని పాఠశాలల్లో ప్రతీ సంవత్సరం విద్యార్థులకు కంటి పరీక్షలు నిర్వహిస్తారు. ఐదేళ్ల కాలానికి గానూ రూ. 680 కోట్లతో ఈ పథకాన్ని ముఖ్యమంత్రి నవీన్ పట్నాయక్ ప్రారంభించారు. అన్ని ప్రభుత్వ ఆసుపత్రుల్లో ఈ చికిత్సలు నిర్వహిస్తారన్నారు.

'కన్యత్వంలేని అమ్మాయిలు సీల్‌లేని బాటిళ్లు!'

కోల్‌కతా: పశ్చిమబెంగాల్‌లోని జాదవ్‌పూర్ విశ్వవిద్యాలయానికి చెందిన ఓ ప్రొఫెసర్ వివాదాస్పద వ్యాఖ్యలు చేశారు. కన్యత్వం కోల్పోయిన అమ్మాయిలు సీల్‌లేని బాటిళ్ల వంటివారని ప్రొ.కనక్ సర్కార్ వ్యాఖ్యానించారు. సీల్ తీసిన కూల్‌డ్రింక్ బాటిల్‌ను, బిస్కెట్ ప్యాకెట్‌ను కొనుగోలు చేసేందుకు మీరు ఇష్టపడతారా? అని ఫేస్‌బుక్‌లో పోస్ట్‌చేశారు. అంతేకాకుండా చాలా మంది యువకులకు కన్యత్వం ఉన్న అమ్మాయిలు దేవకన్యల వంటివారని సెలవిచ్చారు. ప్రొ.కనక్ సర్కార్ ఫేస్‌బుక్‌లో పెట్టిన పోస్ట్ వివాదాస్పదం కావడంతో భావప్రకటన స్వేచ్ఛ కింద అభిప్రాయాలను వెల్లడించానని స్పష్టం చేశారు. ఈ విషయం మీడియాలో వైరల్‌కావడంతో సర్కార్ తన పోస్టింగ్‌ను తొలగించినప్పటికీ జరగాల్సిన నష్టం జరిగిపోయింది. కనక్ సర్కార్‌ను తక్షణం విధుల్లోంచి తప్పించడంతో పాటు వర్సిటీ ప్రాంగణంలో అడుగుపెట్టకుండా వైస్ ఛాన్స్‌లర్ సురంజన్‌దాస్ ఆదేశాలు జారీచేశారు. జాతీయ మహిళా హక్కుల కమిషన్, పశ్చిమబెంగాల్ మహిళా హక్కుల కమిషన్ ఆయనకు నోటీసులు జారీచేశాయి. కమిషన్ల విచారణ పూర్తయ్యేవరకూ సర్కార్‌ను విధుల్లోకి తీసుకోబోమని వీసీ ప్రకటించారు.

కొత్త సెంట్రల్ వర్సిటీలకు 3600 కోట్లు

న్యూఢిల్లీ: 13 కొత్త కేంద్రీయ విశ్వ విద్యాలయాల ఏర్పాటు, వాటిలో మౌలిక వసతుల కల్పన కోసం రూ. 3600 కోట్లను కేటాయిస్తూ కేంద్ర కేబినెట్ బుధవారం నిర్ణయం తీసుకుంది. వచ్చే మూడేళ్లలో వీటిని బిహార్, గుజరాత్, హరియాణా, హిమాచల్‌ప్రదేశ్, జమ్మూకశ్మీర్, జార్ఖండ్, కర్నాటక, కేరళ, ఒడిశా, పంజాబ్, రాజస్తాన్, తమిళనాడుల్లో ఏర్పాటు చేస్తారు. వీటిలో జమ్మూకశ్మీర్‌కు రెండు వర్సిటీలను కేటాయించారు.

'జస్టిస్ ఖన్నా' నియామకంపై రగడ

- కొలీజియం సిఫార్సును తప్పుపడుతూ జస్టిస్ కౌల్ లేఖ
- జస్టిస్ ప్రదీప్‌ను అకారణంగా తప్పించారని ఆగ్రహం


జస్టిస్ సంజీవ్ ఖన్నా


జస్టిస్ ఎస్కే కౌల్

న్యూఢిల్లీ: సుప్రీంకోర్టు కొలీజియం తీసుకున్న నిర్ణయం వివాదాస్పదమైంది. జనవరి 10న ఢిల్లీ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ సంజీవ్ ఖన్నా పేరును సుప్రీంకోర్టు జడ్జీగా సిఫార్సు చేయడాన్ని సీనియర్ న్యాయమూర్తి జస్టిస్ ఎస్కే కౌల్ తప్పుపట్టారు. రాజస్తాన్ హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ప్రదీప్ నంద్రజాగ్ పేరును తొలగించి, ఖన్నా పేరును జాబితాలో చేర్చడాన్ని ప్రశ్నిస్తూ ఆయన సీజేఐ జస్టిస్ రంజన్ గొగోయ్‌తో పాటు కొలీజియం సభ్యులకు లేఖ రాశారు. జస్టిస్ ప్రదీప్ సమర్థుడైన న్యాయమూర్తనీ, పరిపాలకుడని జస్టిస్ కౌల్ వ్యాఖ్యానించారు. ఇలాంటి సందర్భాల్లో దుందుడుకు నిర్ణయాలు తగవని అభిప్రాయపడ్డారు. ఇలాటి నిర్ణయాల కారణంగా న్యాయ వ్యవస్థతో పాటు బార్‌లోనూ సమస్యలు ఉత్పన్నమవుతాయని హెచ్చరించారు.

రాష్ట్రపతి కోవింద్‌కు లేఖ..

దేశవ్యాప్తంగా ఉన్న 32 మంది సీనియర్ న్యాయమూర్తులను కాదని జస్టిస్ సంజీవ్ ఖన్నాకు కొలీజియం సుప్రీంకోర్టు న్యాయమూర్తిగా పదోన్నతి కల్పించిందని ఢిల్లీ హైకోర్టు మాజీ జడ్జి జస్టిస్ కైలాశ్‌గంభీర్ ఆరోపించారు. ఈ వ్యవహారంలో జోక్యం చేసుకోవాలని కోరుతూ రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్‌కు లేఖ రాశారు. 2018 డిసెంబర్ 12న సమావేశమైన కొలీజియం జస్టిస్ ప్రదీప్ నంద్రజాగ్, కోల్‌కతా హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి రాజేంద్ర మీనన్ల పేర్లను సుప్రీం జడ్జీలుగా సిఫార్సు చేసిందని గుర్తుచేశారు. అయితే, ఈనెల 10న సీజేఐ జస్టిస్ రంజన్‌గొగోయ్ నేతృత్వంలో భేటీ అయిన కొలీజియం వీరి పేర్లను ఎలాంటి కారణాలు చూపకుండానే తొలగించి జస్టిస్ ఖన్నాతో పాటు కర్ణాటక హైకోర్టు సీజే జస్టిస్ దినేశ్ మహేశ్వరి పేర్లను చేర్చిందన్నారు. సుప్రీంకోర్టు కొలీజియంలో జస్టిస్ రంజన్ గొగోయ్‌తో పాటు జస్టిస్ ఏకే సిక్రీ, జస్టిస్ ఎస్ఏ బాబ్డే, జస్టిస్ ఎన్వీ రమణ, జస్టిస్ అరుణ్ మిశ్రా సభ్యులుగా ఉన్నారు. గతేడాది జనవరిలో కేసుల కేటాయింపులో అప్పటి సీజేఐ జస్టిస్ దీపక్ మిశ్రా తీరును వ్యతిరేకిస్తూ జస్టిస్ జే.చలమేశ్వర్, జస్టిస్ రంజన్ గొగోయ్, జస్టిస్ లోకూర్, జస్టిస్ కురియన్ జోసెఫ్ సుప్రీంకోర్టు చరిత్రలో తొలిసారి మీడియా సమావేశం నిర్వహించిన విషయం తెలిసిందే.

కొలీజియం సిఫార్సుకు కేంద్రం ఓకే

ఢిల్లీ హైకోర్టు జడ్జి జస్టిస్ సంజీవ్ ఖన్నా, కర్ణాటక హైకోర్టు సీజే జస్టిస్ దినేశ్ మహేశ్వరిలను సుప్రీంకోర్టు న్యాయమూర్తులుగా పదోన్నతి కల్పిస్తూ కేంద్రం నిర్ణయం తీసుకుంది. ఈ మేరకు జనవరి 10న సుప్రీంకోర్టు కొలీజియం చేసిన సిఫార్సును ప్రభుత్వం ఆమోదించింది.

న్యాయవాదుల ఆందోళన..

జస్టిస్ సంజీవ్ ఖన్నా పదోన్నతిని వ్యతిరేకిస్తూ బార్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా బుధవారం ఆందోళన నిర్వహించింది. 32 మంది సీనియర్ జడ్జీలను కాదని జస్టిస్ ఖన్నా పేరును సిఫార్సు చేస్తూ కొలీజియం తీసుకున్న నిర్ణయం విచిత్రం, ఏకపక్షమని స్పష్టం చేసింది. ఢిల్లీ హైకోర్టు బార్ కౌన్సిల్ సైతం జస్టిస్ ఖన్నా నియామకాన్ని వ్యతిరేకిస్తూ తీర్మానం చేసింది.

'కర్ణాటక' కోసం రూ.122 కోట్లు

- అసెంబ్లీ ఎన్నికల్లో వెచ్చించిన కమలనాథులు
- ఈశాన్య రాష్ట్రాల్లో మరో రూ.14 కోట్ల వ్యయం
- రాజకీయ విరాళాల్లోనూ టాపే

న్యూఢిల్లీ: 2018, మేలో జరిగిన కర్ణాటక అసెంబ్లీ ఎన్నికల్లో రూ.122.68 కోట్లు ఖర్చు పెట్టినట్లు బీజేపీ తెలిపింది. ఇందులో రూ.84 కోట్లను ప్రచారం కోసం(బల్క్ ఎస్సెమ్మెస్‌లు, పత్రికలు, ఎలక్ట్రానిక్ మీడియా, కేబుల్, వెబ్ సైట్, ఇతర సామగ్రి) కోసమే ఖర్చుపెట్టినట్లు వెల్లడించింది. ఎన్నికల్లో స్టార్ క్యాంపెయినర్ల పర్యటనలకు మరో రూ.16 కోట్లు వెచ్చించామని పేర్కొంది. గతేడాది జరిగిన మేఘాలయ, నాగాలాండ్, త్రిపుర రాష్ట్రాల అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా రూ.14.18 కోట్లు ఖర్చు పెట్టామని ఎన్నికల సంఘానికి(ఈసీ) సమర్పించిన నివేదికలో బీజేపీ తెలిపింది. వీటిలో మేఘాలయలో రూ.3.8 కోట్లు, త్రిపురలో రూ.6.96 కోట్లు, నాగాలాండ్‌లో రూ.3.36 కోట్లు వ్యయమైనట్లు పేర్కొంది.



విరాళాల్లో బీజేపీనే టాప్..

రూ.20,000 లేదా అంతకంటే ఎక్కువ విరాళాలు అందుకున్న రాజకీయ పార్టీల్లో బీజేపీ అగ్రస్థానంలో నిలిచింది. 2017–18 ఆర్థిక సంవత్సరానికి రాజకీయ పార్టీలకు మొత్తం రూ.469.89 కోట్ల విరాళాలు రాగా, అందులో బీజేపీకే రూ.437.04 కోట్లు దక్కినట్లు అసోసియేషన్ ఫర్ డెమొక్రటిక్ రిఫామ్స్ (ఏడీఆర్) అనే సంస్థ తెలిపింది. కాంగ్రెస్ కేవలం రూ.26.25 కోట్లను అందుకున్నట్లు పేర్కొంది. బీజేపీ విరాళం.. జాతీయ పార్టీలైన కాంగ్రెస్, ఎన్సీపీ, సీపీఐ, సీపీఎం, టీఎంసీల మొత్తం విరాళానికి 12 రెట్లు అధికమని పేర్కొంది. జాతీయ పార్టీలల విరాళాల్లో 90 శాతం కార్పొరేట్ సంస్థలు, మిగిలిన 10 శాతాన్ని వ్యక్తులు ఇచ్చారని ఏడీఆర్ చెప్పింది.

కుంభమేళాలో కిన్నెర అఖాడా

తొలిసారి హాజరైన ట్రాన్స్‌జెండర్ల అఖాడా

ప్రయాగ్‌రాజ్: కుంభమేళా సందర్భంగా ట్రాన్స్‌జెండర్‌లతో కూడిన కిన్నెర అఖాడా సభ్యులు మంగళవారం పవిత్ర స్నానాలు ఆచరించి చరిత్ర సృష్టించారు. జునా అఖాడా సభ్యులతో కలిసి భారీ ర్యాలీగా తరలివచ్చిన కిన్నెర అఖాడా సభ్యులు త్రివేణీ సంగమంలో స్నానం చేశారు. ఈ సందర్భంగా 'హరహర మహాదేవ్' అంటూ నినాదాలు మిన్నంటాయి. కార్యక్రమానికి హాజరైన వారంతా కిన్నెర అఖాడా సభ్యులను ఆసక్తిగా తిలకించారు. కాగా, కుంభమేళాకు ట్రాన్స్‌జెండర్లను అనుమతించడం ఇదే ప్రథమం. సంప్రదాయ వాదుల నుంచి వారికి గట్టి ప్రతిఘటన కూడా ఎదురైందని అఖాడా వర్గాలు తెలిపాయి. 'ప్రాచీన భారతంలో ట్రాన్స్‌జెండర్లకు ఎలాంటి గౌరవం దక్కిందో మన మత గ్రంథాలు చెబుతున్నాయి. అప్పట్లో మాదిరిగా సమాజం మమ్మల్ని అంగీకరించేందుకే ఈ ప్రయత్నం. రానున్న తరాల వారు మా మాదిరిగా వివక్షకు గురి కాకుండా చూసేందుకే ఇక్కడికి వచ్చాం' అని కిన్నెర అఖాడా అధిపతి లక్ష్మి నారాయణ్ త్రిపాఠీ(40) తెలిపారు.


కుంభమేళాకు హాజరైన అశేష జనవాహిని

'ట్రాన్స్‌జెండర్లు బిచ్చగాళ్లుగానే ఉండాలని మీరెందుకు భావిస్తున్నారు? ట్రాన్స్‌జెండర్లకు ఉద్యోగాలు ఇచ్చేందుకు కూడా సంస్థలు ఇష్టపడటం లేదు' అని ఈమె ఆవేదన వ్యక్తం చేశారు. ఈమె పలు హిందీ సినిమాల్లో వివిధ పాత్రలు పోషించారు.

మందిరం కోసం 33 వేల దీపాలు

అయోధ్యలో రామాలయం నిర్మించాలంటూ కుంభమేళా సందర్భంగా సాధువులు రోజుకు 33వేల దీపాలను వెలిగిస్తున్నారు. ఆలయం కోసం ఈ నెలలో 11 లక్షల దీపాలను వెలిగించనున్నట్లు వారు తెలిపారు. కాగా, కుంభ్‌నగరిలో టాయిలెట్లు పనిచేయకపోవడంతో కుంభమేళా ప్రారంభమైన మొదటి రోజు తరలివచ్చిన సుమారు కోట్ల మందిలో చాలా మంది ఇబ్బందులు పడ్డారు.

టాప్ 200లో 49 భారతీయ వర్సిటీలు

ర్యాంకింగ్‌లు ప్రకటించిన టీహెచ్ఈ

లండన్: టైమ్స్ హయ్యర్ ఎడ్యుకేషన్ (టీహెచ్ఈ) 2019 సంవత్సరానికి విశ్వవిద్యాలయాలకు ర్యాంకింగ్‌లు ప్రకటించింది. 43 దేశాలకు చెందిన 450 విశ్వవిద్యాలయాలకు ర్యాంకింగ్‌లు ప్రకటించగా భారత్‌కు చెందిన 49 వర్సిటీలు టాప్ 200లో స్థానం సంపాదించాయి. ర్యాంకింగ్స్‌లో ఇండియన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ సైన్స్ (బెంగుళూరు) 14వ స్థానం, ఐఐటీ (బొంబాయి) 27వ స్థానం, ఐఐటీ (రూర్కీ) 35వ స్థానం, ఐఐటీ (ఇండోర్) 61వ స్థానం, జేఎస్ఎస్ అకాడమీ ఆఫ్ హయ్యర్ ఎడ్యుకేషన్ అండ్ రీసెర్చ్ 64వ స్థానంలో నిలిచాయి. సావిత్రిబాయి పూలే పూణే యూనివర్సిటీ, బనారస్ హిందూ విశ్వవిద్యాలయం, అమృతా యూనివర్సిటీ ఈసారి టాప్ 150లో స్థానం సంపాదించాయి. ఇండియన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ సైన్స్ ఎడ్యుకేషన్ అండ్ రీసెర్చ్ పూణే, ఐఐటీ(హైదరాబాద్) తొలిసారిగా ర్యాంకింగ్‌లో చోటు సంపాదించాయి. 2018లో భారత్ నుంచి 42 వర్సిటీలు స్థానం సంపాదించగా ఈసారి అది 49కి పెరిగింది.

టాప్‌లో చైనా వర్సిటీలు

చైనాకు చెందిన నాలుగు వర్సిటీలు మొదటి ఐదు స్థానాల్లో ఉన్నాయి. జాబితాలో మొత్తం 72 వర్సిటీలతో చైనా అగ్రస్థానంలో ఉంది. భారత వర్సిటీల్లో విద్యాబోధన మెరుగుపడినా ప్రమాణాలతో పోలిస్తే వెనకబడే ఉన్నాయని టీహెచ్ఈ ఎడిటర్ ఎల్లీ బోత్‌వెల్ తెలిపారు.

గాంధీ శాంతి బహుమతి విజేతలు వీరే

న్యూఢిల్లీ: 2015 నుంచి 2018 వరకు నాలుగేళ్ల కాలానికి గాంధీ శాంతి బహుమతుల విజేతల పేర్లను కేంద్ర ప్రభుత్వం బుధవారం ప్రకటించింది. చివరిగా 2014లో ఈ పురస్కారాన్ని భారత అంతరిక్ష పరిశోధన సంస్థ (ఇస్రో)కు ప్రదానం చేశారు. 2015 నుంచి ఎవరికీ ఇవ్వలేదు. గాంధీ సిద్ధాంతాలు, పద్ధతుల ద్వారా సామాజిక, ఆర్థిక, రాజకీయ మార్పు కోసం కృషిచేసే వ్యక్తులు, సంస్థలకు ఈ అవార్డులు ఇస్తారు. తాజాగా ప్రకటించిన అవార్డుల్లో 2015 ఏడాది విజేతగా కన్యాకుమారికి చెందిన వివేకానంద కేంద్రను ఎంపిక చేశారు. పాకీ పని చేసే వారికి విముక్తి కల్పించినందుకు సులభ్ ఇంటర్నేషనల్‌కు, పాఠశాలల్లో మధ్యాహ్న భోజనం అందిస్తున్నందుకు అక్షయపాత్ర ఫౌండేషన్‌కు కలిపి 2016 ఏడాదికి గాంధీ శాంతి అవార్డును ప్రకటించారు. 2017 ఏడాదికి ఏకై అభియాన్ ట్రస్ట్‌ను, 2018కి కుష్టు వ్యాధి నిర్మూలన కోసం డబ్ల్యూహెచ్‌వో సౌహార్ద్ర రాయబారిగా ఉన్న యోహీ ససకవాకు అవార్డులను ప్రకటించారు. ఈ బహుమతి కింద రూ.కోటితోపాటు ప్రశంసాపత్రం ఇస్తారు.

అత్యంత హీనంగా కేరళ సర్కారు తీరు

'శబరిమల' అంశంపై ప్రధాని మోదీ ధ్వజం

- దోపిడీని అడ్డుకున్నందుకు తనపై కుట్ర జరిగిందన్న ప్రధాని

కొల్లం(కేరళ), బలంగిర్(ఒడిశా): శబరిమల అంశంపై కేరళ ప్రభుత్వం అత్యంత హీనంగా వ్యవహరించి, చరిత్రలో నిలిచిందని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ధ్వజమెత్తారు. రేషన్ సరుకులను పక్కదారి పట్టకుండా ఆపి, రూ.90వేల కోట్ల కుంభకోణాన్ని బట్టబయలు చేసినందుకు తనను తొలగించేందుకు కుట్ర జరిగిందని ప్రధాని ఆరోపించారు. మంగళవారం ఆయన కేరళ, ఒడిశా రాష్ట్రాల్లో పర్యటించి పలు అభివృద్ధి కార్యక్రమాలను ప్రారంభించారు. ఈ సందర్భంగా కొల్లం (కేరళ), బలంగిర్ (ఒడిశా)లలో జరిగిన కార్యక్రమాల్లో ప్రసంగించారు. అవినీతి, మతతత్వం, కులతత్వం అంశాల్లో కేరళలోని వామపక్ష ప్రజాస్వామ్య కూటమి(ఎల్‌డీఎఫ్) ప్రభుత్వం, కాంగ్రెస్ నేతృత్వంలోని యూడీఎఫ్ ఒకే నాణేనికి రెండు పార్శ్వాల వంటివని పేర్కొన్నారు. 'శబరిమల అంశంపై కేరళలోని వామపక్ష ప్రభుత్వం వ్యవహరించిన తీరు అత్యంత హీనమైందిగా చరిత్రలో నిలిచిపోతుంది. ఇలా మరే ప్రభుత్వం కానీ, పార్టీ కానీ చేయలేదు. కమ్యూనిస్టులకు చరిత్ర, సంస్కృతి, ఆధ్యాత్మికతలపై ఏమాత్రం గౌరవభావం ఉండదని మనకు తెలుసు. కానీ, ఇంత హేయంగా వ్యవహరిస్తుందని ఎవరూ ఊహించలేరు' అని తీవ్రంగా దుయ్యబట్టారు. శబరిమల ఆలయంలోకి మహిళల ప్రవేశంపై పార్లమెంట్ లోపల ఒకలా, పత్తనంతిట్ట (అయ్యప్ప కొలువైన జిల్లా)లో మరోలా మాట్లాడుతున్న కాంగ్రెస్ తన వైఖరిని స్పష్టం చేయాలన్నారు. కేరళ ప్రజలకు, వారి సంప్రదాయాలకు రక్షణగా నిలిచే ఏకైక పార్టీ బీజేపీయేనని చెప్పారు. 'యూడీఎఫ్, ఎల్డీఎఫ్‌లకు ఒక్కటే చెబుతున్నా. మా కార్యకర్తను తక్కువగా చూడొద్దు. త్రిపురలో జరిగిందే ఇక్కడా జరుగుతుంది' అని అన్నారు.


తిరువనంతపురంలోని పద్మనాభస్వామి ఆలయాన్ని సందర్శించిన మోదీ

నన్ను తొలగించేందుకు కుట్ర

నకిలీ పత్రాల ద్వారా రూ.90వేల కోట్ల ప్రజాధనాన్ని కొల్లగొట్టేందుకు జరుగుతున్న కుట్రను అడ్డుకున్నందుకు తనను పదవి నుంచి తొలగించేందుకు చూశారని ప్రధాని మోదీ ఆరోపించారు. 'గత ప్రభుత్వాల హయాంలో దళారులు.. లేకపోయినా ఉన్నట్లు పత్రాలు సృష్టించి రేషన్ కార్డులు, వంట గ్యాస్ కనెక్షన్లు, పింఛన్లు పొందారు. మా ప్రభుత్వం అలాంటి ఆరు కోట్ల పేర్లను గుర్తించి రూ.90వేల కోట్ల ప్రజాధనం కొల్లగొట్టే పెద్ద కుంభకోణాన్ని అడ్డుకుంది. తమ ఆటలు సాగకపోయేసరికి ఈ అక్రమార్కులంతా ఏకమై ఈ 'చౌకీదార్'ను తొలగించేందుకు నాపై లేనిపోని ఆరోపణలు చేస్తున్నారు' అని మోదీ అన్నారు. ఈ కార్యక్రమాల్లో ప్రధాని మోదీ కొల్లాంలోని జాతీయ రహదారి–66పై నిర్మించిన 13 కిలోమీటర్ల బైపాస్ రోడ్డును, బలంగిర్‌లో రూ.1,550 కోట్ల విలువైన పనులకు శంకుస్థాపనలు చేశారు.

సాక్షి బిజినెస్
గురువారం 17-1-2019
WWW.SAKSHIBUSINESS.COM

స్టాక్ మార్కెట్లు

దేశీ సూచీలు

సెన్సెక్స్	నిఫ్టీ
3 ▲	3 ▲
36,321	10,890

మరిన్ని వార్తలు, స్టాక్ అప్‌డేట్స్ కోసం... www.sakshibusiness.com చూడండి

విదేశీ సూచీలు (తొలిరెండు రాత్రి 11.30గం.)

సూచీ	విలువ	మార్పు
నాస్‌డాక్	7,035	▲ 11
డోజోన్స్	24,195	▲ 132
ఎఫ్‌టీఎస్‌ఈ 100	6,863	▼ 32
డాక్స్	10,931	▲ 39
షాంఘై	2,570	0
నికాయ్ (శుక్రవారం ముగింపు)	20,443	▼ 113

అమెరికా • బ్రిటన్ • జర్మనీ • చైనా • జపాన్

ఫారెక్స్ రేట్లు రూ. లలో

	కరెన్సీ		• కొనుగోలు	• అమ్మకం
$	యూఎస్ డాలర్	ధరమూసేసి	70.50	72.30
£	బ్రిటన్ పౌండ్	ధరమూసేసి	90.60	93.15
€	యూరో	ధరమూసేసి	80.35	82.50
¥	జపాన్ ఎన్ (100)	ధరమూసేసి	64.00	68.00
AUS	ఆస్ట్రేలియా డాలర్	ధరమూసేసి	50.55	52.55
SS	సింగపూర్ డాలర్	ధరమూసేసి	51.00	54.40
SAR	సౌదీ రియాల్	ధరమూసేసి	17.65	20.75
UAE D	యూఏఈ దిర్హామ్	ధరమూసేసి	--	21.00
¥	చైనా యువాన్	ధరమూసేసి	09.45	11.20

ముకేశ్ అంబానీ ‘గ్లోబల్ థింకర్’!



న్యూఢిల్లీ: దేశీ కార్పొరేట్ దిగ్గజం ముకేశ్ అంబానీ మరో ఘనతను సొంతం చేసుకున్నారు. ఫారిన్ పాలసీ పబ్లికేషన్స్ 2019 ఏడాదికి సంబంధించి ప్రకటించిన 100 మంది ప్రపంచ అత్యుతమ ఆలోచనాపరుల (గ్లోబల్ థింకర్స్) జాబితాలో ముకేశ్ నిలిచారు. ఇంకా ఈ ర్యాంకింగ్స్‌లో అలీబాబా వ్యవస్థాపకుడు జాక్ మా, అమెజాన్ సీఈఓ జెఫ్ బెజోస్, అంతర్జాతీయ ద్రవ్య నిధి (ఐఎంఎఫ్) చీఫ్ క్రిస్టీన్ లగార్డ్ తదితరులున్నారు. మొత్తం 100 మందిలో కొన్ని పేర్లను మాత్రమే ప్రకటించిన ఫారిన్ పాలసీ... పూర్తి జాబితాను ఈ నెల 22న విడుదల చేయనున్నట్లు తెలియజేసింది. ‘44.3 బిలియన్ డాలర్ల సంపదతో 2018లో జాక్ మాను వెనక్కినెట్టి రిలయన్స్ ఇండస్ట్రీస్ అధినేత ముకేశ్ అంబానీ ఆసియాలోనే నంబర్ వన్ అపర కుబేరుడిగా అవతరించారు. ప్రధానంగా చమురు, గ్యాస్, రిటైల్ స్టోర్ల ద్వారా ఆయన ఈ స్థాయిలో సంపదను దక్కించుకున్నారు. అయితే, కొత్తగా ప్రారంభించిన రిలయన్స్ జియో ద్వారా ఆయన భారత్ ఆర్థిక వ్యవస్థలో పెనుమార్పులను తీసుకొచ్చే అవకాశం ఉంది. భవిష్యత్తులో ఫేస్‌బుక్, గూగుల్‌లకు కూడా పోటీనిచ్చే సత్తా జియోకు ఉంది’ అని ఫారిన్ పాలసీ పేర్కొంది. కాగా, మొత్తం జాబితాను 10 విభాగాలుగా విభజించామని, అందులో ముకేశ్ అంబానీ... టాప్–10 టెక్నాలజీ థింకర్స్‌లో నిలిచినట్లు వెల్లడించింది. ఇంధనం, పర్యావరణానికి సంబంధించిన జాబితాలో ప్రముఖ రచయిత అమితవ్ ఘోష్‌కు కూడా చోటు లభించింది.

ప్రపంచ బ్యాంకు సారథిగా ఇంద్రా నూయి?

ఆమె పేరును ప్రతిపాదించిన ట్రంప్ కుమార్తె ఇవాంకా



న్యూయార్క్: ప్రపంచ బ్యాంకు ప్రెసిడెంట్ పదవి రేసులో పెప్సీకో మాజీ సీఈవో, జన్మతః భారతీయురాలైన ఇంద్రా నూయి పేరు తెరపైకి వచ్చింది. విశ్వసనీయ వర్గాల సమాచారం ఆధారంగా న్యూయార్క్ టైమ్స్ ఈ మేరకు ఓ కథనాన్ని ప్రచురించింది. అభ్యర్థుల ఎంపికలో కీలక పాత్ర పోషిస్తున్న అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ పెద్ద కుమార్తె ఇవాంక, ఇంద్రా నూయి పేరును ప్రతిపాదించారు. ఇంద్రా నూయిని మార్గదర్శిగా, స్ఫూర్తినీయురాలిగా పేర్కొంటూ ఇవాంకా గత ఆగస్ట్‌లో ఓ ట్వీట్ కూడా చేశారు. అయితే, తన నామినేషన్‌ను ఇంద్రా నూయి అంగీకరిస్తారా, లేదా అన్న దానిపై ప్రస్తుతానికి స్పష్టత లేదు. ప్రపంచ బ్యాంకు ప్రస్తుత ప్రెసిడెంట్ జిమ్‌యాంగ్ కిమ్ ఫిబ్రవరిలో తన పదవి నుంచి తప్పుకోనున్నట్లు ఇటీవలే ప్రకటించారు. ప్రైవేటు ఇన్‌ఫ్రా కంపెనీలో చేరనున్నట్లు ఆయన చెప్పారు. నిర్ణీత పదవీ కాలం కంటే మూడేళ్ల ముందే ఆయన తప్పుకుంటున్నారు. కిమ్ వారసుల ఎంపిక ప్రక్రియను ట్రెజరీ సెక్రటరీ స్టీవెన్ ముంచిన్, ఇవాంకా చూస్తున్నారు. ఈ కమిటీ అభ్యర్థుల నామినేషన్లతో కూడిన జాబితాను ట్రంప్ ముందు ఉంచనున్నారు. ఇవాంక మద్దతుతో నూయి ప్రధాన పోటీదారుగా మారడం ఆసక్తికరం.

రేసులో మరో ఇద్దరు...

ఇక ప్రపంచ బ్యాంకు ప్రెసిడెంట్ పదవికి....అమెరికా అంతర్జాతీయ వ్యవహారాల మంత్రి డేవిడ్ మల్‌పాస్, ఓవర్సీస్ ప్రైవేట్ ఇన్వెస్ట్‌మెంట్ కార్పొరేషన్ ప్రెసిడెంట్ రే వాష్‌బర్న్‌ల పేర్లు కూడా పరిశీలనలో ఉన్నాయి. ప్రపంచ బ్యాంక్ అధ్యక్షుడిని ప్రపంచ బ్యాంక్ బోర్డ్ నియమిస్తుంది. అయితే అమెరికా అధ్యక్షుడు నామినేట్ చేసిన వ్యక్తే ప్రపంచ బ్యాంక్ అధ్యక్షుడు కావడం రివాజు. వైట్ హౌస్ సీనియర్ సలహాదారు పదవిలో అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ తన కూతురిని నియమించడం పట్ల ఇప్పటికే విమర్శలు తలెత్తుతున్నాయి. ఇప్పుడు ప్రపంచ బ్యాంక్ అధ్యక్ష పదవి విషయంలో ఇవాంకా జోక్యం చేసుకోవడంతో ఈ విమర్శలు మరింతగా పెరుగుతున్నాయి. తన స్వప్రయోజనాల కోసం ఇవాంకా అంతర్జాతీయ ఆర్థిక వ్యవహారాల్లో తలదూర్చుతున్నారన్న విమర్శలున్నాయి.



స్కోడా సూపర్బ్‌లో ‘కార్పొరేట్ ఎడిషన్’

ధర రూ. 23.99 లక్షలు



న్యూఢిల్లీ: స్కోడా ఆటో ఇండియా ప్రీమియం సెడాన్ ‘సూపర్బ్’లో కార్పొరేట్ ఎడిషన్‌ను మార్కెట్లోకి విడుదల చేసింది. దీని ధరను రూ.23.99 లక్షలుగా (ఎక్స్ షోరూమ్, ఢిల్లీ) నిర్ణయించినట్లు పేర్కొంది. 1.8 లీటర్ పెట్రోల్ ఇంజిన్ కలిగిన ఈ కారులో 8 ఎయిర్ బ్యాగ్‌లు, 20.32 సెం.మీ. ఫ్లోటింగ్ టచ్‌స్కీన్ డిస్‌ప్లే, త్రీ జోన్ క్లైమాట్రానిక్ ఎయిర్ కండిషనింగ్ తదితర ఫీచర్లు ఉన్నాయి. లీటరుకు 14.64 కిలోమీటర్ల మైలేజీనిస్తుందని కంపెనీ వెల్లడించింది.

300 కోట్ల డాలర్లు సమీకరిస్తాం: ఐఓసీ



న్యూఢిల్లీ: ప్రభుత్వ రంగ చమురు మార్కెటింగ్ కంపెనీ, ఇండియన్ ఆయిల్ కార్పొ(ఐఓసీ) బాండ్ల జారీ ద్వారా 300 కోట్ల డాలర్ల (రూ.21,000 కోట్లు) వరకూ నిధులు సమీకరించనుంది. ఇప్పటికే 90 కోట్ల డాలర్ల బాండ్ల ఇష్యూ మార్కెట్లో ఉందని, ఇదే మొత్తానికి సిండికేటెడ్ రుణం సమీకరించే ప్రయత్నాలు చేస్తున్నామని ఐఓసీ చైర్మన్ సంజీవ్ సింగ్ చెప్పారు. ఈ 90 కోట్ల డాలర్ల ఇష్యూలో కూపన్ రేటు 4.75 శాతమని, వడ్డీని ఆరు నెలలకొకసారి చెల్లిస్తామని, ఈ బాండ్లు 2024లో మెచ్యూర్ అవుతాయని, అసలును, వడ్డీని డాలర్లలోనే చెల్లిస్తామని వివరించారు. సింగపూర్ ఎక్స్ఛేంజ్‌లో ఈ బాండ్లను లిస్ట్ చేస్తామని తెలిపారు.

మన దేశం 80 శాతానికి పైగా ముడి చమురును దిగుమతి చేసుకుంటోందని, ఈ దిగుమతులకు అధిక భాగం డాలర్లలోనే చెల్లింపులు జరుపుతున్నామని సంజీవ్ వివరించారు. అందుకని డాలర్లలో రుణాలు సమీకరించడం... కరెన్సీ ఒడిదుడుకుల్లో ఉన్నప్పుడు సహజమైన హెడ్జింగ్‌గా పనిచేయగలదని పేర్కొన్నారు. వర్కింగ్ క్యాపిటల్ అవసరాల నిమిత్తం ప్రభుత్వ రంగ ఆయిల్ మార్కెటింగ్ కంపెనీలు– ఐఓసీ, హెచ్‌పీసీఎల్, బీపీసీఎల్‌లు 1,000 కోట్ల డాలర్ల నిధులను విదేశీ వాణిజ్య రుణాల(ఈసీబీ) ద్వారా సమీకరించుకోవడానికి గత ఏడాది అక్టోబర్‌లో ఆర్‌బీఐ అనుమతించింది.

రిటర్న్‌ల ప్రాసెసింగ్ ఒక్క రోజులో..!



- ఇక రిఫండ్లు కూడా పూర్తిగా ఆటోమేటిక్
- ఐటీ శాఖ ప్రమేయం లేకుండా నేరుగా కస్టమర్ల ఖాతాల్లోకి
- అత్యాధునిక ఐటీ ఫైలింగ్ వ్యవస్థకు కేంద్ర క్యాబినెట్ ఓకే
- ఇన్ఫోసిస్‌కు రూ.4,242 కోట్ల కీలక ప్రాజెక్టు; 18 నెలల్లో పూర్తి

న్యూఢిల్లీ: ఆదాయపు పన్ను రిటర్న్‌లను ప్రాసెస్ చేయటంలో అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించడానికి కేంద్రం ముందడుగు వేసింది. ఇందుకు సంబంధించి రూ.4,242 కోట్ల ఆదాయపు పన్ను (ఐటీ) ఫైలింగ్ ప్రాజెక్ట్‌కు కేంద్ర క్యాబినెట్ బుధవారం ఆమోదముద్ర వేసింది. ఈ ప్రాజెక్టు డెవలపర్‌గా ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ దిగ్గజం (ఐటీ) ఇన్ఫోసిస్‌ను ఎంపికచేసింది. ప్రాజెక్టు 18 నెలల్లో ప్రాజెక్టు పూర్తవుతుంది. మూడు నెలలు ప్రాజెక్టు పరీక్షా సమయం. అటు తర్వాత పూర్తి స్థాయిలో అమల్లోకి వస్తుందని కేంద్ర మంత్రి పియూష్ గోయెల్ చెప్పారు. అంతకు ముందు ప్రధాని నరేంద్రమోదీ అధ్యక్షతన క్యాబినెట్ సమావేశం జరిగింది. అనంతరం విలేకరులకు పియూష్ గోయెల్ తెలిపిన వివరాల్లో ముఖ్యాంశాలు చూస్తే...

- ప్రస్తుతం రిటర్న్‌లు ఫైల్ చేసిన తర్వాత ప్రాసెసింగ్ సమయం 63 రోజులు పడుతోంది. తాజా వ్యవస్థ అమలోకి వచ్చిన తర్వాత ఈ సమయం కేవలం 24 గంటలకు తగ్గిపోతుంది. దీనితో రిఫండ్ ప్రక్రియ కూడా వేగవంతం అవుతుంది.
- కేబినెట్ ఆమోదముద్ర వేసిన ఆదాయపు పన్ను శాఖ ఇంటిగ్రేటెడ్ ఈ ఫైలింగ్ అండ్ సెంట్రలైజ్డ్ ప్రాసెసింగ్ 2.0 ప్రాజెక్టు రూపకల్పనకు బిడ్డింగ్ ప్రాసెస్‌లో ఇన్ఫోసిస్‌ను ఎంపిక చేశారు.
- ప్రస్తుతం ఉన్న వ్యవస్థ విజయవంతమైనదే అయినప్పటికీ, తాజా వ్యవస్థ మరింత ట్యాక్స్ ఫ్రెండ్లీ వాతావరణాన్ని సృష్టిస్తుంది. ఆయా అంశాలకు సంబంధించి పారదర్శకతనూ పెంపొందిస్తుంది. అన్ని స్థాయిల్లోనూ ఆటోమేషన్ సౌలభ్యం ఏర్పడుతుంది.
- ఆదాయపు పన్ను శాఖ ప్రమేయం ఏమాత్రం లేకుండా పన్ను చెల్లింపుదారుల అకౌంట్‌లోకి డైరెక్ట్‌గా రిఫండ్స్ జారీ అవుతాయి.
- ప్రస్తుత సీపీసీ–ఐటీఆర్ 1.0 ప్రాజెక్టు అమలుకు సంబంధించి ఈ ఆర్థిక సంవత్సరానికిక్యాబినెట్ మరో రూ.1,482 కోట్లను మంజూరు చేసింది.
- ప్రస్తుత ఆర్థిక సంవత్సరం ఇప్పటివరకూ రూ.1.83 లక్షల కోట్ల రిఫండ్స్ జరిగాయి.

నుమాలిగఢ్ రిఫైనరీ విస్తరణకు రూ.22,594 కోట్లు

అస్సాంలోని నుమాలిగఢ్ రిఫైనరీ విస్తరణకు కేంద్ర క్యాబినెట్ రూ.22,594 కోట్ల కేటాయించింది. ఈశాన్య భారత ఇంధన అవసరాలను తీర్చడానికి వీలుగా కేంద్ర క్యాబినెట్ తాజా నిర్ణయం తీసుకుంది. 1999లో నెలకొల్పిన ఈ రిఫైనరీలో భారత్ పెట్రోలియం(బీపీసీఎల్)కు 61.65 శాతం వాటా ఉంది. ఏడాదికి ప్రస్తుతం 3 మి. టన్నుల క్రూడ్ రిఫైన్ చేస్తోంది. ఈ సామర్థ్యాన్ని 6 మి. టన్నులకు పెంచడం క్యాబినెట్ ప్రస్తుత నిర్ణయ ఉద్దేశమని పియూష్ గోయెల్ తెలిపారు. 48 నెలల్లో ఈ ప్రాజెక్టు పూర్తవుతుందని ఆయన వివరించారు. ఈ ప్రాజెక్టు కింద పారాదీప్(ఒడిస్సా) నుంచి నుమాలిగఢ్‌కు క్రూడ్ ఆయిల్ పైప్‌లైన్‌ను నిర్మిస్తారు. నుమాలిగఢ్ నుంచి సిలిగురి (పశ్చిమ బెంగాల్) వరకూ ప్రొడక్ట్ పైప్‌లైన్ ఏర్పాటవుతుంది.

ఎగ్జిమ్ బ్యాంకుకు రూ.6,000 కోట్లు

ప్రభుత్వరంగంలోని ఎగ్జిమ్ బ్యాంక్ (ఎక్స్‌పోర్ట్– ఇంపోర్ట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా) కార్యకలాపాల విస్తరణకు మార్గం సుగమం అయ్యింది. ఈ బ్యాంకుకు తాజా మూలధనంగా రూ.6,000 కోట్లు కేటాయించడానికి కేంద్ర క్యాబినెట్ ఆమోదం తెలిపింది. ఇందుకు సంబంధించి రీక్యాపిటలైజేషన్ బాండ్లను ప్రభుత్వం జారీ చేస్తుంది. ప్రభుత్వ బ్యాంకులకు జారీ అయ్యే తరహాలోనే ఈ రీక్యాపిటలైజేషన్ బాండ్లు జారీ అవుతాయి. ప్రస్తుత (రూ.4,500 కోట్లు), వచ్చే ఆర్థిక సంవత్సరాల్లో (రూ.1,500 కోట్లు) బ్యాంకుకు రెండు విడతల్లో బ్యాంకుకు తాజా మూలధనం అందుతుంది. బ్యాంక్ అధీకృత మూలధనాన్ని రూ.10,000 కోట్ల నుంచి రూ.20,000 కోట్లకు పెంచడానికి కూడా క్యాబినెట్ సమావేశం ఆమోద ముద్ర వేసినట్లు రైల్వేశాఖ మంత్రి పియూష్ గోయెల్ తెలిపారు.

ఈ సారి ఆర్‌బీఐ ‘సరళతరం’!



న్యూఢిల్లీ: ఫిబ్రవరి 7వ తేదీన జరగనున్న ఆరవ ద్వైమాసిక పరపతి విధాన సమీక్ష సందర్భంగా రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్‌బీఐ) అనుసరించబోయే విధానంపై సర్వత్రా ఆసక్తి నెలకొంది. బ్యాంకులకు తానిచ్చే రుణాలపై వసూలు చేసే వడ్డీరేటు– రెపో (ప్రస్తుతం 6.50 శాతం)పై ప్రస్తుతం ఆర్‌బీఐ కొంత కఠిన వైఖరి అవలంబిస్తోంది. అయితే ఇకపై తన వైఖరిని ‘‘తటస్థం’’ స్థాయికి మార్చుకునే అవకాశం ఉందనేది నిపుణుల అంచనా. డిసెంబర్‌లో రిటైల్ ద్రవ్యోల్బణం (2.19 శాతం), టోకు ధరల ద్రవ్యోల్బణం (3.80 శాతం) పెరుగుదల స్పీడ్ తగ్గడం, నవంబర్ పారిశ్రామిక ఉత్పత్తి వృద్ధి రేటు కేవలం అర శాతంగా నమోదుకావడం, క్రూడ్ ధరలు గరిష్టం నుంచి దాదాపు 26 డాలర్లు దిగువనే ఉండటం వంటి సానుకూల అంశాలను ఈ సందర్భంగా నిపుణులు ప్రస్తావిస్తున్నారు.

అరశాతం రేటు కోత!

2019 మొదటి ఆరు నెలల కాలంలో రెపో రేటు అరశాతం వరకూ తగ్గుతుందని భావిస్తున్నాం. ద్రవ్యోల్బణం తక్కువ స్థాయిలో ఉండడం, పారిశ్రామిక ఉత్పత్తి పడిపోవడం, వృద్ధి మందగమనం వంటి అంశాలు ఇందుకు దోహదపడే వీలుంది.

– కొటక్ పరిశోధనా నివేదిక

దక్షిణాదిన సూపర్ ప్లాస్ట్రానిక్స్ ప్లాంటు

- పరిశీలనలో తెలంగాణ, ఏపీ
- కంపెనీ సీఈవో అవనీత్ సింగ్




అవనీత్ సింగ్ మార్వా

హైదరాబాద్, బిజినెస్ బ్యూరో: భారత్‌లో కొడాక్, థామ్సన్ బ్రాండ్ల టీవీల తయారీ లైసెన్సున్న ‘సూపర్ ప్లాస్ట్రానిక్స్’... మరో ప్లాంటు ఏర్పాటు చేయనుంది. ఉత్తరాదిన మూడు ప్లాంట్లున్న ఈ కంపెనీ నాల్గవ యూనిట్‌ను దక్షిణాదిన ఏర్పాటు చేస్తామని తెలియజేసింది. ఇందుకోసం ఏపీ, తెలంగాణ, తమిళనాడు పరిశీలనలో ఉన్నాయని సూపర్ ప్లాస్ట్రానిక్స్ సీఈవో అవనీత్ సింగ్ మార్వా బుధవారమిక్కడ మీడియాకు చెప్పారు. ‘కొత్త ప్లాంటు వార్షిక సామర్థ్యం 2 లక్షల యూనిట్లు ఉంటుంది. ఏ రాష్ట్ర ప్రభుత్వమైతే ఎక్కువ ప్రోత్సాహకాలిస్తుందో అక్కడ ఫ్యాక్టరీని ఏర్పాటు చేస్తాం. ప్రస్తుతం కంపెనీ వార్షిక తయారీ సామర్థ్యం 9 లక్షల యూనిట్లపైనే. కొడాక్, థామ్సన్ బ్రాండ్లలో 2017–18లో 2.1 లక్షల యూనిట్లు విక్రయించాం. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో ఇది 4.8 లక్షల యూనిట్లకు చేరుతుంది. కొడాక్ బ్రాండ్‌లో 14 మోడళ్లున్నాయి. ఈ ఏడాది కొత్తగా 8 మోడళ్లు మార్కెట్లోకి విడుదల చేస్తాం. టీవీల విపణిలో సూపర్ ప్లాస్ట్రానిక్స్‌కు 4 శాతం మార్కెట్ వాటా ఉంది. 2022 నాటికి వాటాను రెండింతలు చేయటమే లక్ష్యంగా పెట్టుకున్నాం. ఆన్‌లైన్‌లో ప్రస్తుతం టాప్–2 ప్లేయర్‌గా ఉన్నాం’ అని వివరించారు.

పరిశ్రమలపై ఆర్‌బీఐ గవర్నర్ దృష్టి

- నేడు కార్పొరేట్ అధిపతులతో శక్తికాంత్ దాస్ భేటీ
- ఇప్పటికే బ్యాంకింగ్, ఎన్‌బీఎఫ్‌సీ, ఎంఎస్‌ఎంఈలతో చర్చలు



ముంబై: దేశ స్థూల ఆర్థిక పరిస్థితులపై రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్‌బీఐ) గవర్నర్ శక్తికాంత దాస్ మరింత దృష్టి సారిస్తున్నారు. ఆర్థికాభివృద్ధికి తీసుకోవాల్సిన చర్యలను వేగవంతం చేస్తున్నారు. ఇందులో భాగంగా ఆయన గురువారం పారిశ్రామిక సంస్థల ప్రతినిధులతో సమావేశం కానున్నారు. మైక్రోబ్లాగింగ్ వెబ్‌సైట్ ట్వీట్‌లో దాస్ ఈ వివరాలను వెల్లడించారు. నవంబర్‌లో పారిశ్రామిక ఉత్పత్తి వృద్ధి కేవలం అరశాతంగా నమోదయిన నేపథ్యంలో గవర్నర్ పారిశ్రామిక బృందాలతో భేటీ కానుండటం ప్రాధాన్యం సంతరించుకుంది. డిసెంబర్ రిటైల్ (2.19%), టోకు ధరలు (3.80%) తగ్గిన పరిస్థితుల్లో ఆర్‌బీఐ రెపో రేటును (ప్రస్తుతం 6.5%) తగ్గించాలని ఇప్పటికే పారిశ్రామిక వర్గాలు డిమాండ్ చేస్తున్నాయి. పాలసీ విధానాలు, తీసుకునే నిర్ణయాల విషయంలో ఆర్‌బీఐ తమ వాదనలకు ప్రాధాన్యమివ్వడం లేదని కూడా పలు సందర్భాల్లో పారిశ్రామిక ప్రతినిధుల నుంచి విమర్శ వస్తోంది. కొత్త గవర్నర్ శక్తికాంత దాస్ నేతృత్వంలోని ద్రవ్య పరపతి విధాన కమిటీ ఫిబ్రవరి 7వ తేదీన ద్వైమాసిన ద్రవ్య పరపతి విధానాన్ని ప్రకటించనున్న సంగతి తెలిసిందే.

వరుస సమావేశాలు...

ఆర్‌బీఐ గవర్నర్‌గా డిసెంబర్ 12న బాధ్యతలు చేపట్టిన తర్వాత రెండుసార్లు ప్రభుత్వ బ్యాంకర్లతో, ఒకసారి ప్రైవేటు బ్యాంకర్లతో ఆర్‌బీఐ గవర్నర్ సమావేశమయ్యారు. లిక్విడిటీ (ద్రవ్యలభ్యత), చిన్న పరిశ్రమలకు రుణ లభ్యతసహా దిద్దుబాటు చర్యల పరిధిలో (పీసీఏ) ఉన్న 11 బ్యాంకులపై ఈ సందర్భంగా చర్చ జరిగినట్లు వార్తలు వచ్చాయి. అటు తర్వాత లఘు, చిన్న, మధ్య తరహా పరిశ్రమలు (ఎంఎస్ఎంఈ), నాన్– బ్యాంకింగ్ ఫైనాన్స్ కంపెనీల ప్రతినిధులతో కూడా భేటీ అయ్యారు. ఎంఎస్ఎంఈ ప్రతినిధులతో సమావేశం అనంతరం ఈ రంగం అభివృద్ధిపై సలహాలకు మార్కెట్ రెగ్యులేటర్ సెబీ మాజీ చైర్మన్ యూకే సిన్హా నేతృత్వంలో ఆరుగురు సభ్యుల నిపుణుల కమిటీనీ ఏర్పాటు చేయడం గమనార్హం. ఎంఎస్ఎంఈలకు సంబంధించి రూ.25 కోట్ల వరకూ రుణం ఉండి, చెల్లించలేకపోతున్న రుణాన్ని, ఒకేసారి పునర్‌వ్యవస్థీకరించడానికి కూడా ఆర్‌బీఐ అనుమతించింది.

స్టార్టప్‌లకు ఉపశమనం!

- ఏంజెల్ ఇన్వెస్ట్‌మెంట్స్‌పై పన్ను మినహాయింపు ప్రక్రియ సరళం?
- 45 రోజుల్లో క్లెయిమ్‌లపై నిర్ణయం తీసుకోవాలని డెడ్‌లైన్



న్యూఢిల్లీ: పన్నుకు సంబంధించి స్టార్టప్ సంస్థల్లో నెలకొన్న భయాందోళనలు కాస్త ఉపశమించేలా కేంద్ర ప్రభుత్వం చర్యలు చేపట్టింది. ఏంజెల్ ఫండ్స్ వెచ్చించే పెట్టుబడులపై స్టార్టప్స్ పన్ను మినహాయింపులను కోరేందుకు సంబంధించిన ప్రక్రియను సరళతరం చేసినట్లు ప్రభుత్వ వర్గాలు బుధవారం వెల్లడించాయి. ఏంజెల్ ఫండ్స్ ద్వారా తాము సమీకరించిన నిధులపై పన్నులు చెల్లించాలంటూ ఇటీవలి కాలంలో ఆదాయపు పన్ను(ఐటీ) శాఖ నుంచి తమకు నోటీసులందటంపై స్టార్టప్స్ వ్యవస్థాపకుల నుంచి తీవ్ర వ్యతిరేకత వ్యక్తమైన సంగతి తెలిసిందే. ఐటీ చట్టంలోని సెక్షన్ 56 (2) కింద స్టార్టప్ సంస్థలకు ఈ నోటీసులు జారీ అయ్యాయి. స్టార్టప్‌కు పన్ను మినహాయింపు నిబంధనల విషయంలో తాజా మార్పుల నోటిఫికేషన్‌కు కేంద్ర వాణిజ్య, పరిశ్రమల శాఖ మంత్రి సురేష్ ప్రభు ఆమోదం తెలిపినట్లు ఆయా వర్గాలు పేర్కొన్నాయి. ‘త్వరలో అమల్లోకి రానున్న కొత్త విధానం ప్రకారం స్టార్టప్స్ గనుక ఏంజెల్ ఫండ్స్‌పై పన్ను మినహాయింపులను కోరాలంటే ముందుగా పారిశ్రామిక విధానం, ప్రోత్సాహక విభాగానికి (డీఐపీపీ) దరఖాస్తు చేసుకోవాలి. నిర్దేశిత స్టార్టప్ దరఖాస్తును తగిన ధ్రువపత్రాలతో కలిపి కేంద్రీయ ప్రత్యక్ష పన్నుల విభాగానికి (సీబీడీటీ) డీఐపీపీయే పంపుతుంది. దరఖాస్తును అందుకున్న 45 రోజుల్లోగా స్టార్టప్‌లకు పన్ను మినహాయింపునకు ఆమోదం తెలపడం లేదా నిబంధనలకు విరుద్ధంగా ఉంటే తిరస్కరించడంపై సీబీడీటీ కచ్చితంగా నిర్ణయం తీసుకోవాల్సి ఉంటుంది’ అని సంబంధిత వర్గాలు పేర్కొన్నాయి.

త్వరలో నోటిఫికేషన్...

గతంలో స్టార్టప్‌లు సమర్పించే పన్ను మినహాయింపు దరఖాస్తును అంతర్ మంత్రిత్వ శాఖల విభాగం ధ్రువీకరణ కోసం పంపేవారు. దీనివల్ల జాప్యం అయ్యేంది. ఇప్పుడు డీఐపీపీ ద్వారా నేరుగా సీబీడీటీకి పంపేలా ప్రక్రియను సరళతరం చేసినట్లు ప్రభుత్వం వర్గాలు వివరించాయి. అదేవిధంగా స్టార్టప్‌లు విక్రయించిన షేర్లకు మార్కెట్ విలువ ఎంతనేది నిర్ధారిస్తూ మర్చెంట్ బ్యాంకర్ నుంచి నివేదికను తీసుకొని సమర్పించాలన్న గత నిబంధనను కూడా తాజాగా తొలగించారు. డీఐపీపీ గుర్తింపు ఉన్న స్టార్టప్‌లన్నీ కొన్ని షరతులకు లోబడి ఈ పన్ను మినహాయింపు పొందే వీలుంది. ప్రధానంగా ఖాతాల వివరాలతోపాటు గడిచిన మూడేళ్ల ఆదాయపు పన్ను రిటర్నులను సమర్పించాలి. అలాగే ఏంజెల్ ఇన్వెస్టర్లు కూడా తమ నెట్‌వర్త్, పెట్టుబడిపై ఎంత ఆదాయం వచ్చింది అనే వివరాలను వెల్లడించాల్సి ఉంటుంది.

కాగా, ఏంజెల్ ఫండ్స్ ఇతరత్రా ఇన్వెస్టర్ల నుంచి రూ.10 కోట్లకు మించి జరిపిన నిధుల సమీకరణపై పూర్తిగా పన్ను మినహాయింపు వర్తిస్తుందని 2018 ఏప్రిల్‌లో ప్రభుత్వం ప్రకటించిన సంగతి తెలిసిందే. అయితే, ఐటీ చట్టంలోని సెక్షన్ 56(2) ప్రకారం స్టార్టప్స్ తమకున్న మార్కెట్ విలువకు మించి జరిపే నిధుల సమీకరణపై 30 శాతం పన్ను విధించేందుకు వీలుంది. దీని ఆధారంగానే ఐటీ శాఖ నోటీసులు జారీచేసింది. కాగా, పన్ను మినహాయింపు నిబంధనల్లో తాజా మార్పులన్నీ నోటిఫికేషన్ జారీ అయినతర్వాత అమల్లోకి వస్తాయని.. ఇప్పటికే నోటీసులు అందుకున్న వారికి కొత్త నిబంధనలు వర్తించవని ఆయా వర్గాలు తెలిపాయి. ఏటా 300– 400 స్టార్టప్‌లకు ఏంజెల్ ఫండ్స్ నుంచి నిధులు అందుతుండగా... 2018 ఏప్రిల్ నుంచి ఇప్పటివరకూ కేవలం రెండు స్టార్టప్స్‌కు మాత్రమే పన్ను మినహాయింపు లభించడం గమనార్హం. ఈ అంశాన్ని కూడా మంత్రి సురేష్ ప్రభు కేంద్ర ఆర్థిక శాఖ దృష్టికి తీసుకెళ్లారు.

ఏంజెల్ ట్యాక్స్ రద్దు చేయండి

ప్రధానిని కోరిన ఐస్పిర్ట్

న్యూఢిల్లీ: స్టార్టప్‌లకు శాపంగా మారిన ఏంజెల్ ట్యాక్స్‌ను తక్షణం రద్దు చేయాలని స్టార్టప్‌లకు ప్రాతినిధ్యం వహిస్తున్న ఐస్పిర్ట్... ప్రధాని నరేంద్ర మోదీని కోరింది. ఈ మేరకు ఈ సంస్థ ఒక లేఖ రాసింది. స్టార్టప్‌ల్లో పెట్టుబడులు పెట్టడం చాలా రిస్క్ అని పేర్కొంది. ఏంజెల్ ఇన్వెస్టర్లు ఎంతో రిస్క్ తీసుకొని ఈ పెట్టుబడుల పెడతారని, విదేశాల్లో ఇలాంటి పెట్టుబడులకు నజరానాలిస్తుండగా, ఇక్కడ మాత్రం పన్నులు వేసి పీడిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేసింది. ఆదాయపు పన్ను విభాగం నుంచి నోటీసులు వస్తుండటంతో పలు స్టార్టప్‌లు బెంబేలెత్తుతున్నాయని, కొన్ని మూతపడుతున్నాయని పేర్కొంది. ఈ ఏంజెల్ ట్యాక్స్‌ను తక్షణం రద్దు చేయాలని, అలా కుదరని పక్షంలో కనీసం నిబంధనలను సరళీకరించాలని కోరింది.

స్టార్టప్‌లలో మైక్రోసాఫ్ట్ భారీ పెట్టుబడులు

- 20 లక్షల డాలర్ల నుంచి కోటి డాలర్ల వరకు
- ఇన్నోవాక్సర్‌లో తొలి పెట్టుబడి

M12 MICROSOFT'S VENTURE FUND

బెంగళూరు: అంతర్జాతీయ ఐటీ దిగ్గజం మైక్రోసాఫ్ట్ భారత్ స్టార్టప్‌లలో భారీగా పెట్టుబడులు పెట్టనుంది. మైక్రోసాఫ్ట్‌కు చెందిన కార్పొరేట్ వెంచర్ ఫండ్, ఎమ్12 (గతంలో మైక్రోసాఫ్ట్ వెంచర్స్ ఫండ్‌గా వ్యవహరించేవారు) భారత స్టార్టప్‌లలో ఒక్కో కంపెనీలో 20 లక్షల డాలర్ల నుంచి కోటి డాలర్ల రేంజ్‌లో పెట్టుబడులు పెట్టబోతోంది. దీన్లో భాగంగా తొలి పెట్టుబడి పెట్టడానికి హెల్త్ టెక్ స్టార్టప్, ఇన్నోవాక్సర్‌ను ఎంచుకున్నామని ఎమ్12 పార్ట్‌నర్ రష్మి గోపీనాథ్ చెప్పారు. బీ2బీ స్టార్టప్‌లలో ఏ నుంచి సి రౌండ్ సిరీస్‌లలో నిధులు సమకూరుస్తామని పేర్కొన్నారు. బిగ్ డేటా, అనలిటిక్స్, బిజినెస్ సాఫ్ట్‌వేర్ యాజ్ ఏ సర్వీస్, క్లౌడ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్, మెషీన్ లెర్నింగ్, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ తదితర రంగాల్లో కార్యకలాపాలు నిర్వహిస్తున్న స్టార్టప్‌లకు నిధులందిస్తామని ఆమె పేర్కొన్నారు.

చర్చలు కొనసాగుతున్నాయ్...!

జెట్ ఎయిర్‌వేస్

న్యూఢిల్లీ: కష్టాల్లో ఉన్న జెట్ ఎయిర్‌వేస్‌ను గట్టెక్కించే ప్రయత్నాలు కొనసాగుతున్నాయి. టర్న్ అరౌండ్‌కు సంబంధించిన పరిష్కార ప్రణాళికపై రుణ దాతలు, భాగస్వాములు, సంబంధిత సంస్థలతో సంప్రదింపులు కొనసాగుతున్నట్లు జెట్ ఎయిర్‌వేస్ తెలిపింది. పునర్వ్యవస్థీకరణ ప్రణాళికలో భాగంగా వాటా విక్రయం, డైరెక్టర్ల బోర్డ్‌లో మార్పులు, చేర్పులు, తదితర అంశాలపై కూడా చర్చ జరుగుతోందని పేర్కొంది. వివిధ వ్యయ నియంత్రణ పద్ధతులు, రుణ భారం తగ్గించుకునే విధానాలు, పెట్టుబడుల సమీకరణ తదితర అంశాలపై కసరత్తు చేస్తున్నామని వివరించింది. కాగా జెట్ ఎయిర్‌వేస్‌లో ప్రస్తుతం 24 శాతం వాటా ఉన్న ఎతిహాద్ సంస్థ తన వాటాను 49 శాతానికి పెంచుకోవడానికి ఆసక్తిగా ఉందని, కానీ ఒక్కో షేర్‌ను రూ.150కు మాత్రమే కొనుగోలు చేయడానికి ఆఫర్ ఇచ్చిందని వార్తలు వచ్చాయి. దీంతో స్టాక్ మార్కెట్లో జెట్ ఎయిర్‌వేస్ షేర్ 8 శాతం పతనమై రూ.271 వద్ద ముగిసింది. ఆర్థిక ఇబ్బందులతో సతమతమవుతున్న ఈ కంపెనీ గత నెల బ్యాంక్‌లకు రుణ చెల్లింపుల్లో విఫలమైన విషయం తెలిసిందే.

ప్రపంచ ఆర్థికానికి ముస్ముందు సవాళ్లే!

డబ్ల్యూఈఎఫ్ నివేదిక..

లండన్/న్యూఢిల్లీ: ప్రపంచ ఆర్థిక రంగానికి 2019లో పలు సవాళ్లు ఎదురుకానున్నాయని జెనీవా కేంద్రంగా పనిచేస్తున్న వరల్డ్ ఎకనమిక్ ఫోరమ్ (డబ్ల్యూఈఎఫ్) పేర్కొంది. భౌగోళిక ఆందోళనలతో పాటు పలు సమస్యలను ప్రపంచం ఎదుర్కోనున్నట్లు తన తాజా ''గ్లోబల్ రిస్క్ రిపోర్ట్''లో పేర్కొంది. డబ్ల్యూఈఎఫ్ ప్రెసిడెంట్ బోర్జ్ బ్రేండీ తెలిపిన సమాచారం ప్రకారం– నివేదికలోని కొన్ని ముఖ్యాంశాలు చూస్తే...


- అంతర్జాతీయ సంబంధాలు అంతకంతకూ దిగజారుతున్నాయి. సమస్యల పరిష్కారంలో కలిసికట్టుగా పోరాడాల్సిన పరిస్థితులను ఇది నీరుగారుస్తోంది.
- గణాంకాల్లో తప్పులు, సైబర్ దాడులు, సమాజంలో వైరుధ్యాలు పెరుగుదల, సంపద వృద్ధిలో అసమానతలు వంటివి ప్రధాన సవాళ్లలో కొన్ని. దీనికి తోడు తుఫానులు, భూకంపాలు, సునామీల వంటివి ఉండనే ఉంటాయని 3000 అభిప్రాయాల ప్రాతిపదికన రూపొందిన నివేదిక పేర్కొంది.
- ప్రపంచవ్యాప్తంగా 1,000 మంది నిపుణులు, పాలసీ నిర్ణేతల అభిప్రాయాల ప్రాతిపదికన ఈ సర్వే రూపొందింది. భౌగోళిక ఉద్రిక్తతల వల్ల ఆర్థిక వ్యవస్థలు దెబ్బతింటాయని ప్రతి పదిమందిలో తొమ్మిది మంది అభిప్రాయపడ్డారు.

నేటి బోర్డ్ మీటింగ్స్...

రిలయన్స్ ఇండస్ట్రీస్, హిందుస్తాన్ యూనిలీవర్, ఎల్ అండ్ టీ టెక్నాలజీ సర్వీసెస్, సైయంట్, ఫెడరల్ బ్యాంక్, ర్యాలీస్ ఇండియా, మాస్టెక్, ఆదిత్య బిర్లా మనీ, ఏయూ స్మాల్ ఫైనాన్స్ బ్యాంక్, జియోజిత్ ఫైనాన్షియల్ సర్వీసెస్, మంగళం ఆర్గానిక్స్

తీవ్ర ఒడిదుడుకులు

- వీగిపోయిన బ్రెగ్జిట్ బిల్లు
- మిశ్రమంగా అంతర్జాతీయ సంకేతాలు
- 3 పాయింట్ల లాభంతో 36,321కు సెన్సెక్స్
- 3 పాయింట్లు పెరిగి 10,890కు నిఫ్టీ



తీవ్ర హెచ్చుతగ్గుల్లో సాగిన బుధవారం నాటి ట్రేడింగ్‌లో స్టాక్ మార్కెట్ అక్కడక్కడే ముగిసింది. ప్రపంచ భౌగోళిక, రాజకీయ అనిశ్చితిల నేపథ్యంలో ప్రపంచ మార్కెట్లు మిశ్రమంగా ట్రేడవడం, డాలర్‌తో రూపాయి మారకం విలువ పడిపోవడం ప్రతికూల ప్రభావం చూపించాయి. ట్రేడింగ్ మొత్తంలో 184 పాయింట్ల రేంజ్‌లో కదలాడిన సెన్సెక్స్ చివరకు 3 పాయింట్ల లాభంతో 36,321 పాయింట్ల వద్ద ముగిసింది. నిఫ్టీ కూడా 3 పాయింట్లు పెరిగి 10,890 పాయింట్ల వద్దకు చేరింది.

ఆరంభ లాభాలు ఆవిరి...

చైనా కేంద్ర బ్యాంక్ బహిరంగ మార్కెట్ లావాదేవీల ద్వారా 8,300 కోట్ల డాలర్ల నిధులను గుమ్మరించనున్నదన్న వార్తల కారణంగా ఆసియా మార్కెట్లు లాభాల్లో మొదలయ్యాయి. దీంతో సెన్సెక్స్ 50 పాయింట్ల లాభంతో ట్రేడింగ్‌ను ఆరంభించింది. బ్రెగ్జిట్ బిల్లు వీగిపోవడంతో యూరప్ మార్కెట్లు మిశ్రమంగా మొదలయ్యాయి. దీంతో మన మార్కెట్లో ఆటు పోట్లు నెలకొన్నాయి. సెన్సెక్స్ ఒక దశలో 144 పాయింట్లు పెరగ్గా, మరో దశలో 40 పాయింట్ల వరకూ పతనమైంది. మొత్తం మీద రోజంతా 184 పాయింట్ల రేంజ్‌లో కదలాడింది.

బ్రిటన్‌లో అనిశ్చితి...

యూరోపియన్ యూనియన్ (ఈయూ) నుంచి వైదొలిగే బ్రెగ్జిట్ బిల్లు బ్రిటన్ పార్లమెంట్‌లో భారీ మెజారిటీతో వీగిపోయింది. దీంతో ఈ బిల్లును ప్రవేశపెట్టిన బ్రిటన్ ప్రధాని థెరిసా మేపై అవిశ్వాస తీర్మానం వచ్చే అవకాశముందని, ఎన్నికలు కూడా రావచ్చనే రాజకీయ అనిశ్చితి నెలకొన్నది. దీంతో ప్రపంచ స్టాక్ మార్కెట్లలో ఇన్వెస్టర్ల సెంటిమెంట్ దెబ్బతింది. లండన్ ఎఫ్‌టీఎస్‌ఈ 0.6 శాతం పతనం కాగా, ఇతర యూరప్ మార్కెట్లు స్వల్పంగా లాభపడ్డాయి. ఆసియా మార్కెట్లు మిశ్రమంగా ముగిశాయి.

ఐడీఎఫ్‌సీ ఫస్ట్ బ్యాంక్ షేర్ల లిస్టింగ్

ఐడీఎఫ్‌సీ బ్యాంక్‌లో క్యాపిటల్ ఫస్ట్ కంపెనీ విలీనం కారణంగా ఏర్పడిన ఐడీఎఫ్‌సీ ఫస్ట్ బ్యాంక్ షేర్లు బుధవారం స్టాక్ మార్కెట్లో లిస్టయ్యాయి. బీఎస్‌ఈలో ఈ షేర్ రూ.47 వద్ద ట్రేడింగ్‌ను ప్రారంభించింది. 2.7 శాతం లాభంతో రూ.48 వద్ద ముగిసింది. ఈ బ్యాంక్ మార్కెట్ క్యాప్ రూ.23,071 కోట్లుగా ఉంది. ఈ బ్యాంక్ రుణాలు రూ.1.02 లక్షల కోట్లుగా ఉన్నాయి. మొత్తం రుణాల్లో రిటైల్ రుణాలు 32 శాతంగా ఉన్నాయి.

- జెట్ ఎయిర్‌వేస్ కంపెనీ పునరుజ్జీవన ప్రణాళికపై అనిశ్చితి నెలకొనడంతో జెట్ ఎయిర్‌వేస్ షేర్లు నష్టపోయాయి. ఈ కంపెనీ భాగస్వామి ఎతిహాద్ జెట్ ఎయిర్‌వేస్‌లో మరింత వాటాను కొనుగోలు చేయనున్నదని, అయితే ఒక్కో షేర్‌ను రూ.150కు మాత్రమే ఆఫర్ ఇచ్చిందన్న వార్తల కారణంగా ఈ షేర్ భారీగా పతనమైంది. బీఎస్‌ఈలో జెట్ ఎయిర్‌వేస్ షేర్ 8 శాతం తగ్గి రూ.271 వద్ద ముగిసింది.
- క్యూ3లో ఆర్థిక ఫలితాలు అదిరిపోవడంతో స్పెషాల్టీ రెస్టారెంట్ షేర్ 20 శాతం అప్పర్ సర్క్యూట్‌తో రూ.98 వద్ద ముగిసింది.

గురువారం స్టాక్ మార్కెట్ డేటా

	టర్నోవర్ (రూ. కోట్లలో)
బీఎస్‌ఈ	3,048
ఎన్‌ఎస్‌ఈ	26,889
ఎన్‌ఎస్‌ఈ (డెరివేటివ్స్)	7,45,712
ఎఫ్ఐఐ	- 90
డీఐఐ	304

నిఫ్టీ 50

టాప్ 10 గెయినర్స్ (రూపాయిల్లో)

Symbol	LTP	(%)Change
IBULHSGFIN	830.4	2.66
YESBANK	207.8	2.36
WIPRO	337	2.18
INDUSINDBK	1,524.90	1.99
BPCL	347.1	1.58
GRASIM	828.25	1.56
ULTRACEMCO	3,884.20	1.48
INFY	735.95	1.29
ADANIPORTS	389.65	1.17
IOC	135.9	1

టాప్ 10 లూజర్స్ (రూపాయిల్లో)

Symbol	LTP	(%)Change
JSWSTEEL	286.35	-1.97
BHARTIARTL	332.45	-1.57
BAJFINANCE	2,565.05	-1.5
UPL	764.85	-1.43
ASIANPAINT	1,388.00	-1.28
VEDL	196.55	-1.18
HEROMOTOCO	2,877.05	-1.16
HCLTECH	937.4	-1.09
ZEEL	451.8	-1.09
INFRATEL	276.85	-1.04

విదేశీ వాణిజ్య రుణ విధానాలు సరళతరం

ముంబై: విదేశీ వాణిజ్య రుణ (ఈసీబీ) విధానాలను రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్‌బీఐ) బుధవారం సరళతరం చేసింది. వ్యాపార నిర్వహణా విధానాలను మరింత సరళతరం చేయడంలో భాగంగా తాజా నిర్ణయం తీసుకున్నట్లు తెలిపింది. దీని ప్రకారం–

- రుణం పొందడానికి అర్హత కలిగిన అన్ని సంస్థలూ ఒక ఆర్థిక సంవత్సరంలో 750 మిలియన్ డాలర్ల వరకూ (లేదా అంతకు సమానమైన విదేశీ మొత్తం) విదేశీ రుణాన్ని ఆటోమేటిక్ రూట్‌లో (ముందస్తు అనుమతులు లేకుండా) సమీకరించుకోవచ్చు.
- ఇప్పటి వరకూ రుణ సమీకరణలకు సంబంధించి రంగాల వారీగా ఉన్న ఆంక్షలను ఆర్‌బీఐ తొలగించింది.
- రుణాన్ని బట్టి ఇప్పటి వరకూ కనీస సగటు మెచ్యూరిటీ కాల పరిమితి (ఎంఏఎంపీ) వేర్వేరుగా ఉండేది. ఇకపై ఎంఏఎంపీ అన్ని రుణాలకు సంబంధించి మూడేళ్లుగానే కొనసాగుతుంది.
- విదేశీ ప్రత్యక్ష పెట్టుబడులు (ఎఫ్‌డీఐ) పొందడానికి అర్హత ఉన్న అన్ని సంస్థలూ ఇకపై ఈసీబీలను పొందడానికి కూడా వీలుంటుంది. దీంతో పోర్ట్ ట్రస్టులు, ప్రత్యేక ఆర్థిక జోన్లలోని సంస్థలు, సిడ్బీ, ఎగ్జిమ్ బ్యాంక్, మైక్రో ఫైనాన్స్ కార్యకలాపాల్లో పాలు పంచుకునే రిజిస్టర్డ్ సంస్థలు, రిజిస్టర్డ్ సొసైటీలు, ట్రస్టులు, సహకార సంస్థలు, ప్రభుత్వేతర సంస్థలు కూడా ఈసీబీలు పొందడానికి వెసులుబాటు కలుగుతుంది.

ఫిలిప్స్ కార్బన్ లాభం 92 శాతం అప్

కోల్‌కత: ఫిలిప్స్ కార్బన్ బ్లాక్ (పీసీబీఎల్) కంపెనీ నికర లాభం ఈ ఆర్థిక సంవత్సరం డిసెంబర్ క్వార్టర్లో 92 శాతం పెరిగింది. గత క్యూ3లో రూ.56 కోట్లుగా ఉన్న నికర లాభం ఈ క్యూ3లో రూ.109 కోట్లకు పెరిగిందని ఫిలిప్స్ కార్బన్ బ్లాక్ తెలిపింది. విలువాధారిత, ప్రత్యేక ఉత్పత్తుల రియలైజేషన్లు పెరగడం వల్ల నికర లాభం ఈ స్థాయిలో పెరిగిందని వివరించింది. నికర అమ్మకాలు రూ.618 కోట్ల నుంచి 54 శాతం వృద్ధితో రూ.950 కోట్లకు పెరిగాయి. రూ. 2 ముఖ విలువ గల ఒక్కో షేర్‌కు రూ.3.5 డివిడెండ్ (175 శాతం) ఇవ్వనున్నామని తెలిపింది. ఈ కంపెనీ దక్షిణ భారత్‌లో రూ.600 కోట్ల పెట్టుబడులతో ఒక ప్లాంట్‌ను ఏర్పాటు చేయనుంది. దీని కోసం షేర్ల జారీ ద్వారా నిధులు సమీకరించాలన్న ప్రణాళికను సిద్ధం చేసింది. అయితే నికర లాభం అంచనాలనుమించి పెరగడంతో నిధుల సమీకరణ ప్రణాళికను రద్దు చేసుకున్నట్లు కంపెనీ చైర్మన్ సంజీవ్ గోయెంకా తెలిపారు. అంతర్గత వనరుల నుంచే నిధులు సమీకరిస్తామన్నారు.

హెచ్‌టీ మీడియా లాభం 69% డౌన్

న్యూఢిల్లీ: హెచ్‌టీ మీడియా నికర లాభం ఈ ఆర్థిక సంవత్సరం సెప్టెంబర్–డిసెంబర్ క్వార్టర్లో 69 శాతం తగ్గింది. గత క్యూ3లో రూ.137 కోట్లుగా ఉన్న నికర లాభం ఈ క్యూ3లో రూ.43 కోట్లకు తగ్గిందని హెచ్‌టీ మీడియా తెలిపింది. మొత్తం ఆదాయం రూ.682 కోట్ల నుంచి రూ.665 కోట్లకు తగ్గింది. మొత్తం వ్యయాలు రూ.533 కోట్ల నుంచి రూ.638 కోట్లకు పెరిగాయి. ఆర్థిక ఫలితాలు నిరాశపరచడంతో బీఎస్‌ఈలో హెచ్‌టీ మీడియా షేర్ 1 శాతం తగ్గి రూ.47 వద్ద ముగిసింది.

విక్రయానికి ఎస్సార్ స్టీల్ మొండి బకాయిలు !

- ఆసక్తి ఉన్నవారిని ఆహ్వానించిన ఎస్‌బీఐ
- ఈ నెల 30 ఈ–వేలం



న్యూఢిల్లీ: ఎస్సార్ స్టీల్ మొండి బకాయిలను స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఎస్‌బీఐ) విక్రయించనుంది. రూ.15,431 కోట్ల ఎస్సార్ స్టీల్ మొండి బకాయిలను విక్రయించనున్నామని, ఆసక్తి గల బ్యాంక్‌లు, అసెట్ రీకన్‌స్ట్రక్షన్ కంపెనీలు (ఏఆర్‌సీ)లు, నాన్ బ్యాంకింగ్ ఫైనాన్స్ సంస్థలు(ఎన్‌బీఎఫ్‌సీ), ఆర్థిక సంస్థలు (ఎఫ్‌ఐ) దరఖాస్తులు సమర్పించాలని ఎస్‌బీఐ కోరింది. ఆసక్తి గల సంస్థలు ఈఓఐలు (ఎక్స్‌ప్రెషన్ ఆఫ్ ఇంట్రస్ట్) సమర్పించాలని పేర్కొంది. నాన్–డిస్‌క్లోజర్ అగ్రిమెంట్ (ఎన్‌డీఏ) కుదుర్చుకున్న సంస్థలు మాత్రమే ఈ మొండి బకాయిలకు సంబంధించిన ఆస్తులను పరిశీలించే అవకాశం ఉంటుందని వివరించింది. ఈ మొండి బకాయిలకు రిజర్వ్ ధరను రూ.9,587.64 కోట్లుగా నిర్ణయించిన బ్యాంకు... వీటి విక్రయం ఈ నెల 30న ఈ–వేలం ద్వారా జరుగుతుందని తెలియజేసింది. 10 మిలియన్ టన్నుల వార్షిక ఉత్పత్తి సామర్థ్యం ఉన్న స్టీల్ ప్లాంట్‌ను నిర్వహిస్తున్న ఎస్సార్ స్టీల్ కంపెనీ రెండు డజన్లకు పైగా బ్యాంక్‌ల నుంచి రూ.49,000 కోట్ల మేర రుణాలను తీసుకుంది. ఈ బకాయిల చెల్లింపుల్లో విఫలం కావడంతో ప్రస్తుతం ఈ కంపెనీపై దివాలా ప్రక్రియ నడుస్తోంది. ఈ కంపెనీని టేకోవర్ చేయడానికి ఆర్సెలర్ మిట్టల్ రూ.50,000 కోట్ల ప్యాకేజీతో ముందుకువచ్చింది. మరోవైపు ఎస్సార్ స్టీల్ హోల్డింగ్ కంపెనీ ఎస్సార్ స్టీల్ ఏషియా హోల్డింగ్ కంపెనీ రూ.54,389 కోట్ల ప్యాకేజీని ఆఫర్ చేసింది. ఈ ఆఫర్‌పై తన తీర్పును ఎన్‌సీఎల్‌టీ అహ్మదాబాద్ బెంచ్ గత వారం రిజర్వ్ చేసింది.

మైండ్ ట్రీ లాభం 35 శాతం అప్



న్యూఢిల్లీ: మధ్య తరహా ఐటీ కంపెనీ మైండ్ ట్రీ నికర లాభం ఈ ఆర్థిక సంవత్సరం మూడో త్రైమాసిక కాలంలో 35 శాతం పెరిగింది. గత క్యూ3లో రూ.142 కోట్లుగా ఉన్న నికర లాభం ఈ క్యూ3లో రూ.191 కోట్లకు పెరిగిందని మైండ్ ట్రీ తెలిపింది.ఆదాయం రూ.1,378 కోట్ల నుంచి 30 శాతం ఎగసి రూ.1,787 కోట్లకు చేరిందని కంపెనీ సీఈఓ, ఎమ్‌డీ రోస్టా రావణన్ పేర్కొన్నారు. డాలర్ల పరంగా చూస్తే నికర లాభం 22 శాతం వృద్ధితో 2.7 కోట్ల డాలర్లకు, ఆదాయం 17 శాతం వృద్ధితో 25 కోట్ల డాలర్లకు పెరిగాయి. సీజనల్‌గా బలహీనంగా ఉన్న క్యూ3లోనూ మంచి ఫలితాలు సాధించామని సంతృప్తి వ్యక్తం చేశారు. ఒక్కో షేర్‌కు రూ.3 మధ్యంతర డివిడెండ్‌ను చెల్లించనున్నామని పేర్కొన్నారు. డిజిటల్ వ్యాపారం 32 శాతం వృద్ధి చెందిందని తెలిపారు. గత నెల చివరి నాటికి యాక్టివ్ క్లయింట్ల సంఖ్య 340గా ఉందని, ఉద్యోగుల సంఖ్య 19,908గా ఉందని పేర్కొన్నారు. ఉద్యోగుల వలస (ఆట్రిషన్) 13.4 శాతంగా ఉందని వివరించారు. ఆర్థిక ఫలితాల నేపథ్యంలో బీఎస్‌ఈలో మైండ్‌ట్రీ షేర్ 1.5 శాతం నష్టపోయి రూ.842 వద్ద ముగిసింది.

51శాతం పెరిగిన డీసీబీ బ్యాంక్ లాభం

న్యూఢిల్లీ: ప్రైవేట్ రంగ డీసీబీ బ్యాంక్ నికర లాభం డిసెంబర్ క్వార్టర్లో 51 శాతం పెరిగింది. గత ఆర్థిక సంవత్సరం ఇదే క్వార్టర్లో రూ.57 కోట్లుగా ఉన్న నికర లాభం ఈ క్యూ3లో రూ.86 కోట్లకు ఎగసిందని డీసీబీ బ్యాంక్ తెలిపింది. నికర వడ్డీ, ఇతర, నిర్వహణ ఆదాయాలు జోరుగా పెరగడంతో ఈ స్థాయి నికర లాభం సాధించామని వివరించింది. మొత్తం ఆదాయం రూ.686 కోట్ల నుంచి రూ.872 కోట్లకు పెరిగింది. స్థూల మొండి బకాయిలు 1.89 శాతానికి పెరగ్గా, నికర మొండి బకాయిలు 0.89 శాతం నుంచి 0.71 శాతానికి తగ్గాయని బ్యాంకు తెలియజేసింది. నికర వడ్డీ ఆదాయం 17 శాతం పెరిగి రూ.294 కోట్లకు, రుణాలు రూ.18,595 కోట్ల నుంచి 23 శాతం వృద్ధితో రూ.22,888 కోట్లకు పెరిగాయి.

బులియన్ రూ.లలో

ముంబై	
బంగారం (24 క్యారెట్లు)	33,240
బంగారం (22 క్యారెట్లు)	31,660
వెండి (కిలో)	42,900
చెన్నై	
బంగారం (24 క్యారెట్లు)	32,570
బంగారం (22 క్యారెట్లు)	31,020
వెండి (కిలో)	42,900
హైదరాబాద్	
బంగారం (24 క్యారెట్లు)	32,570
బంగారం (22 క్యారెట్లు)	31,020
వెండి (కిలో)	42,900
ప్రొద్దుటూరు	
బంగారం (24 క్యారెట్లు)	32,700
బంగారం (22 క్యారెట్లు)	30,280
వెండి (కిలో)	40,200
విశాఖపట్నం	
బంగారం (24 క్యారెట్లు)	32,980
బంగారం (22 క్యారెట్లు)	30,680
వెండి (కిలో)	40,500
విజయవాడ	
బంగారం(24 క్యారెట్లు)	32,850
బంగారం (22 క్యారెట్లు)	30,150
వెండి (కిలో)	40,000
ఏపీ బులియన్ అసోసియేషన్	
బంగారం (24 క్యారెట్లు)	33,490
బంగారం (22 క్యారెట్లు)	31,020
వెండి (కిలో)	40,500

గమనిక: గిట్టుబాటు, నిల్వ, పోటీ వంటి పలు అంశాల ప్రాతిపదికన షాపుల మధ్య పసిడి ధరల్లో కొంత వ్యత్యాసం ఉండవచ్చు.

ముడిచమురు... (బ్యారెల్)

	రాత్రి 11.30కు	మంగళవారం ముగింపు
నైమెక్స్ లైట్ స్వీట్	51.89	$52.11
బ్రెంట్	60.73	$60.64

కోడిగుడ్లు (హోల్‌సేల్ -నెక్ /100కు రూ.లలో) 17-01-2019

విజయవాడ	435-00
విశాఖపట్నం	435-00
చిత్తూర్	443-00
వరంగల్	435-00
చెన్నై	450-00
ముంబై	483-00
నమక్కల్	435-00
గోదావరి	435-00
16-1-2019 ఫామ్ ధర...	
హైదరాబాద్	433-00
రిటైల్ (ఒక గుడ్డుకు)	4.95
బెంగళూరు	445-00
కోల్‌కత్త	474-00
ఢిల్లీ	460-00

ఎన్‌ఎస్‌ఈ నగదు విభాగంలో ట్రేడైన షేర్లు

కంపెనీ పేరు	ముగింపు ధర	క్రితం ముగింపు
ADANI PORT	389.3	385.15
ASIAN PAINT	1389.75	1405.95
AXIS BANK L	664	660.6
BAJAJ AUTO	2717.45	2725.85
BAJAJ FINSE	6464.85	6509.7

A B C D

3M INDIA LI	20698	20846.15
5PAISA CAPI	267.05	270.9
63 MOONS TE	94.55	95.6
8K MILES SO	150.05	151.4
AARTI DRUGS	599.45	606.45
AARTI INDUS	1546	1565.55
AAVAS FINAN	841.1	849.85
BATA INDIA	1165.05	1167.3
BAYER CROPS	4293	4197.2
BEML LIMITE	914	910.6
BERGER PAIN	322.9	325.8
BETA DRUGS	85.85	81.5
BF INVESTME	244.75	245.7
BF UTILITIE	222.45	224.35
BGR ENERGY	60.4	60.3
BHAGERIA IN	290.6	291.95
BHANSALI EN	86.05	87.05
DILIP BUILD	404.5	392.1
DISHMAN CAR	230.6	229.4
DIXON TECHN	2202.75	2166.9
DOLLAR INDU	302.15	295.9
DOLPHIN OFF	53.9	54
DR. LAL PAT	1021.35	996.35
DYNAMATIC T	1473	1499.05
DYNEMIC PRO	123	122.55

E F G H

GUJ IND POW	77.55	78.2
GUJ NAR VAL	373.1	379.25
GUJ STATE F	111.65	112.3
GUJ. APOLLO	161	161.15
GUJARAT ALK	522.3	520.5
GUJARAT AMB	217.9	219.45
GUJARAT FLU	935.45	931.9
GUJARAT GAS	143.3	143.3
GUJARAT MIN	86.1	87.2
GUJARAT PIP	95.95	89.85

I J K L

JAYANT AGRO	220	220.15
JAYSHREE TE	83.6	83.85
JBM AUTO LI	291.7	291.3
JET AIRWAYS	269.7	293.7
JINDAL DRIL	112.9	113.55
JINDAL POLY	245.25	244.65
JINDAL SAW	80.6	81.35
JINDAL STAI	87.2	86.1
JINDAL STEE	146.65	146.9
JINDAL WORL	74.5	72.95

M N O P

MARINE ELEC	89.95	85.35
MAS FINANCI	551.45	546.4
MASTEK LTD	428.85	421.95
MATRIMONY.C	456.15	452.05
MAX FINANCI	452.65	460.5
MAX INDIA L	85.65	85.25
MAX VENTURE	52.95	53.95
MAYUR UNIQU	395.35	395.7
MAZDA LIMIT	291.85	292.05
MCLEOD RUSS	111	111.4
PNC INFRATE	149.8	153.25
PODDAR HOUS	515	517.45
PODDAR PIGM	186.75	186.95
POKARNA LIM	183.05	174.8
POLY MEDICU	220.1	221.95
POLYPLEX CO	513.55	511.75
PONNIE SUGA	138.1	139.55
POWER FIN C	107.05	108.3
POWER MECH	950.25	960.7
PPAP AUTOMO	348.05	339.05

R S T U

SHALIM PAIN	68.9	68.6
SHANKARA BL	524.4	511.1
SHANTHI GEA	127.9	127.75
SHARDA CROP	308.4	299.4
SHARDA MOTO	1453.5	1442.1
SHEELA FOAM	1307.95	1344.9
SHEMAROO EN	438.05	433.5
SHILPA MEDI	396.15	386.3
SHIRPUR GOL	86	84.75
SHIVA MILLS	61.15	62.3
THE HI-TECH	321.7	320.35
THE INDIA C	87.8	87.95
THE INDIAN	139.8	138.95
THE INVEST	144.85	149
THE PHOENIX	574.3	577.25
THE RAMCO C	633.9	630.05
THE RUBY MI	308.15	312.8
THE STATE T	132.45	131.25
THE TINPLAT	151.7	152.55
THEJO ENGIN	598	580

V W Z

నిఫ్టీ నెక్స్ట్ ఫిఫ్టీ

బీఎస్‌ఈలో ఎస్ఎంఈ షేర్లు

బంగారు 'పొంగల్' కుండ

తయారు చేసిన తమిళనాడు స్వర్ణకారుడు



వేలూరు (తమిళనాడు): తమిళనాడులో ఓ స్వర్ణకారుడు 1.900 మిల్లీ గ్రాముల బంగారంతో పొంగల్ కుండ, చెరకు, ఎద్దును తయారు చేశారు. వేలూరు జిల్లా ఆంబూరు సాండ్రోర్ కుప్పం వడివేల్ నగర్‌కు చెందిన దేవన్.. మిల్లీ గ్రాముల బంగారంతో భారతదేశపు మ్యాప్, ప్రపంచ క్రికెట్ కప్, మహాత్మగాంధీ ఇలా పలు విగ్రహాలను తయారు చేశారు.

ఎన్‌సీసీ అధికారికి 'కోస్ మెడలియన్' అవార్డు

న్యూఢిల్లీలో చీఫ్ ఆఫ్ ఆర్మీ స్టాఫ్ జనరల్ బిపిన్ రావత్ చేతుల మీదుగా ప్రదానం



బిపిన్ రావత్ నుంచి అవార్డు అందుకుంటున్న వెంకట్

తెనాలి: స్థానిక ఎన్‌ఎస్‌ఎస్ మున్సిపల్ ఉన్నత పాఠశాల ఉపాధ్యాయుడు బెల్లంకొండ వెంకట్‌కు అరుదైన గౌరవం లభించింది. ఆర్మీ దినోత్సవం సందర్భంగా మంగళవారం సాయంత్రం న్యూఢిల్లీలోని ఆర్మీ క్యాంపులో జరిగిన కార్యక్రమంలో 'కోస్ మెడలియన్'ను చీఫ్ ఆఫ్ ఆర్మీ స్టాఫ్ జనరల్ బిపిన్ రావత్ చేతుల మీదుగా ఆయన అందుకున్నారు. ఫ్లాగ్ ఏరియా, డ్రిల్, సాంస్కృతిక కార్యక్రమాలు, కార్యదక్షత, నిబద్ధత, క్రమశిక్షణకు సంబంధించిన అంశాల్లో జాతీయస్థాయిలో ఉత్తమంగా ఎంపిక చేసిన తొమ్మిది మందిలో స్థానం సంపాదించారు. దేశవ్యాప్తంగా ఉన్న 17 ఎన్‌సీసీ డైరెక్టరేట్ల నుంచి ఎంపికైన తొమ్మిది మందిలో ఫస్ట్ ఆఫీసర్ వెంకట్ ప్రథమస్థానంలో గౌరవాన్ని స్వీకరించడం గర్వకారణమని ఆంధ్రప్రదేశ్, తెలంగాణ కంటింజెంట్ కమాండర్ కల్నల్ రాజేష్ శర్మ అభినందించారు. కాగా గణతంత్ర దినోత్సవ సంబరాల నిమిత్తం ఏపీ, తెలంగాణ కంటింజెంట్ తరఫున ప్రతినిధిగా వెంకట్, గత నెలలో రెండు రాష్ట్రాలకు చెందిన 110మంది ఎన్‌సీసీ క్యాడెట్లను ఢిల్లీ తీసుకెళ్లారు. వీరిలో ఈ నెల 26వ తేదీన జరుగనున్న కవాతుకు 20 మంది, ప్రధానమంత్రి గౌరవ వందన సమర్పణ కార్యక్రమానికి అయిదుగురు ఎంపికయ్యారు. వారిలో తెనాలి వీఎస్సార్ అండ్ ఎన్‌వీఆర్ కాలేజి ఫైనల్ బీఎస్సీ విద్యార్థి, ఎన్‌సీసీ సీనియర్ అండర్ ఆఫీసర్ వై.అనిల్‌కుమార్ కాగా, మరొకరు నిడుబ్రోలులోని పీబీఎన్ కాలేజీలో చదువుతున్న ఆలూరి శివకుమార్ ఉన్నారు.

ముగిసిన ఏరో స్పోర్ట్స్ ఫెస్ట్



సీతంపేట: శ్రీకాకుళం జిల్లా సీతంపేట ఏజెన్సీలోని ఎన్టీఆర్ అడ్వంచర్ పార్కులో నాలుగు రోజులుగా నిర్వహిస్తున్న ఏరో స్పోర్ట్స్ ఫెస్ట్ బుధవారంతో ముగిసింది. పారామోటరింగ్,హాట్ ఎయిర్ బెలూన్, పారాసైలింగ్ వంటి వాటిల్లో పర్యాటకులు ఆకాశంలో విహరించారు. సంక్రాంతి పర్వదినం సందర్భంగా పాలకొండ వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే కళావతి తన కుటుంబ సభ్యులతో ఈ ఉత్సవాలకు హాజరయ్యారు. అలాగే వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన పర్యాటకులతో సీతంపేట కళకళలాడింది.


టీడీపీ కార్యకర్తలకే 'క్షమాభిక్ష'!

- మాజీ మంత్రి రామసుబ్బారెడ్డి అనుచరుల విడుదలకు రంగం సిద్ధం
- మొద్దు శీను హత్య కేసులో శిక్ష అనుభవిస్తున్న ఓం ప్రకాష్ కూడా...
- 20 ఏళ్లుగా శిక్ష అనుభవిస్తున్న ఇతర ఖైదీలకు లభించని క్షమాభిక్ష

సాక్షి ప్రతినిధి కడప: గణతంత్ర దినోత్సవం సందర్భంగా సత్ప్రవర్తన కలిగిన ఖైదీలకు క్షమాభిక్ష పేరుతో పలు జైళ్లలో కారాగార శిక్ష అనుభవిస్తున్న టీడీపీ కార్యకర్తలను విడుదల చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం సిద్ధమైంది. దీర్ఘకాలంగా శిక్ష అనుభవిస్తున్న ఇతర ఖైదీలను పక్కనపెట్టి ఎన్నికలకు ముందు కేవలం అధికార పార్టీ అనుచరులను మాత్రమే విడుదల చేయాలని నిర్ణయించడం గమనార్హం. ఖైదీల విడుదలకు సంబంధించి జనవరి 9వతేదీన రాష్ట్ర ప్రభుత్వ జీవో ఎంఎస్ నం.06 విడుదల చేసింది. గతంలో దివంగత సీఎం వైఎస్ రాజశేఖరరెడ్డి తండ్రి వైఎస్ రాజారెడ్డి హత్య కేసులో నిందితులకు ఇలాంటి ఊరటనే కల్పించిన రాష్ట్ర ప్రభుత్వం తాజాగా టీడీపీ ఎమ్మెల్సీ రామసుబ్బారెడ్డి వర్గీయుల కోసం ఎన్నికలకు ముందు ప్రత్యేక ఉత్తర్వులు జారీ చేసిందని పేర్కొంటున్నారు.

టీడీపీ సానుభూతిపరులకు మాత్రమే...

జంట హత్యల కేసులో టీడీపీ ఎమ్మెల్సీ, మాజీ మంత్రి రామసుబ్బారెడ్డి వర్గీయులు కడప సెంట్రల్ జైల్లో జీవిత ఖైదీలుగా శిక్ష అనుభవిస్తున్నారు. వీరిలో ముద్దనూరు మండలం కోడిగాండ్లపల్లెకు చెందిన ఐదుగురు వ్యక్తులున్నారు. తాజా ఉత్తర్వుల నేపథ్యంలో వీరి విడుదలకు రంగం సిద్ధమైంది. అయితే ఇదే జైల్లో నంద్యాలకు చెందిన శివనాగిరెడ్డి(60) అనే జీవిత ఖైదీ 22 సంవత్సరాలుగా శిక్ష అనుభవిస్తున్నాడు. అనంతపురం జిల్లాకు చెందిన బోడే నాయక్(63) కూడా 18 ఏళ్లుగా శిక్ష అనుభవిస్తున్నాడు. చిత్తూరు జిల్లాకు చెందిన అయ్యప్ప దీర్ఘకాలికంగా శిక్ష అనుభవిస్తున్నాడు. ఇలా ఖైదీలుగా 14 ఏళ్లకుపైగా శిక్ష పూర్తిచేసిన వారు దాదాపు 20 మంది ఉన్నా క్షమాభిక్షను వర్తింపచేయడం లేదని వారి కుటుంబ సభ్యులు వాపోతున్నారు. క్షమాభిక్ష జాబితాలో తమ పేర్లు లేవని తెలియడంతో కుమిలిపోయి మానసిక రోగులుగా మారుతున్నారని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.



GOVERNMENT OF ANDHRA PRADESH
ABSTRACT

Prisoners - Grant of Special Remission to the life convicted prisoners on the occasion of Republic Day on 26-01-2019 - Guidelines - Issued.

HOME (PAROLES) DEPARTMENT

G.O.MS.No. 6 Dated: 09-01-2019
Read the following:

1. G.O.Ms.No.17, Home (Prisons.B2) Department, dated. 17.01.2003.
2. Hon'ble Supreme Court of India Judgment dated 25-04-2014 in W.P.(Crl.) No.48/2014 filed by Union of India Vs V.Sriharan @ Murugan & Others.
3. Hon'ble Supreme Court of India Judgment dated 09-07-2014 in W.P.(Crl.) No.48/2014 filed by Union of India Vs V.Sriharan @ Murugan & Others.
4. Hon'ble Supreme Court of India Judgment dated 23-07-2015 in W.P.(Crl.) No.48/2014 filed by Union of India Vs V.Sriharan @ Murugan & Others.
5. G.O.Ms.No.163, Home(Paroles) Dept., Dated 18.11.2015.
6. G.O.Ms.No.8, Home(Paroles) Dept., Dated 23.01.2018.
7. Representation from Smt Kattula Lakshmi Samrajyam, M/o Kattula Hari, CT No.177 Central Prison, Rajamahendravaram dated Nil.
8. From the Director General of Prisons and CS, Andhra Pradesh, Vijayawada,

ఖైదీలను విడుదల చేస్తున్నట్టు ప్రభుత్వం జారీ చేసిన జీవో

ఓం ప్రకాష్ కూడా...

టీడీపీ నేత, మాజీ మంత్రి పరిటాల రవి హత్య కేసులో నిందితుడైన మొద్దు శీనును అనంతపురం జైల్లో డంబెల్‌తో మోది హతమార్చిన ఓం ప్రకాష్ కూడా తాజా ఉత్తర్వుల ద్వారా విడుదల కానున్నట్లు తెలిసింది. ఓంప్రకాష్ ఏడేళ్లుగా జైలు శిక్ష అనుభవిస్తున్నాడు. అయితే పరిటాల రవి హత్యకేసులో ముద్దాయిలకు మాత్రం ఈ ఉత్తర్వులు అడ్డంకిగా మారాయి. ప్రజా ప్రతినిధి హత్య కేసులో ముద్దాయిలు కావడంతో 12 ఏళ్లకుపైగా జైల్లోనే ఉన్నా వీరిని విడుదల చేయడం లేదని సమాచారం.

ముద్దనూరులో పట్టుకోసం..

టీడీపీ ఎమ్మెల్సీ, శాసనమండలి విప్ పొన్నపురెడ్డి రామసుబ్బారెడ్డి 2019లో జమ్మలమడుగు టీడీపీ అభ్యర్థిగా పోటీ చేయనున్నారు. ఈ తరుణంలో జీవిత ఖైదీలుగా ఉన్న ఆయన వర్గీయుల విడుదలకు సిద్ధం కావడం చర్చనీయాంశంగా మారింది. ఎన్నికల్లో ముద్దనూరు మండలంలో పట్టు సాధించేందుకే ఈ ఉత్తర్వులు వెలువడినట్లు తెలుస్తోంది. సత్ప్రవర్తన కలిగిన ఖైదీలందరి పట్ల ఒకే విధమైన వైఖరి అనుసరించాల్సిన ప్రభుత్వం అధికార పార్టీ కార్యకర్తల కోసం ఇష్టానుసారంగా నిబంధనలు మారుస్తూ ఉత్తర్వులు జారీ చేస్తోందనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

తెలంగాణలో ముగ్గురు ఎమ్మెల్సీలపై అనర్హత వేటు

- రాములు నాయక్, భూపతిరెడ్డి, యాదవరెడ్డిల సభ్యత్వం రద్దు
- టీఆర్ఎస్ నుంచి కాంగ్రెస్ పార్టీలోకి ఫిరాయించినందుకే...

సాక్షి, హైదరాబాద్: టీఆర్ఎస్ తరఫున ఎన్నికై తెలంగాణ అసెంబ్లీ ఎన్నికలకు ముందు కాంగ్రెస్‌లోకి ఫిరాయించిన ముగ్గురు శాసనమండలి సభ్యులపై అనర్హత వేటు పడింది. పార్టీ ఫిరాయింపుల నిబంధనల ప్రకారం ఎస్. రాములు నాయక్, ఆర్. భూపతిరెడ్డి, కె. యాదవరెడ్డిలను మండలి చైర్మన్ వి.స్వామిగౌడ్ అనర్హులుగా ప్రకటించారు. ఈ మేరకు తెలంగాణ అసెంబ్లీ కార్యదర్శి వి.నర్సింహాచార్యులు బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు. అనర్హత ఉత్తర్వులు వెంటనే అమల్లోకి వస్తాయని తెలిపారు. నామినేటెడ్ కోటాలో ఎమ్మెల్సీ అయిన రాములు నాయక్, ఎమ్మెల్యేల కోటాలో ఎమ్మెల్సీగా ఎన్నికైన యాదవ రెడ్డి, నిజామాబాద్ స్థానిక సంస్థల నియోజకవర్గం నుంచి ఎమ్మెల్సీగా గెలిచిన భూపతిరెడ్డి కాంగ్రెస్‌లో చేరడంతో పార్టీ ఫిరాయింపుల నిబంధనల ప్రకారం వారిపై అనర్హత వేటు వేయాలంటూ మండలి చైర్మన్‌కు టీఆర్ఎస్ ఫిర్యాదు చేసింది. ఈ ఫిర్యాదు ఆధారంగా ఆ ముగ్గురికీ నోటీసులు జారీ చేసిన చైర్మన్... దశలవారీగా విచారణ జరిపారు. జనవరి 12న ముగ్గురి అనర్హత పిటిషన్‌పై విచారణ పూర్తి చేశారు. అన్నింటినీ పరిశీలించి బుధవారం నిర్ణయం తీసుకున్నారు. దీంతో శాసనమండలిలోని ఖాళీల సంఖ్య ఏడుకు చేరింది. తెలంగాణ శాసనమండలిలో మొత్తం 40 స్థానాలు ఉన్నాయి. ఒకేసారి 16 స్థానాలు ఖాళీ అయ్యే పరిస్థితి నెలకొంది. అసెంబ్లీ ఎన్నికల్లో ఎమ్మెల్యేలుగా ఎన్నిక కావడంతో మైనంపల్లి హన్మంతరావు, పట్నం నరేందర్‌రెడ్డి, కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి ఎమ్మెల్సీ పదవులకు రాజీనామా చేశారు. వరంగల్ స్థానిక సంస్థల ఎమ్మెల్సీ కొండా మురళీధర్‌రావు ఎన్నికల ముందు కాంగ్రెస్‌లో చేరారు. దీంతో పదవికి రాజీనామా చేశారు. ఇలా నాలుగు స్థానాలు ఖాళీ అయ్యాయి. తాజాగా అనర్హత వేటుతో మరో మూడు స్థానాలు ఖాళీ అయ్యాయి. శాసనమండలి శాశ్వతసభ. ప్రతి రెండేళ్లకు ఒకసారి మూడింట రెండో వంతు స్థానాలకు పదవీకాలం పూర్తవుతుంది. ఈ లెక్కన మార్చి ఆఖరు వరకు 9 స్థానాలు ఖాళీ అవుతున్నాయి.

వివాహితపై లైంగిక దాడి

- తమిళనాడులో ఓ ఉన్మాది ఘాతుకం
- ఘోరాన్ని చూసిన మూడేళ్ల బిడ్డనూ చంపిన వైనం

సాక్షి ప్రతినిధి, చెన్నై: ఓ వివాహితపై అత్యాచారానికి పాల్పడి దారుణంగా హత్య చేశాడో కిరాతకుడు. అనంతరం ఈ ఘోరాన్ని చూసిన మూడేళ్ల చిన్నారిని సైతం కిరాతకంగా కత్తితో పొడిచి చంపేశాడు. ఈ ఘటన తమిళనాడులోని చెన్నై ఆవడిలో చోటుచేసుకుంది. స్థానిక ఎస్టీ కాలనీలో అరుణ్‌పాండియన్ అనే వ్యక్తి తన భార్య రోజా (22), కుమారుడు పార్థిబన్ (5), కుమార్తె సుజాత (3)తో కలసి నివాసం ఉంటున్నాడు. సంక్రాంతి పండుగను పురస్కరించుకుని అరుణ్‌పాండియన్ తన కుమారుడు పార్థిబన్‌ను వెంటపెట్టుకుని పూసలు, దండలు, బొమ్మలు అమ్మే వ్యాపారం నిమిత్తం రెండు రోజుల క్రితం తిరుత్తణి వెళ్లాడు. ఈ నేపథ్యంలో బుధవారం ఎంతకూ వారి ఇంటి తలుపులు తెరవకపోవడంతో స్థానికులు లోపలికి వెళ్లి చూడగా రోజా, చిన్నారి సుజాత దారుణంగా హత్యకు గురై పడిఉన్నారు. సమాచారం అందుకున్న ఆవడి పోలీసులు మృతదేహాలను పోస్టుమార్టానికి పంపి విచారణ చేపట్టారు. కాలనీవాసులు ఇచ్చిన సమాచారం మేరకు అదే కాలనీకి చెందిన రేఖాసాముద్రికుడు వేలూరుకు చెందిన వీరకుమార్ (18)ను అదుపులోకి తీసుకుని తమదైన శైలిలో ప్రశ్నించగా నేరాన్ని ఒప్పుకున్నాడు.

సోషల్ మీడియా వేదికగా పోరాటం

'షర్మిల' కేసుపై మహిళలకు విజయశాంతి పిలుపు

సాక్షి, హైదరాబాద్: వైఎస్సార్‌సీపీ నాయకురాలు షర్మిల ఉదంతంపై యావత్ మహిళాలోకం సోషల్ మీడియా వేదికగానే పోరాటం చేయాలని టీపీసీసీ నాయకురాలు విజయశాంతి పిలుపునిచ్చారు. తనపై సోషల్ మీడియాలో జరుగుతున్న దుష్ప్రచారంపై షర్మిల చేస్తున్న ఆవేదన.. సమాజంలో మహిళల దుస్థితికి అద్దం పడుతుందన్నారు. సోషల్ మీడియా వేదికగా మహిళా సెలబ్రిటీలపై విషం కక్కుతున్న ఈ సంస్కృతిని నియంత్రించాల్సిన అవసరముందని బుధవారం ఓ ప్రకటనలో విజయశాంతి పేర్కొన్నారు. రాజకీయాల్లో మహిళలను వేధింపులకు గురిచేస్తూ.. పురుషాధిక్యత చాటుకునే ఘటనలు రోజురోజుకీ పెరిగిపోతున్నాయన్నారు. ఈ తరహా ఘటనలు మహిళలను మానసికంగా మరింత కుంగదీస్తాయన్నారు. షర్మిలకు న్యాయం జరిగే విషయంలో పోలీసులు, ప్రభుత్వం వెంటనే స్పందించి చర్య తీసుకునే విధంగా యావత్ మహిళా లోకం సోషల్ మీడియా వేదికగా పోరాటం చేయాలన్నారు. ఇందులో ఎలాంటి రాజకీయ ఉద్దేశాలు లేవని.. 40 ఏళ్లుగా.. సినిమా, రాజకీయ రంగాల్లో మహిళా సాధికారత కోసం పోరాడిన వ్యక్తిగా తన స్పష్టమైన అభిప్రాయాన్ని తెలియజేస్తున్నానని వెల్లడించారు.

పదేళ్ల చిన్నారిపై లైంగికదాడి.. హత్య

తమిళనాడులో ఘటన

వేలూరు (తమిళనాడు): తమిళనాడులోని తిరువణ్ణామలై జిల్లాలో ఐదో తరగతి విద్యార్థినిపై లైంగిక దాడికి పాల్పడి ఆపై గొంతు నులిమి హత్య చేశాడో వృద్ధుడు. జిల్లాలోని తెన్‌ముడియనూర్ గ్రామంలో నివసించే విజయకుమార్, అన్బుకుమారి దంపతులకు కుమార్తె గీత (10), కుమారుడు ప్రభు (8) ఉన్నారు. దంపతులిద్దరూ కూలీ కార్మికులు కావడంతో చిన్నారి గీతను అదే గ్రామంలోని అవ్వ ఇంటిలో ఉంచి ప్రభుత్వ పాఠశాలలో చదివిస్తున్నారు. బుధవారం ఉదయం చిన్నారి గీత అదే గ్రామంలోని చెరుకు తోట వద్ద మృతదేహంగా పడి ఉండడాన్ని స్థానికులు గమనించి తండ్రాంబట్టు పోలీసులకు సమాచారం అందజేశారు. చిన్నారి శరీరంపై రక్తపు గాయాలు ఉండటంతో పాటు గొంతు నులిమి హత్య చేసినట్లు గుర్తించారు. దీంతో పోలీసులు అనుమానంతో డాగ్ స్క్వాడ్‌తో తనిఖీలు చేపట్టారు. విచారణలో అదే గ్రామానికి చెందిన గణేశన్(60) అనే వృద్ధుడు చిన్నారిపై లైంగిక దాడి చేసి అనంతరం హత్యచేసినట్లు గుర్తించారు.

Published and Printed by K.Ramachandra Murthy, Editorial Director, on behalf of Jagati Publications Limited, Published at Phase – 2, Plot No. 06, 100 Feet Road, Auto Nagar, Vijayawada, Krishna District – 520 007 (AP) and Printed at Jagati Publications Limited, Phase – 2, Plot No. 06, 100 Feet Road, Auto Nagar, Vijayawada, Krishna District – 520 007 (AP), and D. No. 5- 625, Vadlamudi Road, Atmakur Village, Mangalagiri Mandal, Guntur Dist-522 503. Editor: V. Murali, Phone No : 0863-2512581 Fax No: 0863-2512584, RNI Regn No. APTEL/2008/23794.